Receptio

On

Friday, 15th April 2016, a

Venue

H.P.C.L. Club Audito

H.P.C.L. Waltair Pa

Opp. Andhra University

Siripuram,

Visakhapatnam - 530

Dinner Foll

N Anantha Rama Sarma 70/-

ఎం.ఏ., జ్యోతిషం

ప్రథమ సంవత్సరం

ప్రశ్నలు - సమాధానాలు

(గత సంవత్సరాల ప్రశ్నపత్రాలలోనివి)

తెలుగు బుక్ హౌస్
3-3-862, ఆర్యసమాజ్ ఎదురువీధి,
కాచిగూడ 'X' రోడ్స్, హైదరాబాద్-500 027.
☎ 040-65347374, 9247446497

కావ్యశ్రీ జ్యోతిర్విద్యాలయం

హైదరాబాద్.

వినతి

జ్యోతిశ్శాస్త్రాన్ని ఎం.ఏ., స్థాయిలో అధ్యయనం చేస్తున్నప్పుడు తప్పనిసరిగా విషయంపై అవగాహన, కృషితో కూడిన ఫలిత వివేచన, గణిత సామర్థ్యం అన్నీ అవసరాలే. అయితే కృషి చేయగలిగిన శక్తి ఉండీ, విషయజ్ఞానం ఉండీ ఎం.ఏ., పరీక్షలలో సమాధానాలను సరిగా వ్రాయలేకపోతున్న వారికోసం కొంత మార్గదర్శకంగా ఈ ప్రశ్నలు - సమాధానాలు అనే అంశం తయారు చేయడం జరిగింది. గత సంవత్సరాలలో తిరిగి తిరిగి వస్తున్న ప్రశ్నలను దృష్టిలో పెట్టుకొని ఆ ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు వ్రాయడం జరిగింది.

ఈ ప్రశ్నలు - సమాధానాలు కేవలం మార్గదర్శకాలే కాని, ఇవే ప్రశ్నలు పరీక్షలలో వస్తాయనిగాని, ఈ ప్రశ్నలకు ఇంతే సమాధానం వ్రాయాలనే నియమం కాని లేదు.

'కావ్యశ్రీ జ్యోతిర్విద్యాలయం' తాను చేసే ఈ ప్రయత్నాన్ని, విద్యార్థులు వినియోగించుకుంటారని ఆశిస్తుంది.

ఎం.ఏ., జ్యోతిషం - ప్రథమ

పేపర్ - 1

1. వేదాలలోని జ్యోతిషాంశాలను వివరించండి (2001)

జ్యోతిషం వేదపురుషుని కన్నువంటిదనే భావన సర్వత్రవ్యాప్తమైన సత్యం. జ్యోతిషమనే కన్ను లేకుండా వేదాన్ని, వేదార్థాన్ని, వేద తత్త్వాన్ని అవగతం చేసుకోవడం సాధ్యం కాదు. అందుకే అది వేదాంగంగా భాసించింది.

'శిక్షావ్యాకరణం ఛందో నిరుక్తం జ్యోతిషం తథా
కల్పశ్చేతి షడంగాని వేదస్యాహుర్మనీషిణః'

అని చెప్పడం వల్ల వేదాంగంగా జ్యోతిషం చెప్పబడుతుంది. పై షడంగాలలో జ్యోతిషం తప్ప మిగిలిన వేదాంగాలన్నీ భాషా వ్యాకరణ సంబంధంగాను, వేదోచ్చారణకు ఉపయుక్తాలుగాను ఉన్నాయి. కాని జ్యోతిషం మాత్రం ప్రకృతి యొక్క రహస్యాలను చెప్పే శాస్త్రంగా, ప్రకృతి అధ్యయన శాస్త్రంగా, వేరు వేరు జ్యోతిస్సుల ప్రభావాలను తెలుసుకొని అవి మానవ జీవనంపైన, ప్రకృతిపైన చూపే ప్రభావాలను తెలిపేవిగా ఉన్నాయి. అందుకే జ్యోతిషం వేదాంగమైంది. అందుకే జ్యోతిషం వేదానికి చక్షుస్థానీయమైంది.

ఛందః పాదౌతు వేదస్య హస్తౌ కల్పోథ పఠ్యతే
జ్యోతిషామయనం చక్షుః నిరుక్తం శ్రోత్రముచ్యతే
శిక్షాఘ్రాణస్తు వేదస్య ముఖం వ్యాకరణం స్మృతం
తస్మాత్సాంగ మధీత్యైవ బ్రహ్మలోకే మహీయతే

అన్న శ్లోకం ప్రకారం ఇంద్రియాలలో ప్రధానమైన ఇంద్రియంగా నయనాలున్నట్లు, వేదానికి కూడా ప్రధానమైన నయనస్థానంలో జ్యోతిషం కనిపిస్తుంది. దీనిని బట్టి వేదానికి, జ్యోతిషానికి ఎంతటి సంబంధముందో అర్థమవుతుంది.

వేదమంటే తెలుసుకోదగిన జ్ఞానం. అనేక రకాల వైజ్ఞానిక అంశాల సమాహారం వేదం. వేదాలు జ్యోతిషాంశాలను మాత్రమే చెప్పడానికి నిర్ణయించిన గ్రంథాలు కావు. అయితే ఆ యా సందర్భాలలో చెప్పబడిన అంశాలలో ఎక్కువగా జ్యోతిషాంశాలే చోటుచేసుకున్నాయి. ఈ జ్యోతిషాంశాలను కొన్నింటిని గమనిస్తే జ్యోతిషం మానవుని దైనందిన జీవితావసరం అనే విషయం అర్థం అవుతుంది.

వేదాల్లో ధర్మశాస్త్రాంశాలతో పాటు జ్యోతిషాంశాలు కూడా అనేకంగా వివరించబడ్డాయి. సంవత్సరం, చాంద్రమాసం, సూర్యమాసం, ఋతువులు, అయనాలు, నక్షత్ర వివరాలు, విషువత్తులు, దినవృద్ధి తదితరమైన ఎన్నో అంశాలు వేదాలలో మనకు కనిపిస్తుంటాయి

'ద్వాదశ ప్రధయశ్చక్రమేకం త్రీణి నాభ్యాని క ఉతచ్చికేత
తస్మిన్సాకం త్రిశతాన శంకోవోర్పితాః షష్టిర్నచలాచలాసః'

ఋగ్వేదంలోని ఈ మంత్రార్థం ప్రకారం సంవత్సరం 12 మాసాలుగా విభక్తమౌతుంది. ప్రత్యేకమైన 13వ మాసం సౌర చాంద్రమాసాలకు సమన్వయంగా అధికమాసంగా చేర్చబడింది. ఋగ్వేదంలో సంవత్సరానికి 12 నెలలు, 360 రోజులు మరియు 720 రాత్రింబగళ్ళు అని వర్ణించబడింది.

అదేవిధంగా మాసాల పేర్లు వేదకాలంలో ఈ విధంగా ఉండేవి.

"మధుశ్చ మాధవశ్చ శుక్రశ్చ శుచిశ్చ నభశ్చ నభస్యశ్చేషశ్చోర్జశ్చ సహాశ్చ సహస్యశ్చ తపశ్చ తపస్యశ్చోపయామ గృహీతోసి సంసర్పోస్యంహస్పత్యాయత్వా"

అవి మధు, మాధవ, శుక్ర, శుచి, నభ, నభస్య, ఇష, ఊర్జ, తప, తపస్య అనే 12 పేర్లు కాగా అధికమాసానికి సంసర్పం అని, క్షయమాసానికి అహస్పతి అని గుర్తించబడినాయి.

ఋతువులలో మధుమాధవాలు వసంత ఋతువనీ, (మధుశ్చ మాధవశ్చ వాసన్తికావృతూ) శుక్ర శుచి మాసాలు గ్రీష్మఋతువనీ, నభస్య నభస్య వర్షఋతువుగా, ఇష ఊర్జలు శరదృతువుగా, సహస్ సహస్యలు హేమంతఋతువుగా, తపస్ తపస్యలు

శిశిర ఋతువుగా చెప్పబడినాయి. ఋతు శబ్దం అనేక స్థానాల్లో సంవత్సరార్థంలో ప్రయోగింపబడింది.

ఋగ్వేదంలో సంవత్సరం శరత్, హేమంత వాచకాల ద్వారా చెప్పబడింది. గోపథ బ్రాహ్మణంలో సంవత్సరానికి 'హాయన' శబ్దం, వాజసనేయీ సంహితలో 'సమా' శబ్దం ఉపయోగించబడినాయి. సంవత్సరానికి ఉండే రోజులను గూర్చి గూడా వేదాలలో చెప్పబడింది. సంవత్సర, పరివత్సర, ఇడావత్సర, ఇద్వత్సర, అనువత్సరాలనే పంచసంవత్సరాల గూర్చి వాటికి అధిపతులైన అగ్ని, ఆదిత్య, చంద్ర, వాయువుల గూర్చి దీనిలో వివరించబడింది.

అమీయ ఋక్షా నిహితాస ఉచ్చా నక్తన్దదృశ్ర కుహచిద్దివేయుః
అదబ్ధాని వరుణస్య వ్రతాని విచాకశచ్చంద్రమా నక్తమేతి.

అనే మంత్రం ప్రకారం రాత్రివేళలలో నక్షత్ర ప్రకాశం, పగటివేళలో సూర్యుని వెలుగు వల్ల అవి ప్రకాశరహితం కావడం అనే అంశాలు కూడా వైదిక సాహిత్యంలో కనిపిస్తున్నాయి.

వేదాలలో గ్రహకక్ష్యల గూర్చి స్పష్టమైన నిర్దేశం లేకున్నా కొన్ని మంత్రాల్లో సూచనా మాత్రంగా ఉంది. కుజాది పంచగ్రహాల విషయంలో సూచనలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. అదేవిధంగా విషువత్తుల గూర్చి, గ్రహణం గూర్చి, యుగం గూర్చిన అవగాహనలు వైదిక మంత్రాలలో కనిపిస్తున్నాయి.

ఈ విధంగా వైదికసాహిత్యంలో వేరు వేరు మంత్రాల్లో అనేక జ్యోతిశ్శాస్త్ర అంశాలు సందర్భవశాత్తు ప్రయోగింప బడినాయి. వాటన్నింటినీ పరిశీలిస్తే సరైన వైదికార్థాలు వెలికి తీసే అవకాశం ఉంటుంది.

2. ఋగ్జ్యోతిష ప్రత్యేకతలను తెలపండి. (2001)

వేదాంగ జ్యోతిష గ్రంథాల్లో మొట్టమొదటి గ్రంథం 'ఋగ్జ్యోతిషం'. దీని కర్త లగధుడు. దీనిలో 36 కారికలున్నాయి. దీనిలోని భాష, శైలి, విషయ పరీక్షల ద్వారా

ఇది క్రీ.పూ. 500 సంవత్సరాల నాటిదని తెలుస్తుంది. దీనిలో మొదటి శ్లోకాల్లో, జ్యోతిషం కాలజ్ఞానానికి సంబంధించినదనే విషయం స్పష్టం అవుతుంది.

'పంచ సంవత్సరమయం యుగాధ్యక్షం ప్రజాపతిం
దినర్త్వయన మాసాంగం ప్రణమ్య శిరసా శుచిః'
'ప్రణమ్య శిరసా కాల మభివాద్య సరస్వతీమ్
కాలజ్ఞానం ప్రవక్ష్యామి లగధస్య మహాత్మనః'

పై శ్లోకాలలో పంచసంవత్సరాలతో ఏర్పడే యుగాధిపతి, దిన, ఋతు, అయన, మాసాలనే అంగాలు కలిగిన ప్రజాపతికి, కాలానికి, సరస్వతికి నమస్కరిస్తూ కాలజ్ఞానం తెలియజేస్తున్నట్లుగా సూచించబడింది.

పంచసంవత్సరాలంటే - సంవత్సర, పరివత్సర, ఇదావత్సర, ఇద్వత్సర, అనువత్సరాలు. వీటికి అధిపతులు వరుసగా - అగ్ని, ఆదిత్య, వాయు, చంద్ర, మృత్యువస్తు మొదలైనవారు. ఋగ్జ్యోతిషంలో పర్వగణసాధన విషయం ఉంది. పర్వాలంటే పూర్ణిమ, అమావాస్యలు.

అదేవిధంగా ఉత్తరాయణ దక్షిణాయన ప్రారంభాలను గూర్చిన వివరం కూడా దీనిలో కనిపిస్తుంది. సూర్యుడు ధనిష్ఠా నక్షత్రం ప్రారంభంలో ఉన్నపుడు ఉత్తరాయణం, ఆశ్లేష రెండవపాదంలో ఉన్నపుడు దక్షిణాయనం ఏర్పడుతుంది. సూర్యుడు మాఘమాసం నుండి ఉత్తరానికి, శ్రావణం నుండి దక్షిణానికి ప్రయాణిస్తాడని తెలుపబడింది.

ఉత్తరాయణంలో సూర్యుడున్నప్పుడు ఆరు ముహూర్తాల ఉదయకాలం వృద్ధి చెందగా, అంతే ప్రమాణమున్న రాత్రికాలం క్షీణిస్తుంది. అదేవిధంగా దక్షిణాయనంలో ఆరు ముహూర్తాల రాత్రికాలం వృద్ధిచెందగా, అంతే ప్రమాణమున్న ఉదయకాలం క్షీణిస్తుంది. వేరు వేరు మాసాలకు, సంవత్సరాలకు ఉండే రోజుల వివరాలను ఈ గ్రంథం వివరించింది.

పంచసంవత్సరాలలో వేరువేరు సంవత్సరాలకు రవి, చంద్రులుండే నక్షత్రాల ద్వారా ఆ యా సంవత్సరాలకు ఉత్తరాయణ, దక్షిణాయనాలేర్పడే సమయాలు

సూచించబడినాయి. అదేవిధంగా పంచసంవత్సరాలలో వేరు వేరు సంవత్సరాలలో ఉత్తరాయణ, దక్షిణాయనాలకు వేర్వేరు తిథులు కూడా చెప్పబడినాయి.

నక్షత్రనామాలు ప్రస్తుతం చెప్పుకున్నట్లు కాకుండా సంకేతరూపంలో ఉన్నాయి. ఉదాహరణకు : జౌ - అశ్విని, ద్రా - ఆర్ద్ర, గః - పూర్వఫల్గుణి, ఖే - విశాఖ, శ్వే - ఉత్తరాషాఢ మొ॥నవి. ఈ నక్షత్రాలకు దేవతలపేర్లుకూడా సంకేతాక్షరాల రూపంలో ఉన్నాయి. విషువత్తుల సంఖ్య, దాన్ని గణించే విధానం కూడా ఋగ్జ్యోతిషంలో చెప్పబడింది.

ఈ విధంగా ఋగ్జ్యోతిషం అనే గ్రంథం ఎన్నో ప్రామాణిక గణిత, కాల విషయాలకు వేదికగా జ్యోతిశ్శాస్త్రంలో ప్ర ప్రథమ గ్రంథంగా భాసింపబడుతుంది.

3. జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకులను తెలిపి, వారిని పరిచయం చేయండి? (2001, 2003)

శాస్త్రాన్ని ప్రవర్తింపజేసినవారిని ప్రవర్తకులంటారు. జ్యోతిశ్శాస్త్రాన్ని వివిధరకాలుగా వ్యాప్తి చెందించినవారు 18 మంది ఋషులు అని ప్రసిద్ధి. ప్రవర్తకులంటే - శాస్త్రం యొక్క విషయాలను నిత్యజీవితంలో ఆచరణలో స్థానాన్ని కల్పించినవారని అర్థం. వీరిలో కొందరు ధర్మశాస్త్రకర్తలు, స్మృతికర్తలు చోటుచేసుకున్నారు. వారు తమ స్మృతి గ్రంథాల్లో వివరించిన వేరు వేరు విషయాలు ధర్మాల ద్వారా నిత్యం ప్రతి మానవుడు జ్యోతిశ్శాస్త్ర బద్ధమైన జీవనం గడిపేవిధంగా ప్రయత్నించి శాస్త్రాన్ని ప్రవర్తింపజేశారు. జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకులుగా క్రింద సూచించిన 18 మంది సూచింపబడినారు.

"సూర్యః పితామహో వ్యాసో వసిష్ఠోఽత్రిః పరాశరః
కశ్యపో నారదో గర్గో మరీచిర్మనురంగిరాః
రోమశః పౌలిశశ్చైవ చ్యవనో యవనో భృగుః
శౌనకోఽష్టాదశశ్చైతే జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకాః"

సూర్యుడు, పితామహుడు, వ్యాసుడు, వశిష్ఠుడు, అత్రి, పరాశరుడు, కశ్యపుడు,

నారదుడు, గర్గుడు, మరీచి, మనువు, అంగీరసుడు, లోమశుడు, పౌలిశుడు, చ్యవనుడు, యవనుడు, భృగువు, శౌనకుడు అనే 18 మంది జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకులని కశ్యపవచనం.

సూర్యుడు : సూర్యసిద్ధాంతం అనే జ్యోతిష సిద్ధాంతగ్రంథానికి కర్త అయినందు వల్ల ఇతడు ప్రవర్తకుడైనాడు.

బ్రహ్మ : బ్రహ్మ, పితామహుడు, విశ్వసృట్ అని వేరు వేరు పేర్లతో పిలువబడే వ్యక్తి ఒక్కరే అని భావించి పితామహసిద్ధాంత కర్తగా భావించడం వల్ల ఇతడు ప్రవర్తకుడైనాడు.

వ్యాసుడు : అష్టాదశ పురాణాల రచయితగా, భారత రచయితగా వ్యాసుడు తమ పౌరాణిక గాథలద్వారా, వివిధ రూపాల్లో జ్యోతిషాన్ని తెలియజేసి నిత్యజీవనంలో భాగాలుగా చేసినందువల్ల 'వ్యాసుడు' ప్రవర్తకుల్లో ఒకడైనాడు.

వశిష్ఠుడు : ప్రాచీనమైన పంచసిద్ధాంతాల్లో వశిష్ఠ సిద్ధాంతం ముఖ్యమైంది ఈ సిద్ధాంత కర్త అయిన ఇతడు జ్యోతిష ప్రవర్తకుడైనాడు.

అత్రి : అత్రి వంశీయులు గ్రహణ పరిజ్ఞానం కలవారని, ఇతరులకు ఆ పరిజ్ఞానం లేదని చెప్పడం వల్ల అత్రివంశీయులు వంశపరంపరగా ఆ జ్ఞానాన్ని వికసింపజేసుకుంటూ తమ వంశమూలపురుషుని నుండి ఈ జ్ఞానం తమకు లభించినట్లు చెప్పుకున్నందువల్ల అత్రి జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకుడైనాడు.

పరాశరుడు : బృహత్పరాశర హోరాశాస్త్రాన్ని మైత్రేయునికి చెప్పినందువల్ల అనేక నూతన సిద్ధాంతాలు, ఫలితాంశాలు తన గ్రంథంలో పేర్కొన్నందువల్ల పరాశరుడు ప్రవర్తకుడైనాడు.

కశ్యపుడు : కశ్యప సంహిత గ్రంథ రచయితగా ఇతడు ప్రవర్తకుడైనాడు.

నారదుడు : నారదసంహిత రచయితగా నారదుడు జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకుల్లో చేరినాడు.

గర్గుడు : గర్గుని పేర చాలా జ్యోతిష గ్రంథాలున్నాయి. వృద్ధగర్గుని పేర గ్రంథాలు కనిపిస్తున్నాయి. జైనసంప్రదాయంలో గర్గుడు గొప్ప జ్యోతిశ్శాస్త్రజ్ఞుడని తెలుస్తుంది.

మరీచి : ఇతని జ్యోతిషగ్రంథం ప్రస్తుతం అలభ్యమైనా పూర్వం అధికంగా వ్యాప్తంలో ఉన్నట్లు తెలియడం వల్ల ఇతడు ప్రవర్తకునిగా గుర్తింపబడినాడు.

మనువు : ఇతడు స్మృతి కర్త. మనుస్మృతి విశేష ఆదరాన్ని పొందిన ధర్మశాస్త్రగ్రంథం. ఆచారనియమాల నిర్దేశంలో అంతర్గతంగా జ్యోతిషవిజ్ఞానాన్ని చూపిస్తూ సమయానుకూలమైన విధులను నిర్దేశించడంవల్ల ఇతడు జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకుడైనాడు.

అంగిరుడు : అంగిరుడు, బృహస్పతి పర్యాయపదాలుగా వాడబడుతున్నాయి. బార్హస్పత్య సంహిత అనే గ్రంథం ఉందని తెలుస్తోంది. అందువల్ల ఇతడు జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకుడైనాడు

రోమశుడు : పంచసిద్ధాంతాల్లో 'రోమక సిద్ధాంతం' ఒకటి. రోమశుడు, రోమకుడు, లోమశుడు అని పేర్లు గలిగినవారంతా ఒక్కరేనని అభిప్రాయపడుతున్నారు. ఈ సిద్ధాంత ప్రతిపాదన కర్తగా ఇతడు జ్యోతిష ప్రవర్తకుడైనాడు.

పౌలిశుడు : ఇతని పేర ఒక సిద్ధాంతం ఉంది. ఇతని గ్రహగణితం అంకెల ద్వారా స్థూలంగా ఉంది. ఇతని సిద్ధాంతం కూడా అతి ప్రాచీనమైనదని భావన ఉంది. అందుకే ఇతడు ప్రవర్తకుల్లో ఒకడైనాడు.

చ్యవనుడు : ఇతని గ్రంథాలు కనిపించకున్నప్పటికీ పూర్వ జ్యోతిశ్శాస్త్రవేత్తగా మంచి గుర్తింపు కలిగిన వాడు ఇతడు. ఇతడు జ్యోతిషశాస్త్ర ప్రవర్తకునిగా గుర్తించబడినాడు.

యవనుడు : ఫలితజ్యోతిషంలో యవనమతం చాలా విశిష్టమైంది. 'వృద్ధయవన జాతకం' అనే బృహద్గ్రంథాన్ని మీనరాజు రచించినట్లు తెలుస్తుంది. యవనుల గూర్చిన ప్రశంస బృహజ్జాతకంలో కనిపిస్తుంది. జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకుల్లో ఇతడు స్థానం పొందినాడు.

భృగువు : ఇతని పేరు మీద అనేక గ్రంథాలు లభిస్తున్నాయి. భృగుసంహిత విశిష్ట గ్రంథంగా పేరుపొందింది. భృగునాడి అనే నాడీ గ్రంథం కూడా లభిస్తోంది. ఇతడు కూడా ప్రవర్తకుల్లో ఒకడైనాడు.

శౌనకుడు : పరాశరునికి జ్యోతిషం నేర్పినవాడు శౌనకుడని ఒక అభిప్రాయం. ఇతని శ్లోకాలు అనేక మూల గ్రంథాల్లో ఉదాహృతాలు. ఇతడు కూడా జ్యోతిషశాస్త్ర ప్రవర్తకులలో ఒకడైనాడు.

పులహుడు : పులహుడు, పౌలిశుడు, పౌలస్త్యుడు ఒక్కరేననే అభిప్రాయం కొందరిలో ఉంది. వీరి వివరాలు అంతగా కనిపించకున్నా పౌలస్త్య పులహులు బ్రహ్మమానసపుత్రులని భారతంలో వర్ణింపబడింది. ఇతడు ప్రవర్తకునిగా గుర్తింపబడినాడు.

శాకల్యుడు : శాకల్యసంహిత అనే గ్రంథంలో భాగంగా బ్రహ్మ సిద్ధాంతం అనే గ్రంథం ఉంది. ఇతడు జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకుల్లో ఒకరిగా గుర్తింపబడినాడు."

ప్రవర్తకుల విషయంలో మరో ముఖ్యమైన విషయం గమనించాలి. జ్యోతిశ్శాస్త్రాన్ని ప్రవర్తింపజేసేది ధర్మశాస్త్రం. ధర్మశాస్త్రంలో అనేకరకాలైన జ్యోతిషాంశాలు వివరింపబడి ప్రజల్లో ప్రచారం పొందాయి. అందువల్ల జ్యోతిషాన్ని జనులచేత ఆచరింపజేసినవారే జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకులని భావించే పక్షంలో వేదకాలం నుండి కశ్యప, అత్రి, వశిష్ఠ, నారద, పరాశర, అంగిరస, వ్యాసాదుల నామాలు కనిపిస్తాయి. కొందరు పురాణాల్లో కనిపిస్తున్నారు. స్మృతికర్తల్లో కూడా వారి పేర్లున్నాయి. ప్రవర్తకుల నిర్ణయంలో ఇద్దరి ముగ్గురిలో అభిప్రాయ భేదాలుండడం వల్ల 18 మంది ప్రవర్తకుల కన్నా ఎక్కువమందిని సూచించడం జరిగింది.

4. బృహజ్జాతకం గూర్చి వివరించండి? (2001, 2002)

వరాహమిహిరుడు వ్రాసిన హోరాశాస్త్ర గ్రంథం 'బృహజ్జాతకం'. ఇది ఫలితభాగానికి సంబంధించింది. జ్యోతిషంలోని పంచస్కంధాలలో హోరా స్కంధానికి సంబంధించిన గ్రంథం ఇది. వరాహమిహిరుడు జ్యోతిశాస్త్రంలోని పంచ స్కంధాలలోనూ కృషి చేసి అనేక గ్రంథాలను రచించినాడు. బృహజ్జాతకం, బృహత్సంహిత, పంచసిద్ధాంతిక మొదలైన గ్రంథాలు ఇందులో విశిష్ట స్థానాన్ని పొందాయి. బృహజ్జాతకంలో మొత్తం 26 అధ్యాయాలు, 417 శ్లోకాలున్నాయి.

'హోర' అనే శబ్దం ఏర్పడిన విధానాన్ని బృహజ్జాతకంలో వరాహమిహిరుడు ఈ విధంగా వివరించాడు.

'హోరేత్యహోరాత్ర వికల్పమేకే వాంఛంతి పూర్వాపరవర్ణలోపాత్
కర్మార్జితం పూర్వభవేసదాది యత్తస్య పంక్తి సమభివ్యనక్తి" (బృ.జా.1.3)

'అహోరాత్ర' అనే పదంలోని మొదటి అక్షరం, చివరి అక్షరం లోపించగా 'హోరా' అయిందనీ, అహోరాత్రాలలో కలిగే పూర్వజన్మార్జిత శుభాశుభ కర్మఫలాలను చెప్పేదవడం చేత దీనికి 'హోరాశాస్త్రం' అనే పేరు వచ్చిందని తెలిపాడు. నవాంశగణితం గూర్చి, అనేక రకాల దశావిశేషాల గూర్చి బృహజ్జాతకం బాగా చర్చించింది. దశా పద్ధతులను, ఫలిత జ్యోతిష విధానాలను వివరించేటపుడు బృహజ్జాతక పద్ధతి అని ప్రత్యేకంగా తెలియజేయబడింది.

దీనిలో సంజ్ఞాధ్యాయం, గ్రహయోని భేదాధ్యాయం, వియోని జన్మాధ్యాయం, నిషేకాధ్యాయం, జన్మకాల లక్షణాధ్యాయం, బాలారిష్టాధ్యాయం, ఆయుర్దాయాధ్యాయం, దశాంతర్దశాధ్యాయం, అష్టకవర్గాధ్యాయం, కర్మజీవాధ్యాయం, రాజయోగాధ్యాయం, నాభసయోగాధ్యాయం, చంద్రయోగాధ్యాయం, ద్విగ్రహయోగాధ్యాయం, పరివ్రాజకయోగాధ్యాయం, రాశిశీలాధ్యాయం, దృష్టిఫలాధ్యాయం, భావఫలాధ్యాయం, ఆశ్రయయోగాధ్యాయం, ప్రకీర్ణాధ్యాయం, అరిష్టాధ్యాయం, స్త్రీజాతకాధ్యాయం, నైర్యాణికాధ్యాయం, నష్టజాతకాధ్యాయం, ద్రేక్కాణాధ్యాయం, ఉపసంహారాధ్యాయం అనే 26 అధ్యాయాలున్నాయి.

సంజ్ఞాధ్యాయంలో రాశులు, గ్రహాలు, భావాదుల సంజ్ఞల వివరణ, గ్రహయోని భేదాధ్యాయంలో గ్రహాల స్వరూప స్వభావ, దృష్టి, చేష్టాదులు, మిత్రశత్రుత్వాదుల వివరణ, వియోని జన్మాధ్యాయంలో వేరువేరు పశుపక్ష్యాదుల జన్మల నిర్ణయం, నిషేకాధ్యాయంలో గర్భోత్పత్తి కాలం మొదలుకొని వివిధ దశల వర్ణన తదితర అంశాలు తెలియజేయబడినాయి.

అదేవిధంగా జీవి ఏవిధంగా ఎక్కడ ఏ స్వరూపంతో ఏ స్వభావంతో పుడుతుందో తెలుసుకునే పద్ధతి జన్మకాల లక్షణాధ్యాయంలోనూ, చిన్నతనంలోనే కలిగే

మరణాలగూర్చిన అధ్యయనం బాలారిష్టయోగాధ్యాయంలోనూ; ఆయుః ప్రమాణం గూర్చిన వివరాలు ఆయుర్దాయాధ్యాయంలోనూ, దశలను, అంతర్దశలను వివరించే పద్ధతులు దశాంతర్దశాధ్యాయంలోనూ వివరించబడినాయి.

ఫలిత నిర్ణయానికి కీలకంగానూ గోచార ఫలితాల్ను స్పష్టంగా తెలియజెప్పి, గ్రహాల బలాబలాలను సూచించే పద్ధతి అష్టకవర్గ. ఈ అష్టకవర్గగూర్చి వరాహమిహిరుడు తన బృహజ్జాతకంలో అష్టకవర్గాధ్యాయంలో చర్చించాడు. అదేవిధంగా జాతకుని జీవనాన్ని తెలిపే యోగాలు, రాజయోగాలు, నాభసయోగాలు చంద్రస్థితివల్ల ఏర్పడేయోగాలు. రెండు గ్రహాల కలయికల వల్ల ఏర్పడే యోగాలు సన్యాస యోగాలు మొదలైనవన్నీ వేరు వేరు యోగాధ్యాయాలలో ఆరు విభాగాలలో వివరంగా బృహజ్జాతకం తెలియజేసింది.

రాశిశీలాధ్యాయంలో మేషాది రాశుల్లో పుట్టినవారి స్వభావాదుల వివరణ, దృష్టిఫలాధ్యాయంలో ఆ యా స్థానాల్లో ఉన్న చంద్రుడు ఇతర గ్రహాలతో చూడబడినప్పుడు ఫలితాలు. వేరు వేరు భావాలలో వేరు వేరు గ్రహాలు. వేరు వేరు భావాధిపతుల్లు ఉన్నప్పుడు కలిగే ఫలితాలు కూడా బృహజ్జాతకం భావఫలాధ్యాయం చర్చించింది. ఇంతేకాక స్త్రీల గూర్చి మాత్రమే పరిశీలించే అంశాలను స్త్రీజాతకాధ్యాయం విశ్లేషించింది

జాతకం లేనివారికి జాతకం తెలియజెప్పడం చాలా కష్టంతో కూడిన పని. ఆ విధానానికి నష్టజాతకాధ్యాయం అనే పేరుతో బృహజ్జాతకంలో చక్కని వివరణ కనిపిస్తుంది. ఈ విధంగా వరాహమిహిరాచార్యుల వారి బృహజ్జాతకం ఎన్నో అంశాలతో కూడుకొని చక్కని గ్రంథంగా, ఫల జ్యోతిష నిర్ణయానికి ఉపయుక్త గ్రంథంగా భాసిస్తూ కనిపిస్తుంది. వరాహ మిహిరుడు తన బృహజ్జాతకాన్ని ఈ క్రింది శ్లోకంతో పూర్తి చేశాడు.

"దినకర ముని గురుచరణ ప్రణిపాతకృత ప్రసాద మతినేదమ్

శాస్త్రముప సంగృహీతం నమోఽస్తు పూర్వ ప్రణేతృభ్యః"

అందరికీ నమస్కారం చేస్తూ వరాహమిహిరుడు వ్రాసిన బృహజ్జాతకం

జ్యోతిశ్శాస్త్రంలో ప్రామాణిక అంశాలను ఎన్నింటినో వివరించిన ప్రత్యేక హోరాశాస్త్ర గ్రంథం. నాటినుండి నేటి వరకు బహుళప్రచారంలో ఉంటూ అన్ని భాషలలోనూ అనువాదాలు పొందిన గ్రంథం. ఈ గ్రంథంలో వరాహమిహిరుడు అనేక విశేషపదాలను కూడా వినియోగించడం జరిగింది. ఈ విధంగా బృహజ్జాతకం తన వైశిష్ట్యాన్ని చాటింది.

5. పురోగామి జాతకం అంటే వివరించి, దానిని పరిశీలించే విధానం రాయండి? (2001, 2002)

జ్యోతిషం కాంతులకు సంబంధించిన శాస్త్రం. కాంతి ఎక్కడైతే ప్రసరిస్తూ మానవుని మేధస్సును వికసింపజేస్తుంటుందో అక్కడ జ్యోతిశ్శాస్త్ర పరిశోధనలను, పరిశీలనలు కూడా నిరంతరం జరుగుతూనే ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా జ్యోతిష పరిశోధనలు అన్ని విభాగాలలో జరుగుతున్నాయి. ప్రాచ్య దేశాలకు, పాశ్చాత్యదేశాలకు ఈ పరిశోధనల్లో కొంత వ్యత్యాసం కనిపిస్తుంది.

ప్రాచ్యదేశాలలో ఫలితాల సాధనకు దశలపై ఆధారపడితే పాశ్చాత్య దేశాలలో దృష్టులపై ఆధారపడతారు. అంతేగాక ప్రాచ్య దేశాలలో నిరయన పద్ధతిని ప్రామాణికంగా చూస్తే పాశ్చాత్య పద్ధతిలో సాయనవిధానాన్ని చూసారు. ఈ పద్ధతిలో సంవత్సర ఫలితాలను నిర్ణయించుకోవడానికి 'పురోగామి జాతకం' ప్రత్యేకంగా పరిశీలించడం జరుగుతుంది. 'ఒకదినం ఒక సంవత్సరానికి సమం' అనే సూత్రంతో పుట్టినరోజునుండి ముందుకు ఎన్ని రోజులు గడిస్తే అన్ని సంవత్సరాలు గడిచినట్లుగా భావించి ఆ యా సంవత్సరాలకు ప్రత్యేకంగా పురోగామి జాతక చక్రాలు రూపొందించి జన్మకుండలిలోని లగ్న, దశమ భావాలకు, గ్రహాలకు ఏర్పడే శుభాశుభ దృష్టులు విశ్లేషించి, ఫలితం చెప్పడం పాశ్చాత్య సంప్రదాయం. దీన్నే పురోగామి జాతకం అని అంటారు.

మనిషి జన్మించిన సమయంలో ఉన్నటువంటి గ్రహస్థితి శాశ్వతం. అదే మనిషి యొక్క భవిష్యత్తు జీవనం ఎలా ఉంటుందో ఉండాలో నిర్దేశించే జన్మజాతకం,

దానిలో గ్రహాల ప్రభావం, గ్రహాలదృష్టులుబట్టి జీవన విధానం, ఎప్పుడు ఎలా ఉంటుందో, ఏమి జరుగుతుందో తెలిపేది పురోగమన జాతకం.

శిశువు ఏ సంవత్సరం, ఏ మాసం, ఏ తేదీన జన్మించారో చూసి ఆ తేదీ నుండి వరుసగా ఒక్కొక్క తేదీ ఒక్కో సంవత్సరంగా భావించాలి.

ఉదా. ఒకరిజననం జనవరి 10, 1990 అయితే, అతనికి 14 సం॥రాలు వచ్చాక జీవితం ఎలాంటుంది తెలుసుకోవాలంటే జనవరి 10వ తేదీనుంచి 14 రోజులు లెక్కించి 14వ రోజున ఉన్న గ్రహ స్థితిని తెలుసుకోవాలి. అయితే ఇక్కడ పుట్టినతేదీ, సంవత్సరం కూడా లెక్కలోకి తీసుకోవాలి. ఈ విధంగా చక్రం వేసుకొని, జన్మజాతకానికి, పురోగమన జాతకచక్రానికి గ్రహాలమధ్య ఉన్న దృష్టులు చూసి ఫలనిర్ణయం చేయాలి.

సాధారణంగా పాశ్చాత్యులు అనుసరించే వీల్ ఛార్ట్‌లో రాశి చక్రాన్ని డిగ్రీలతో సహా ముందుగా గుర్తించాలి. ఆ తర్వాత పురోగమన జాతక చక్రాన్ని ఏ సంవత్సరానికి కావాలో ఆ సంవత్సరానికి పెన్ ఇంక్ మార్చి వేసుకోవడం వల్ల భావాల మార్పులు గుర్తించడం చాలా సులభం అవుతుంది. పురోగామి జాతకంలో గ్రహాల మధ్యగల దూరాలు, వాటికి ఏర్పడే శుభాశుభ దృష్టులు, లగ్నభావ డిగ్రీకి, దశమ భావడిగ్రీకి గ్రహాలతో సహా ఏర్పడే దృష్టులను గమనించి వాటి ఫలితాలు గ్రహించాలి. జన్మకుండలిలోని లగ్నడిగ్రీకి, దశమభావడిగ్రీకి సూర్యునికి, ఇతర గ్రహాలకు - పురోగామి జాతకంలోని గ్రహాలకు, లగ్న దశమభావ డిగ్రీలకు మధ్యలో ఏర్పడే శుభాశుభ దృష్టులు పరిశీలించి ఫలాలను విశ్లేషించాలి.

సూర్యుని సగటు వేగం రోజుకు ఒక డిగ్రీ. ఒక రోజు ఒక సంవత్సరానికి సమం అనే సూత్రాన్ని అన్వయిస్తే సంవత్సరానికి ఒక డిగ్రీ చొప్పున సూర్యుని పురోగమనం జరుగుతుంది. ఏ సంవత్సరపు పురోగామి జాతకంలో సూర్యునికి ఇతర గ్రహాలతో సంయోగం కాని, సమగ్ర దృష్టి కాని ఏర్పడుతుందో, ఆ సంవత్సరంలో కొన్ని ముఖ్యమైన సంఘటనలు జరుగుతాయి.

చంద్రుని సగటు వేగం సుమారు రోజుకు 12 డిగ్రీలు. ఒక రోజు ఒక సంవత్సరానికి సమం అనే సూత్రాన్ని చంద్రునికి అన్వయిస్తే 12 నెలలకు 12 డిగ్రీలు

అంటే నెలకు ఒక డిగ్రీ చంద్రుని సగటు వేగం అవుతుంది. ఈ విధంగా లెక్కించి పురోగామి జాతకంలో ఒక గ్రహం ఒక భావంలో ఉన్నప్పుడు ఇతర గ్రహాలతో దృష్టి సంబంధం ఏర్పడతాయో అవి ఏ మాసంలో, ఏ సమయంలో ఏర్పడతాయో గ్రహించవచ్చు.

ఇదే విధంగా వేరు వేరు గ్రహాల సగటు వేగాలు గ్రహిస్తూ వాటి సంచారం జన్మజాతకంపై చూపించే ప్రభావాన్ని, పురోగామి గ్రహాలపై చూపించే ప్రభావాలను గమనించి అవి ఫలించే సమయాలను గుర్తించి దృష్టులు, యుతుల ద్వారా ఫలితం చెప్పడం పురోగామి జాతక విధానం.

పురోగమన జాతకంలో పరిశీలించవలసిన అంశాలు

పురోగమించిన రవినుంచి జన్మరవి, చంద్ర ఇతర గ్రహాలు, లగ్నం, దశమం మధ్యదృష్టులు.

పురోగమించే రవినుంచి పురోగమిస్తున్న ఇతర గ్రహాలు, లగ్నం, దశమం.

పురోగమిస్తున్న ఇతర గ్రహాలు - జన్మరవి, చంద్ర, ఇతర గ్రహాలు, లగ్నం, దశమం.

పురోగమించే ఏ ఇతర గ్రహం - ఇతర పురోగమన గ్రహాలు - భావాలు - లగ్నం - దశమం.

పురోగమించే చంద్రునికి - జన్మలోని అన్ని గ్రహాలు - లగ్నం, దశమం మధ్యదృష్టి.

పురోగమించే చంద్రునికి - పురోగమన రవి ఇతర గ్రహాలు - భావాలు - లగ్నం దశమం - మధ్యదృష్టి.

పురోగమించే లగ్నభావాలు - జన్మరవి, చంద్ర ఇతర గ్రహాలు, పురోగమించే దశమ, జన్మరవి, చంద్ర, ఇతర గ్రహాలు.

ఈ విధంగా పాశ్చాత్య పద్ధతిలో పురోగామి జాతకచక్రం ఫలిత నిర్ణయ సమయాలను నిర్దేశించడానికి ఉపయోగ పడుతున్న విధానంగా గోచరిస్తుంది.

6. భాస్కరుడు -2 రచించిన 'సిద్ధాంత శిరోమణి'ని పరిచయం చేయండి? (2001)

శూన్యాన్ని (0) కనిపెట్టి గణితశాస్త్రంలో నూతనమైన మార్పులను తీసుకొని వచ్చి గణితశాస్త్ర విధానాలకు ఒక దిశానిర్దేశనం చేసినవారు భారతీయులు. భారతీయ మేధావులెందరో ఖగోళంలోని అనేక అంశాలపై అత్యధికమైన కృషి చేసి ఎన్నో నూతనాంశాలను ఆవిష్కరించారు. అటువంటి వారిలో ఆర్యభట్టు, భాస్కరుడు మొదలైనవారు సుప్రసిద్ధులు.

భాస్కరుడు అనే పేరుతో ఇద్దరు ప్రముఖులుండడం వల్ల వారిని భాస్కరుడు -1 అనీ, భాస్కరు 2 అనీ ప్రత్యేకంగా సూచించడం జరిగింది. వీరిలో భాస్కరుడు -1 'మహాభాస్క ధీయము', 'లఘుభాస్కరీయము' అనే రెండు గ్రంథాలు రచించాడు. అదేవిధంగా ఇతడు 'ఆర్యభట తంత్ర భాష్యము' అనే పేరుతో మరో పుస్తకం రచించినాడని తెలుస్తుంది.

భాస్కరుడు -2 పేరుతో ఉన్న మరో ప్రఖ్యాత గణితశాస్త్రవేత్త, ఖగోళశాస్త్రవేత్త 'సిద్ధాంత శిరోమణి', 'కరణ కుతూహలం' అనే గ్రంథాలు రచించాడు. ఇతడు సహ్యాపర్వత ప్రాంత సమీపంలో ఉన్న విజ్జడవిడ గ్రామంలో జన్మించాడు. వీరి తండ్రిపేరు మహేశ్వరుడు. వీరు శక సంవత్సరం 1036 అంటే క్రీ.శ. 1114 లో జన్మించినట్లు తెలుస్తుంది.

భాస్కరుడు రచించిన 'సిద్ధాంత శిరోమణి' నాలుగు భాగాలుగా విభజింపబడింది. అవి 1. లీలావతి 2. బీజగణితం 3. గణితాధ్యాయం 4. గోళాధ్యాయం.

వీనిలో లీలావతికి 'పాటీగణితం' అని కూడా పేరు. భాస్కరుడు ఈ అధ్యాయాన్ని తన కుమార్తె లీలావతికి అంకితం చేసి ఆ పేరు పెట్టినాడు. ఈ అధ్యాయ ప్రారంభంలో కొలతలు ఇవ్వబడినాయి. వీనిలో కేవలం భారతీయుల్లో ప్రచారమైనవే కాక, విదేశీయుల్లోనూ, తురుష్కాదుల్లనూ ప్రచారంలో ఉన్న కొలతలు ఇవ్వబడ్డాయి. 'పరికర్మాష్టకం' దీనిలో ప్రతిపాదించబడింది. దీనిలో కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు, వర్గం, వర్గమూలం, ఘనం, ఘనమూలం అనే ఎనిమిది

అంశాలు పరికర్మాష్టకం అనబడతాయి. అంకపాశం, కుట్టకం, ఛాయ, రాశి, క్రకచం, చితి, ఖాతలు, క్షేత్ర వ్యవహారం, శ్రేఢి, మిశ్రవ్యవహారం, భాండప్రతిభాండకం, నవరాశికం, సప్తరాశికం అనే అంశాలు గణితశాస్త్రంలో ఆధునిక కాలంలో కొంచె పేరు మార్పులతోనూ, ఆంగ్లనామాలతోనూ వ్యవహరించబడుతున్నాయి. ఆ యా అంశాల ప్రతిపాదన కూడా ఈ అధ్యాయంలో వివరించబడింది.

అంకపాశానికి ఉదాహరణ ఈ విధంగా ఉంటుంది.

"పాశాంకుశాహి డమరూక కపాలశూలైః
ఖట్వాంగశక్తి శరచాపయుతై ర్భవన్తి
అన్యోన్య హస్త కలితైః కతి మూర్తి భేదాః
శమ్భోర్హరే రివ గదారి సరోజ శంఖైః"

అనే ఈ ఉదాహరణ ప్రస్తుత కాలంలో గణితశాస్త్రంలో 'ప్రస్తారాలు - సంయోగాలు' అనే అర్థంలో వినియోగించబడుతుంది.

మహేశ్వరుని పది చేతుల్లోనూ పాశం, అంకుశం, సర్పం, డమరు, కపాలం, శూలం, మంచంకోడు, శక్తి, బాణం, ధనుస్సు అనే పది ఆయుధాలు మార్చి మార్చి ఉంచితే ఒకసారి అమర్చిన ప్రదేశంలో మళ్ళీ అమర్చకుండా ఉంటే మొత్తం మహేశ్వరునివి ఎన్ని రూపాలు అవుతాయి?

అదేవిధంగా శ్రీమహావిష్ణువు నాలుగు చేతుల్లోనూ శంఖం, చక్రం, గద, పద్మం అనే నాలుగింటిని మార్చి మార్చి అమర్చడం వల్ల శ్రీమహావిష్ణువు రూపాలు ఎన్ని అవుతాయి? అని ప్రశ్నిస్తే ఎన్ని చేతుల్లో అమర్చాలో అన్ని సంఖ్యలను వరుసగా గుణించడం అవసరం అవుతుంది. మహేశ్వరుని మూర్తుల సంఖ్య 1 2 3 4 5 6 7 8 9 10 = 3628800 రూపాలు అవుతాయి. అదేవిధంగా శ్రీమహావిష్ణువు రూపాలు 1 2 3 4 = 24 అవుతాయి.

భాండ ప్రతిభాండమనే ఉదాహరణలో వస్తుమారక సంబంధంగా కనిపించే అంశాలున్నాయి. అప్పటి కాలం నాటి నాణేల వివరాలను కూడా లీలావతిలో భాస్కరుడు

వివరించాడు. అవి 20 వరాటకాలు = 1 కాకిణి, 4 కాకిణులు = 1 పణం, 16 పణాలు = 1 ద్రమ్మం, 16 ద్రమ్మాలు = 1 నిష్కం. ఈ విధమైన నాణేల వివరణ కనిపిస్తుంది.

సిద్ధాంత శిరోమణిలోని రెండవభాగానికి బీజగణితం అని పేరు. దీనిలో 213 శ్లోకాలున్నాయి. దీనిలో బీజగణిత సంబంధంగా క్షయ (నెగటివ్) స్వ (పాజిటివ్) సంఖ్యల స్వరూపం, వాటి తీసివేతకు, కూడికకు సంబంధించిన నియమాలు చెప్పబడినాయి. ఇవి ఆధునిక కాలంలో కూడా ఏ మాత్రం మార్పులేకుండా అనుసరించబడుతున్నాయి.

శూన్యం లేదా 'ఖం' గూర్చి దానికి సంబంధించిన పద్ధతులను భాస్కరుడు బీజగణితం భాగంలో సూచించాడు. ఒక సంఖ్యలోంచి శూన్యాన్ని తీసివేసినా, దానికి కలిపినా దాని విలువలో మార్పుండదు. ఏదైనా సంఖ్యను శూన్యంచేత గుణించినా ఫలం శూన్యమే అవుతుంది. శూన్యాన్ని ఏ సంఖ్యచేతనైనా భాగిస్తే భాగఫలం శూన్యతచ్ఛేదం అవుతుంది. ఏదైనా సంఖ్యను శూన్యంతో భాగిస్తే భాగఫలం అనంతం (ఖహారం = ఇన్‌ఫినిట్) అవుతుంది. ఖహారం (అనంతం) నుండి ఏమైనా చేర్చినా, తీసివేసినా ఆ ఖహారంలో మార్పుండదు. ఖహార ఉపయోగం పాటీగణితంలో నిషేధించినా బీజగణితంలో మాత్రం అంగీకరించబడింది.

ఈ అంశాలు తెలియజేసే శ్లోకాలను భూతగణాలకు, అనంతుడైన అచ్యుతునికి సంబంధం చూపిస్తున్నట్లుగా భాస్కరుడు అద్భుతంగా తెలియజేశాడు.

> 'ఖయోగే వియోగే ధనర్ణం తథైవ చ్యుతం శూన్యతస్త ద్విపర్యాసమేతి
> వధాదౌ వియత్ఖస్య ఖం ఖేనఘాతే ఖహారో భవేత్ ఖేన భక్తశ్చ రాశిః'
> 'అస్మిన్వికారః ఖహారే న రాశావపి ప్రవిష్టేష్వపి నిఃసృతేషు
> బహుష్వపి స్యాల్లయసృష్టికాలేఽనంతేఽచ్యుతే భూతగణేషు యద్వత్'

సృష్టి లయ కాలాల్లో అనంతుడైన అచ్యుతుని నుండి భూతగణాన్ని తీసినా, చేర్చినా అచ్యుతుని స్వరూపంలో ఏవిధమైన మార్పుండదు కదా! అదేవిధంగా

ఖహారంలోనుండి ఏమైనా తీసివేసినా, చేర్చినా దాని విలువలో ఏవిధమైన మార్పుండదు అని భాస్కరుడు ఉదాహరణతో తెలియజేశాడు.

శూన్యాన్ని, బీజగణితంలో దాని వినియోగాన్ని గూర్చి మొట్టమొదట బ్రహ్మగుప్తుడు 'బ్రాహ్మస్ఫుట సిద్ధాంతం'లో చెప్పి ఉన్నాడని, దానినే భాస్కరుడు చాలావరకు అనుసరించి పూర్తిస్థాయిలో వినియోగంలో తెచ్చాడని పండితుల అభిప్రాయం.

అవ్యక్త సంఖ్యాదులను (ఎక్స్, వై, జడ్ లాంటివి) నిర్దేశించడానికి యావత్, తావత్, కాలక, నీలక, పీతక, లోహితక వంటి పదాలను ఉపయోగించాలని భాస్కరుడు సూచించాడు. బీజగణిత విషయంలో ఇది ఒక అత్యుత్తమ గ్రంథంగా ప్రఖ్యాతి పొందింది.

సిద్ధాంతశిరోమణిలో మూడవభాగం గణితాధ్యాయం. దీనిలో గ్రహగణితం, దానిని గమనించే విధానం వివరించ బడింది. గ్రహమధ్యమాలను సాధించడం, గ్రహణసాధన, గ్రహకక్ష్యా సాధన, త్రిప్రశాధికారం, అధికమాసాల చర్చ, మానాలకు సంబంధించిన అంశాలు, పర్వసంభవాదుల విషయం, గ్రహ ఉదయాస్త విషయాలు, ఛాయ, పాత మొదలైన అంశాలు దీనిలో చర్చించబడినాయి.

సిద్ధాంతశిరోమణిలో నాలుగవ భాగం గోళాధ్యాయం. దీనిలో 15 అధ్యాయాలున్నాయి. దీనిలో వేరు వేరు అధ్యాయాలలో భూగోళానికి సంబంధించిన అంశాలు, భూగోళ అస్తిత్వం, భూమిపైనుండి చూస్తే ప్రపంచ స్వరూప వర్ణన, గ్రహాల స్వరూప విశేషాలు, భూమి స్వశక్తిచేత అనంతాకాశంలో ఏవిధంగా నిలిచి ఉందనే విషయం, భూమధ్యరేఖ, మొదలైన అంశాలు వివరించబడినాయి. అదేవిధంగా ఉత్తర, దక్షిణ ధ్రువ స్వరూపాలు, సౌర, చాంద్ర వర్షాలు, అధిక మాసాలు ఏర్పడడం, గ్రహాలస్ఫుటస్థితి కనుక్కొనే విధానం తెలియజేయబడినాయి. గ్రహకక్ష్యాదులను కనుక్కోవడానికి యంత్ర ఉపయోగం వివరించబడింది. అదేవిధంగా 'ధీ' యంత్ర సహాయంతో లెక్కలు కట్టే విధానానికి ఉదాహరణలు కూడా ఇచ్చాడు. ఈ అధ్యాయంలో అనేక జ్యోతిష విషయాల ప్రతిపాదన కనిపిస్తుంది. ఈ ప్రతిపాదనలన్నీ దృష్టిలో

పెట్టుకుంటే భారతీయ ఖగోళ శాస్త్రంలో, గణితశాస్త్రంలో ఎన్నిరకాలైన అంశాలు ప్రాథమిక దశలో ఉన్నాయో మనకు అవగతమౌతుంది.

ఈ సిద్ధాంతశిరోమణికి అనేక భాష్యాలు, టీకలు కనిపిస్తున్నాయి. దీనిలో ఒక్కో భాగానికి ప్రత్యేకంగా కూడా భాష్యాలున్నాయి. ఇవి వేరు వేరు భాషల్లోకి అనువదించబడ్డాయి.

7. ప్రశ్నశాస్త్ర పద్ధతులను తెలపండి? (2001)

మానవుని మేధోవికాసానికి కారణమైన జ్యోతిశ్శాస్త్రం ప్రారంభకాలం నుండి నేటి వరకు అధ్యయన పరిమితిని అధికంగా పెంచుకుంటూ వస్తున్న శాస్త్రం. ఎన్నో శాస్త్రాల ఆవిర్భావానికి, వికాసానికి కారణమైన విజ్ఞానాలకు తల్లిగా భాసించిన ఈ జ్యోతిశ్శాస్త్రం పంచస్కంధ సమన్విత శాస్త్రంగా ప్రసిద్ధి చెందింది.

సిద్ధాంత సంహితా హోరా ప్రశ్నా శకున సమ్మితమ్ అన్నట్లుగా ఈ శాస్త్రం సిద్ధాంతం, సంహిత, హోర, ప్రశ్న, శకునాలనే ఐదు స్కంధాలతో ఈ శాస్త్రం కూడుకొని ఉంది. ఈ పంచస్కంధాలలో సిద్ధాంతం గణిత విభాగానికి సంబంధించింది. హోరాశాస్త్రం వ్యక్తిగతమైన ఫలితాలతో కూడుకొన్న శాస్త్రవిభాగం. సంహితావిభాగంలో జ్యోతిస్సులు ప్రకృతిమీద చూపించే ప్రభావాన్ని గమనిస్తూ ముందు జాగ్రత్తలను తీసుకునే విభాగం ఈ సంహితావిభాగం. ఇది ఒక విజ్ఞానసర్వస్వం లాంటిది. వేరు వేరు పశు పక్ష్యాదులు, ప్రకృతి స్పందనలను గమనించి ఫలనిర్ణయం చేసుకునే విభాగం శకున విభాగం.

జ్యోతిశ్శాస్త్రంలో చతుర్థ స్కంధమిది. తాత్కాలికంగా తాను చేయబోయే పనులలో శుభాశుభాలను గుర్తించి కార్యానికి ఉద్యుక్తులు కావడంలో ఉన్న అంశాలను దృష్టిలో పెట్టుకోవడం ఈ విభాగంలో కనిపిస్తుంది. తత్కాల గ్రహస్థితి ఆధారంగా ఈవిషయాన్ని నిర్ణయిస్తారు. అంతేగాకుండా ప్రశ్న అడిగిన సమయంలో జ్యోతిష్కుని శ్వాస, చుట్టూవున్న శుభాశుభ వస్తువులు, చెప్పిన సంఖ్య, ప్రశ్నాక్షరాలు మొదలైన విషయాలపై ప్రత్యేక శ్రద్ధను చూపిస్తూ స్వర, కాల, సంఖ్యా, వాక్యప్రశ్నలుగా అధ్యయనం చేస్తున్నారు.

ప్రశ్నస్కంధం జైనుల నుండి ప్రారంభమై విస్తృతి పొందింది. ప్రారంభంలో సంహితలో అంతర్భాగమైన ప్రశ్నాశాస్త్రం అధ్యయన పరిమితిని పెంచుకొని ఒక స్కంధంగా

రూపొందింది. దీనిలో ప్రస్తుతం అనేక విభాగాలుగా అధ్యయనం జరుగుతుంది. అవి 1. కాలప్రశ్న 2. స్వరప్రశ్న 3. అక్షర లేక వాక్య ప్రశ్న 4. సంఖ్యా ప్రశ్న.

పృచ్ఛకుడు వచ్చిన సమయం ఆధారంగా లేదా ప్రశ్న అడిగిన సమయాన్ని ఆధారంగా తీసుకుని అప్పటి గ్రహస్థితుల ఆధారంగా ఫలితాలను చెప్పే విధానం కాలప్రశ్న అంటారు. దీన్నే ప్రశ్నసమయ సిద్ధాంతం అంటారు.

పృచ్ఛకుడు ప్రశ్నించిన సమయంలో జ్యోతిష్కుని స్వరస్థితిని ఆధారంగా ఫలితం చెప్పే పద్ధతిని స్వరప్రశ్నసిద్ధాంతం అని వ్యవహరిస్తారు. ఇడ, పింగళ, సుషుమ్న అనే నాడులను స్వరాలని వ్యవహరిస్తారు.

పృచ్ఛకుడు ప్రశ్నించిన విషయంలోని మొదటి అక్షరాలను లేదా ప్రారంభవాక్యంలోని మొదటి గణాలను, వాక్య నిర్మాణం ఆధారంగా ఫలితాలను సూచించే విభాగం అక్షర ప్రశ్న లేదా వాక్య ప్రశ్న అని అంటారు.

పృచ్ఛకుడు ప్రశ్నించినపుడు చెప్పిన సంఖ్యను కాని లేదా ప్రశ్నించడానికి వచ్చినపుడు దైవజ్ఞుని వద్దకు తెచ్చిన ఫలాలు, తాంబూలాదుల సంఖ్యను గమనించి ఫలితాలను తెలియజేసే విభాగాన్ని సంఖ్యాప్రశ్న అని అంటారు.

ప్రశ్నశాస్త్రంలో ఎన్నో వినూత్నాంశాలు పరిశోధించబడినాయి. అయితే వీటిలో అతి క్లిష్టమైన అంశాలనుండి అతి సులువైన విశేషాలు, విభాగాలెన్నో ఉన్నాయి. ప్రశ్నించేటపుడు చుట్టుపక్కల పరిసరాల ద్వారా జ్యోతిష్కునికి అందుతున్న సమాచారం, శకునాలు, ఉపశ్రుతి మొదలైనవి దృష్టిలో పెట్టుకొని పృచ్ఛకుని లక్షణాన్ని గమనిస్తూ ఫలితాలను చెప్పవలసి ఉంటుంది. దీనినే అంగవిద్య అని కూడా అంటారు. ఇవే కాక తాంబూల ప్రశ్న, గవ్వలప్రశ్న, రమలప్రశ్న, పంచపక్షి ప్రశ్న వంటి అనేక విధానాలు కూడా ప్రాచుర్యంలో వేరు వేరు ప్రాంతాలలో అనుసరించబడుతూ ఉన్నాయి.

ఈ విధంగా ప్రశ్నశాస్త్రం తాత్కాలిక సమస్యలను తీరుస్తూ జాతకాదులు లేనివారికి అత్యధికంగా వినియోగ పడడమే కాకుండా, జాతకాలున్నవారికి ఈ జన్మలో చేసిన కర్మల ఫలితాల ద్వారా ఏర్పడే విశేషాలను సూచించే అంశంగా ప్రత్యేకంగా గమనించబడుతూ ఉన్నది.

8. తిథి : తేది – వీటి ఖగోళీయ ప్రామాణికతను చర్చించండి? (2001, 2003)

జ్యోతిశ్శాస్త్రం ప్రత్యక్ష ప్రమాణ శాస్త్రం. ఆకాశంలో కనిపించే అంశాలు భూగోళానికి అందించే సూచనలను తెలియజేసే విధానమే దీనిలో ఫలితవిభాగం. ఈ ఫలితాల నిర్ధారణకు మనకు ఖగోళంలోని గ్రహగమనాలే ఆధారం. కాలాన్ని నిర్ధారించుకొని విభజించుకొని ఆలోచించడానికి మనకు తిథులు, వారాలు, మాసాలు, ఋతువులు, అయనాలు, సంవత్సరాలు, యుగాలు, అధికమాసాలు మొదలైనవి ఉంటాయి. అదేవిధంగా చంద్రగతిని గూర్చి చర్చించడానికి వేరు వేరు నక్షత్రాలలో చంద్రుడున్న స్థితి ప్రధానమౌతుంటుంది. కాలగణన ముఖ్యంగా రవి, చంద్ర స్థితులపై ఆధారపడి ఉంటుంది. ఇటువంటి స్థితుల్లో ముఖ్యంగా దినప్రమాణాన్ని నిర్దేశించుకోవడానికి తిథి అనేది జ్యోతిష్కులు ప్రత్యేకంగా గణిస్తుంటారు.

ఖగోళంలో రవిస్ఫుటానికి చంద్రస్ఫుటానికి మధ్యలో ఉన్న దూరాన్ని తిథిగా పరిగణిస్తుంటాం. ఈ దూరం రోజుకు దాదాపు 12 డిగ్రీలు ఉంటుంది. రవి నుండి చంద్రుడు 12 డిగ్రీల దూరంలో ఉంటే శుక్ల పాడ్యమి అని, 24 డిగ్రీల దూరంలో ఉంటే విదియ అనీ, 36 డిగ్రీల దూరం వరకు ఉంటే తదియ అంటూ వరుసగా లెక్కిస్తుంటాం. ఒక తిథికి 12 డిగ్రీల చొప్పున ఒక మాసంలోని 30 తిథులకు 360 డిగ్రీలు అవుతుంటాయి. రవి నుండి చంద్రుడు మొదటి 7 రాశుల్లో కనిపిస్తే దానిని శుక్లపక్షంగానూ, వెనుకవైపు 7 రాశుల్లో ఉంటే అది కృష్ణపక్షంగానూ పరిగణించబడుతుంది. రవి చంద్రుడు ఒకే డిగ్రీలో ఉంటే అది అమావాస్య అనీ, 180 డిగ్రీల దూరంలో అంటే 7వ రాశిలో ఉంటే అది పౌర్ణిమగా పరిగణింపబడుతుంది. ఖగోళంలో ఉండే ఈ ప్రత్యక్ష ప్రమాణాలే మనకు తిథులకు ఆధారం.

అదేవిధంగా చాంద్రమానం ప్రకారం ఏర్పడే మాసాలకు కూడా ఇటువంటి గణన ఉంది. ప్రతిమాసంలోనూ పౌర్ణిమ నాడు వచ్చే నక్షత్రం ఆధారంగా ఆ మాసానికి పేరు ఏర్పడింది. పౌర్ణిమనాడు ఆ నక్షత్రం గాని దాని ప్రక్క నక్షత్రాలు గాని లేకపోతే ఆ మాసం పేరు ఉండక అధికమాసంగా సూచించబడుతుంది. ఉదాహరణకు చిత్త +

పౌర్ణమి = చైత్రమాసం, విశాఖ + పౌర్ణమి = వైశాఖమాసం, జ్యేష్ఠ + పౌర్ణమి = జ్యేష్ఠమాసం, పూర్వాషాఢ లేక ఉత్తరాషాఢ + పౌర్ణమి = ఆషాఢమాసం, శ్రవణం + పౌర్ణమి = శ్రావణమాసం, పూర్వాభాద్ర లేక ఉత్తరాభాద్ర + పౌర్ణమి = భాద్రపద మాసం, అశ్విని + పౌర్ణమి = ఆశ్వీజమాసం, కృత్తిక + పౌర్ణమి = కార్తీక మాసం, మృగశిర + పౌర్ణమి = మార్గశిర మాసం, పుష్యమి + పౌర్ణమి = పుష్యమాసం, పూర్వఫల్గుణి లేదా ఉత్తరఫల్గుణి + పౌర్ణమి = ఫాల్గుణమాసంగా గుర్తించడం జరిగింది.

సౌరమానం ప్రకారం కూడా సూర్యుడు వేరు వేరు రాశుల్లో సంచరించే కాలాలు ఆ యా రాశుల పేర్లతోనే మాసాలుగా గుర్తిస్తుంటారు. మేషమాసం, వృషభమాసం .... ధనుర్మాసం, మకరమాసం ... లాంటి పేర్లు ఈ విధంగా ఏర్పడినవే. ఈ విధంగా జ్యోతిశ్శాస్త్రం ప్రకారం గమనించే ప్రతివిషయంలోనూ మనకు ప్రత్యక్ష ఖగోళప్రమాణాలు కనిపిస్తున్నాయి.

అయితే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనుసరించే తేదీకి సార్వత్రికత లేదు. అదేవిధంగా మనం అనుసరించే నెలలకు కూడా ఖగోళ ప్రమాణం ఏదీ కనిపించదు. అందరూ అనుసరించడం వల్ల దాని వినియోగాన్ని సూచించుకోవడమే తప్ప ప్రత్యేకంగా ఒక తేది (డేట్) ఒక రోజుకు ప్రమాణం అనే అంశం ఏరకంగానూ మనం సమర్థించలేం. ఒక మాసాన్ని (జనవరి, ఫిబ్రవరి మొ॥నవి) అది కాదనేటప్పుడు కూడా దాన్ని సమర్థించడానికి ప్రపంచంలో ఎవ్వరి వద్దా సరియైన ప్రమాణం కనిపించదు.

అందువల్ల జ్యోతిశ్శాస్త్రం ప్రత్యక్ష ప్రమాణాలతో, ఖగోళ ప్రమాణాలతో కూడుకొన్నటువంటిది. అనుసరణలు ఏ విధంగా ఉన్నప్పటికీ మౌలికమైన ఆధారాలతో కూడుకొన్న జ్యోతిషం మాత్రం ఉత్తమమైన ఫలితాలను లోకానికి అందిస్తూ దాని ప్రత్యేకతలను చాటుతూనే ఉన్నది.

అందుకే 'అప్రత్యక్షాణి శాస్త్రాణి వివాదస్తేషు కేవలం ప్రత్యక్షం జ్యోతిషం శాస్త్రం చంద్రార్కౌ తత్ర సాక్షిణౌ' అంటారు.

9. మేదినీజ్యోతిషంలో 12 భావాలు సూచించే విషయాలను వెల్లడించండి? (2001)

జ్యోతిశ్శాస్త్రంలో వ్యక్తిగతమైన ఫలితాలను సూచించే పద్ధతులతో పాటు సామూహిక ఫలితాలకు సంబంధించిన అంశాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఈ పద్ధతులలో ప్రాచ్యధోరణి, పాశ్చాత్య ధోరణులు ప్రత్యేకంగా అనుశీలించ బడుతున్నాయి. దేశపరిస్థితులపై గ్రహాల ప్రభావాన్ని ఊహించడానికి సాయన మేషరాశిలో సూర్యుడు ప్రవేశించే సమయానికి జాతకచక్రం రూపొందించి పరిశీలించడం పాశ్చాత్య సంప్రదాయం. దేశరాజధాని లేక కావలసిన నగర అక్షాంశ, రేఖాంశలకు సాయన మేషసంక్రమణకాలంలో ఏర్పడే లగ్నాది ద్వాదశ భావాలను, ఆ భావాల్లో వివిధ గ్రహాలను, దృష్టి సంయోగాలను గుర్తించి ఫలితాలు చూసే ఈ విధానాన్ని మేదినీ జ్యోతిషం లేదా ముండేన్ ఆస్ట్రాలజీ అని అంటారు. ప్రాచ్య పద్ధతిలోనూ వర్షలగ్నం, జగల్లగ్నం అనే పేర్లతో సంవత్సర ప్రారంభంలో ఉగాదినాడు, నిరయన మేష సంక్రమణ కాలానికి ఉన్న గ్రహస్థితుల ఆధారంగా దేశపరిస్థితులను విశదీకరించే సంప్రదాయం ఉంది.

దేశాన్ని వ్యక్తిగా భావించి ఫలితాలు చెప్పవలసిన ఈ విధానంలో వేరు వేరు దేశాలకు వేరు వేరు రాశులను నిర్దేశించుకోవడం జరిగింది. దీనిలోనూ ప్రాచ్య పాశ్చాత్య విధానాలలో కొంత భేదం కనిపిస్తుంటుంది భావాల విషయంలో మాత్రం ద్వాదశభావాలలోనూ దాదాపు ఐక్యత కనిపిస్తుంటుంది. వ్యక్తి జాతకంలో గమనించే అంశాలకు విస్తృతరూపంగా దేశగోచార అంశాలు మనకు కనిపిస్తుంటాయి. మేదినీ జ్యోతిషం ప్రకారం ద్వాదశభావాలు సూచించే అంశాలు ఈ విధంగా ఉన్నాయి. అవి

1. లగ్నం లేదా ప్రథమభావం : జనసామాన్యం, ప్రజల ఆరోగ్యం, దేశ ఆంతరంగిక వ్యవహారాలు, సాధారణ పరిస్థితులు.

2. ద్వితీయ భావం లేదా ధనభావం : జాతీయసంపద, ఆదాయం, స్టాక్ ఎక్స్ఛేంజ్, బ్యాంకులు, వాణిజ్య వ్యవహారాలు.

3. తృతీయభావం : రైల్వేస్, రవాణా, తంతితపాలా, టెలీఫోన్స్, పత్రికలు, ప్రచురణలు, ప్రచారం, సమాచారశాఖ.

4. చతుర్థభావం : ప్రతిపక్షం, వాతావరణం, వ్యవసాయం, పంటలు, ప్రభుత్వస్థలాలు, గనులు, కార్యాలయాలు.

5. పంచమభావం : విద్య, కళాశాలలు, పిల్లలు, జననశాతం, కళలు, క్రీడలు, పందేలు, వినోదాలు, స్పెక్యులేషన్లు.

6. షష్ఠభావం : సైనిక నౌకా రక్షణశాఖలు, కార్మిక శాఖ, కార్మికులు, కర్మాగారాలు, వ్యాధి, ఆరోగ్య సంక్షేమాలు.

7. సప్తమభావం : విదేశవ్యవహారాలు, యుద్ధాలు, అంతర్జాతీయ వివాదాలు, విదేశవాణిజ్యం, వివాహాలు, విడాకులు.

8. అష్టమభావం : ప్రజాధనం, పన్నులు, ఋణాలు, మరణాలు, హత్యలు, ఆత్మహత్యలు.

9. నవమభావం : న్యాయస్థానం, శాసనాలు, న్యాయమూర్తులు, తీర్పులు, దేవాదాయశాఖ, విద్యాశాఖ, విదేశీ వ్యవహారాలు, సుంకాలు, ఎగుమతి దిగుమతులు, నౌకావాణిజ్యం, రవాణాప్రసారాలు, దేశ ఆధ్యాత్మికసంపద.

10. దశమభావం : ప్రభుత్వం, పాలకపక్షం, మంత్రివర్గం, పరిపాలనా యంత్రాంగం, ప్రముఖులు.

11. లాభభావం : లోకసభ, రాజ్యసభ, శాసనసభ, అధికారపక్షం, వాణిజ్యమండలి, వివిధ సంస్థలు.

12. వ్యయభావం : వైద్యశాలలు, చెరసాలలు, ఆలయాలు, ధర్మసంస్థలు, ఆశ్రమాలు, నేరాలు, విచారణలు, గూఢచారులు, రహస్య శత్రువులు, కపటవ్యూహాలు.

ఈ విధంగా ఉన్న ఫలితాలలో వేరు వేరు భావాలను పరిశీలించేటప్పుడు ఉదాహరణకు తృతీయంలో వ్యక్తిగత జాతకాలలో చిన్న చిన్న ప్రయాణాలను, రచనలను, సహకారాన్ని పరిశీలిస్తుంటాం. అదేవిషయాన్ని దేశదేహానికి పరిశీలిస్తే రవాణా, తపాలా, ప్రసారాలు, పత్రికలు, సమాచారశాఖగా గుర్తించాల్సి ఉంటుంది.

దశమభావంలో పదవీ, హోదా గౌరవాదులను వ్యక్తిగత జాతకాలలో గమనిస్తే దేశానికి పార్లమెంటు, మంత్రివర్గం, ప్రభుత్వం, పరిపాలనా యంత్రాంగం వంటి అంశాలను గమనించి ఫలితాలు చెప్పవలసి ఉంటుంది. ఈవిధంగా మేదినీ జ్యోతిషంలో వేరు వేరు భావాలను గమనించి ఫలనిర్దేశం చేయాలి.

10. పాశ్చాత్య దేశాలలో జ్యోతిష వికాసాన్ని వివరించండి? (2000, 2001, 2002)

జ్యోతిషం కాంతి ఉన్న ప్రతి ప్రదేశంలోనూ వికసించింది. కాంతిని గూర్చి దాని ప్రభావాలను గూర్చి ఆసక్తితో చేసిన అధ్యయనం ప్రకృతిలోని అనేక రహస్యాలను విప్పి చెప్పింది. ఎన్నో శాస్త్రాలకు జ్యోతిషం తల్లిగా మారడానికి కారణం ఈ అంశాలరీత్యా చేసిన ప్రత్యేక పరిశోధనలే. ఈ పరిశోధనల్లో అనేక మౌలికాంశాలు తెలియజేయబడినాయి. ఆ యా దేశాల్లో జ్యోతిష విశేషాలు ఆ యా ప్రాంతీయ పరిస్థితులు, పరిశీలనా విధానాలకు అనుకూలంగా వెల్లడి చేయబడినాయి. దేశ రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక కారణాల వల్ల కొన్ని సార్లు విషయవ్యక్తీకరణ సాధ్యం కాకపోయినప్పటికీ, జ్యోతిష విషయాల పరంగానూ, ఖగోళ విషయాల పరంగానూ పరిశోధనలు చేసి నూతన అంశాలను వ్యక్తికరించి దేశబహిష్కారాదులు, మరణశిక్షలు పొందిన శాస్త్రవేత్తలు కూడా పాశ్చాత్య దేశాల్లో మనకు కనిపిస్తుంటారు. ఈ విధంగా ఇబ్బందులను ఎదుర్కొన్నా కాంతుల ప్రభావాలను, ఖగోళ భూగోళాంశాల విషయంలో పాశ్చాత్యులు ఎన్నో ఉత్తమమైన అంశాలను సమాజానికి వేరు వేరు పరికరాల సహకారంతో అందించారు.

పాశ్చాత్య జ్యోతిష ప్రముఖుల్లో టాలెమీని ఆద్యునిగా పేర్కొనవచ్చు. ఈయన రచించిన టెట్రో బైబ్లోస్ అనే గ్రంథం నాలుగు సంపుటాలుగా ఉంది. ఇది అత్యంత ప్రామాణిక గ్రంథం. ఆధునిక జ్యోతిషానికి మార్గదర్శకులైన అలెన్‌లియో గ్రంథాలు ప్రస్తుతకాలంలో అత్యంత ప్రాచుర్యం వహించాయి. విలియం విల్లీ రచించిన ప్రశ్నశాస్త్ర గ్రంథం కూడా అత్యుత్తమమైందిగా ప్రసిద్ధిపొందింది. ఇంకా కార్టర్, వెస్లెన్ జార్జి,

మార్గరెట్ హోన్, రాబ్సిన్, ఎబర్టిన్, టక్కర్, శాకోయిన్, సెఫీరియల్, రాఫెల్ మొదలైనవారు జ్యోతిషంలోని వేరు వేరు భాగాలలో కృషి చేశారు. ఎఫిమెరిస్‌లను రూపొందించారు.

బాబిలోనియా (మెసపటేమియా)లో జ్యోతిష పరిశీలన పూర్వం బాగా జరిగినట్లు ఆధారాలు లభ్యం అవుతున్నాయి. బాబిలోనియన్ల నుండి గ్రీసు దేశస్థులు సుమారు 7వ శతాబ్దం ప్రాంతంలో జ్యోతిషం నేర్చుకున్నారనే భావన వ్యాప్తిలో ఉంది. గ్రహణాల విషయంలోనూ, ఖగోళపరిజ్ఞానంలోనూ, ఐరేటస్ అనే కవి వర్ణనల ప్రకారం కనిపించే నక్షత్రమండలాల విభజనలను వీరికున్న పరిజ్ఞానాన్ని గమనిస్తే క్రీ.పూ. 2వ శతాబ్దానికే వారికి ఉన్న జ్యోతిష ప్రావీణ్యం అర్థమవుతుంది. ఖగోళాన్ని గమనించే టెలీస్కోప్‌ను కనిపెట్టిన తర్వాత వారి కార్యక్రమాలు అత్యంత వేగవంతగా నడచినాయి. గ్రహవేధ చేయడం వారికి తెలుసు. వేరు వేరు గ్రహాల సంచార కాలాలను గమనించిన విశేషాలు తెలుస్తున్నాయి.

అయనావిష్కరణ జ్యోతిష శాస్త్రంలో పెద్ద మలుపు లాంటిది. హిపార్కస్ అనే శాస్త్రజ్ఞుడు అయన విషయంలో గొప్ప విశేషాలను వెలికి తీసినట్లు తెలుస్తుంది. అయితే భారతీయులు ఈ అంశాన్ని ఎప్పుడో కనిపెట్టి వేరు వేరు కథల రూపంలోనూ, మంత్రాల రూపంలో తెలియజేసినా పాశ్చాత్యులే ఈ అయనాన్ని కనిపెట్టినట్లుగా ప్రచారంలో తెలుస్తుంది. అయనం, విషువత్తుల కాలాలు మారడాన్ని హిపార్కస్ సూచిస్తే టాలెమీ దానిని స్థిరపరచి సూత్రీకరించాడు. వసంత విషువత్తు అయన రీత్యా నెమ్మదిగా కదులుతూ ఒక వృత్తాన్ని పూర్తిచేయడానికి దాదాపు 26000 సంవత్సరాలు పడుతుందని తెలియజేశారు.

టాలెమీ అలెగ్జాండ్రియా దేశస్థుడు ఇతడు రచించిన ఆల్‌మెజెస్ట్ గ్రంథం ఆకాలంలోని పాశ్చాత్యుల ఖగోళశాస్త్ర పాండిత్యాన్ని తెలియజేస్తుంది. టాలెమీ రచనలకు యవనులు 'మేథమేటిక్ సిన్‌టాక్సిస్' అనే పేరు పెట్టారు. దీనికి గణిత సంహిత అని పేరు. అదేవిధంగా ఋతుక్రమాన్ని తెలియజెప్తూ, సూర్యుని చుట్టూ భూమి ఏటవాలుగా దీర్ఘవృత్తంలో తిరుగుతున్నదని సూచించినవారు అరిస్టార్కస్. పైథాగరస్ అనే వ్యక్తి

పైథాగరస్ సిద్ధాంతాన్ని ఏర్పరచారు. ఇతడు క్రీ.పూ.550కి చెందిన ఈతడు భూమి తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుందని ప్రతిపాదించినాడు.

యూదులు, అరబ్బులు, చైనీయులు, మధ్య అమెరికా వాసులు మొదలైనవారు ఖగోళశాస్త్ర అంశాలలో పాండిత్యం సంపాదించినారు. టైకోబ్రాహి, గెలీలియో, కెప్లర్, కాసనే, హైగెన్స్, రమ్మర్, న్యూటన్, ఎడ్మండ్ హేలీ మొదలైన శాస్త్రవేత్తలే కాక ఎందరో పాశ్చాత్యులు జ్యోతిష, ఖగోళశాస్త్ర విషయాలలో తీవ్రమైన పరిశోధనలు చేసి వేరు వేరుగా ఫలితాల క్రోడీకరణ చేసినారు. జ్యోతిషం విశ్వవ్యాప్తమని నిరూపించినారు.

11. గ్రహణాలు ఏర్పడే విధానాన్ని వివరించండి? (2001)

రవి చంద్రుల గతులవల్ల గ్రహణాలు ఏర్పడతాయి. రవి, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖలో ఉన్నప్పుడు ఈ గ్రహణం ఏర్పడుతుంది. సూర్యుని కాంతి చంద్రునిపై పడుతుంది. దానివల్లనే అది ప్రకాశిస్తుంది. భూమి నీడ పరిధిలోనికి చంద్రుడు వచ్చినపుడు భూమి నీడ పరిధి దాటేంతవరకు పూర్తిగా కనిపించకుండా ఉంటాడు. దీనినే గ్రహణం అంటారు. రాహువు వద్దకు గాని, కేతువు వద్దకు కాని ఈ గ్రహాలు వచ్చినపుడు మాత్రమే ఈ గ్రహణాలు ఏర్పడతాయి. ఆ సమయంలోనే మూడు గ్రహాలు ఖచ్చితంగా ఒకేవరుసలో కనిపిస్తుంటాయి.

రవి, భూమి, చంద్ర మార్గాలు ఒకేరకంగా ఉండవు. రవి, భూమి ఎప్పటికీ ఒకమార్గంలో ఉన్నప్పటికీ చంద్రుడు ఈ మార్గానికి 5 డిగ్రీలు అటూ ఇటూ తిరుగుతుంటాడు. రవి చంద్రులకు మధ్యలో భూమి ఉన్న రోజున పూర్ణిమ అవుతుంది. అయితే రవి, భూమి, చంద్రులు ఒకే సరళరేఖలో వుండి చంద్రుడు రాహువు వద్దగాని, కేతువు వద్దగాని ఉన్నప్పుడు ఈ చంద్రగ్రహణం ఏర్పడుతుంది. చంద్రబింబం పూర్తిగా కనిపించకుండా ఉంటే అది సంపూర్ణచంద్రగ్రహణం. కొంతభాగం కనిపించకుండా ఉంటే అది పాక్షిక చంద్రగ్రహణం అవుతుంది. మొత్తం గ్రహణం ప్రారంభమై, పూర్ణమై మళ్ళీ పూర్ణబింబం కనిపించేసరికి ఒక గంట ముప్పావు సమయం పడుతుంది. ఈ గ్రహణ సమయంలో చంద్రునిపై ఉష్ణోగ్రత బాగా తగ్గిపోతుంది.

అదేవిధంగా రవికి భూమికి మధ్యలో చంద్రుడు వచ్చినపుడు సూర్యగ్రహణం ఏర్పడుతుంది. ఆ రోజున అమావాస్య అవుతుంది. రవి, చంద్రులు ఆ రోజున ఒకే డిగ్రీపై కనిపిస్తుంటారు. ఆ సమయంలో ఆ ప్రదేశంలో రాహువుగాని, కేతువుగాని ఉండాలి.

అమావాస్య పూర్ణిమలు ఎన్నోసార్లు వచ్చినా రాహు, కేతువులు ఉన్న స్థానంలో మాత్రమే ఈ గ్రహాలు వరుసగా ఉన్నప్పుడు గ్రహణాలు ఏర్పడతాయి. ఈ గ్రహణం ఏర్పడే సమయంలో భూమిపై సూర్యకాంతి పడకుండా చంద్రుడు అడ్డుగా వస్తాడు. పాక్షిక సూర్యగ్రహణ సమయంలో సూర్యునిలో చంద్రుడు కొంతభాగానికి మాత్రమే అడ్డుగా వస్తాడు. సూర్యగ్రహణం అన్ని ప్రాంతాలలో ఒకే విధంగా కనిపించదు. ఈ గ్రహణానికి 8 నిమిషాలకన్నా ఎక్కువ సమయం పట్టదు.

ఈ సమయంలో వాతావరణంలో వచ్చే వేరు వేరు మార్పుల ఆధారంగానూ, ఆ యా నక్షత్రాలలో పట్టే గ్రహణాలకు అనుకూలంగానూ జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని జ్యోతిష్కులు తెలియజేస్తుంటారు.

12. ఈ క్రిందివారిలో ఇద్దరి గూర్చి పరిచయం చేయండి? (2001)

పావులూరి మల్లన : ఇతడు ప్రసిద్ధ గణితశాస్త్రవేత్త, తెలుగు రచయిత. జైన సంప్రదాయానికి చెందినవాడు. 12వ శతాబ్ది పూర్వార్ధానికి చెందినవాడు. ఇతడు గణితాన్ని తెలుగులో శాస్త్రకావ్యంగా తీర్చిదిద్దిన ప్రముఖుడు. తెలుగులోని శాస్త్రకావ్యాల్లో ఇతడు రచించిన గణితగ్రంథం మొదటిది. దీనికి మహావీరాచార్యుని 'గణితసారసంగ్రహం' మూలం. దీని ఆధారంగా మల్లన రచించిన గ్రంథానికి 'సారసంగ్రహగణితం' అని పేరు కాని ఈ గ్రంథం 'పావులూరి మల్లన గణితం' అనే పేరుతోనే ప్రసిద్ధి పొందింది. మహావీరాచార్యుని గణితసారసంగ్రహంలో పరికర్మ గణితం, ప్రకీర్ణగణితం, త్రైరాశిక గణితం, మిశ్రగణితం, క్షేత్రగణితం, ఖాతగణితం, ఛాయాగణితం అనే అష్టవిధ గణితాల్లో పావులూరి మల్లన మిశ్రగణితాన్ని రెండుభాగాలు చేసి మొత్తం తొమ్మిది విభాగాలుగా తన గ్రంథంలో రచించాడు.

ఈతని పద్యశైలికి ఉదాహరణ ఈ విధంగా ఉంటుంది.

"మున్నయు, మున్నయు బెంచిన
మున్నయు, తత్కృతి ఘనంబు మున్నయ పచ్చున్
మున్నంబు, లెక్కయుబెంచి
మున్నయ తానమరియుండు మున్నర రీతిన్"

ఇది సున్నాకు చెందిన గణితం. సులభమైన పదాలలో వీరి రచనారీతి ఉంటుంది. పావులూరి మల్లన క్షేత్రగణిత భాగాన్ని బెంజిమన్‌హైన్ అనే పండితుడు ఇంగ్లీషులోకి అనువదించాడని తెలుస్తోంది. మల్లన భాస్కరుని లీలావతి (పాటీ గణితాన్ని) తెలుగులోకి అనువదించినట్లు తెలుస్తుంది.

ఆల్బెటాన్ : ఇతడు అరబ్బు ఖగోళ శాస్త్రవేత్త. మెసపటోమియాలో బట్టాన్ నగరంలో జన్మించాడు. ఇతని తండ్రి ఖగోళశాస్త్ర పరికర నిర్మాత. ఆల్‌బట్టాని 57 అధ్యాయాలున్న గ్రంథం ఒకటి వ్రాశాడు. దీనిలో అనేక గణిత సంబంధ అంశాలున్నాయి. ఇతడు కొద్ది తేడాతో విషుప్రవేశకాలాన్ని నిర్ణయించాడు. గ్రీకుల కంటె శుద్ధంగా క్రాంతివృత్తాన్ని కనుకున్నాడు. సూర్యుని జ్యాలోని చలనగతిని కనుక్కున్నవారిలో ఇతడే మొదటివాడు. ఇతనికాలంలో అబుల్ వాఫా, నాజరుద్దీన్, ఉలూగ్‌బేగ్ మొదలైన ప్రసిద్ధశాస్త్రవేత్తలుండేవారు.

దుర్గదేవుడు : దిగంబర జైన సంప్రదాయానికి చెందిన దుర్గదేవుడు క్రీ.శ.1032 కాలం వాడు. ఇతడు జ్యోతిశ్శాస్త్ర మర్మాలు అధికంగా అధ్యయనం చేసినవాడు. అర్ఘకాండం, రిట్టసముచ్చయమనే గ్రంథాలు రచించాడు. ఇతని గురువు సంయమదేవుడు. రిట్టసముచ్చయం జైన శౌరసేనీ ప్రాకృతంలో ఉంది. ఇందులో శకునాలు, శుభాశుభ నిమిత్తాలు, మరణ నిమిత్తాలు మొదలైన నిమిత్తాలను గూర్చి వ్రాశాడు. అరిష్టాలను పిండస్థ, రూపస్థ, పదస్థ నిమిత్తాలుగా విభజించాడు.

పిండస్థ నిమిత్తాలంటే వేళ్ళు విరుచుకోవడం, నేత్రకాంతి తగ్గడం, రసజ్ఞానం తగ్గడం, కండ్లనుండి నిరంతరం నీరు కారడం, తన నాలుకను తాను చూసుకోలేక పోవడం మొదలైనవి.

పదస్థ నిమిత్తాలంటే సూర్యచంద్రులు అనేకులుగా కనిపించడం, మండుతున్న దీపం దగ్గర వెచ్చదనం లేకపోవడం, చంద్రుడు ముక్కలుగా కనిపించడం, చంద్రునిలో మచ్చలు కనిపించకపోవడం మొదలైనవి.

రూపస్థ నిమిత్తాలలో భాగంగా నిజచ్ఛాయ, పరిచ్ఛాయ, ఛాయాపురుషుడు, ఛాయ అంగవిహీనంగా కనిపించడం, తననీడలో – చిల్లులు కనిపించడం మొదలైనవి.

స్వప్నాలు దేవేంద్ర దత్తాలని, సహజాలని రెండుగా విభజించాడు. శకునాల ద్వారా రాబోయే మృత్యువును కూడా తెలుసుకునే పద్ధతులను ఇతడు వివరించాడు

కళ్యాణవర్మ : (2000, 2001, 2003) ప్రముఖ ఫలజ్యోతిష హోరాశాస్త్ర గ్రంథమైన 'సారావళి' ని రచించిన వాడు కళ్యాణవర్మ. ఇతడు శా.శ. 500 సంవత్సరానికి చెందినవాడు. అంటే దాదాపు క్రీ.శ.ఆరవ శతాబ్దంవాడు. హోరాశాస్త్రంలోని నిస్సార విషయాలన్నీ వదిలివేసి సారాన్ని మాత్రమే గ్రహించి వ్రాసిన గ్రంథం కావడం వల్ల దీనికి 'సారావళి' అని పేరుపెట్టడం జరిగింది. ఈ గ్రంథం వరాహమిహిరుని బృహజ్జాతకం కంటె చాలా పెద్దది. దీనిలోని శ్లోక సంఖ్య 2500 కు సరింది. హోరాశాస్త్ర తపనతో పీడింపబడుతున్న తన శిష్యుల పరితాపం తీర్చడానికి కళ్యాణవర్మ సారావళి వ్రాశాడు. కళ్యాణవర్మ దేవగ్రామ నివాసి అని తెలుస్తుంది. దేవగ్రామం గుజరాత్‌రాష్ట్రంలోని రేవారాజ్యంలోనిది. ఇతనికి వ్యాఘ్రపదీశ్వరుడనే నామాంతరం ఉంది. సారావళి గ్రంథంలో 55 అధ్యాయాలున్నాయి. ఇతడు సూర్యచంద్రుల వల్ల ఏర్పడే యోగాలకు ఫలితాలను వివరించాడు. చంద్రుని నవాంశ ఫలితాలను గూర్చి, నష్టజాతకాన్ని గూర్చి విపులంగా వ్రాశాడు.

13. శాస్త్ర శబ్దాన్ని నిర్వచించి, ఆ శబ్దార్థత జ్యోతిశ్శాస్త్రానికి ఎందువల్ల ఉన్నదో స్థాపించండి? (2000, 2001)

'శాసతి అనేన శాస్త్రమ్' అని శాస్త్ర శబ్దానికి వ్యుత్పత్తి. శాసించేది కాబట్టి శాస్త్రమవుతుంది. 'శాసనాత్ శాస్త్రముచ్యతే'. మానవునికి ఉపయోగపడే విజ్ఞానాన్ని శాస్త్రం అని పూర్వులు తెలియజేశారు. వ్యక్తియొక్క ప్రవర్తనను శాస్త్ర శాసిస్తుంది. చేయవలసిన విధిని నిర్దేశిస్తూ దానికి అనుకూలమైన కర్మను ప్రోత్సహిస్తుంది. వ్యక్తి నిత్య వికాసానికి, ఔన్నత్యానికి, అభివృద్ధికి ఎప్పటికీ తోడ్పడేది శాస్త్రం. దీనిని నిరూపించడానికి అవసరమైన ఉదాహరణలను చూపించడమే హేతువు చూపించడం. శాస్త్రమనే ప్రతి అంశానికి దాదాపు హేతువుండాలి. హేతువు లేకుండా విషయ నిరూపణ కష్టం. అయితే ఆ హేతువులు గుర్తించగలగడం వ్యక్తి యొక్క బుద్ధికుశలతపై ఆధారపడి ఉంటాయి. హేతువులను గుర్తించి, తెలియపరచినపుడు ఆ విషయ వ్యక్తీకరణ, శాస్త్రబద్ధత స్పష్టంగా అవగాహనలోకి వస్తాయి.

జ్యోతిషం విషయంలో కూడా శాస్త్ర శబ్దం పూర్వకాలంలో బాగా ఆదరణలో ఉండేది. ప్రత్యక్ష ప్రమాణాలైన ఖగోళాంశాలను ఆధారం చేసుకొని భూగోళంపైన, దానిపై ఉండే ప్రకృతిపైన, నివసించే వ్యక్తులు, పశు పక్ష్యాదులపైన ఆ యా జ్యోతిస్సులు కలిగించే ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలను అధ్యయనం చేస్తూ భవిష్యత్తు మంచి చెడులను సూచించడానికి జ్యోతిషం ప్రత్యేకంగా వినియోగపడుతుంది.

శాస్త్రాలు సూచితాత్మకమనీ, నియమితాత్మకమనీ రెండు రకాలు. నియమితాత్మకాలైన శాస్త్రాల విషయంలో ప్రయోగశాలలో పరిశోధనలు ప్రత్యేకమైన సమయాలను, ప్రత్యేకమైన పరిమాణాలను దృష్టిలో పెట్టుకొని చేయవచ్చు. కాని జ్యోతిషం లాంటి శాస్త్రాల విషయంలో ఆ విధమైన పరిశోధన అసాధ్యం. కేవలం ఆకాశంలో ఒకసారి ఒక నక్షత్రం ఒక ప్రత్యేకమైన ప్రదేశంలో కనిపించినపుడు భూగోళంలోని ప్రత్యేకమైన ప్రదేశంలో కలిగే మార్పులు మళ్ళీ గమనించాలంటే మళ్ళీ అదే నక్షత్రం అక్కడ ఉదయించినపుడు చూడాల్సిందే. ఎప్పుడు పడితే అప్పుడే గమనించడం అసాధ్యం. అదే విధంగా వేరు వేరు గ్రహాలు ఉదయించే కాలాలు,

అస్తమించే కాలాలలో ఉండే వైవిధ్యం, భూగోళం తిరగడం వల్ల కలిగే మార్పులన్నీ ఆ యా ప్రత్యేక సమయాల్లలో, ఆ ప్రత్యేకమైన కలయికలతో కలిపి చూడాల్సిందే కాని మనకిష్టమైనపుడు, ఎవరైనా హేతువు చూపించమన్నపుడు చూసే అంశాలు కావు. అందువల్ల ఆ పరిమితులను నిర్దేశించుకొని ఏర్పాటు చేయబడిన సూచితాత్మక శాస్త్రం జ్యోతిషం.

సూచితాత్మకశాస్త్రాలు విషయాన్ని సూచిస్తూ వుంటాయి. మంచి చెడుల విషయంలో అవి చేసే సూచనల ఆధారంగా భవిష్య నిర్దేశం ఉంటుంది. ముఖ్యంగా జ్యోతిషం శుభాశుభ కాలాలను సూచిస్తూ ఉంటుంది. ఈ సూచనల ప్రకారం వ్యక్తికి మంచి సమయం అని భావన ఏర్పడితే ఆ సమయాన్ని వ్యర్థం కాకుండా తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితం పొందేటట్లుగా ప్రయత్నం చేయవలసి ఉంటుంది. అదేవిధంగా కాలం అశుభాత్మకమనే భావన జాతకునికి ఏర్పడితే జాగ్రత్తలు తీసుకుంటూ, ఎక్కువ ప్రయత్నం చేస్తూ ముందుకు నడిచే ఆత్మస్థైర్యాన్ని జ్యోతిషం అందిస్తుంది. అందువల్ల జ్యోతిషాన్ని అధ్యయనం చేయడం వల్ల మంచి, చెడు కాలాల మీద అవగాహన ఏర్పడి వ్యక్తి విసిగి పోకుండా, తనకు అనుకూలమైన మార్గంలో తాను చేయవలసిన శ్రమయొక్క శాతాన్ని గుర్తు చేసుకొంటూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు ఆత్మవిశ్వాసంతో సాగడం జరుగుతుంది. ఈ శాస్త్రమొక్కటి తప్ప మరే ఇతర శాస్త్రం కూడా ఇటువంటి జాగ్రత్తలను అందించలేదు.

సూర్యకాంతి రాగానే వ్యక్తి మేల్కొనడం, ఆనందించడం, పని చేసుకోవడం, అది పోగానే విశ్రాంతి వైపు క్రమంగా సాగిపోవడం జరుగుతుంది. చంద్రకాంతి వయోధర్మం, దేహధర్మం, మనోధర్మాల ఆధారంగా వ్యక్తిలో మార్పులను కలిగిస్తుంటుంది. అదేవిధంగా వేరు వేరు గ్రహాల కాంతుల ప్రభావాలు వ్యక్తిపై ప్రకృతిపై మంచి, చెడు ఫలితాలను కలిగిస్తున్నాయి. సూర్యకాంతి ఒక సమయంలో ఉండడం, మరో సమయంలో పోవడం గూర్చిన ఆలోచన, చంద్రకాంతుల వృద్ధి, క్షీణతలను గూర్చిన ఆలోచన, గ్రహాలు ఒకసారి కనిపించడం మరోసారి కనిపించక పోవడం, నక్షత్రాలు ఒక సారి కనిపించడం మరికొంత కాలం కనిపించక పోవడం, వేరువేరు

సమయాలలో ప్రకృతిలో వచ్చే మార్పుల అధ్యయనం జ్యోతిశ్శాస్త్రంగా రూపొందింది. ఆ యా సందర్భాలలో ప్రకృతిలోని మార్పులతో పాటు, వ్యక్తులందరిపై ప్రభావాలలో వైవిధ్యం కూడా ఆశ్చర్యాన్ని కలిగించి ప్రత్యేకంగా పరిశీలించడానికి హేతువైంది. అందుకే జ్యోతిషం ఎన్నో విషయాలను సూచించేదిగా మారుతూ అనునిత్య మార్గదర్శకశాస్త్రమైంది.

ఒక శాస్త్రం నూతన విషయాలను తెలియజేస్తున్నప్పుడు అది అందించే అంశాలు ఆ శాస్త్రోక్తాలుగా చెప్పబడతాయి. అయితే ఆ కాలంలోనే కాక ఎప్పటికీ కూడా పూర్వంలో గమనించిన అంశాల ప్రభావం నిత్యనూతనంగా ఉంటుంటే క్రమ పరిణామంలో ఆ శాస్త్రం తన శాశ్వతత్వాన్ని కోల్పోయి ఎల్లకాలంలోనూ, అందరిచేతా అనుసరించబడి, ఆచరించబడి అది ధర్మంగా పరిణమిస్తుంది. అది జీవధర్మం, వ్యక్తిధర్మమై ధర్మశాస్త్రాంశంగా నిర్దేశించబడుతుంది. ఒక విషయం ధర్మ శాస్త్రాంశంగా ఎప్పుడైతే నిర్దేశించబడుతుందో అప్పుడు ఆ అంశాన్ని వివరించడం ఆ సూత్రం ఏ కాలంలో ఎందుకొరకు పెట్టారనే అంశం గుర్తు చేసుకోవడం సాధ్యం కాదు. దాని వినియోగం అందరికీ సమానమనే ధోరణి మాత్రం ప్రత్యేకంగా పరిగణించబడుతుంది. జ్యోతిషం అటువంటి శాస్త్రమే. జీవనధర్మంగా ప్రస్తుతకాలంలో దాని సూత్రాలు ధర్మశాస్త్రం ప్రకారం ఇతర శాస్త్రాల ప్రకారం ప్రవర్తించబడడం వల్ల శాస్త్ర ధర్మాన్ని కోల్పోతూ వచ్చి హేతువుల వివరణ క్రమంగా తగ్గి కేవలం అనుసరణ మాత్రమే పెరిగింది. అందువల్లనే ప్రస్తుత కాలంలో ఇది శాస్త్రమా? కాదా? అనే చర్చలు అనేకంగా ఏర్పడినాయి. అయితే జానపదులకు, జ్ఞానపథులకు అందరికీ కూడా సమానంగా వినియోగపడి స్పష్టమైన ప్రభావాన్ని చూపేది జ్యోతిష శాస్త్రమొక్కటే. పండుగలు వాటి విధులు, జన నిత్యజీవనంలో చేసే వేరు వేరు కార్యక్రమాలు, గ్రహణాదులు ఏర్పడినప్పుడు భూగోళంపై ఏర్పడే ప్రభావాలు, వాటికి తీసుకొనే జాగ్రత్తలు, వేరు వేరు పౌరాణిక గాథలలో అంతర్గతంగా నిబిడీకృతం చేసి లోకానికి కథలరూపంలో అందించదలచుకొన్న జ్యోతిష విజ్ఞానాలను ప్రస్తుత కాలంలో సింహావలోకనం చేసుకుంటే అత్యంత విస్మృతంగా, అందరి మన్ననలకు గురై, లోకహితాన్ని కోరుకునే శాస్త్రం ఒక్క జ్యోతిషమే నన్న భావన స్పష్టంగా అవగతమవుతుంది.

✓

ఖగోళంలోని అంశాల ఆధారంగా భూగోళం పైన ఉండే వ్యక్తుల పరిశీలనల పొందుపర్చ్య ఫలితం అంతా ప్రత్యక్షంగా అందరికీ అర్థమయ్యేదే. అందుకే జ్యోతిషాన్ని ప్రత్యక్ష ఫలప్రదశాస్త్రమని అంటారు.

"అప్రత్యక్షాణి శాస్త్రాణి వివాదస్తేషు కేవలం
ప్రత్యక్షం జ్యోతిషం శాస్త్రం చంద్రార్కౌ యత్ర సాక్షిణౌ"

14. ఆధునిక యుగంలో జ్యోతిషశాస్త్ర ప్రయోజనాన్ని తెలియజేయండి? (2003)

జ్యోతిషం సార్వత్రికంగా, సర్వకాలాలలోనూ ప్రయోజనాన్ని చూపించే శాస్త్రం. అన్నికాలాలలోనూ ప్రదేశపరంగా, సంఘపరంగా ప్రయోజనాల విషయాలలో మార్పులు ఏర్పడవచ్చుగాని, వ్యక్తిగత అంశాలు, ప్రాకృతిక అంశాలలో దాని ప్రభావ ఫలితం ఒకేరకంగా ఉంటుంది. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుంటే వ్యక్తికి అనునిత్యం ఉపయోగపడే విజ్ఞానం జ్యోతిష విజ్ఞానం అవుతుంది.

ప్రస్తుత కాలంలో జ్యోతిషం శాఖోపశాఖలుగా విస్తరించి ఒక్కో భాగం ప్రత్యేకంగా, అధ్యయనం చేయబడుతుంది. ఆ యా విభాగాల ప్రయోజనాలను గమనిస్తే జ్యోతిశ్శాస్త్ర ప్రయోజనాలను సరియైన విధంగా నిరూపించవచ్చు.

జ్యోతిశ్శాస్త్రంలో సంహితలోని ఒక విభాగం ముహూర్తం. వేరు వేరు పనులకు ముహూర్తాదులు నిర్దేశించుకోవడం ప్రస్తుత జనజీవనానికి సామాన్యమే. పుట్టుక తన చేతిలో లేదని భావించే వ్యక్తి ఏదైనా కార్యక్రమ ప్రారంభానికి ప్రత్యేకంగా ముహూర్త నిర్ణయం చేసుకోవడం పరిపాటి. ఒక సత్కర్మకు ఒక మంచి ముహూర్తం నిర్ణయించుకోవడం ద్వారా ఆ పనికి సంబంధించిన భవిష్యజీవనం ఆనందంగా ఉంటుంది. జీవితంలోని ప్రతి కార్యక్రమానికి, మొదలు పెట్టబోయే వ్యాపార తదితర భాగస్వామ్య వ్యవహారాలు, గృహాదుల ప్రారంభ ప్రవేశాలకు, ఉద్యోగాదుల్లో చేరడానికి, కొత్త కార్యక్రమాలన్నింటికీ అన్నింటికీ ఈ ముహూర్తాలను నిర్ణయించడం ద్వారా ఆ విషయపరమైన ప్రయోజనం ఆ వ్యక్తి పొందుతాడు.

అదేవిధంగా పుట్టిన సమయానికి వేసుకునే జాతకంలో దశానుకూలంగా, గోచారానుకూలంగా కొన్ని కొన్ని శుభాశుభఫలితాలు జరుగుతూ ఉంటాయి. వాటిని ముందుగానే గమనించి సరియైన ముందు జాగ్రత్తలు తీసుకునే విధానాన్ని కూడా జ్యోతిషం సూచించి వ్యక్తి ఆత్మవిశ్వాసం తగ్గకుండా జ్యోతిషం అత్యంత ప్రయోజనకారిగా మారుతుంది. ఈ జాగ్రత్తచర్యలనే శాంతి విధానాలంటారు. ఈ విధానాలలో వేరు వేరు ప్రాంతాలలో వైవిధ్యం కనిపించినా అవి చేసుకోవలసిన అవసరమున్న జ్యోతిష సూత్రాలు మాత్రం సార్వత్రికంగా ఒకే రకంగా కనిపిస్తుంటాయి.

వైద్యవిధానంలో ముఖ్యంగా జ్యోతిష విశేషాల పరిగణన అత్యధికంగా సాగుతూ ఉంది. శరీరం అనారోగ్యానికి గురి కాకుండా అష్టకవర్గు, తదితర సూత్రాల రీత్యా జాతకాదులను అధ్యయనం చేస్తూ జాగ్రత్తలు తీసుకోవడం, ఆరోగ్యం పొందడం జ్యోతిష ప్రయోజనమే. అదేవిధంగా శరీరం, మనసులకు ఏదైనా వ్యాధుల వంటివి సంక్రమించినా అవి ఏ ప్రభావం వల్ల కలిగాయో గుర్తించి వేరు వేరు మార్గాలలో శాంతులను చేసుకోవడం ద్వారా తగ్గించుకోవడం కూడా జ్యోతిష ప్రయోజనమే. ఈ ఇబ్బందులు పూర్వకర్మకృతాలవల్ల జరుగుతాయని. దాని నివారణకు ఓషధులు, దానాదులు, జపాదులు, హోమాదులు చేయవలసి ఉంటుందని జ్యోతిషం సూచిస్తూ ఉంటుంది. ఈ అంశాలన్నింటికీ ప్రత్యేకంగా వేరు వేరు గ్రహాలకోసం వేరు వేరు అంశాలను సూచిస్తూ ఆ యా విధానాలను మాత్రమే అనుసరించాలని శాంతులలో భాగంగా శాస్త్రం నిర్దేశిస్తుంది.

'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అని స్మృతి వాక్యం. అటువంటి ఆరోగ్యాన్ని కాపాడుకునే మార్గంలో జ్యోతిషం అన్ని రకాలుగా ముందు జాగ్రత్తలను అందిస్తుంది. వేరు వేరు గ్రహాల ప్రభావాలతో కూడుకున్న చికిత్సావిధానాలను నిర్దేశిస్తుంది. ఆ యా గ్రహాల ధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా రోగనివారణ మార్గాన్ని తెలియజేస్తుంది. మానసిక వికలాంగులకు అమావాస్య పూర్ణమి రోజుల్లో కలిగే మార్పులను గమనించి ఔషధచికిత్సకు సరియైన మార్గనిర్దేశనం చేస్తుంది.

రత్నధారణ జ్యోతిషం చూపించే ఒక నివారణ మార్గం. మంచి రత్నాలద్వారా వేరు వేరు కాంతులు శరీరంపై, మనసుపై ప్రభావాన్ని చూపుతాయి. సూక్ష్మీకృత కాంతి

ప్రభావంవల్ల శరీరంలో లోపమున్న కాంతిభాగాన్ని పూరించుకొని ఉత్తమమైన ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పొందడానికి అవకాశం కలుగుతుంది. ఇటువంటి ప్రయోజనాలతో జ్యోతిషం కూడుకొని ఉంది.

అదేవిధంగా సంతానానికి సంబంధించిన సరియైన ముహూర్తం నిర్ణయించడం, ఇరువురి జాతకాలలో పంచమ భావం బలంగా ఉన్నసమయాన్ని సంతానం కోసం నిర్దేశించడం ద్వారా కలుగబోయే సంతానం సమాజానికి ఉపకరించేదిగా మారుతుంది.

వాతావరణాది అంశాలపై జ్యోతిష ప్రభావాలను గమనించడం వల్ల వ్యవసాయదారునికి ఉత్తమమైన మార్గం లభిస్తుంది. వర్షనిర్దేశాన్ని స్పష్టంగా చేసుకోవడం ఈ కాలంలో అందరం కోరుకుంటున్నదే. దాని పైన కూడా జ్యోతిష ప్రభావమే అధికంగా ఉంది. భూకంపాల విషయంలోనూ జ్యోతిష ప్రభావాలను గమనించడం వల్ల, దేశగోచారాదులను పరిశీలించడం వల్ల, ఇతర ప్రమాదాలను ముందుగా గమనించడం వల్ల జాగ్రత్తలు తీసుకోవచ్చు.

శుభకాలం అశుభకాలాలను వేరు వేరు పద్ధతుల ద్వారా గమనించి, మంచికాలంలో చేసే ప్రయత్నాన్ని ప్రోత్సహించడం వల్ల తక్కువ శ్రమతో ఎక్కువ లాభం పొందవచ్చు. అశుభకాలంలో జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఇబ్బందులు లేకుండా కార్యసిద్ధిని పొందవచ్చు. ఈ అంశాన్ని జ్యోతిషం మాత్రమే సరియైన విధంగా మార్గనిర్దేశం చేయగలదు.

ఈ విధంగా ఆధునిక కాలంలో ప్రతి అంశంలోనూ జ్యోతిషం తన ప్రభావాన్ని చూపిస్తూ నిరంతరం వ్యక్తిని పురోగామిగా నిలబెడ్తుందనడంలో సందేహం లేదు.

15. ఫలితజ్యోతిషంలో కర్మసిద్ధాంత పాత్రను విశ్లేషించండి? (2000, 2002, 2003)

కర్మసిద్ధాంతం ప్రకారం మానవులు ఒక దూరానుగతమైన ఆలోచనాపరంపర ద్వారా, సృష్టిలో పూర్వాపరాలు వివేచింపబడుతూ, ప్రత్యేకమైన వైజ్ఞానిక అరమరికలో కల్పనాచిత్రంగా సృష్టింపబడ్డారు.

కర్మసిద్ధాంతం మూడు మూలస్తంభాలపై ఆధారపడి ఉంది. అవి 1. పునర్జన్మ 2. మానవుడు కర్మల నుండి తప్పించుకోలేకపోవడం 3. కర్మయొక్క ఫలితం ఏదైనా అనుభవించడం. స్మృతుల ప్రకారం :

అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం
నభుక్తం క్షీయతే కర్మ కల్పకోటి శతైరపి

మానవుడు తన కర్మల యొక్క శుభాశుభ ఫలితాలను అనుభవించి తీరాల్సిందే. యుగాలు, కల్పాలు మారినప్పటికీ ఇవి మారడం, తగ్గడం జరుగదు. పై మూడు సూత్రాలు ఒక చక్కని వ్యూహాత్మకంగా మలచబడి మానవులు భయతత్వానికి వ్యతిరేకంగా పోరాడడానికి, మోక్షానికి చేరువ కావడానికి ఉపయోగపడతాయి. పునర్జన్మ లేకుంటే జ్యోతిషమే లేదు. పూర్వజన్మలోని కర్మలకు, రాబోయే జన్మలోని కర్మలకు జ్యోతిశ్శాస్త్రం చక్కని వారధిలా కనిపిస్తుంది. అంటే పూర్వజన్మ యొక్క కర్మ ఫలితాలకు అనుగుణమైన ఫలితం పొందగలిగే సమయమున్న గ్రహస్థితి వచ్చినపుడు మళ్ళీ ఆ జీవికి జన్మ లభిస్తుంది. కర్మసిద్ధాంతాన్ని అనుసరించి ఒక జాతకం సరియైన విధంగా తయారుచేయబడుతుంది. దీని ద్వారానే వారి పూర్వకర్మల ఆధారంగా ప్రస్తుత జీవన అవధి, కర్మలు నిర్ణయింపబడతాయి.

భారతీయ కర్మ సిద్ధాంతం ప్రకారం కర్మలు మూడురకాలు : అవి 1. ప్రారబ్ధం 2. సంచితం 3. ఆగామి.

1. ప్రారబ్ధం : పూర్వజన్మల్లో మనం చేసిన కర్మకు ఫలితంగా వచ్చేది.

2. సంచితం : పూర్వం చేయబడి నిల్వగా ఉండి అనుభవించడానికి సిద్ధంగా ఉన్నది.

3. ఆగామి : రాబోయే కాలంలో పరిపక్వమయ్యేది.

పూర్వకర్మల ఫలితాలు ప్రస్తుత జీవనంలో వ్యక్తిని ప్రేరేపిస్తాయి. ఆ కర్మలకు అనుగుణంగానే వ్యక్తి తన కార్యక్రమాలను నిర్వహిస్తుంటాడు. కర్మ సిద్ధాంతం ప్రకారం వ్యక్తి ఎటువంటి కర్మలు ఏ సమయాల్లో చేయాలో ఆ సమయంలోనే, అటువంటి

వాతావరణం ఉన్న ప్రదేశంలోనే మళ్ళీ పుడతాడు. ఆ విధమైన కర్మలే చేస్తూ ఉంటాడు. జ్యోతిషం ద్వారా జాతక చక్రాన్ని పరిశీలించి శుభాశుభ సమయాన్ని దశల ఆధారంగా గమనించగలిగితే మంచి కాలాన్ని గుర్తించి మరికొంత నూతన ప్రయత్నం చేయడానికి, చెడుకాలాన్ని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

కర్మసిద్ధాంతం ప్రకారం ఏ కార్యక్రమమైనా తప్పనిసరిగా జరిగితీరాలనే నియమం ఉన్నా జ్యోతిషం ద్వారా మాత్రమే ఫలితాలు ముందుగా కనుక్కొని కర్మల యొక్క ఫలితాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకొనే అవకాశం ఉంటుంది.

పూర్వకర్మకృతం పాపం వ్యాధిరూపేణ పీడ్యతే
తచ్ఛాంతిః ఔషధైః దానైః జపహోమ సురార్చనైః

అనే వాక్యం అందరికీ తెలిసిందే. పూర్వకర్మలలోని పాపాలు వ్యాధిరూపంలో బాధిస్తాయని, దాని నివారణార్థం ఔషధ, జప, హోమ, దానాది ప్రక్రియలు ఆయా దోషకాలాలను గుర్తించి చేసుకోవాలని చెప్పడం జరిగింది. దోష దశ వచ్చేవరకు ఆగి దోషఫలితాన్ని అనుభవించడం ప్రారంభించిన తర్వాత దానిని తొలగించుకోవడం అనారోగ్యం కల్గిన తర్వాత చేసే ఔషధ సేవ వంటిది. జాతకం ద్వారా రాబోయే దోషఫలితాన్ని ముందుగా గుర్తించి పరిహారంగా మనం చేయాల్సిన కృషిని అంచనా వేసి లౌకిక, ఆధ్యాత్మిక ప్రతిక్రియల ద్వారా కృషి చేసి దోషఫలితాన్ని పరిహరించుకోవాలి.

గతంలో చేసిన కర్మ ఫలితాన్ని నివారించడానికి ప్రస్తుతం చేసే కర్మ ప్రయోజనకారి అవుతుంది. పూర్వం చేసిన కర్మలో దుష్టఫలితాన్ని నివారించుకోవడానికి మంచి ఫలితాన్ని పెంపొందించుకోవడానికి ఇప్పుడు చేసే కర్మ కారణమవుతుంది అనడాన్ని అటు కర్మసిద్ధాంతం, ఇటు జ్యోతిశ్శాస్త్రం కూడా సమర్థిస్తున్నాయి.

ఈ జన్మలో వ్యక్తి యొక్క సత్ప్రవర్తన ద్వారా ఆగామిని మంచిగా మలచుకోవడానికి అవకాశం ఉంది. ప్రతిక్రియల ద్వారా దుష్టమైన సంచితకర్మను తొలగించుకోవచ్చు. కర్మ సిద్ధాంత అనుగుణంగానే ప్రస్తుతం జ్యోతిర్విద్య భావన ఏర్పాటు చేయబడింది. ఇబ్బందులు కలిగిన తర్వాత నివారణ చేసుకోవడం కన్నా ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడమే మేలు అనేది ఈ సిద్ధాంతం చెపుతుంది.

లఘుజాతకంలో వరాహమిహిరుడు ఈ విధంగా తెలియజేశాడు.

యదుపచిత మన్య జన్మని శుభాశుభం తస్య కర్మణః పంక్తిం
వ్యంజయతి శాస్త్రమేతత్ తమసి ద్రవ్యాణి దీప ఇవ

పూర్వజన్మలో చేసిన శుభ పాపకర్మల యొక్క ఫలానుభవ కాలాన్ని ఈ శాస్త్రం సూచిస్తుంది. చీకటిలోని వస్తువులను దీపం యొక్క సహాయంతో చూచినట్లుగా, జ్యోతిష సహకారంతో జరుగబోయే మంచి చెడ్డలను గుర్తించి అనుకూల వ్యతిరేక ప్రక్రియల ద్వారా జీవితాన్ని సుఖవంతం చేసుకోవడానికి ఈ శాస్త్రం సహకరిస్తోంది. అంతేగాకుండా

అత్యుత్కటైః పుణ్యపాపైః ఇహైవ ఫలమశ్నుతే

అనే వచనం ప్రకారం తీవ్రమైన పుణ్యపాపాలకు సంబంధించిన అంశాలను వచ్చే జన్మలో కాకుండా అదే జన్మలో ఫలితాన్ని అనుభవిస్తారని చెప్పబడింది.

జాతకాన్ని నాలుగు భాగాలుగా ఆలోచిస్తే చేయబోయే కర్మలు వాటి విమోచనం అర్థం అవుతాయి. అవి 1. ధర్మ 2. అర్థ 3. కామ 4. మోక్షం.

జాతకచక్రంలోని 1,5,9 భావాలు ధర్మానికి, 2,6,10 భావాలు అర్థానికి, 3,7,11 భావాలు కామానికి, 4,8,12 భావాలు మోక్షానికి ప్రతీకలు. ఆయా రాసుల్లోనూ, భావాలపైన గ్రహాల యొక్క దృష్టి, స్థితి, యుతి మొదలైన వాని వల్ల జాతకుని కర్మ నిర్దేశింపబడుతుంది. ఎక్కువ గ్రహాలు అర్థ, కామ భావాలవైపు ఉన్నప్పుడు జాతకుని ప్రయత్నం, పరిధి, ఆలోచనలు అవైపే ఉంటాయి. అతనికి కోరికలు, ధనం రెండూ ఉండి అవి ఒక సరియైన కాలంలో కలిసి రావడం వల్ల జాతకునికి కాలగతమైన వృద్ధి కల్గి వాటిని పూర్తిగా అనుభవిస్తాడు. ఇది జాతకం నిర్దేశించే విధానం. ఈవిధంగా ఇంక ధర్మ, మోక్ష స్థానాల్లోనే గ్రహాలుండడం వల్ల కర్మదాస్య విమోచనం జరుగుతుంది. అందువల్లనే సమాజంలో కనిపించే వ్యక్తుల మధ్య విభిన్నత, వేరైన ఆలోచనలు, ఆచరణాలు వేరు వేరుగా గ్రహాల యొక్క కలయికల వల్ల ఏర్పడుతున్నాయి. ఈ విధంగా జాతకంలోని గ్రహాల భావాల ఆధారంగా కర్మ సిద్ధాంతాన్ని వివేచింపవచ్చు.

16. భారతీయ జ్యోతిష శాస్త్రచరిత్రలో జైనులపాత్రను విశ్లేషించండి? (2000,2003)

జైనులు జ్యోతిశ్శాస్త్రానికి విశేషమైన సేవలుచేశారు. ప్రాచీనమైన ఇతర శాస్త్రాలను జైనులు నిరాదరించినా లోకానికి విశేషంగా వినియోగపడే జ్యోతిషం, వైద్యశాస్త్రాల్లో విశేషమైన కృషి చేశారు. జ్యోతిష వాస్తు విశేషాలలో వీరివి ప్రత్యేక గ్రంథాలున్నాయి. వీరి గ్రంథాలు ఎక్కువగా ప్రాకృతభాషలో కనిపిస్తున్నాయి. ఎందరో జైన పండితులు, ఆచార్యులు జ్యోతిష గ్రంథాలను రచించారు. ప్రాచీనకాలంలోనే సూర్యప్రజ్ఞప్తి, చంద్రప్రజ్ఞప్తి, జంబూద్వీప ప్రజ్ఞప్తి, జ్యోతిష్కరండకము మొదలైన గ్రంథాలు జైనుల కృషి ఫలితంగా మనకు లభ్యమవుతున్నాయి. .

సూర్యప్రజ్ఞప్తి : వేదాంగ జ్యోతిషానికి సమానమైన కాలంలో వెలువడ్డ ప్రామాణిక గ్రంథం సూర్యప్రజ్ఞప్తి. అర్థమాగధి ప్రాకృతభాషలో వెలువడ్డ గ్రంథమిది. ఇది దాదాపు క్రీ.పూ. 100 ప్రాంతానికి చెందిన గ్రంథమని పరిశోధకుల అభిప్రాయం. దీనిలో సూర్యగమనం, ఆయువు, పరివారం, సంఖ్య తదితరాంశాలు తెలియజేయబడినాయి. దినమానం ప్రకారం రోజు, మాసం, పక్షం, అయనం అనే అంశాలు వివరించబడినాయి. వేదాంగ జ్యోతిషంలో లాగానే పంచవర్షాత్మకయుగంలోని ఐదు సంవత్సరాలలో ఉత్తరాయణ దక్షిణాయణాలు ఏర్పడేటపుడు రవి నక్షత్రాలు, చంద్రనక్షత్రాల వివరాలు, దినప్రమాణం పెరిగడం, తరగడం మొదలైన అంశాలున్నాయి. జైనుల అభిప్రాయంలో జంబూద్వీపం సమతలంగా ఉందనే భావన ఉండగా, సూర్యప్రజ్ఞప్తిలో మాత్రం భూమికి మధ్యలో హిమవాన్, మహిమవాన్, నిషధ, నీల, రుక్మి, శిఖరిణి అనే ఆరు పర్వతాలు ఉండడం వల్ల ఒక్కోచోట ఎగుడుదిగుడులుగా ఉంటుంది. దానివల్ల ఏర్పడే అక్షాంశ మార్పులవల్ల అన్ని ప్రాంతాల్లో దినమానం ఒకేవిధంగా ఉండదని తెలియజేయబడింది.

సూర్యుడు అన్ని నక్షత్రాలకంటే దగ్గరగా ఉన్నట్లు, భూమి నాలుగు ఖండాలైనట్లు భావించడం జరిగింది. అభిజిత్తుతో కలిపి 28 నక్షత్రాలున్నట్లు ఈ గ్రంథం తెలుపుతుంది. గ్రహాల పరిజ్ఞానం, సౌర, చాంద్ర, నాక్షత్ర, సావన, కార్మ సంవత్సరమానాలు ఈ గ్రంథంలో పేర్కొనబడ్డాయి. ఈ విధంగా అనేక ప్రాచీన అంశాలతో కూడుకున్న ప్రామాణిక ప్రాథమిక గ్రంథం సూర్యప్రజ్ఞప్తి. ఇది జైనుల ఉపాంగగ్రంథాలలో ఒకటి.

చంద్రప్రజ్ఞప్తి : దీనిలోని విషయం కూడా సూర్యప్రజ్ఞప్తిని పోలి ఉంటుంది. అయితే సూర్యప్రజ్ఞప్తిలోని అంశాలకంటే ఈ గ్రంథంలోని అంశాలు పరిష్కృతాలై ఉండడం వల్ల ఇది సూర్యప్రజ్ఞప్తికన్నా ఆధునిక కాలానికి చెందిందని గుర్తించవచ్చు. దీనిలోని అధ్యాయాలను ప్రాభృతాలు అంటారు. కాలవిభజన, సూర్యచంద్రుల ఆకృతులు, వారికి సంబంధించిన వీధులు, సుషమా సుషమా, సుషమా దుషమాది కాలాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. ఛాయాసాధనం కూడా ఉంది. నీడను బట్టి కాలప్రమాణం గుర్తించే అంశం చంద్రప్రజ్ఞప్తిలో కనిపిస్తుంది. అయితే చంద్రుణ్ణి స్వయం ప్రకాశమాన గ్రహంగా ఈ గ్రంథం గుర్తించింది. జైన సంప్రదాయాన్ననుసరించి 790 యోజనాల నుండి 900 యోజనాల వరకు ఉన్న ప్రదేశంలో గ్రహనక్షత్రాదులు వ్యాపించి ఉన్నట్లు తెలుస్తుంది. గ్రహణ పరిజ్ఞానం ఉంది. రాహుకేతువులకు పర్యాయపదాలు కనిపిస్తున్నాయి. ప్రాకృతభాషలోని ఈ గ్రంథాన్ని గమనిస్తే దాదాపు సూర్యప్రజ్ఞప్తికి కొద్దికాలం తరువాతదనే భావం మాత్రం అర్థమవుతుంది.

జంబూద్వీపప్రజ్ఞప్తి : ఈ గ్రంథం కూడా జైనుల జ్యోతిష పరిజ్ఞానాన్ని విపులంగా తెలియజేసే గ్రంథం. జైనుల విశ్లోల్లేఖనం, భూగోళశాస్త్రం ఇందులో వివరించబడ్డాయి. సూర్య, చంద్ర ప్రజ్ఞప్తి గ్రంథాల లాంటిదే ఈ గ్రంథం కూడా.

జ్యోతిష్కరండకం : ఇది కూడా అత్యంత ప్రాచీన గ్రంథం. దీని భాష, శైలిని గమనిస్తే క్రీ.పూ.400 నుండి 300 మధ్యకాలంలోనిదని పండితుల అభిప్రాయం. దీనిలో అశ్విని, స్వాతీనక్షత్రాలు విషువాలుగా చెప్పబడ్డాయి. రాసుల్లాగానే నక్షత్రాలను లగ్నాలను విభజించిన పద్ధతి చెప్పబడిది.

అంగవిజ్జ : ఇది ప్రాకృత గ్రంథం. ప్రశ్నశాస్త్ర గ్రంథం. దీనిలో 8 అధ్యాయాలున్నాయి. దీనిలో గ్రంథ సంఖ్య 9 వేలు. గ్రంథం అంటే 32 అక్షరాల పరిమితి కలిగింది అని అర్థం. ఇందులో ప్రశ్నకర్త వివిధ శరీరాంగాలను స్పృశించడం, గమనాగమనాలు. చేష్టలు మొదలైనవాటిని పరిశీలించి ప్రశ్నకు సమాధానం చెప్పే విధానాలున్నాయి. దీని రచయిత ఎవరో తెలియడం లేదు. ఎనిమిది విధాలైన నిమిత్త జ్ఞానాల్లో అంగనిమిత్త ప్రాధాన్యాన్ని రచయిత దీనిలో వివరించారు. నదులన్నీ సముద్రంలో ఏవిధంగా కలుస్తాయో అదే విధంగా స్వర, లక్షణ, వ్యంజన, స్వప్న,

ఛిన్న, భౌమ, అంతరిక్ష నిమిత్తాలు అంగనిమిత్తమనే సముద్రంలో కలుస్తాయని చెప్పబడింది. అరవై అధ్యాయాలతో కూడుకున్న ఈ గ్రంథం మనుష్యుల సహజ ప్రవృత్తుల ఆధారంగా ప్రశ్నకర్త విభిన్న ప్రవృత్తుల ననుసరించి ఫలిత నిర్ణయం చేసే విధానాన్ని వివరించింది.

జినేంద్రమాల : ఇది ప్రశ్నశాస్త్రానికి సంబంధించిన గ్రంథం. దీనిలోని అధ్యాయాలను కాండలు అంటారు. దీనిలో అంతరిక్షం, భౌమం, అంగం, స్వరం, వ్యంజనం, ఛిన్నం, స్వప్నం మొదలైన ఎనిమిది ప్రశ్నల గూర్చి చర్చించబడింది. దీనిలో గ్రంథకర్త పాపాలను జయించేవాడు లేదా పాపాలను ధ్వంసం చేసేవాడు జినుడు అనే శబ్దార్థాన్ని తెలియజేశాడు. దీనిలో ధాతుకాండ, మూలకాండ, జీవకాండ, లాభాలాభకాండ, రోగకాండ, మరణకాండ, భోజనకాండ, స్వప్నకాండ, శకునకాండ, వివాహకాండ, కామకాండ, పుత్రోత్పత్తికాండ, ఆయుధకాండ, శల్యకాండ, కూపకాండ, సేవాగమకాండ, స్మశానకాండ, యాత్రాకాండ, వృష్టికాండ, అర్ఘకాండ, నౌకాకాండ అనే భాగాలున్నాయి.

జైన జ్యోతిష్కులు : జైనులలో ప్రముఖులైన జ్యోతిష పండితులు అనేకులున్నారు. గర్గునివంటి ప్రవర్తకులు జైనులు. ఆర్యభట్టు వంటి గొప్ప ఖగోళశాస్త్రవేత్తకూడా జైనుడే. ఫలిత జ్యోతిషవిషయంలోనూ, సిద్ధాంత జ్యోతిషాంశాలలోనూ ఎందరో జైనులు తమ గొప్పతనాన్ని నిరూపించుకున్నారు. కాలకాచార్యుడు, మహావీరాచార్యుడు, శ్రీధరుడు, ఋషిపుత్రుడు, దుర్గదేవుడు, పావులూరి మల్లన, మల్లిషేణుడు, భట్టవోసరి, సింహతిలకసూరి, మేఘవిజయగణి, లబ్ధిచంద్రగణి మొదలైనవారు ఎందరో జ్యోతిషశాస్త్రంలో కృషిచేసి వేరు వేరు గ్రంథాలు సంస్కృత, ప్రాకృత భాషల్లో రచించారు.

కాలకాచార్యుడు : ఇతడు వరాహమిహిరునికి పూర్వకాలంవాడు. బృహజ్జాతకంలో కాలక సంహితను గూర్చిన ప్రసక్తి ఉంది. ఇతడు అతిపెద్ద నిమిత్త శాస్త్రం రచించినట్లు ఆధారం లభిస్తుంది. భోజసాగరగణి అనే విద్వాంసుడు సంస్కృతంలో రమల విద్యాసంబంధంగా ఒక ప్రత్యేక గ్రంథం రచించాడు. అతడు కాలకాచార్యుని ద్వారా యవనదేశం నుండి ఈ విద్య తీసుకురాబడినట్లు పేర్కొన్నాడు. నిశీథచూర్ణి, అవశ్యకచూర్ణి అనే గ్రంథాల ద్వారా ఇతని జ్యోతిర్విజ్ఞానం బాగా అర్థమవుతుంది.

మహావీరాచార్యుడు : జైన సంప్రదాయంలో గొప్ప గణితజ్ఞుడితడు. రాష్ట్రకూట వంశం రాజ్యమేలిన కాలంలో ఇతడున్నట్లు తెలియడం వల్ల ఇతని కాలం క్రీ.శ. 850 అని తెలుస్తుంది. ఇతడు జ్యోతిష పటలము, గణితసారసంగ్రహము అనే గ్రంథాలు రచించినట్లు తెలుస్తుంది. సంస్కృత భాషలో ఈ గ్రంథాలున్నాయి. గణితసార ప్రారంభంలో గణిత విషయ ప్రశంస ఉంది. గణితవిషయాల్లో అనేక ప్రామాణిక విశేషాలు ఇందులో కనిపిస్తున్నాయి. సంజ్ఞాధికారం, పరికర్మవ్యవహారం, త్రైరాశిక వ్యవహారం, మిశ్రిక వ్యవహారం, క్షేత్రగణిత వ్యవహారం, ఛాయా వ్యవహారం మొదలైన అంశాలు ప్రామాణికంగా ఉన్నాయి.

అదేవిధంగా జ్యోతిషపటలంలో గ్రహ, నక్షత్ర, తారలస్థానం, గతి, స్థితి, సంఖ్య మొదలైన విషయాల ప్రతిపాదన ఉంది.

శ్రీధరాచార్యుడు : ఈ జ్యోతిష పండితుడు ధార్వాడ్‌జిల్లా బెళువలనాడులోని నరుగుంద గ్రామంవాడు. ఇతని గ్రంథంలో చెప్పిన అంశాలను బట్టి ఇతడు 11వ శతాబ్దికాలం వాడని తెలుస్తుంది. ఇతడు బృహజ్జాతకం, సారావళి ఆధారంగా కన్నడభాషలో జాతకతిలకం వ్రాసినాడు. దీనిలోని భాగాలకు అధికారాలు అని పేరు. జాతకతిలకంలో 24 అధికారాలున్నాయి. తన గ్రంథానికి కావ్యరమ్యత సంపాదించ డానికి ఇతడు ప్రయత్నించాడు. ఈయనకు 14 బిరుదులున్నట్లు తెలుస్తుంది. బుధమిత్ర అనే బిరుదు ఎక్కువగా తెలుస్తుంది. జాతకతిలకం ఫలితజ్యోతిష విషయంలో ఉత్తమమైన గ్రంథం. ఇంకా ఇతడు గణితసారం, జ్యోతిర్జ్ఞాననిధి అనే గ్రంథం రచించినట్లు తెలుస్తుంది. జ్యోతిర్ జ్ఞాననిధి అనే గ్రంథం జ్యోతిషం నేర్చుకునేవారికి ఉపకరించే ప్రాథమిక గ్రంథం. సంవత్సరనామాలు, నక్షత్రాలు, యోగాలు, కరణాలు వాని శుభాశుభాలు, కొన్ని ముహూర్తాలు దీనిలో ఇచ్చాడు. మాసశేషం, మాసాధిపతి శేషం, దినశేషం, దినాధిపతి శేషం మొదలైన అర్థగణితానికి సంబంధించిన విశిష్ట విషయాలు ఇందులో కనిపిస్తున్నాయి.

వీరే కాక మరికొందరు జ్యోతిష పండితులు, గ్రంథకర్తలు జైనులలో మనకు కనిపిస్తున్నారు.

17. ఆధునిక విజ్ఞానాన్ని అనుసరించి సౌరకుటుంబ చరిత్ర వ్రాయండి? **(2003)**

సూర్యుడు, సూర్యుని చుట్టూ సంచరించే నవగ్రహాలు తదితర అంశాలను కలిపి సౌరకుటుంబం అని అంటారు. ఖగోళశాస్త్ర రీత్యా, జ్యోతిషశాస్త్ర రీత్యా వీటి ప్రామాణిక పదజాలం వేరుగా కనిపిస్తుంటుంది. అదేవిధంగా భారతీయ, పాశ్చాత్యుల పరిగణనలు అనుసరించి ఈ గమనింపు వేరుగా ఉంటుంది.

ఆధునిక ఖగోళ విజ్ఞానాన్ని అనుసరించి సూర్యుడు ఒక తార (స్టార్). కొన్ని తారల సమూహామే నక్షత్రం (అశ్విన్యాదులు). సూర్యుని చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యల్లో తిరిగేవి గ్రహాలు. సూర్యుని ఆకర్షణబలంలో ప్రత్యేకమైన కక్ష్యల్లో ఇవి సంచరిస్తుంటాయి. అవి వరుసగా బుధుడు, శుక్రుడు, భూమి. కుజుడు, గురుడు, శని, యురేనస్, నెప్ట్యూన్ మరియు ఫ్లూటో గ్రహాలు. రాహువు, కేతువులు ఛాయా గ్రహాలు. భూమి చుట్టూ తిరిగే చంద్రుడు ఉపగ్రహం (శాటిలైట్). ఇవి కాక తోకచుక్కలు, ఆస్టరాయిడ్స్ తదితరాలు ఏవైతే సూర్యుని చుట్టూ సంచరిస్తాయో వాటినన్నింటినీ కలిపి సౌరకుటుంబం అని అంటారు. ఇది ఖగోళ సంప్రదాయం.

అయితే భూగోళంపైన ఉన్నటువంటి వ్యక్తిపై గ్రహ, నక్షత్రగోళాలన్నీ చూపించే ప్రభావాలను అధ్యయనం చేసే సందర్భంలో భూమినుండి వేరు వేరు గ్రహాదులు కనిపించే దూరాలను గమనించి ఫలితాలవైపు దృష్టిసారించడం జ్యోతిష సంప్రదాయం.

విజ్ఞానశాస్త్రరీత్యా సూర్యుడు ఒక నక్షత్రం. సూర్యుని నుండి భూ కక్ష్యకు మధ్యలో సంచరించే గ్రహాలను అంతర గ్రహాలంటారు. ఇవి 1. బుధుడు 2. శుక్రుడు. అదేవిధంగా భూకక్ష్య తరువాతి గ్రహాలను బాహిర గ్రహాలంటారు. అవి 1. కుజుడు 2. గురుడు 3. శని 4. యురేనస్ 5. నెప్ట్యూన్ 6. ఫ్లూటో గ్రహాలు. ఈ గ్రహాలన్నీ సంచరించే ఖగోళ మార్గాన్ని రవిమార్గ (ఎక్లిప్టిక్) అని అంటారు. ఈ మార్గమే 27 విభాగాలుగా, నక్షత్రాలుగా విభజింపబడింది. ఒక్కో నక్షత్రానికి ప్రమాణం 13.20 డిగ్రీలు. అవే రాశులుగా గుర్తింపబడినాయి. ఒక్కో రాశి ప్రమాణం 30 డిగ్రీలు

సూర్యుడు : ఆకాశంలోని కాంతివత్పదార్థాల్లో ముఖ్యుడుగానూ, భూమ్యాది నవ గ్రహాలకు అత్యంత ఉపయుక్తుడైనవాడు సూర్యుడు. సూర్యుడు ఒక తార. తన

శక్తితో ప్లూటోలాంటి అత్యంత దూరంగా ఉన్న గ్రహాలను ఆకర్షించే శక్తి సూర్యునికుంది. సూర్యునిలోని వేడి, కాంతి వేరు వేరు గ్రహాలపై పడి అది పరావర్తనం చెంది అవి ప్రకాశిస్తుంటాయి. సూర్యుడు అత్యంత శక్తిదాయకుడుగా గుర్తించబడుతున్నాడు.

సూర్యుని పరిధి 8,65,000 మైళ్ళు; సూర్యుడు గెలాక్సీలో సెకనుకు 135 మైళ్ళ వేగంతో తిరుగుతూ 225 మిలియన్ సంవత్సరాలకు ఒక పూర్తి భ్రమణం చేస్తుంది.

భూమి : భూమి గోళాకారంలోని ఒక గ్రహం. ఖగోళంలో ఇది తనచుట్టూ తాను తిరుగుతుంది; దీనిని ఆత్మభ్రమణం అంటారు. తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ కూడా తిరుగుతుంది. దీనిని పరిభ్రమణం అంటారు. భూమి తనచుట్టూ తాను పశ్చిమం నుండి తూర్పువైపుకు సంచరించడం వల్ల భూమిపైనున్నజీవులకు ఆకాశంలోని సూర్యుడు, ఇతర నక్షత్రాలు తూర్పునుండి పడమరకు వెళ్తున్నట్లు కనిపిస్తాయి. గోళాకారంలో ఈ గ్రహం ఉండడం వల్ల తన చుట్టూ తాను తిరుగుతున్న సమయంలో కొంచెం వంగి తిరుగుతుంది. ఈ వంగడం కక్ష్య తలానికి 23 న్నర డిగ్రీలు ఉంటుంది. భూమికి ఉత్తరం వైపు ఉన్న ధ్రువాన్ని ఉత్తర ధ్రువమనీ, దక్షిణం వైపున్న ధ్రువాన్ని దక్షిణ ధ్రువమనీ పిలుస్తారు. మధ్యలో ఉన్న ఊహారేఖను భూమధ్యరేఖ అంటారు. భూమి ఆత్మభ్రమణం సెకండుకు 30 కి.మీ. చొప్పున నిమిషానికి 1800 కి.మీ. అవుతుంది.

చంద్రుడు : చంద్రుడు భూమికి ఉపగ్రహం. భూభ్రమణం వల్ల చంద్రుడు కూడా ఆకాశంలో తూర్పునుండి పశ్చిమానికి పోతున్నట్లు కనిపిస్తుంటాడు. ఒకసారి చంద్రుడు భూమి చుట్టూ తిరిగి రావడానికి పట్టే కాలం 27 రోజుల 7 గంటల 43 నిమిషాలు. అయితే భూమిచుట్టూ తిరిగివచ్చేటపుడు భూగమనం కూడా కొంత ఉండడం వల్ల ఒక అమావాస్య నుండి మరో అమావాస్యకు పట్టేకాలం మాత్రం 30 రోజుల పాటు ఉంటుంది.

బుధుడు : సూర్యుని నుండి కక్ష్యల్లో మొట్టమొదటి గ్రహం బుధుడు. రవికి ఇది అతి దగ్గరి గ్రహం. దీని వేగం అధికం. గ్రీకులు దీనికి దేవదూత అని పేరు పెట్టారు.

బుధుడు రవిబింబాన్ని దాటేటప్పుడు నల్లటి చుక్కలాగా కనిపిస్తుంది. ఈ ఖగోళవిశేషాన్ని తిరణము అంటారు. సూర్యుని చుట్టూ బుధుడు తిరగడానికి 88 రోజులు పడుతుంది. తన చుట్టూ తాను తిరగడానికి 58 రోజుల 15 గంటలు పడుతుంది. దీనిపై వాతావరణమే సరిగా లేదు. దీని పరిధి 3000 మైళ్ళు.

శుక్రుడు : ఇది రవి నుండి కక్ష్యలో రెండో గ్రహం. ఇక్కడ సూర్యుని నుండి పశ్చిమంలో ఉదయించి తూర్పున అస్తమిస్తాడు. వాతావరణం దట్టంగా ఉంటుంది. గ్రహం ఆత్మభ్రమణ కాలం 243 రోజులు. పరిభ్రమణ కాలం 224.7 రోజులు.

కుజుడు : రవి నుండి కక్ష్యలో ఇది నాలుగో గ్రహం. గ్రహ పరిధి 4,200 మైళ్ళు. గ్రహంపై తుప్పుపొర లాంటిది ఉండడం వల్ల రవి కాంతికి అది ఎర్రగా కనిపిస్తుంది. ఆత్మభ్రమణ కాలం 24 గం. 37 ని.లు. పరిభ్రమణ కాలం 687 రోజులు. దీనికి రెండు ఉపగ్రహాలున్నాయి అవి 1. డైమోస్ 2. ఫోబోస్. ఈ గ్రహంలో అతి పెద్దదైన అగ్నిపర్వతం ఉంది.

గురుడు : సౌరకుటుంబంలో అతి పెద్ద గ్రహం గురుడు. అత్యధికమైన బరువున్న గ్రహం కూడా. దీని ఆత్మభ్రమణానికి 9 గం. 50 ని.లు పడుతుంది. పరిభ్రమణానికి 11.86 సంవత్సరాలు పడుతుంది. గురుగ్రహానికి 16 ఉపగ్రహాలున్నాయి. ఈ గ్రహంపై చుట్టుకున్నట్లుగా పచ్చని పొరలు కనిపిస్తున్నాయి.

శని : సౌరకుటుంబంలోని సూర్యుని కక్ష్యల్లో ఇది ఆరవ గ్రహం. దీని సాంద్రత అతి తక్కువ. ఈ గ్రహం ఆత్మభ్రమణానికి 10గం. 14 ని.లు. పరిభ్రమణానికి 29.46 సంవత్సరాలు పడుతుంది. శని గ్రహానికి దాదాపు 20 ఉపగ్రహాలున్నట్లు తెలుస్తుంది. ఈ గ్రహం చుట్టూ అనేక వలయాలున్నాయి.

యురేనస్ : ఈ గ్రహాన్ని 1781లో హెర్షల్ అనే శాస్త్రవేత్త కనుక్కున్నాడు. ఇది ఆకుపచ్చగా కనిపిస్తుంది. ఈ గ్రహం చుట్టూ 9 ఇరుకు వలయాలున్నాయి. దీనికి 5 ఉపగ్రహాలున్నాయి. ఆత్మభ్రమణానికి 16 గం. 10 నిమిషాల కాలం పట్టగా, దీని పరిభ్రమణకాలం 84.01 సంవత్సరాలు.

నెప్ట్యూన్ : దీన్ని 1846 సం.లో కనుక్కున్నారు. దీనికి రెండు ఉపగ్రహాలున్నాయి. ఆత్మభ్రమనానికి 18 గం: 26 నిమిషాల సమయం పట్టగా, పరిభ్రమణానికి 164.8 సం.లు పడుతుంది. ఇది వరుస కక్ష్యలో ఎనిమిదవ గ్రహం.

ప్లూటో : సౌరకుటుంబంలోని గ్రహాల కక్ష్యల్లో ఇది 9వ గ్రహం. 1930లో దీన్ని కనుక్కున్నారు. ఈ గ్రహపరిధి 1800 మైళ్ళు. దీనికి ఒకే ఒక ఉపగ్రహం షరాన్ ఉంది. ఆత్మభ్రమణ కాలం 6 రోజుల 9 గం.లు కాగా, పరిభ్రమణ కాలం 247.7 సంవత్సరాలు.

రాహుకేతువులు : ఇవి ఛాయా గ్రహాలు. చంద్రుడు భూమికి ఉపగ్రహం కావడం వల్ల ఈ రవిమార్గాన్ని ఖండిస్తూ ప్రత్యేక కక్ష్యలో తిరుగుతుంటాడు. ఈ రవి మార్గను చంద్రుడు దక్షిణం నుండి ఉత్తరం వైపు దాటే బిందువును రాహువు అనీ, ఉత్తరం నుండి దక్షిణం వైపు ఖండించే ప్రదేశాన్ని కేతువు అనీ అంటారు. ఇవి ఆకృతి కలిగిన అంశాలు కావు. కేవలం సున్నితమైన బిందువులు. ఈ బిందువుల వద్దకు సూర్య చంద్రులు వచ్చినపుడు గ్రహణాలు ఏర్పడతాయి. ఈ బిందువులు రవిమార్గపై స్థిరంగా ఉండక కదులుతుంటాయి. ఒక పూర్తి మార్పుకు దాదాపు 18 సం.ల 220 రోజులు పడుతుంది. ఈ ఖండన బిందువుల గమనం వ్యతిరేక దిశలో ఉండడం వల్ల ఇవి వెనుకకు చలిస్తుంటాయి. వీటి వ్యతిరేక గమనం సంవత్సరానికి దాదాపు 19.30 డిగ్రీలుంటుంది. ఈ విధంగా ఖగోళశాస్త్ర రీత్యా సౌరకుటుంబ చరిత్ర ఉంటుంది.

18. భారతీయ జ్యోతిషశాస్త్ర వికాసంలో వరాహమిహిరుని పాత్రను వివరించండి? (2003)

జ్యోతిశ్శాస్త్ర చరిత్రలో ఒక మైలురాయి లాంటివాడు వరాహమిహిరుడు. జ్యోతిషంలోని అన్ని స్కంధాలలోనూ రచనలు చేసి తనకన్నా పూర్వుల విశేషాలను సూచిస్తూ ప్రత్యేకంగా గ్రంథాలను సంకలనం చేసి రచించిన వాడు వరాహమిహిరుడు. సిద్ధాంత స్కంధంలో 'పంచసిద్ధాంతిక', హోరాస్కంధంలో 'బృహజ్జాతకం', సంహితా స్కంధంలో 'బృహత్సంహిత' ప్రముఖ గ్రంథాలు. ఇవి కాక అనేక ఇతర గ్రంథాలు ప్రశ్న, యాత్ర తదితర అంశాలలో ఉన్నాయి.

ఆర్యావృత్తంలో లఘుజాతకాన్ని రచించాడు. వివాహపటలం, సమాససంహిత, జాతకార్ణవము, ఢికనిక యాత్ర, గ్రహణమండల ఫలం, పంచపక్షి, దిక్కినీ యాత్ర అనే గ్రంథాలు కూడా రచించాడని తెలుస్తుంది.

పంచసిద్ధాంతిక : సిద్ధాంతస్కంధానికి చెందిన ఈ గ్రంథంలో పైతామహ, వాసిష్ఠ, రోమక, పౌలిశ, సౌర సిద్ధాంతాల సంకలనం ఉంది. దీనిలో సౌరసిద్ధాంత ప్రాధాన్యాన్ని తెలిపినాడు. అయితే ప్రస్తుతం లభించే సూర్యసిద్ధాంతానికి, దీనికి కొన్ని భేదాలు కనిపిస్తున్నాయి. పంచసిద్ధాంతికలో ఐదు సిద్ధాంతాలకు సంబంధం లేని 13వ అధ్యాయం త్రైలోక్య సంస్థానం స్వతంత్ర రచన అయి ఉంటుందని అభిప్రాయం.

పంచభూతమయమైన, గోళాకారమైన భూగోళం – ఆకాశంలో తారాగణం అనే పంజరంలో అయస్కాంతాల మధ్య లోహం ఉన్నట్లు నిరాలంబంగా నిలిచి ఉందని తెలిపినాడు. 14వ అధ్యాయం 'ఛేదక యంత్రాణి' లో ఖగోళానికి సంబంధించిన కొన్ని సాధారణ యంత్రాలు వర్ణించబడినాయి.

బృహజ్జాతకం : వరాహమిహిరుడు వ్రాసిన హోరాశాస్త్ర గ్రంథం 'బృహజ్జాతకం'. ఇది ఫలితభాగానికి సంబంధించింది. జ్యోతిషంలోని పంచస్కంధాలలో హోరా స్కంధానికి సంబంధించిన గ్రంథం ఇది. బృహజ్జాతకంలో మొత్తం 26 అధ్యాయాలు, 417 శ్లోకాలున్నాయి.

'హోర' అనే శబ్దం ఏర్పడిన విధానాన్ని బృహజ్జాతకంలో వరాహమిహిరుడు ఈ విధంగా వివరించాడు.

'హోరేత్యహోరాత్ర వికల్పమేవే వాంఛంతి పూర్వాపరవర్ణలోపాత్
కర్మార్జితం పూర్వభవేసదాది యత్తస్య పంక్తి సమభివ్యనక్తి" (బృ.జా.1.3)

'అహోరాత్ర' అనే పదంలోని మొదటి అక్షరం, చివరి అక్షరం లోపించగా 'హోరా' అయిందనీ, అహోరాత్రాలలో కలిగే పూర్వజన్మార్జిత శుభాశుభ కర్మఫలాలను చెప్పేదవడం చేత దీనికి 'హోరాశాస్త్రం' అనే పేరు వచ్చిందని తెలిపాడు. నవాంశగణితం గూర్చి, అనేక రకాల దశావిశేషాల గూర్చి బృహజ్జాతకం బాగా చర్చించింది. దశా పద్ధతులను, ఫలిత జ్యోతిష విధానాలను వివరించేటపుడు బృహజ్జాతక పద్ధతి అని ప్రత్యేకంగా తెలియజేయబడింది.

దీనిలో సంజ్ఞాధ్యాయం, గ్రహయోని భేదాధ్యాయం, వియోని జన్మాధ్యాయం, నిషేకాధ్యాయం, జన్మకాల లక్షణాధ్యాయం, బాలారిష్టాధ్యాయం, ఆయుర్దాయాధ్యాయం, దశాంతర్దశాధ్యాయం, అష్టకవర్గాధ్యాయం, కర్మజీవాధ్యాయం, రాజయోగాధ్యాయం, నాభసయోగాధ్యాయం, చంద్రయోగాధ్యాయం, ద్విగ్రహయోగాధ్యాయం, పరివ్రాజకయోగాధ్యాయం, రాశిశీలాధ్యాయం, దృష్టిఫలాధ్యాయం, భావఫలాధ్యాయం, ఆశ్రయయోగాధ్యాయం, ప్రకీర్ణాధ్యాయం, అరిష్టాధ్యాయం, స్త్రీజాతకాధ్యాయం, నైర్యాణికాధ్యాయం, నష్టజాతకాధ్యాయం, ద్రేక్కాణాధ్యాయం, ఉపసంహారాధ్యాయం అనే 26 అధ్యాయాలున్నాయి.

వరాహమిహిరాచార్యుల వారి బృహజ్జాతకం ఎన్నో అంశాలతో కూడుకొని చక్కని గ్రంథంగా, ఫల జ్యోతిష నిర్ణయానికి ఉపయుక్త గ్రంథంగా భాసిస్తూ కనిపిస్తుంది. వరాహమిహిరుడు తన బృహజ్జాతకాన్ని అందరికీ నమస్కారం చేస్తూ ముగించాడు. వరాహమిహిరుని బృహజ్జాతకం జ్యోతిశ్శాస్త్రంలో ప్రామాణిక అంశాలను ఎన్నింటినో వివరించిన ప్రత్యేక హోరాశాస్త్ర గ్రంథం. నాటినుండి నేటి వరకు బహుళప్రచారంలో ఉంటూ అన్ని భాషలలోనూ అనువాదాలు పొందిన గ్రంథం. ఈ గ్రంథంలో వరాహమిహిరుడు అనేక విదేశీపదాలను కూడా వినియోగించడం జరిగింది.

బృహత్సంహిత : సంహితలో కేవలం వ్యక్తికి సంబంధించిన శుభాశుభకాల సూచకమే కాకుండా దేశానికి సంబంధించిన శుభాశుభాల విచారణ ఉంటుంది. దీనిలో మొత్తం 105 అధ్యాయాలు, 4000 శ్లోకాలున్నాయి. అనేక రకాల ఖగోళ భూగోళాంశాలు దీనిలో ప్రత్యేకంగా వివరింపబడినాయి. సూర్యచంద్రాది గ్రహాల సంచారం, నక్షత్ర మండలంలో వాని సంచారం వల్ల భూమిపై ఉన్న ప్రాణులకు కలిగే శుభాశుభాలు, అగస్త్య, సప్తర్షుల ఉదయాదుల వల్ల కలిగే ఫలాలు, మేఘాల గర్భధారణ, స్వాతీ ఆషాఢీ రోహిణీ యోగ ఫలితాలు, ప్రతిసూర్యుడు, గంధర్వనగరం, ఉల్కాపాతం, పరివేషం, ఇంద్రధ్వజం, దివ్యాలు, భౌమాలు, అంతరిక్ష జన్యాలైన ఉత్పాతాలు, వృక్షాయుర్వేదం, ప్రాసాదాల లక్షణం, వాస్తు విశేషాలు, రత్నవిశేషాలు, శకునాలు మొదలైన ఎన్నో అంశాలకు సంబంధించిన అధ్యాయాలు ఈ గ్రంథంలో ఉన్నాయి.

ఈ అంశాలతో కూడుకున్న ఈ గ్రంథం ఒక ప్రాకృతిక విజ్ఞానసర్వస్వంలాగా కనిపిస్తుంటుంది. సంహింతాగ్రంథం ఎన్నో దైనందిన విషయాలను చర్చించింది. కొన్ని విషయాలు తరువాతి కాలంలో పరిశోధనకు నోచుకోకపోవడం వల్ల అంతటితో ఆగిపోయాయి.

వరాహమిహిరుడు తన గ్రంథాల్లో ఎందరో తన పూర్వుల వాక్యాలను స్మరించినాడు. ఈతని పుస్తకాలన్నింటికీ వ్యాఖ్యానం రచించినవాడు 'భట్టోత్పలుడ'నే కాశ్మీర పండితుడు. ఆయన చాలామంది ప్రభావం వరాహమిహిరునిపైనున్నట్లు సూచించాడు.

వరాహమిహిరుడు వివాహ, యాత్ర, ప్రశ్నశాస్త్రాలలో ఇతర గ్రంథాలను చాలా రచించాడు. ఈ విధంగా భారతీయ ప్రాచీన జ్యోతిష శాస్త్రవేత్తల్లో జ్యోతిషంలోని అన్ని విభాగాలను స్పర్శించడమే కాక, వాటిని ఉన్నతోన్నతంగా తీర్చి దిద్దినవాడు వరాహమిహిరుడు.

19. భారతీయ జ్యోతిష పఠన పాఠనాలలో అనుసరించే యుగవిభజనను తెలియజేయండి? (2000, 2002, 2003)

ఏ శాస్త్రానికైనా దానిని విపులంగా అధ్యయనం చేయడానికి యుగవిభజన అవసరం. యుగవిభజన వల్ల కాలక్రమానుసారమైన శాస్త్ర వికాసం అర్థమౌతుంది. జ్యోతిశ్శాస్త్రం కూడా అత్యంత సనాతనకాలానికి చెందింది కాబట్టి తప్పనిసరి యుగవిభజన అవసరమైంది. అయితే ఈ అంశానికి సంబంధించి వేరు వేరు వ్యక్తులు వేరు వేరుగా ఈ విభజన చేశారు. దానిలో కొన్ని అంశాలు అత్యంత ప్రమాణంగా గుర్తించబడినాయి.

యుగమంటే : యుగ్మమంటే జంట అని అర్థం. దేహ వ్యవహారాల్లోనూ, కాల వ్యవహారాల్లో యుగ్మం (జంట) ప్రాధాన్యాన్ని పొంది ఉంది. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఏవిధంగా శరీరానికి జంటగా కనిపిస్తుంటాయో, అదేవిధంగా కాలానికి సంబంధించి పగలు-రాత్రి, శుక్ల కృష్ణపక్షాలు, ఉత్తరాయణ దక్షిణాయనాల్లాగే ఐదు సంవత్సరాల కాలానికి 'పంచవర్షాత్మక యుగ'మనే పేరు ప్రసిద్ధమైంది. ఈ పంచవర్షాత్మక

యుగంలో రెండు అధికమాసాలు కనిపిస్తుంటాయి. ఇక్కడనుండి యుగ్మశబ్దం యుగ శబ్దంగా పరిణమించి ఉంటుంది. తరువాత అది కాలప్రమాణ వాచిగా మారి చిన్న కాలం నుండి పెద్దకాలం వరకు యుగ ప్రమాణాలుగా వైదిక కాలంనుండి సూచించ బడుతూ వచ్చింది.

యుగవిభజనలో కాలక్రమానుసార యుగవిభజన, గ్రంథాల గ్రంథకర్తల ప్రభావానుసార యుగవిభజన అంటూ వేరువేరుగా విభజనలు కనిపిస్తున్నాయి. వాటిలో డా॥ నేమి చంద్రశాస్త్రి తన 'భారతీయ జ్యోతిష' అనే గ్రంథంలో కాలక్రమానుసార యుగవిభజన చేశారు. వారి విభజన ప్రకారం –

క్రీ.పూ.10000 కు ముందుకాలం – అంధకార కాలం

క్రీ.పూ.10000 నుండి క్రీ.పూ.500 వరకు – ఉదయకాలం

క్రీ.పూ. 500 నుండి క్రీ.శ.500 వరకు – ఆదికాలం

క్రీ.శ.501 నుండి క్రీ.శ. 1000 వరకు – పూర్వమధ్యకాలం

క్రీ.శ.1001 నుండి క్రీ.శ.1600 వరకు – ఉత్తరమధ్యకాలం

క్రీ.శ.1601 నుండి క్రీ.శ.1946 వరకు – ఆధునికకాలం

డా॥ గోరఖ్ ప్రసాద్ గారి 'భారతీయ జ్యోతిష్ కా ఇతిహాస్' లోని గ్రంథాలు – గ్రంథకర్తల ప్రభావానుసార విభజన ప్రకారం – ప్రాచీనతమ జ్యోతిషం, వేదకాలంలో దిన నక్షత్రాదులు, వేదాంగ జ్యోతిషం, వేదాలు వేదాంగాలు వానికాలం, మహాభారతంలో జ్యోతిషం, ఆర్యభట్టు, వరాహమిహిరుడు, పాశ్చాత్య జ్యోతిష ఇతిహాసం, సూర్యసిద్ధాంతం, భారతీయ యవన జ్యోతిషాలు, లాటదేవుని నుండి భాస్కరుని వరకు, సిద్ధాంత శిరోమణి, కరణకుతూహలం, భాస్కరుని తరువాత, జయసింహుడు అతని వేధశాల, భారతీయ పంచాంగం అంటూ విభజించినాడు. అయితే ఈ విభజన సమగ్రంగా కాని, వరుసగా కాని కనిపించడం లేదు.

లోకమాన్య బాలగంగాధర తిలక్ పండితుని వేదకాల నిర్ణయం ప్రకారం వేదాలలోని అయనాంశకు సంబంధించిన ఆధారాలను అనుసరించిన యుగ విభజనకు

జ్యోతిషశాస్త్ర విభజనకు సంబంధం చక్కగా కుదిరింది. దీనినే విషయప్రధాన యుగవిభజన అని అంటారు.

వేదకాల పూర్వయుగం – క్రీ.పూ. 10,000 లకు ముందు

వేదయుగం – క్రీ.పూ. 10,000 నుండి 1400 వరకు

వేదాంగయుగం – క్రీ.పూ.1400 నుండి 1100 వరకు

స్మృతి భారతాది యుగం – క్రీ.పూ. 1100 నుండి 500 వరకు

స్వర్ణయుగం – క్రీ.పూ.500 నుండి క్రీ.శ. 500 వరకు

సిద్ధాంత ప్రకల్పనా యుగం – క్రీ.శ. 500 నుండి 1200 వరకు

కరణాది యుగం – క్రీ.శ.1200 నుండి 1400 వరకు

అనుకరణయుగం – క్రీ.శ. 1400 నుండి 1900 వరకు

ఆధునిక యుగం – క్రీ.శ. 1900 నుండి నేటివరకు.

బాలగంగాధర తిలక్ గారు వేదకాలం నిర్ణయించడానికి 'మృగశీర్ష' అనే గ్రంథం రచించారు. దానిలో వారు విషువచ్చలనం ఆధారంగా వేదకాల నిర్ణయం చేశారు. విషువత్తును పునర్వసూ నక్షత్రం నుండి గమనించనప్పటినుండి ప్రస్తుత కాలం వరకు దాని చలనం ఆధారంగా కాల నిర్ణయం చేసినప్పుడు

ఉత్తరధ్రువ హిమ ప్రళయానంతర యుగారంభం –క్రీ.పూ. 10000 – 8000

అదితియుగం లేదా పునర్వసు యుగం – క్రీ.పూ. 8000 – 5000

మృగశీర్షయుగం – క్రీ.పూ. 5000 – 3000

కృత్తికా యుగం – క్రీ.పూ. 3000 – 1000

గౌతమ బుద్ధ పూర్వయుగం – క్రీ.పూ.1400 – 500

జ్యోతిశ్శాస్త్ర దృష్ట్యా పరిశీలిస్తే క్రీ.పూ. 1400 – 900 కాలాన్ని వేదాంతయుగంగా క్రీ.పూ.900 నుండి 700 కాలాన్ని స్మృతిమహాభారతయుగంగా, క్రీ.పూ.700 నుండి 500 వరకు ప్రవర్తక యుగంగా విభజించుకోవచ్చు.

20. ఆకాశంలోని నక్షత్రాలను గుర్తించడానికి భారతీయులు వాటి ఆకృతి విశేషాలను వర్ణించిన తీరును వివరించండి? (2003)

ఆకాశంలో కనిపించే నక్షత్రాలు నిజానికి కొన్ని నక్షత్రాల సమూహాలు. ఆ నక్షత్రాల ఆకృతులు వేరు వేరుగా ఉంటాయి. అశ్విని నుండి రేవతి వరకు ఉన్న ఈ నక్షత్రాలు రవిమార్గంలో ఉన్న నక్షత్రాలు మాత్రమే. 360 డిగ్రీల రవిమార్గంలో చంద్రుడు ప్రతిరోజూ ఏ నక్షత్రానికి దగ్గరలో కనిపిస్తుంటాడో అదే ఆ రోజు నక్షత్రంగా చెప్పబడుతుంది. ఆకాశంలో ఈ 27 నక్షత్రాలే కాక ఇతర నక్షత్రమండలాలు చాలా ఉన్నప్పటికీ గ్రహసంచార మార్గం కలిగిన వీటికి ప్రాముఖ్యం బాగా ఏర్పడింది. అధ్యయన సౌలభ్యం కోసం వరాహమిహిరుని కాలం నుండి వీటికి ప్రారంభ బిందువు అశ్వినిగా అంత్య బిందువు రేవతిగా భావించడం జరిగింది. ఆ యా నక్షత్రాల ఆకృతులు ఈ విధంగా ఉన్నాయి.

1. అశ్విని - తురగముఖాశ్వినీ త్రీణి (గుర్రంముఖం ఆకృతిలో మూడు)
2. భరణి - భరణీ యోని త్రీణి (యోని ఆకృతిలో మూడు నక్షత్రాలు)
3. కృత్తిక - కృత్తికా క్షురాషట్కం (మంగలికత్తి ఆకృతిలో ఆరు నక్షత్రాలు)
4. రోహిణి - శకటం పంచ రోహిణీ (బండి ఆకృతిలో ఐదు నక్షత్రాలు)
5. మృగశిర - మృగశిరా శీర్షం త్రయం (శీర్షాకారంలో మూడు నక్షత్రాలు)
6. ఆరుద్ర - ఆర్ద్రా ప్రవాళ మేకం (పగడం ఆకృతిలో మెరుస్తూ ఒకే నక్షత్రం)
7. పునర్వసు - పునర్వసూ కులాలచక్రం పంచ (చక్రాకృతిలో ఐదు నక్షత్రాలు)
8. పుష్యమి - సరళా పుష్యమీ త్రీణి (సరళాకృతిలో వరుసగా మూడు నక్షత్రాలు)
9. ఆశ్లేష - ఆశ్లేషా సర్పా ఋతూ (సర్పాకృతిలో ఆరు నక్షత్రాలు)
10. మఖ - మఖాందోళికా పంచ (పల్లకీ ఆకృతిలో ఐదు నక్షత్రాలు)
11. పుబ్బ - పుబ్బ, ఉత్తర నేత్ర ద్వయోః (కంటి ఆకృతిలో రెండు నక్షత్రాలు)
12. ఉత్తర - పుబ్బ, ఉత్తర నేత్ర ద్వయోః (కంటి ఆకృతిలో రెండు నక్షత్రాలు)
13. హస్త - హస్తా పాణినాం పంచ (చేతివేళ్ళ ఆకృతిలో ఐదు నక్షత్రాలు)
14. చిత్త - చిత్తా మౌక్తిక మేకం (ముత్యం ఆకృతిలో ఒకే ఒక నక్షత్రం)

15. స్వాతి - స్వాతీ మాణిక్య మేకం (మాణిక్యం లాగా ఒకే నక్షత్రం)
16. విశాఖ - విశాఖా కులాలచక్రం పంచ (చక్రాకృతిలో ఐదు నక్షత్రాలు)
17. అనూరాధ -అనూరాధ జ్యేష్ఠాంగుళ ఛత్రాకార త్రయం (గొడుగు ఆకృతిలో మూడు నక్షత్రాలు)
18. జ్యేష్ఠ - అనూరాధ జ్యేష్ఠాంగుళ ఛత్రాకార త్రయం (గొడుగు ఆకృతిలో మూడు నక్షత్రాలు)
19. మూల - మూలా కుప్యత్కేసరీ పంచ (కోపించిన కేసరి ఆకృతిలో ఐదు)
20. పూర్వాషాఢ - పూర్వాషాఢా ఉత్తరాషాఢా ద్వే ద్వే భేకం (కప్ప ఆకృతిలో రెండు)
21. ఉత్తరాషాఢ -పూర్వాషాఢా ఉత్తరాషాఢా ద్వే ద్వే భేకం (కప్ప ఆకృతిలో రెండు)
22. శ్రవణం - శ్రవణం మత్స్యాకార త్రయం (చేప ఆకారంలో మూడు)
23. ధనిష్ఠ - ధనిష్ఠా శీర్ష త్రయం (శీర్షాకృతిలో మూడు నక్షత్రాలు)
24. శతభిషం - శతభిషక్పృతం తారాః (వంద తారల గుంపు)
25. పూర్వాభాద్ర - పూర్వాభాద్ర ఉత్తరాభాద్ర ద్వే ద్వే ఖట్వం (మంచం ఆకృతిలో రెండు నక్షత్రాలు)
26. ఉత్తరాభాద్ర - పూర్వాభాద్ర ఉత్తరాభాద్ర ద్వే ద్వే ఖట్వం (మంచం ఆకృతిలో రెండు నక్షత్రాలు)
27. రేవతి - రేవతీ మత్స్యాకార త్రయం (చేప ఆకారంలో మూడు నక్షత్రాలు)

అదేవిధంగా అధిదైవాలను కూడా నిర్ణయించడం జరిగింది. నక్షత్రాలకు అవి ఉన్న ప్రదేశాలను బట్టి, అవి తూర్పు ఆకాశంలో సూర్యోదయం కన్నా ముందు, సూర్యాస్తమయం తర్వాత ఉదయించడాన్ని బట్టి, అవి ఉదయించినప్పుడు ప్రకృతి యొక్క పరిస్థితులను బట్టి, ఆ యా నక్షత్రాలలో రవి ప్రవేశించినపుడు భూగోళంపైన జరిగే ఋతు, ప్రకృతి సంబంధమైన మార్పులను ఆధారంగా చేసుకొని అధిదైవాలను నిర్ణయించడం జరిగింది. ఆ యా అధిదేవతలు సాహిత్యంలో మనకు ప్రత్యేకంగా కనిపిస్తున్నారు. నక్షత్రాల అధిదైవాలకు సంబంధించిన గాథలు సాహిత్యంలో మనకు అనేకంగా కనిపిస్తున్నప్పటికీ, జ్యోతిషంపై సరియైన అవగాహన లేకపోవడం వల్ల వాటిని పుక్కిటి పురాణాలుగానో, లేక ఇతరమైన కథలుగానో గుర్తిస్తున్నాం.

1. అశ్విని - అశ్విన్ దేవతలు
2. భరణి - యముడు
3. కృత్తిక - అగ్ని
4. రోహిణి - ప్రజాపతి
5. మృగశిర - చంద్రుడు
6. ఆరుద్ర - రుద్రుడు
7. పునర్వసు - అదితి
8. పుష్యమి - బృహస్పతి
9. ఆశ్లేష - సర్పం
10. మఖ - పితరులు
11. పుబ్బ - భగుడు
12. ఉత్తర - అర్యముడు
13. హస్త - సూర్యుడు
14. చిత్త - విశ్వకర్మ
15. స్వాతి - వాయువు
16. విశాఖ - ఇంద్రాగ్నులు
17. అనూరాధ - సూర్యుడు (మిత్రుడు)
18. జ్యేష్ఠ - ఇంద్రుడు
19. మూల - నిర్ఋతి
20. పూర్వాషాఢ - ఉదకములు
21. ఉత్తరాషాఢ - విశ్వేదేవతలు
22. శ్రవణం - విష్ణువు
23. ధనిష్ఠ - వసువులు
24. శతభిషం - వరుణుడు
25. పూర్వాభాద్ర - అజైకపాదుడు
26. ఉత్తరాభాద్ర - అహిర్బుధ్న్యుడు
27. రేవతి - పూషుడు.

21. పంచస్కంధాలను వివరించండి? (2000, 2002)

వేదాలలో మొదలై పురాణ తంత్రాలలో వెలుగు చూసి జ్యోతిషం తన ప్రత్యేకతను వ్యక్తీకరించింది. వేదాంగంగా ప్రత్యేకశాస్త్రమైంది. జ్యోతిషం కాలవిధానశాస్త్రంగా గుర్తించబడింది.

ముందు గణితభాగంగా, తరువాత గణిత ఫలిత భాగాలుగా విస్తరించిన జ్యోతిషం - సిద్ధాంత, హోర, సంహిత అనే భాగాలతో త్రిస్కంధ సమన్వితంగా తరువాత సిద్ధాంత, సంహిత, హోర, ప్రశ్న, శకునాదులనే పంచస్కంధాలతో విస్తరించి, అనేక శాఖోపశాఖలుగా అధ్యయనం చేయబడుతున్నది.

వీనిలో తంత్రం సిద్ధాంతభాగానికి సంబంధించింది. ఇది గణితమనే పేరుతో పిలువ బడుతుంది. తంత్రం గ్రహగతులకు సంబంధించింది. మధ్యగతి, తిథి నక్షత్రచ్ఛేదాలు, స్ఫుటగతి, త్రిప్రశ్న, చంద్రసూర్యగ్రహణాలు, ఉదయాస్తమయాలు, శృంగోన్నతి, సమాగమం, తారాగ్రహసంయోగం మొదలైన విషయాలు తంత్రంలోని అంశాలు. గ్రహాల గతుల్లో వక్రాది విషయాలు ఈవిభాగంలో వివేచించబడతాయి.

త్రుటినుండి అనంతం వరకు కాలగణన, వేరు వేరు కాలమానాలు, గణితం, గ్రహ గణితం, యంత్ర విశేషాలు మొదలైనవన్నీ ఈ సిద్ధాంతస్కంధంలో భాగంగా అధ్యయనం చేయడం జరుగుతుంది. గణిత విభాగం గ్రహగణితం, పాటీగణితం, బీజగణితాలనే మూడు విభాగాలైంది. బ్రహ్మ, వశిష్ఠ, సోమ, సూర్యాదులు ఈ స్కంధ ప్రవర్తకులు. తరువాతి కాలంలో ఆర్యభట, బ్రహ్మగుప్త, వరాహమిహిర, భాస్కరాచార్య, కమలాకర ప్రభృతులు దీనిని విస్తరింపజేశారు. సూర్యసిద్ధాంతం, ఆర్యభటుని ఆర్యభటీయం, బ్రహ్మగుప్తుని బ్రహ్మస్ఫుటసిద్ధాంతం, వరాహ మిహిరుని పంచ సిద్ధాంతిక, భాస్కరుని సిద్ధాంత శిరోమణి, కమలాకరుని సిద్ధాంత తత్త్వవివేకం మొదలైనవి స్కంధ విభాగంలో ప్రసిద్ధి పొందిన గ్రంథాలు.

హోరాస్కంధం జాతక, తాజక, నాడీ భేదాలతో మూడుభాగాలుగా కనిపిస్తుంది. ఈ స్కంధం ఫలితజ్యోతిష భాగంగా పేరుపొందింది. హోరాశాస్త్రంలో అనేక విభాగాలు ఏర్పడ్డాయి. 'తాజకం' అంటే ఒక సంవత్సర ఫలాలను చెప్పడానికి పాశ్చాత్యుల



నుండి వచ్చిన శాస్త్ర విధానం. జాతకం - 'జ' అంటే పుట్టుక అని అర్థం. పుట్టుక సమయంలోని వివిధ గ్రహనక్షత్రాల సంచార మాధారంగా జాతకం వేసి భవిష్యత్తును సూచించడం, ఫలవివరణ చేయడం దీని ప్రత్యేకత. దీనిలో వివిధ రకాల మార్గాలు చూపినవారు - పరాశార, సత్యాచార్య, జైమిని, యవన, పాశ్చాత్యులు. వీరి ఫలిత విశ్లేషణామార్గాలు విభిన్నంగా ఉన్నప్పటికీ అన్నింటికీ ప్రామాణికత ఉంది. వరాహమిహిరుని 'బృహజ్జాతకం', నీలకంఠుని 'తాజక నీలకంఠి' ఈ విషయంలో ప్రామాణిక గ్రంథాలు.

హోరాస్కంధమంటే జాతక సంబంధమైంది. పితామహ, నార, వసిష్ఠ, కశ్యపాదుల చేత నిర్మించబడ్డ స్కంధమిది. అహోరాత్ర శబ్దంలో ఆద్యంత అక్షరాలు (అ, త్ర) లోపిస్తే 'హోర' అనే శబ్దం ఏర్పడింది. ఇదే ఆంగ్లంలో ఒక గంట కాలపరిమితి గల కాలానికి 'అవర్' గా వికృతి పొందింది. రాశిభేదాలు, గ్రహయోనులు, ఆధానం, జన్మనక్షత్రాల వివేచన, సంవత్సరాది ఫలం, మాసఫలం, గ్రహస్థితి ఫలం, గ్రహదృష్టి ఫలం, అరిష్టం, ఆయుర్దాయం, రాజాదియోగాలు ఈ భాగం నుండి వివేచించ బడినాయి. తాజకం దీనిలో మరోభాగం. తాజకం ఒక సంవత్సర ఫలితాలకు సంబంధించింది. తాజకం 'వర్షఫల'మనే పేరుతో పిలువబడుతుంది. ఒక్కో రాశిని అనేక వందల భాగాలు చేసి ఒక్కో భాగానికున్న ప్రత్యేకమైన ప్రతిపత్తిని అర్థం చేసుకోవడమే నాడీశాస్త్రం యొక్క ముఖ్య ఉద్దేశం. వేరు వేరు భాగల్లో ఉన్న వేరు వేరు గ్రహాలు, లగ్నం ఇచ్చే ఫలితాన్ని అత్యంత సూక్ష్మంగా వివేచించి వ్యక్తికి భవిష్య మార్గసూచన చేయడం నాడీశాస్త్రం తెలియజేస్తుంది.

సంహిత ఇందులో మూడవ స్కంధం. ఈ స్కంధం ప్రకృతి, ఫలిత జ్యోతిషాదుల్ని వివరిస్తుంది. అన్ని ప్రత్యేకమైన అంశాలు ఈ స్కంధంలో సంక్షిప్తంగా తెలియజేయబడతాయి. ఇందులో సంవత్సర సూత్రం, గ్రహవిచారం, గ్రహయుతి, వర్షఫలం, శృంగాటకం, గర్భవివేకం, ఉల్కావివేకం, ప్రతివర్ష కృత్య లక్షణాలు, వాస్తు, వృక్షాయుర్వేదం, శకున వివేచన, తిథ్యాదుల ఫలితం, గ్రహగోచరాది విషయాలు వివరింపబడతాయి. గర్గ, వసిష్ఠ, భృగు, కశ్యప, నారద, బృహత్సంహితాదులు ఈ స్కంధంలో ప్రసిద్ధ గ్రంథాలు

సంహిత మానవజీవన విజ్ఞానశాస్త్రం. జ్యోతిస్సుల ప్రభావాలను అనేక రీతులలో పరిశీలించి, అవి మానవునిపై చూపించే ప్రభావాలను ఈ సంహితాస్కంధంలో అధ్యయనం చేస్తారు. దీనిలో తొమ్మిది విభాగాలు కనిపిస్తున్నాయి. ఈ విభాగాలలో జ్యోతిస్సుల ప్రభావం అస్పష్టంగా కనిపించి, ఛాయామాత్రమైన జ్యోతిషభావనలు వ్యక్తీకరించబడతాయి. సంహిత అనేక భాగాలుగా, ఉపవిభాగాలుగా పునర్విభజిత మైంది.

సాముద్రికం – కాంతి ప్రభావాల వల్లనే వేరువేరు శరీరతత్త్వాలు, రేఖలు ఏర్పడడం, శరీరాంగాల వృద్ధిక్షయాదులు సాధ్యమని సాముద్రికశాస్త్రం చెబుతుంది. ఈ అంగాల మరియు ఇతర ప్రభావాలను నిరంతరం అధ్యయనం చేయడంవల్ల ఈ రేఖలు మొదలైనవి భవిష్యత్తును సూచిస్తున్నాయనే భావం ఏర్పడింది. అందువల్ల ఇది ప్రస్తుతకాలంలో ప్రత్యేకమైనశాస్త్రంగా అధ్యయనం చేస్తున్నారు. హస్త, అంగ, తిలక, ముఖ, పశు సంబంధమైన అంశాలు ఇందులో ప్రత్యేక విభాగాలుగా రూపుదిద్దుకున్నాయి. హస్తరేఖల ఆధారంగా భవిష్యత్తును సూచించడం హస్త సాముద్రికం. శరీరాంగాల ఆధారంగా వ్యక్తియొక్క విశేషాలను తెలియజేసేది అంగ సాముద్రికం. శరీరంపైగల పుట్టుమచ్చల ఆధారంగా ఫలితాలు తెలిపేది తిలక సాముద్రికం. ముఖం ఆధారంగా ఫలసూచన ముఖసాముద్రికంగా భావింప బడుతుంది. పశువుల మీది సుడులు, వాటి ప్రత్యేక లక్షణాలను ఆధారంగా వాటిలో మంచివానిని నిర్ణయించడానికి ఏర్పడిన శాస్త్రం పశుసాముద్రికం.

వాస్తు – వస్తుగతమైంది. ఈ ప్రకృతిలో భూమిపై ఆనందంగా, ఆరోగ్యంగా నివసించడానికి ఒక ప్రత్యేకమైన సదుపాయాలు కలిగి, ప్రకృతి శుభాశుభకిరణాలకు, భూ అయస్కాంత తరంగాలకు అనువుగా జీవనం సాగిస్తే అది వ్యక్తి అభివృద్ధికి హేతువవుతుంది. ప్రకృతికి వ్యతిరేకమైన జీవనం పతనం చేస్తుంది. అనుకూలమైతే ఆనందాన్నిస్తుంది. ఈ విషయాలకు శాస్త్రీయమైన రూపమే వాస్తుశాస్త్రం. దీనిలో 'కళారాధన' అనే అంశం కూడా చేరి అందం అనే అంశానికి ప్రాముఖ్యం కలిగింది. అందంగా ఉండి వ్యక్తి ఆనందమయ జీవనమార్గానికి హేతువయ్యేది వాస్తుశాస్త్రం. ఈ శాస్త్రాన్ని ఆలయ, శిల్ప, గృహ, యంత్ర అనే విభాగాలుగా అధ్యయనం చేస్తున్నారు.

ప్రస్తుత కాలంలో దీనిపై అత్యంత శ్రద్ధ పెరిగి, ఆర్కిటెక్చర్, ఇంటీరియల్ డెకరేషన్, వాస్తు ఇంజనీరింగ్ విభాగాలుగా అధ్యయనం చేస్తూ నూతనాంశాలను ఆవిష్కరణకు ప్రయత్నం చేస్తున్నారు.

ముహూర్తం – జీవితంలో జరుపుకునే ముఖ్యమైన కార్యక్రమాలకు తత్కాల అనుకూల గ్రహ నక్షత్రాల ప్రభావాలను చూసి సమయం నిర్ణయించే విధానాన్ని ముహూర్తం అంటాం. జనన సమయాన్ని మార్చలేము. కాబట్టి సంఘటనలకు, ముఖ్య జీవితాంశాలకు సంబంధించి శుభమైన కాంతులు ప్రసరించే ఉత్తమమైన కాలాన్ని ఎన్నుకోవడం, ఆసమయంలో ఆ కార్యక్రమాలను జరపడం ద్వారా ఇతర దోషాలు తొలగింపబడి ఆ కార్యం సఫలమై ఆనందం కలిగిస్తుంది.

గోచారం – గ్రహాల సంచారమే గోచారం. ఈ సృష్టిలోని సమస్తవస్తువులు భ్రమణశీలం కల్గినట్టివే. సూర్యకుటుంబంలో వేరువేరు గ్రహాలు భూగ్రహం పైనున్న మానవులపై కల్గజేసే ప్రభావాలు అధికం. వ్యక్తి జన్మజాతకాన్నుండి వివిధ గ్రహాలు ఎంతెంత దూరంలో ఉన్నాయి? ఆ ప్రదేశాలనుండి ఏయే కేంద్రాలు, కోణాల ద్వారా వ్యక్తిపై కాంతి ప్రసరిస్తుంది? ఈ కాంతుల ప్రసరణకు స్పందన ఏమిటి ?.మొదలైన అంశాల పరిశీలన 'గోచారం' గా మారింది. వ్యక్తిపరంగా, దేశపరంగా ఆలోచనలు, అధ్యయనాలు దీనిపై విస్తృతంగా కొనసాగుతున్నాయి.

వృష్టి – వ్యవసాయదారునికి ముఖ్యంగా కావల్సింది వర్షం. దాని ప్రకారమే అతడు విత్తనాలు వేసి పంటలు పండిస్తాడు. అకాలంలో వేసిన పంట మొలకెత్తదు, పండదు. అది తనకే గాక దేశానికి కూడా నష్టమే. ఈవిధమైన వర్షవిజ్ఞాన పరిశోధన అత్యంతావశ్యకం. వర్షాలు పడే సమయంలో మార్పులు ఏవిధంగా వున్నాయో పరిశీలనలోకి వచ్చింది. సూర్యుని వివిధ కార్తెల ప్రవేశం, చంద్రపరివేషం మొదలైన అంశాలు ప్రకృతిని ప్రేరేపిస్తున్నాయని, దానికి అనుగుణంగా వర్షాలు పడుతున్నాయని గ్రహించారు. ఇప్పటికీ ఆ సమయ నిర్దేశమాధారంగానే వ్యవసాయదారులు తమ పనులు చేసుకుంటున్నారు. ఈవిధమైన పరిశీలన రెండురకాలుగా సాగుతుంది. జంతుజాలాల ప్రవర్తనా మార్పులవల్ల కురియబోయే వృష్టిని 'సద్యోవృష్టి' గాను, జ్యేష్ఠ

శుద్ధ పూర్ణమి తర్వాత పూర్వాషాఢా నక్షత్రం నుండి వరుసగా 27 నక్షత్రాలు దాటేవరకు ఏరోజులో ఎంత వర్షం ఏ ప్రదేశంలో పడుతుందో గమనించి దాని ప్రకారం ఆ సంవత్సరం వర్ష ఫలితాన్ని తెలుసుకునే విధానం 'ప్రవర్షణ' అనే అంశంగా అధ్యయనం సాగుతుంది.

శాంతి - గ్రహదోషాలంటే గ్రహాలు చెడ్డవనీ, పీడాకారులనీ కాదు. గ్రహాలు తమ వాతావరణానికి అనుగుణంగా విభిన్న కాంతులను భూమిపై ప్రసరిస్తాయి. గ్రహ సంబంధమైన కాంతులు శరీరంపై సరిగా లేకపోవడం వల్ల ఆశరీరంలో ఆయా కాంతులకు సంబంధించిన ధాతువుల వృద్ధి ఆగిపోతుంది. వివిధ శక్తి కేంద్రాలనుండి హార్మోన్ల విడుదల, శక్తి ప్రవాహం తగ్గుతుంది. అందువల్లనే గ్రహశాంతులకు ప్రాధాన్యమిచ్చి ఆయా గ్రహాలకు రూపాలను ఏర్పాటు చేసుకుని ఆరాధిస్తారు. ఈ శాంతి ఒక రకమైన వైద్య ప్రక్రియ. హోమ, జప, దానాదులు ఆధునిక కాలంలో హోమథెరపీ, మంత్ర థెరపీ, జెమ్‌థెరపీ అంటూ వేరు వేరు పేర్లతో ఏర్పడడమే కాక సంగీత సంబంధమైన వైద్యం, నక్షత్ర గ్రహానుకూలమైన చెట్లను పెంచడం ద్వారా వైద్యం వంటి అనేకానేక ప్రాకృతిక వైద్యాలు శాంతి సంబంధమైనవిగా పరిగణిస్తున్నారు. ఈవిధానాలకు నేడు అధికమైన ఆదరణ కూడా ఉంది.

స్వప్నం - కాంతియొక్క సూక్ష్మీకృత రూపమే మనసు. సకల జీవరాశుల అంతశ్చేతన ఒక్కటేనని మనస్తత్వ శాస్త్రజ్ఞుల అభిప్రాయం. మనిషి నిద్రించినా మనసు నిద్రించదు. దానికున్న శక్తి అమోఘం. అందువల్ల నిద్రలో కూడా అది స్మృతులను వెలికి తీస్తుంటుంది. మనసుకు భవిష్య జ్ఞానముండి స్వప్నం ద్వారా అది వ్యక్తీకరింపబడుతుంది. స్వప్నంలో కనిపించే వివిధ అంశాలకు వివిధ ప్రతీకలున్నాయి. ఇవి ప్రాంతపరంగా భౌగోళిక పరిస్థితుల ఆధారంగా విభేదిస్తాయి. వీనిని అధ్యయనం చేస్తూ శుభాశుభాలను పరిశీలనలోనికి తీసుకోవడం ద్వారా ప్రమాదాలనుండి రక్షించుకోవచ్చు. ఈ భావంతో వృద్ధి పొందిన శాస్త్రం స్వప్నశాస్త్రం. దీన్ని ప్రాంత విభేదం, అధ్యయన భేదాన్ని అనుసరించి ప్రాచ్య పాశ్చాత్య భావాలుగా అధ్యయనం చేస్తున్నారు.

రత్నశాస్త్రం - మనిషి శారీరక, మానసిక స్థితులపై అధికంగా ప్రభావం చూపించే

వివిధ కాంతుల ప్రభావం సరిగా లేనపుడు వానిని గుర్తించి సూక్ష్మీకృత కాంతిని శరీరానికి అందజేసే రత్నాల ద్వారా వైద్యం చేసే విధానాన్ని రత్నశాస్త్రం తెలియజేస్తుంది. ఒక్కో గ్రహసంబంధ మైన కాంతికి అనుగుణంగా ఒక్కో రత్నం పనిచేస్తుంది. కాంతికి సంబంధించిన లోపాన్ని కాంతితోనే పూరించాలన్న వైజ్ఞానిక దృక్పథం రత్నశాస్త్ర ఆవిర్భావానికి దారి తీసింది. జాతకాదుల పరీక్ష ద్వారా ఏ గ్రహ సంబంధమైన దోషం వుందో గమనించి ఆ గ్రహ సంబంధమైన రత్నం ధరింపజేయడం వల్ల నివారణ చేయడమే కాకుండా అనేక శారీరక, మానసిక సంబంధ లోపాలను రత్నాలద్వారా తీసివేయడం 'జెమ్ థెరపీ' ద్వారా సాధ్యమవుతుంది. ఈ విషయ సంబంధమైన వైద్య ప్రక్రియను 'స్టెల్లార్ హీలింగ్' అని అంటారు.

ప్రశ్న - జ్యోతిశ్శాస్త్రంలో చతుర్థ స్కంధమిది. తాత్కాలికంగా తాను చేయబోయే పనులలో శుభాశుభాలను గుర్తించి కార్యానికి ఉద్యుక్తులు కావడంలో ఉన్న అంశాలను దృష్టిలో పెట్టుకోవడం ఈ శాస్త్రంలో కనిపిస్తుంది. తత్కాల గ్రహస్థితి ఆధారంగా ఈవిషయాన్ని నిర్ణయిస్తారు. అంతేగాకుండా ప్రశ్న అడిగిన సమయంలో జ్యోతిష్కుని శ్వాస, చుట్టూవున్న శుభాశుభ వస్తువులు, చెప్పిన సంఖ్య, ప్రశ్నాక్షరాలు మొదలైన విషయాలపై ప్రత్యేక శ్రద్ధను చూపిస్తూ స్వర, కాల, సంఖ్యా, వాక్యప్రశ్నలుగా అధ్యయనం చేస్తున్నారు.

శకునం - జ్యోతిష విజ్ఞానంలో తరువాతి కాలంలో పంచమస్కంధంగా గుర్తించబడింది. ఈ శకునాలను గుర్తించేది మనస్సే. మనకు నిత్య జీవితంలో కనిపించే వస్తువులు, జీవజాలాలు వాటికి ప్రేరకాలే గాని అవి చెడ్డవి కావు. ప్రకృతిలో ఏదో మార్పు కలుగుతుందన్నప్పుడు జీవులు తమ శరీర ప్రకృతులు మార్చుకుంటాయి. అవి గమనించడం కూడా శకున సంబంధమైన అంశమే. దీనిలో మనుష్య, ప్రకృతి, పశుపక్షి సంబంధమైన విధాలుగా విభజన చేసి అధ్యయనం చేస్తున్నారు.

ఈవిధంగా జ్యోతిషం ఎన్నో విజ్ఞాన శాస్త్రాల ఆవిర్భావానికి మూలకారణం అవడమే కాకుండా వానికి సంబంధించిన ఎన్నో రకాల శాస్త్రాలను వృద్ధి చేస్తుంది. కేవలం వైజ్ఞానిక శాస్త్రాలపై పరిశోధనలు చేసేవారు సామాజిక శాస్త్రాలను, సామాజిక

శాస్త్రాల పరిశోధకులు వైజ్ఞానిక శాస్త్రాల వారిపై వాగ్బాణాలను సంధిస్తూ అవహేళనలు చేసుకుంటూ సమన్వయం సాధించకుండా పోతున్నారు. వీరి మధ్యగల అనైక్యత కారణంగా శాస్త్రవిజ్ఞానం సమాజానికి, సమాజస్థితి శాస్త్రానికి అంతుబట్టకుండా పోతుంది. ఈ పరిణామం వల్ల విజ్ఞానం వినాశనానికి, విధ్వంసానికి కారణమవుతుంది. ఈవిధమైన స్థితిగతులున్న సమాజంలో పూర్వకాలం నుండి ప్రస్తుతం వరకు నూతన దృక్కోణంలో సామాజిక, వైజ్ఞానిక శాస్త్రాలను సమన్వయం చేసే శాస్త్రంగా జ్యోతిషం వెలుగుతూనే వుంది. దీనిలోని సిద్ధాంత అధ్యయన భాగం ఖగోళ సంబంధ మైంది. దాని ఫలితం భౌతిక శాస్త్ర, కాంతి శాస్త్ర, అయస్కాంత శాస్త్ర సంబంధమైనది. వీనివల్ల శరీరంలోను, ప్రకృతిలోను కలిగే మార్పులు అధ్యయనం చేయడం 'కళ'గా సామాజిక శాస్త్రాంశంగా చూడవచ్చు.

ఒక శాస్త్రీయమైన విషయం ప్రజల్లోకి పూర్తిగా చేరిన తరువాత దాని ప్రభావాన్ని సాధారణంగా అందరూ గుర్తించడం జరుగుతుంది. ఒకవేళ అది ప్రభావం చూపలేకపోయి నట్లయితే దాన్నెవరూ ఆచరించరు, ఆదరించరు, అనుసరించరు. శాస్త్రం పరిశోధించవలసిన అవసరం ఇక లేదనిపించి, గమనించిన విషయం పూర్ణజ్ఞానమనే స్థితికి వచ్చినపుడు అది నమ్మకంగా పరిణమిస్తుంది. ఈ విషయాలనే తమ తర్వాతి తరాల వారికి పూర్వులు అందజేస్తుంటారు. ఆయా విషయాలు నిత్యజీవన వ్యవహారంలోనూ, వ్యవసాయంలోనూ, వివిధ వృత్తులలోనూ అన్నింటిలోనూ అంతర్గతంగానో, బహిర్గతంగానో తెలుస్తూనే ఉన్నాయి. వాటిని విశ్లేషిస్తూ వచ్చే నూతన అధ్యయనాలు ప్రస్తుత సమాజానికి అవసరం.

23. నక్షత్ర వివరాలను, వాటి విస్తరణ డిగ్రీలను, వివరించి వాటిని రాశుల డిగ్రీలతో సమన్వయపరచండి? **(2002)**

ఏదైనా వృత్తమార్గం 360 డిగ్రీలని భావిస్తే, రవిమార్గం కూడా 360 డిగ్రీలుగా విభజింపబడుతుంది. ఈ రవిమార్గాన్ని ముందు 27 విభాగాలుగా గుర్తించారు. అవే మనకు నక్షత్రాలు. ఆకాశంలో ఈ 27 నక్షత్రాలే కాక ఇతర నక్షత్ర మండలాలు

అనేకంగా ఉన్నా, రవిమార్గంలో ప్రతిరోజూ చంద్రుడు ఏ నక్షత్రానికి దగ్గరగా ఉంటాడో చూసి ఆ నక్షత్రాన్ని ఆ రోజు నక్షత్రంగా గుర్తించారు. అవి మొత్తం 27. అవే అశ్విన్యాది నక్షత్రాలు. వైదిక సాహిత్యం నుండి ఈ నాటివరకు ఈ నక్షత్రాల విషయంలో మార్పేమీ లేదు. ఒక్కో నక్షత్ర ప్రమాణం 13 డిగ్రీల 20 నిమిషాలు.

నక్షత్రాలు : 1. అశ్విని 2. భరణి 3. కృత్తిక 4. రోహిణి 5. మృగశిర 6. ఆరుద్ర 7. పునర్వసు 8. పుష్యమి 9. ఆశ్లేష 10. మఖ 11. పుబ్బ 12. ఉత్తర 13. హస్త 14. చిత్త 15. స్వాతి 16. విశాఖ 17. అనూరాధ 18. జ్యేష్ఠ 19. మూల 20. పూర్వాషాఢ 21. ఉత్తరాషాఢ 22. శ్రవణం 23. ధనిష్ఠ 24. శతభిషం 25. పూర్వాభాద్ర 26. ఉత్తరాభాద్ర 27. రేవతి.

ఒక్కో నక్షత్రాన్ని నాలుగు పాదాలుగా విభజించడం వల్ల మొత్తం 27 నక్షత్రాలకు 27 4 = 108 పాదాలుంటాయి. ఒక్కో నక్షత్ర పాద ప్రమాణం 3 డిగ్రీల 20 నిమిషాలు.

నక్షత్రాలను గమనించిన తరువాత ఆకాశాన్ని ముఖ్యంగా 12 విభాగాలు చేయడం జరిగింది. ఇవే రాశులు. ఒక్కో రాశి ప్రమాణం 30 డిగ్రీలు. 12 రాశుల మొత్తం ప్రమాణం 360 డిగ్రీలవుతుంది.

రాశులు : 1. మేషం 2. వృషభం 3. మిథునం 4. కర్కాటకం 5. సింహం 6. కన్య 7. తుల 8. వృశ్చికం 9. ధనుస్సు 10. మకరం 11. కుంభం 12. మీనం.

నక్షత్రపాద విభజన వేరు వేరు రాశుల్లో వేరు వేరు నక్షత్రాలను చేర్చడానికి అవసరమైంది. ఒక్కో రాశిలో వేరు వేరు నక్షత్రాలకు సంబంధించిన 9 పాదాలు అమర్చబడి ఉంటాయి.

అశ్విని(4) భరణి (4) కృత్తిక (1)	- మేషం
కృత్తిక (2,3,4) రోహిణి (4) మృగశిర (1,2)	- వృషభం
మృగశిర (3,4) ఆర్ద్ర (4) పునర్వసు (1,2,3)	- మిథునం
పునర్వసు (4వ పాదం) పుష్యమి (4) ఆశ్లేష (4)	- కర్కాటకం

మఖ (4) పుబ్బ (4) ఉత్తర (1)	- సింహం
ఉత్తర (2,3,4) హస్త (4) చిత్త (1,2)	- కన్య
చిత్త (3,4), స్వాతి (4), విశాఖ (1,2,3)	- తుల
విశాఖ (4వపాదం) అనూరాధ (4) జ్యేష్ఠ (4)	- వృశ్చికం
మూల (4) పూర్వాషాఢ (4) ఉత్తరాషాఢ (1)	- ధనుస్సు
ఉత్తరాషాఢ (2,3,4) శ్రవణం (4) ధనిష్ఠ (1,2)	- మకరం
ధనిష్ఠ (3,4) శతభిషం (4) పూర్వాభాద్ర (1,2,3)	- కుంభం
పూర్వాభాద్ర (4వపాదం) ఉత్తరాభాద్ర (4) రేవతి (4)	- మీనం.

ఈ విధంగా వేరు వేరు నక్షత్ర పాదాల సమన్వయం ఒక్కో రాశిగా ఆకాశంలో మనకు దర్శనమిస్తూ ఉంటుంది. ఆ యా స్వరూపాలను జాగ్రత్తగా గమనించి అధ్యయనం చేయవలసి ఉంటుంది.

ఉదాహరణకు మేష రాశిలో అశ్విని 4 పాదాలు, భరణి నాలుగు పాదాలు, కృత్తిక 1 పాదం ఉంటుంది. దీనిలో అశ్విని (0 - 13.20), భరణి (13.20 - 26.40), కృత్తిక (1పాదం) - 3.20 = మొత్తం 30 డిగ్రీలు అవుతాయి. మేషరాశిలో 30 డిగ్రీలయితే వృషభరాశి 60 డిగ్రీలవరకు విస్తరించి ఉంటుంది. ఇదేవిధంగా మీనరాశి 330 నుండి 360 డిగ్రీల వరకు విస్తరించి ఉంటుంది.

24. ఆర్యభట్టు ప్రజ్ఞలను వివరించండి? (2002)

ఆర్యభట్టు అనే ప్రముఖ జ్యోతిష శాస్త్రవేత్త క్రీ.శ.476లో జన్మించాడు. ఇతడు కుసుమపుర నివాసి. ఇది నేటి బీహారు రాష్ట్రంలోని పాట్నాకు పేరు. 'అశ్మక జనపద జాతః ఆర్యభటాచార్యః' అనే మాట ప్రకారం ఆర్యభట్టు అశ్మక దేశీయుడని తెలుస్తుంది. ఇది నేటి కేరళ దేశంలోని తిరువాన్కూర్ ప్రాంతం. ఇతని ప్రామాణిక జ్యోతిష గ్రంథానికి 'ఆర్యభటీయం' అని పేరు. ఆర్యభటీయంలో నాలుగు పాదాలున్నాయి. అవి 1. గీతికాపాదం 2. గణితపాదం 3. కాలక్రియాపాదం 4. గోళపాదం.

1. గీతికాపాదం : దీనిలో పది శ్లోకాలు గీతి ఛందస్సులో ఉన్నాయి. దీనికి 'దశగీతికాసూత్రం' అని పేరు. దీనిలో సంఖ్యలు నిర్దేశించడానికి కొన్ని సంకేతాలను ఏర్పరచుకొన్నాడు. వర్ణమాలలోని ఒక్కో అక్షరం ఒక్కో సంఖ్యకు సంకేతంగా ఉంటాయి. అచ్చులకు 1, 10, 100, 1000, 10000 అనే విధంగానూ, హల్లులకు 1,2,3,4, 5, 6, 7, మొదలైన సంఖ్యలతోనూ సంకేతాలు ఏర్పరచబడినాయి. చిన్న అక్షరాలతో పెద్ద సంఖ్యలను చెప్పడానికి ఆర్యభట్టు ఇటువంటి సంకేతాలను ఏర్పరచుకుని సూత్ర పద్ధతిని అనుసరించినాడు.

ఈ పాదంలోనే ఇతర శ్లోకాల్లో భూ పరిభ్రమణం గూర్చి, మహాయుగంలోని ఇతరమైన కృత, త్రేతా, ద్వాపర, కలియుగాల గూర్చి వివరించారు. ఇక్కడ ఇతరులు అంగీకరించిన అంశాలకు భిన్నంగా ఆర్యభట్టు అన్ని యుగాల ప్రమాణం సమమే అని ప్రతిపాదించాడు. రాశి, అంశ, కళ మొదలైన వాని సంబంధం, ఆకాశ కక్ష్యా విస్తారం, పృథ్వీ సూర్య చంద్రాదుల గతి, అంగుళం, హస్తం, పురుషుడు, యోజనం మొదలైన ప్రమాణాలు తదితరాంశాలు చర్చించబడినాయి.

2. గణితపాదం : దీనిలో 33 శ్లోకాలున్నాయి. దీనిలో దశగుణాలైన సంఖ్యలను గూర్చి చెప్పబడింది. తరువాతి శ్లోకాల్లో వర్గం, వర్గక్షేత్రం, ఘనం, ఘనఫలం, వర్గమూలం, ఘనమూలం, త్రిభుజాల యొక్క క్షేత్రఫలం, త్రిభుజాకార శంకువు యొక్క ఘనఫలం, వృత్తం యొక్క క్షేత్రఫలం, గోళఘనఫలం మొదలైన విషయాలు చెప్పబడ్డాయి.

గ్రీకులకు కూడా ముందుగా తెలియని 'సైన్' (భుజజ్యా) వంటి విశేషాలు ఆర్యభటీయంలో కనిపిస్తున్నాయి. అంతేగాక పైథాగరస్ థీరంగా చెప్పబడుతున్న అంశాలు కూడా ఆర్యభటీయంలో ఉన్నాయి. వీటికి మూలం భారతీయ శుల్బసూత్రాలలో ఉంది. ఇంకా వృత్త, త్రిభుజ, చతుర్భుజాలను గీసే పద్ధతి, సమతల పరీక్షా పద్ధతి మొదలైన అంశాలు దీనిలో ఉన్నాయి.

3. కాలక్రియాపాదం : దీనిలో 25 శ్లోకాలున్నాయి. మొదట్లో వర్షం, మాసం మొదలైన కాలమానాలు తెలుపబడినాయి. 12 మాసాలు ఒక వర్షం, 30 రోజులు ఒక మాసం, అరవై నాడులు ఒక రోజు, 60 వినాడులు ఒక నాడి అవుతాయి.

వినాడి, వినాడిక, విఘటిక సమానార్థాలలో ప్రయోగించబడినాయి. నాడికి 24 నిమిషాలు. 60 దీర్ఘాక్షరాలను ఉచ్చరించడానికి లేదా ఆరుశ్వాసలు తీసుకోవడానికి కావలసిన సమయం ఒక వినాడిక అని తెలుపబడింది.

క్షేత్ర విభాగానికి, కాలవిభాగానికి సంబంధం తెలియజేయబడింది. రాశికి 30 భాగాలున్నట్లు మాసానికి 30 దివసాలుంటాయని మొదలు పెట్టి అన్ని అంశాలలోనూ సమత్వాన్ని తీసుకొని రావడానికి ప్రయత్నం కనిపిస్తుంది. అదేవిధంగా రవిమాసం, శశిమాసం, అధికమాసం మొదలైన విశేషాలు, మనుష్యవర్షం, దివ్యవర్షం, పితృవర్షం, యుగంలోని ఉత్సర్పణీకాలం, అపసర్పణీకాలాలు తెలియజేయబడినాయి.

4. గోళపాదం : ఇది చివరి పాదం. దీనిలో 50 శ్లోకాలున్నాయి. దీనిలోని మొదటిశ్లోకం ప్రకారం రవి మార్గబిందువు మేషాదిగా ఉంటుందని చెప్పడం వల్ల ఆర్యభట్టు వసంత విషువత్తును అంగీకరించినట్లు తెలుస్తుంది. అందువల్ల రవి మేష ప్రారంభం నుండి కన్యాంతం వరకు ఉత్తరం వైపు జరుగుతాడనీ, తులా ప్రారంభం నుండి మీనాంతం వరకు దక్షిణం వైపుకు జరుగుతాడనీ చెప్పబడింది. భారతీయ ప్రాచీన ఖగోళ శాస్త్రజ్ఞులలో భూభ్రమణాన్ని అంగీకరించినవాడు ఆర్యభట్టు.

ఈ గ్రంథం రచించబడిన నాటినుండి ఈనాటివరకు దీనికి అత్యుత్తమ గౌరవం లభిస్తూనే ఉంది. ముఖ్యంగా దీనిని ఆధారం చేసుకొని విభిన్న కాలాల్లో వ్రాసిన కరణ గ్రంథాలు చాలా ప్రచారంలో ఉండడం దీని ప్రాశస్త్యానికి తార్కాణం. ఆర్యభటుని ఖగోళశాస్త్రం అరబ్ దేశాల్లో మంచి ప్రచారంలో ఉంది. గ్రీక్ గణితశాస్త్ర పండితుల బీజగణిత పరిజ్ఞానం ఆర్యభట్టు జ్ఞానంతో పోల్చి చూస్తే చాలా పరిమితంగా కనపడుతుంది. దీనికి అనేక వ్యాఖ్యానాలు వచ్చాయి.

ఆర్యభట్టు రెండవవాడు కూడా 'మహాసిద్ధాంతం' అనే ప్రామాణికమైన జ్యోతిశ్శాస్త్ర గ్రంథం రచించాడు. దీనిలో 18 అధికారాలు 625 ఆర్యాఛందస్సులో ఉన్నాయి. మొదటి ఆర్యభట్టు రచించిన ఆర్యభటీయాన్ని ఇతడు విశదీకరించి చూపించాడు.

25. ఫలితజ్యోతిష గ్రంథ కర్తలు?

పృథుయశస్సు : ఇతడు వరాహమిహిరుని కుమారుడు. ఉజ్జయిని ప్రాంతం

వాడు. ఇతడు 'హోరాసారం' అనే జాతకగ్రంథాన్ని, 'షట్పంచాశిక' అనే ప్రశ్నగ్రంథాన్ని రచించాడు. ఇతడు కూడా తండ్రిలాగా సూర్యభక్తుడు. హోరాశాస్త్రాన్ని అత్యంత సులభంగా వ్రాయడానికి ప్రయత్నించినందువల్ల తన గ్రంథానికి 'హోరాసారం' అనే పేరు పెట్టాడు పృథుయశస్సు.

ఇతడు మయ, యవన, సిద్ధసేన, ప్రబోధ, మాండవ్య, విష్ణుగుప్తాదులను తనకంటె ప్రాచీనులైన ఆచార్యులుగా పేర్కొన్నాడు. దశలను వివరించే సందర్భంలో 2గాని, 3 గాని, 4 గాని గ్రహాలు కలిసి ఉన్నప్పుడు ఒక గ్రహం యొక్క దశలో మరోగ్రహం యొక్క అంతర్దశ యోగించదు అని వివరించాడు. దశాశేషం కట్టడానికి కేవలం చంద్రస్ఫుటమే కాక లగ్నస్ఫుటాన్ని కూడా వినియోగించవచ్చునని ఇతడు తెలిపాడు. తల్లినక్షత్రంలో కుమారుడు జన్మిస్తే తండ్రికి దోషమనీ, తండ్రి నక్షత్రంలో కుమారుడు జన్మిస్తే తల్లికి దోషమని తెలియజేశాడు. ఇటువంటి ఎన్నో అంశాలతో పాటు అష్టకవర్గు లేకుండా శుభాశుభఫలాలు చెప్పడం సాధ్యం కాదని చెప్పాడు. ఈ అష్టకవర్గు విషయంలో తాను సిద్ధసేనుని అనుసరించినట్లు తెలిపాడు. హోరాసారం మిక్కిలి విలువైన గ్రంథం. దీని ప్రభావం శ్రీధరాచార్యునిపై కనిపిస్తుంది.

ఇతడు రాసిన మరో గ్రంథం పేరు షట్పంచాశిక. ఇది 56 శ్లోకాల్లో ప్రశ్నశాస్త్రాన్ని వివరించిన గ్రంథం. దీనికి భట్టోత్పలుని వ్యాఖ్య ఉంది. దీనివల్ల ప్రభావితుడైన భట్టోత్పలుడు స్వయంగా 70 ఆర్యాశ్లోకాలతో ఆర్యాసప్తతి అనే ప్రశ్నగ్రంథం వ్రాశాడు.

మంత్రేశ్వరుడు : ఇతని అసలు పేరు మార్కండేయ భట్టాద్రి. ఇతడు కేరళీయుడైన నంబూద్రి బ్రాహ్మణుడు. సుకుంతలాంబా దేవీ భక్తుడు. నిరంతర వ్రతోపవాసాదుల చేత, నియమపూర్వక తపశ్చర్య చేత సిద్ధుడైనాడు. అందువల్ల ఈతనికి మంత్రేశ్వరుడనే పేరు వచ్చింది. ఇతడు యోగసిద్ధుడై 150 సంవత్సరాలు బ్రతికినాడని ప్రతీతి. జ్యోతిషంలో ఎన్నో లోతైన అంశాలు కనుక్కున్న ఇతడు రచించిన 'ఫలదీపిక' గ్రంథంలో 28 అధ్యాయాలున్నాయి. ఈ గ్రంథం సంజ్ఞాధ్యాయంతో ప్రారంభమై ద్వాదశభావాలకు చెందిన అంశాలతో పాటు అత్యంత విలువైన జ్యోతిష సూత్రాలతో కూడుకొని ఉపసంహారాధ్యాయంతో ముగిసింది.

వైద్యనాథుడు : ఇతడు రచించిన గ్రంథం పేరు 'జాతకపారిజాతం'. ఇతని గ్రంథరచనాకాలం క్రీ.శ.1471 అని తెలుస్తుంది. ఈ గ్రంథం 18 అధ్యాయాలతో కూడుకొని ఉంది. దీనిలోని శ్లోకసంఖ్యను గూర్చి గ్రంథకర్త 'గీతోత్సుక శ్లోకినీం' అని పేర్కొన్నాడు. ఈ మాటకు గ్రంథవ్యాఖ్యాత 1763 (గీ-3, తో-6, త్సు-7, క-1) అనే అర్థాన్ని చెప్పి మొత్తం గ్రంథంలో 1763 శ్లోకాలున్నట్లు తెలిపాడు.

ఇది ప్రమాణగ్రంథంగా ప్రసిద్ధి చెందింది. సంవత్సర క్రమంలో ఆయుర్విచారణ, అరిష్టాధ్యాయంలోనూ, పిండాయువు, చక్రాయువు, అంశాయువు మొదలైన ఆయుర్విషయాలు ఆయుర్దాయాధ్యాయంలో విచారణ చేయబడ్డాయి. అవయవ లోపాదులు జాతకభంగాధ్యాయంలో వివరించబడ్డాయి. 5 అధ్యాయాల్లో భావఫలాలు, ఒక అధ్యాయంలో స్త్రీజాతకం, ఒక అధ్యాయంలో కాలచక్రదశ వివరించబడ్డాయి. ఇది ప్రామాణికమైన జ్యోతిష గ్రంథంగా ప్రసిద్ధిపొందింది.

కాళిదాసు : ఇతడు **ఉత్తరకాలామృతం** రచించాడు. జ్యోతిర్విదాభరణం రాసిన కాళిదాసుకంటే, కావ్యత్రయం రాసిన మహాకవి కాళిదాసుకంటె వేరైన వ్యక్తి. ఇతడు ఆంధ్రుడని తెలుస్తుంది. దీనికి కారణం ఇతడు ఆంధ్రభాషాకారకత్వాదులను తన గ్రంథంలో సూచించాడు. ఈ గ్రంథంలో ప్రాచీన గ్రంథాల్లో లేని ఎన్నో విషయాలున్నాయి. వార్షిక దశలను ఇతడు సూచించాడు. గ్రహభావ కారకత్వాలలో ఇతడిచ్చిన కారకత్వాలు ప్రాచీన గ్రంథకర్తల కంటే చాలా అధికంగా ఉన్నాయి. ఇతడు కమలాకర భట్టును అనుసరించినట్లు తెలియడం వల్ల 17వ శతాబ్ది వాడుగా పరిగణిస్తున్నారు.

మానసాగరుడు : 'మానసాగరి' ఇతని గ్రంథం. గ్రంథకర్త గ్రంథంలో తన పేరుగాని, పూర్వుల పేరుగాని ఎక్కడా చెప్పలేదు. ఈ గ్రంథ రచనాకాలం 1843 అని తెలుస్తుంది. కలియుగ జన్మఫలం, ప్రభవాది సంవత్సరాల్లో జన్మఫలం, ఋతు, మాస, పక్ష, తిథి, వార ఫలాలు చెప్పబడినాయి. ఆదివారం జన్మిస్తే 60 సం.లు, సోమ -84, మంగళ - 74, బుధ - 64, గురు - 84, శుక్ర - 60, శని - 100 సం.లు అవుతాయి. చరఖండసాధన, అక్షాంశసాధన వివరించబడింది. అయనాంశ సాధన వివరించబడింది. అష్టకవర్గ ఫలాలు, షడ్వర్గ సాధన వివరించబడింది. యోగాలు,

దశలు విపులంగా వివరించబడ్డాయి. దశలకు వాహనాలు, వాహన ఫలాలు చెప్పబడ్డాయి. దశాంతర్దశా ఫలాలు, ఉపదశా ఫలాలు చెప్పబడినాయి. మొత్తంమీద జాతక విషయంలో సమగ్రత కోసం దీనిలో ప్రయత్నం జరిగింది.

పరాశరుడు - బృహత్పరాశర హోరాశాస్త్రం
వరాహమిహిరుడు - బృహజ్జాతకం, బృహత్సంహిత, పంచసిద్ధాంతిక, వివాహపటలం, ఢికనిక యాత్ర, దిక్కినీ యాత్ర, సమాస సంహిత, లఘుజాతకం, గ్రహణ మండల ఫలం, స్వల్పజాతకమ్.
పృథుయశస్సు - హోరాసారం
కృష్ణమిశ్రుడు - జ్యోతిష ఫలరత్నమాల, ముహూర్త కంఠాభరణం, ప్రశ్నశాస్త్రం
మీనరాజు - వృద్ధయవన జాతకం
కళ్యాణవర్మ - సారావళి
భట్టోత్పలుడు - బృహజ్జాతక, లఘుజాతక, షట్పంచాశిక, బృహన్మానసం, బృహత్సంహిత, ఖండఖాద్యకం, యోగయాత్రా గ్రంథాలకు టీక, అదేవిధంగా ప్రశ్నజ్ఞానమ్, రాహున్నాకరణమ్, కరణపాతం, శ్రూషవం, రమలసారం మొదలైన గ్రంథాలు రచించాడు.
మంత్రేశ్వరుడు - ఫలదీపిక
నరపతి కవి - నరపతి జయచర్య అనే శకున గ్రంథం.
పుంజరాజు - శంభుహోరా ప్రకాశం
వైద్యనాథుడు - జాతక పారిజాతం
ఢుంఢిరాజు - జాతకాభరణం, సుధారసకరణచషకము, గ్రహలాఘవోదాహరణము, గ్రహకలోపపత్తి, పంచాంగఫలం.
గణేశ దైవజ్ఞుడు - గ్రహలాఘవం
నీలకంఠుడు - తాజక నీలకంఠి
రామదైవజ్ఞుడు - ముహూర్త చింతామణి
వేంకటేశ దైవజ్ఞుడు - సర్వార్థ చింతామణి

కమలాకర భట్టు - సిద్ధాంత తత్త్వ వివేకం

విద్యన్నారాయణుడు - జాతకసారం, చమత్కార చింతామణి

కాళిదాసు - ఉత్తర కాలామృతం

గణేశుడు - జాతకాలంకారం

మానసాగరుడు - మానసాగరి

పద్మప్రభసూరి - భువనదీపకం (గ్రహాభావ ప్రకాశం)

ఆర్యభట్టు -1 - ఆర్యభటీయం

భాస్కరుడు-2 - సిద్ధాంత శిరోమణి, కరణ కుతూహలం

ఆర్యభట్టు -2 - మహాసిద్ధాంతం

ఎం.ఏ., జ్యోతిషం (ప్రథమ) పేపర్ 1

ఈ క్రిందివానిలో ఏ నాలుగు ప్రశ్నలకైనా సమాధానాలు వ్రాయండి.

1. జ్యోతిషాన్ని వైజ్ఞానిక శాస్త్రంగా నిరూపించడానికి కావలసిన హేతువులను, కారణాలను విశదీకరించండి?
2. 'వేదపురుషునికి జ్యోతిషం కన్ను' వంటిది. ఈ భావాన్ని తెలియజేసేవిధంగా వేదాలలోని జ్యోతిషాంశాలను పరిచయం చేయండి?
3. వేదాంగంగా జ్యోతిషం యొక్క ప్రాధాన్యతను తెలిపి, ఋగ్జ్యోతిష, అథర్వజ్యోతిషాలలోని మౌలిక భేదాలు తెలియజేయండి?
4. పాశ్చాత్య జ్యోతిష స్వరూపాన్ని విశదీకరించండి?
5. భారతీయ కర్మసిద్ధాంతానికి, జ్యోతిషానికి గల అనుబంధాలను చర్చించండి?
6. జైనుల జ్యోతిష సేవను స్థూలంగా వివరించండి?

ఈ క్రిందివానిలో ఏ నాలుగు ప్రశ్నలకైనా సమాధానాలు వ్రాయండి:

1. ఖగోళ, జ్యోతిశ్శాస్త్రాల సమన్వయాన్ని తెలియజేయండి?
2. ఆర్యభటీయాన్ని గూర్చి వివరించండి?
3. బృహత్సంహితా గ్రంథం యొక్క ప్రాధాన్యాన్ని సంహితాశాస్త్ర దృష్ట్యా విశదీకరించండి?
4. జ్యోతిషంలోని త్రిస్కంధాలను, వాని విభాగాలను తెలియజేయండి?
5. గ్రహాలకు వక్రగతులు ఏర్పడే విధానాన్ని ఖగోళశాస్త్ర దృష్ట్యా విశదీకరించండి?
6. ఈ క్రిందివారిలో ఇద్దరిని గూర్చి పరిచయం చేయండి.

   1. భాస్కరుడు. 2. వైద్యనాథుడు 3. మంత్రేశ్వరుడు 4. జీవశర్మ

ఎం.ఏ., జ్యోతిషం - ప్రథమ

పేపర్ - 2

1. ద్వాదశభావాలను వివరించి వాటి లక్షణాలను, కారకత్వాలను గూర్చి వివరించండి? **(2001)**

మనసులోని భావనలే భావాలు. ద్వాదశరాశుల లాగే ద్వాదశ జీవిత భావాలుంటాయి. వేరు వేరు విశేషాలను, సంఘటనలను, కుటుంబ సంబంధాలను, వాహనాదుల విశేషాలను, లాభవ్యయాదులను గమనించడానికి వేరు వేరు భావాల పరిశీలన అవసరం అవుతుంది. జాతక ఫలనిర్ణయంలో ఆ యా భావాధిపతుల దశాంతర్దశలను గమనించడం, ఆ యా భావాలలో ఉండే గ్రహాల వల్ల కలిగే ఫలితాలను గమనించడం వల్ల స్పష్టమైన ఫలితాలు సాధ్యమౌతాయి. ఈ అంశాలను గమనించడానికి భావాలకు సంబంధించిన వివరాలు తెలిసి ఉండడం అవసరం. అవి ఈ విధంగా ఉంటాయి.

లగ్నభావం : శరీరం, రూపం, జ్ఞానం, వర్ణం, బలం, దౌర్బల్యం, సుఖదుఃఖాలు, స్వభావం, ఆశయాలు, అభిరుచులు, దృక్పథాలు, ఆలోచనాసరళి, పట్టుదల, నిత్య కృషిశీలత, చక్కని ప్రయత్నం తదితర అంశాలు లగ్నభావం నుండి పరిశీలించాలి.

ద్వితీయ/ధనభావం : ధనం, ధాన్యం, కుటుంబం, మృత్యువు, శత్రువు, ధాతువులు, రత్నాదికాలు, మృదువాక్కు, దాతృత్వం, ఆస్తికత్వం, కన్ను, స్నేహం, లోభం, ధన సంపాదనకు ప్రయత్నం, సహాయం, కలిమి, లేమి, బ్యాంకు నిల్వలు, వాటాలు, విలువైన వస్తువులు తదితర అంశాలు ధనభావం నుండి పరిశీలించాలి.

తృతీయ/సహజభావం : పరాక్రమం, సేవకులు, సోదరీ సోదర వర్గం, దగ్గర ప్రయాణాలు, పితృమరణం, కంఠం, రచన, శ్రవణం, దాసీజనం, దగ్గరి బంధువులు, సహకారం, చిత్తచాంచల్యం, సహాధ్యాయులు, సమీపవ్యక్తులు, సంభాషణ, పరామర్శ, ప్రచారం, ప్రసారం, కమ్యూనికేషన్లు, పుస్తకపఠనం తదితర అంశాలు సహజభావం నుండి పరిశీలించాలి.

చతుర్థ/మాతృభావం : సుఖం, వాహనాలు, బంధువులు, మాతృసౌఖ్యం, గృహం, ఆహారం, కృషి, విద్య, తల్లి ఆరోగ్యం, భూములు, సుగంధ ద్రవ్యాలు, అభివృద్ధి, జన్మస్థలం, తల్లితరపు బంధువులు, చేపట్టినపదవి, అధిష్ఠించిన ఆసనం, కార్యాలయం మొదలైన అంశాలు చతుర్థ భావం ద్వారా చూడాలి.

పంచమ / సంతానభావం : సంతానం, యంత్రాలు, మంత్రదీక్ష, విద్య, బుద్ధి, పుత్రులు, రాజ్యలాభం, పదవీచ్యుతి, మంచి స్వభావం, మనస్సు, ఆలోచన, పితృధనం, రహస్యాలు, కార్యాచరణం, సంతృప్తి, పాండిత్యం, వంశపరంపరాగతమైన మంత్రిపదవి, సంతతికి సంబంధించిన విషయాలు, అనురాగం, ఆత్మీయత, సరదాలు, లలితకళలు, పరపాలనా సమర్థత, ప్రసూతి వైద్యం, సృజనాత్మకత, హృదయానికి సంబంధించిన విషయాలు పంచమభావం ద్వారా పరిశీలించాలి.

షష్ఠ/ రోగభావం : మేనమామ, మృత్యుభయం, వాణిజ్యం, నష్టవస్తుపరిజ్ఞానం, ఆత్మ మరణాలు, రోగం, యుద్ధం వల్ల కలహం వల్ల వచ్చే సంపద, లోభం, అస్వస్థత, స్ఫోటకం, ఉన్మాదం, శత్రువుల సంతోషం, వృత్తివిద్యలు, అనారోగ్యం, రోగ నిరోధక శక్తి, ఔషధం, చికిత్స, సిబ్బంది, కార్మికులు, అధికారి, సేవకులు, శారీరక బలం, వ్యాయామం, అంగవైకల్యం, ఆహారధాన్యాలు, నింద, సేవ, సోదరులతో కలహం మొదలైన అంశాలు షష్ఠ భావం ద్వారా పరిశీలించాలి.

సప్తమ / కళత్రభావం : భార్య, మార్గప్రయాణం, వాణిజ్యం, నష్టవస్తు పరిజ్ఞానం, ఆత్మ మరణాలు, వివాహం, భర్త, పవిత్రత, తాంబూలం, సుగంధ పుష్పాలు, మైథునం, స్వదేశం, అన్యదేశం, ఆప్తమిత్రులు, విరోధి, అధికారి, భాగస్వామి, స్నేహితులు, జీవితంతో ముడిపడిన వ్యక్తులు, పది మందిలో పలుకుబడి తదితర అంశాలు కళత్ర భావం ద్వారా పరిశీలించాలి.

అష్టమ / ఆయుర్భావం : ఆయుష్షు, రణం, మృతధనం, మరణం, ఇబ్బందులు, అవమానం, లైఫ్ ఇన్సూరెన్స్, భార్యను బాధించే కార్యకలాపాలు, దుఃఖం, ఆకస్మిక లాభనష్టాలు, ఆరోగ్యం, దుష్టసాంగత్యం, పరివారం, చెడ్డపనులయందు ఆసక్తి, యుద్ధం, అవయవలోపం, జీవహింస, లావాదేవీలు, క్రయ విక్రయాలు, పరాశ్రయం, పరాధీనం,

అన్యాక్రాంతం, పన్నులు, లాటరీలు, మరణం తదితర అంశాలను అష్టమ భావం ద్వారా గమనించాలి.

నవమభావం : భాగ్యం, భార్య సోదరుడు, ధర్మం, సోదరుల భార్యలు, తీర్థయాత్రలు, సేవ, తపస్సు, గురువులు, విద్య నేర్చుకోవడం వల్ల వచ్చిన గౌరవం, ప్రయాణం, భాగ్యం, నీతి, పరాక్రమం, పిత్రార్జన, శుభకార్యాలు, ధనం దాచడం, సజ్జన సాంగత్యం, దూర ప్రయాణాలు, సాధారణ విద్య, విదేశ వ్యవహారాలు, పరిశోధన, శాస్త్రవిజ్ఞానం, మత రాజకీయ న్యాయ సారస్వత వైజ్ఞానిక విషయాలు, విశాలభావాలు, దూరదృష్టి, దేవాలయాలు, శాసనకర్తలు, బోధకులు, మతాధిపతులు తదితర అంశాలను ఈ భావం ద్వారా గమనించాలి.

దశమ / రాజ్యభావం : రాజ్యం, గౌరవం, కీర్తి, పితృసుఖం, ప్రవాసం, ఋణాలను పరీక్షించడం, శరీరబలం, రాచకార్యాలు, యంత్రాలు, మంత్రాలు, ఓషధులు, సుఖ జీవనం, రాజులవద్ద ప్రఖ్యాతి, ఇతరులపై దయచూపడం, ముద్రాధికారం, వృత్తి వ్యాపారాలు, సాంఘిక రాజకీయ విషయాలు, తండ్రి, పెద్దలు, అధికారం తదితర అంశాలను దశమభావం ద్వారా గమనించాలి.

ఏకాదశ / లాభభావం : వివిధ వస్తువులు, సంపత్తి, పుత్రుని భార్య, ఆదాయం, పశువృద్ధి, అన్ని విధాలైన లాభాలు, దురాశ, ఇతరుల మీద ఆధారపడడం, పినతండ్రి, సాత్త్వికోపాసన, కళానైపుణ్యం, సంఘాలలో సభ్యత్వం, కంపెనీలలో వాటాలు, సంస్థలు, రాజకీయ పార్టీలు, సమిష్టి ఆశయాలు, ఆదర్శాలు, సంఘవ్యవహారాలను లాభభావం ద్వారా గమనించాలి.

ద్వాదశ / వ్యయభావం : ధనవ్యయం, శత్రువుల వృత్తాంతం, జన్మాంతమందలి విషయాలు, నిద్రాభంగం, మనోవ్యథ, పాదాలు, శత్రుభయం, బంధనం, పీడా విముక్తి, చిత్తవైకల్యం, దీనస్వభావం, సుఖంకోసం ఆలోచించడం, దేహసౌఖ్యం లోపించడం, మృతి, ఇతర దేశం వెళ్ళడం, అన్నివిధాల ఖర్చులు, భార్యాహాని, విశ్రాంతి లోపం, విశ్రాంతి భవనాలు, పరాధీనత, రహస్య స్థావరాలు కలలు, భ్రమలు, నిద్ర, మత్తు, దేశాంతరవాసం తదితర అంశాలు ద్వాదశభావం వల్ల గమనించాలి.

2. పంచాంగం అంటే ఏమిటో తెలిపి, దానిలో ఉన్న విశేషాలను మన నిత్యజీవితంలో ఎట్లా ఉపయోగపడుచున్నవి వివరించండి? (2001,2003) జాతక చక్ర నిర్మాణ పద్ధతి పంచాగాన్ని అనుసరించి చేసే విధానం (రాశి, నవాంశ చక్ర నిర్మాణంతోపాటు) జననకాల మహాదశాశేషం కట్టడాన్ని వివరించుము? (2003).

పంచాంగ మంటే తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు. ఇవన్నీ సూర్య చంద్ర సంబంధంగా ఏర్పడేవే. యోగ కరణాలను ప్రస్తుతకాలంలో గణించడం తగ్గిపోయింది. తిథి, వార. నక్షత్రాలకే ప్రాధాన్యం అధికంగా ఉంది.

తిథి : సూర్యునికి చంద్రునికి మధ్యలో ఉన్న దూరాన్ని తిథి తెలియజేస్తుంది. ఒక్కో తిథికి 12 డిగ్రీల ప్రమాణం ఉంటుంది. మొత్తం శుక్లపక్షం, కృష్ణపక్షం కలిపి 30 తిథులుంటాయి.

వారం : రోజులో గంటకు ఒక హోర ఉంటుంది. ఈ హోరలు ఆకాశంలో గ్రహాలుండే వరుస క్రమాన్ని బట్టి ఉంటాయి. 'మందామరేజ్య భూపుత్ర సూర్యశుక్రేందుజేందవః' అనే వరుస ప్రకారం ప్రతిరోజూ హోరా క్రమం కదులుతూ ఉంటుంది. ప్రతిరోజూ సూర్యోదయ కాలంలో ఉండే హోర అనుసరించి వారం పేరు నిర్ణయించడం జరుగుతుంది. ఉదాహరణకు ఆదివారం ఉదయం సూర్యహోరతో ప్రారంభమౌతుంది. రవి, శుక్ర, బుధ, చంద్ర, శని, గురు, కుజ హోరలు ప్రతిగంటకొకటి చొప్పున మూడు ఆవృతులు ఒకరోజులో పూర్తిచేసేసరికి 21 గంటలవుతుంది. 22 గంట మళ్ళీ రవిహోర, 23వ గంట శుక్రహోర, 24వ గంట బుధహోరతో ఆ రోజు పూర్తి అవుతుంది. 25వ గంట అనగా మరుసటిరోజు మొదటి హోర చంద్రహోరతో ప్రారంభం అవుతుంది. అందుకే మరుసటిరోజుకు సోమవారమని పేరు. అదేవిధంగా అన్ని వారాలకు పేర్లు పెట్టబడినాయి.

నక్షత్రం : చంద్రుడు ప్రతిరోజూ ఏ నక్షత్రంలో సంచరిస్తూ ఉంటాడో అది ఆరోజున నక్షత్రం అవుతుంది. ఇది ఆకాశంలో స్పష్టంగా మనం గమనించవచ్చు. అశ్విన్యాది నక్షత్రాలు 27 ఉంటాయి.

యోగం : సూర్యుడు చంద్రుల మధ్య దూరాన్ని రెట్టింపు చేస్తే యోగం ఏర్పడుతుంది. ఇవి కూడా 27 ఉంటాయి.

కరణం : సూర్యుడు చంద్రుల మధ్య దూరాన్ని సగం చేస్తే కరణం ఏర్పడుతుంది. చర, స్థిర కరణాలని ఇవి రెండురకాలు.

పంచాంగంలో ఇంకా లగ్నాలు, దిన ప్రమాణాలు, భుక్తి, భోజ్య విశేషాలు, అమృతకాలం, వర్జ్యం, దుర్ముహూర్తం మొదలైన అంశాలు, ప్రత్యేక స్మరణ దినాలు, గ్రహప్రవేశాలు, ప్రదేశాలను బట్టి సూర్యోదయాస్తమయాదులు తదితర అంశాలు కనిపిస్తాయి. ఇవే కాక సంవత్సర ఫలనిర్ణయానికి సంబంధించిన అంశంలో రాజు, మంత్రి తదితర అంశాలు, వాటి ఫలాలు, వర్ష జగల్లగ్న విశేషాలు, గ్రహణాలు వాటి సమయాలు ఫలితాలు, సంక్రాంతి పురుష నిర్ణయం తదితర దేశగోచారాంశాలు విశదంగా కనిపిస్తుంటాయి. వీనితో పాటు వ్యక్తి గోచారాలకు సంబంధించి వేరు వేరు రాశులవారికి సంబంధించిన సంవత్సర, మాస ఫలితాలతో పాటు వేరు వేరు నక్షత్రాల వారి ఆదాయ వ్యయాలు, రాజపూజ్యావమానాలు, కందాయాలు తదితరాంశాలు ప్రత్యేకించి సూచించబడతాయి.

ఇదేవిధంగా ధర్మశాస్త్ర అంశాలకు చెందిన అనేక అంశాలు పంచాంగంలో ఈ కాలంలో సూచనలు చేస్తున్నారు. వేరు వేరు నక్షత్రాలలో పుట్టుక, వాటికి శాంతి, అశౌచ వివరాలు, మృతాశౌచ వివరాలు, బల్లిపాటు తదితర వివరాలు, వివాహ మేలాపకం సూత్రాలు, ముహూర్తనిర్ణయాలు, వాస్తు తద్ధితరమైన ఎన్నో అంశాలతో కూడుకుని పంచాంగం చిన్న విజ్ఞానకోశంలాగా, ఆకాశాన్ని, ప్రకృతిని అరచేతిలో పెట్టి చూపించే కరదీపికలాగా కనిపిస్తుందనడంలో సందేహం లేదు. ఈ పంచాంగం ప్రకారం జాతకచక్ర నిర్మాణ కూడా చేయవచ్చు. ఆ క్రమాన్ని క్రింద పరిశీలించవచ్చు.

జాతకచక్ర నిర్మాణం : పంచాంగం ప్రకారం జాతకచక్రం నిర్మించడానికి ప్రస్తుత కాలంలోని పంచాంగాలతో అత్యంత సులభం. పూర్వకాలం పంచాంగ క్రమమైతే వాటిలో ఇచ్చే సమాచారం ప్రకారం గణన చేయడానికి లగ్ననిర్ణయానికే సమయం అధికంగా పట్టేది. కాని ప్రస్తుతం లగ్న నిర్ణయానికి పంచాంగంలో ప్రతి నెలా తిథి వారాదులు ఇచ్చే పేజీల్లో క్రింది భాగంలో లగ్నాంత్యకాలాలు ఇస్తూ ఉన్నారు. పుట్టిన తేదీ సమయం తెలిస్తే లగ్నం గుర్తించడం అత్యంత సులువు. ఉదాహరణకు

10.10.2004 నాడు మధ్యాహ్నం 3.30కి రాజమండ్రిలో పుట్టిన వ్యక్తి జాతకం వేయడానికి పిడపర్తి వారి పంచాంగాన్ని అనుసరించి క్రమం ఈ విధంగా ఉంటుంది. తారణ పంచాంగంలో 57వ పేజీలో లగ్నాంత్య కాలాలలో 10వ తేదీకి ఎదురుగా మధ్యాహ్నం 2.47 కు మకరం అంత్యంగానూ, సాయంత్రం 4.26కు కుంభం అంత్యం గానూ ఇవ్వడం జరిగింది. పుట్టిన సమయం ఈ రెండు కాలాల మధ్య ఉండడం వల్ల కుంభలగ్నంలో జన్మించినట్లు తెలుస్తుంది. సరియైన డిగ్రీ కనుక్కోవడానికి రెండింటి మధ్య దూరాన్ని కనుక్కోవాలి. అంటే కుంభలగ్న ప్రమాణం లెక్కించాలి.

4.26 - 2.47 = 1.39 ని॥లు. 30 డిగ్రీల కుంభ ప్రమాణానికి 1.39 నిమిషాలైతే లగ్నారంభం నుండి పుట్టిన సమయం మధ్యకాలమైన 43 ని॥లకు ఎన్ని డిగ్రీలవుతుందని లెక్కించాలి.

43÷1.39 X 30 = 13.01 డిగ్రీలవుతుంది. అంటే కుంభలగ్నంలో 13.01 అయితే దానిని 10.13.01 గా గుర్తించాలి. శతభిషం 2వ పాదంలో లగ్నమైంది. అదేవిధంగా చంద్రస్ఫుటాన్ని నిర్ణయించేటప్పుడు కావలసిన సమయానికి ఏ నక్షత్రం ఉందో అది ఎప్పటి నుండి ఎప్పటి వరకు ఉందో గమనించాలి. ఆ ప్రమాణాన్ని 4 భాగాలు చేస్తే నక్షత్రం యొక్క నాలుగు పాదాలు వస్తాయి. దాన్ని బట్టి చంద్రస్థితిని గుర్తించవచ్చు. ఉదాహరణకు 10.10.2004 మధ్యాహ్నం 3.30కి పిడపర్తి తారణ పంచాంగం ప్రకారం మఘ నక్షత్రం ఉంది. ఇది 9వ తేదీరాత్రి 11.51 నుండి 10వ తేదీ రాత్రి 1.14 వరకు ఉంది. ఈ నక్షత్ర ప్రమాణం లేదా టైం ఇంటర్‌వెల్ = 25 గంటల 23 నిమిషాలు. దీన్ని 4 పాదాలుగా విభజిస్తే ఒక్కో పాదానికి దాదాపు 6 గంటల 21 నిమిషాలు వస్తాయి. ఈ ప్రమాణాన్ని రాత్రి 11.51 నుండి వరుసగా కలుపుతూ వస్తే అది మఘ నక్షత్రం 3వ పాదం అవుతుంది. అప్పుడు మనం చంద్రుని మఘ 3 చంద్రః అని రాసుకోవాలి.

అదేవిధంగా పుట్టిన సమయం తరువాత వేరు వేరు రాశుల్లో ప్రవేశించిన గ్రహాలను రాశిచక్రంలో భాగంగా చేయాలి. పుట్టిన సమయం కన్నా ముందుగా ప్రవేశించని గ్రహాలను రాశిచక్రంలో మార్పుతో వేయకూడదు. వీటి పరిజ్ఞానానికి కొంత ఘడియలనుండి నిమిషాలలోకి సమయాన్ని మార్చుకోగలగాలి. (60 ఘడియలకు

24 గంటలు, 30-12, 15-6, 10-4, 5-2, 1- 24 ని॥లు, అదేవిధంగా విఘడియా నిమిషాలు విశేషాలు ఉంటాయి. గ్రహ ప్రవేశ కాలాలను అనుసరించి అన్నిగ్రహాల స్థితులు వేసుకోవాలి. దాని ప్రకారం రాశి నవాంశ చక్రాలను వేసుకోవలసి ఉంటుంది.

అదేవిధంగా చంద్రస్ఫుటం యొక్క మొత్తం ప్రమాణకాలం 25.23 గంటలు కావడం, అది మఖ నక్షత్రం కావడం, మఘుకు కేతుమహాదశాకాలం 7 సంవత్సరాలు ఉండడం మొదలైన విషయాలను అనుసరించి మొత్తం మఘ నక్షత్ర ప్రమాణం 25.23 లకు 7 సంవత్సరాల కేతుమహాదశా ప్రమాణం అయితే ఇష్టకాలానికి ఎంతో గణించి దశాశేషాలను వేసుకోవలసి ఉంటుంది.

భావాధిపతి భావం నుండి ఎంత దూరంలో ఉన్నాడో అతని నుండి అన్నవ స్థానం ఆరూఢమనిపించుకుంటుంది. ఆ విధంగా అన్ని గ్రహాలు, భావాలు వేసుకున్న తరువాత ఆరూఢ చక్ర నిర్మాణం చేయాలి. ఈ విధంగా పంచాంగం ప్రకారం జాతక చక్రాన్ని నిర్మించుకోవలసి ఉంటుంది.

చంద్రస్ఫుటం ఆధారంగా మహాదశాశేషాన్ని లెక్కించవలసి ఉంటుంది. ఇది వింశోత్తరి పద్ధతిద్వారా జరుగుతుంది. వింశోత్తరీ దశావిధానానికి ఒక ప్రత్యేకమైన పద్ధతి ఉంది. వింశోత్తరి అంటే 120 సంవత్సరాల ప్రమాణం. వేరు వేరు నక్షత్రాలకు వేరు వేరు గ్రహాలు ఆధిపత్యం వహించి వారికి సంబంధించిన దశాంతర్దశల్లో శుభాశుభ ఫలితాన్ని ఇస్తుంటాయి. ఆ యా నక్షత్రాలకు గల గ్రహాధిపత్యాన్ని ఈ విధంగా గమనించవచ్చు.

ఇన శశి కుజ రాహుర్జీవ మందజ్ఞః కేతుః
భృగురితి నవానాం కృత్తికాది క్రమేణ

కృత్తికా నక్షత్రం నుండి వరుసగా రవి, చంద్ర, కుజ, రాహు, గురు, శని, బుధ, కేతు, శుక్ర గ్రహాలు అధిపతులవుతున్నారు.

కృత్తిక	ఉత్తర	ఉత్తరాషాఢ	రవి	6 సం॥
రోహిణి	హస్త	శ్రవణం	చంద్ర	10 సం॥
మృగశిర	చిత్త	ధనిష్ఠ	కుజ	7 సం॥

ఆరుద్ర	స్వాతి	శతభిషం	రాహు	18 సం॥
పునర్వసు	విశాఖ	పూర్వాభాద్ర	గురు	16 సం॥
పుష్యమి	అనూరాధ	ఉత్తరాభాద్ర	శని	19 సం॥
ఆశ్లేష	జ్యేష్ఠ	రేవతి	బుధ	17 సం॥
మఖ	మూల	అశ్విని	కేతు	7 సం॥
పుబ్బ	పూర్వాషాఢ	భరణి	శుక్ర	20 సం॥
				-----
				120 సం॥లు

3. షోడశవర్గ విశేషాలను, ఉపయోగాలను వివరించండి? (2001)

రాశిచక్రంలో మొత్తం 360 డిగ్రీలుంటాయి. ఒక్కో రాశిలో 30 డిగ్రీలుంటాయి. ఈ 30 డిగ్రీలను అనేక సూక్ష్మ భాగాలు చేస్తూ ఒక్కో భాగం యొక్క ప్రత్యేకతను అధ్యయనం చేయడం షోడశవర్గుల ప్రత్యేక లక్షణం. షోడశవర్గులు 16. వీటిలో షడ్వర్గులు, సప్తవర్గులు, దశవర్గులు అనే విభజనలున్నాయి.

రాశి, హోర, ద్రేక్కాణ, నవాంశ, ద్వాదశాంశ, త్రింశాంశలను షడ్వర్గులు అనీ,

రాశి, హోర, ద్రేక్కాణం, సప్తమాంశ, నవాంశ, ద్వాదశాంశ, త్రింశాశలను సప్తవర్గులు అనీ,

రాశి, హోర, ద్రేక్కాణం, సప్తమాంశ, నవాంశ, దశమాంశ, ద్వాదశాంశ, షోడశాంశ, త్రింశాంశ, షష్ట్యంశలను దశవర్గులు అనీ,

1. రాశి 2. హోర 3. ద్రేక్కాణం 4. చతుర్థాంశ 5. సప్తమాంశ 6. నవాంశ 7. దశమాంశ 8. ద్వాదశాంశ 9. షోడశాంశ 10. వింశాంశ 11. చతుర్వింశాంశ 12. సప్తవింశాంశ 13. త్రింశాంశ 14. ఖవేదాంశ 15. అక్షవేదాంశ 16. షష్ట్యంశలను షోడశవర్గులు అనీ అంటారు.

ఈ షోడశవర్గుల సంక్షిప్త వివరాలను ఇక్కడ పరిశీలిద్దాం.

1. రాశి : రాశికి క్షేత్రమనే పేరు ఉంది. ఇది 30 డిగ్రీల ప్రమాణం కలిగి ఉంటుంది. ఏ రాశిలో గ్రహం ఉంటే అదే క్షేత్రం అవుతుంది. ఆ రాశ్యధిపతే క్షేత్రాధిపతి అవుతాడు.

2. హోర : ఒక రాశికి రెండు హోరలుంటాయి. ఒక్కో హోరకు 15 డిగ్రీల ప్రమాణం ఉంటుంది. బేసి రాశి మొదటిహోరకు రవి, రెండవ హోరకు చంద్రుడు అధిపతులు. అదేవిధంగా సరిరాశి ప్రథమ హోరకు చంద్రుడు, రెండవ హోరకు రవి అధిపతులు అవుతున్నారు.

3. ద్రేక్కాణం : రాశిని మూడు భాగాలు చేసినపుడు ఒక్కో భాగానికి ద్రేక్కాణమని పేరు. దీని ప్రమాణం 10 డిగ్రీలుంటుంది. మొత్తం 12 రాశులకు 36 ద్రేక్కాణాలుంటాయి. ప్రథమ ద్రేక్కాణానికి ఆ రాశ్యధిపతి, రెండవ ద్రేక్కాణానికి పంచమాధిపతి, మూడవ ద్రేక్కాణానికి నవమాధిపతి ద్రేక్కాణాధిపతులు.

4. చతుర్థాంశ : రాశిలో నాలుగో భాగానికి చతుర్థాంశ అని పేరు. దీనిలో ఒక్కో భాగానికి 7.30 డిగ్రీల ప్రమాణం ఉంటుంది. మొత్తం 12 రాశులకు 48 చతుర్థాంశలుంటాయి. మొదటి చతుర్థాంశకు ఆ రాశ్యధిపతి, రెండవ చతుర్థాంశకు చతుర్థాధిపతి, మూడవ చతుర్థాంశకు సప్తమాధిపతి, నాల్గవ చతుర్థాంశకు దశమాధిపతి వరుసగా అధిపతులవుతారు.

5. సప్తమాంశ : రాశిలో 7వ భాగానికి సప్తమాంశ అని పేరు. ఒక్కో భాగానికి 4డిగ్రీల 17 నిమిషాల ప్రమాణం ఉంటుంది. రాశిచక్రంలోని 12 రాశులకు 84 సప్తమాంశలుంటాయి. బేసి రాశులకు ఆ రాశినుండి, సరి రాశులకు ఆ రాశికి సప్తమ రాశినుండి వరుసగా గణన ప్రారంభమవుతుంది. ఆ యా రాశ్యధిపతులు వరుసగా సప్తమాంశాధిపతులవుతారు.

6. నవాంశ : రాశిలో 9వ భాగానికి నవాంశ అని చెప్పబడింది. ఒక్కొక్క భాగానికి 3 డిగ్రీల 20 నిమిషాల ప్రమాణం ఉంటుంది. రాశిచక్రంలో మొత్తం 108 నవాంశలుంటాయి.

చరరాశులకు ఆ రాశినుండి, స్థిరరాశులకు ఆ రాశి నుండి 9వ రాశినుండి, ద్విస్వభావ రాశులకు ఆ రాశికి పంచమం నుండి క్రమంగా గణన ప్రారంభమౌతుంది.

షష్ట్యంశలుంటాయి. ద్వాదశభావాలలోని గ్రహాలకు షష్ట్యంశలు కట్టదలచినపుడు రాశులు వదిలిపెట్టి, డిగ్రీ, నిమిషాలను 2తో గుణించి 12తో భాగించగా మిగిలిన శేషానికి ఒకటి కలపగా షష్ట్యంశ సంఖ్య వస్తుంది. గ్రహం ఏరాశిలో ఉంటుందో ఆ రాశినుండే లెక్కించాలి. బేసి, సరి రాశులకున్న షష్ట్యంశలను బట్టి ఆ గ్రహం యొక్క ఫలితాలను తెలుసుకోవలసి ఉంటుంది. శుభషష్ట్యంశలో లేని గ్రహం యొక్క దశాంతర్దశలు ఇబ్బందికరాలవుతాయి.

4. ఈ క్రింది రాశులు, డిగ్రీలననుసరించి గ్రహాలున్న నక్షత్ర పాదాలను తెల్పుతూ రాశి, నవాంశ కుండలులను నిర్మించండి ? (2001)

3- 5-20	కర్కాటకం పుష్యమి ౧ లగ్నః
10-5-30	కుంభం ధనిష్ట ౪ కుజః
4-14-15	సింహం పుబ్బ ౧ శుక్రః
5-27-26	కన్య చిత్త ౨ రవిః
5-16-41	కన్య హస్త ౩ బుధః
6-10-31	తుల స్వాతి ౨ శనిః
0-8-17	మేషం అశ్విని ౩ చంద్రః
7-23-40	వృశ్చికం జ్యేష్ఠ ౩ గురుః
3-27-07	కర్కాటకం ఆశ్లేష ౪ రాహుః

రాహువుకు ఆరు రాశులు కలుపుకుంటే కేతువు స్ఫుటం వస్తుంది కాబట్టి 3.27.07 + 6 రాశులు = 9.27.07 – మకరం ధనిష్ట ౨ కేతుః అవుతుంది. ఈ గ్రహాలన్నింటినీ రాశి చక్రంలో వేస్తే ఈవిధమైన చక్రనిర్మాణం ఏర్పడుతుంది.

	చంద్ర		
కుజ	రాశి చక్రం		లగ్నం రాహు
కేతు			శుక్ర
	గురు	శని	బుధ రవి

రాహు			చంద్ర బుధ
గురు	నవాంశ		
శని			లగ్నం శుక్ర
	కుజ		కేతు రవి

5. భారతీయ సంప్రదాయం ప్రకారం గ్రహదృష్టులను వాటి విశేషాలను తెల్పండి? (2001)

గ్రహాల విషయంలో దృష్టి అనేది సంబంధ త్రయంలో ఒకటి. దృష్టి, యుతి, పరివర్తన అనేవి సంబంధ త్రయాలు. వేరు వేరు గ్రహాల మధ్యలోని దూరాలను బట్టి, అవి ఇచ్చే శుభాశుభ ఫలితాలు ఆధారపడి ఉంటాయన్నది శాస్త్రరీత్యా సరియైన అంశం. పాశ్చాత్య, భారతీయ, తాజక రీతులన్నింటిలోనూ వేరు వేరు దృష్టులు ప్రత్యేకంగా చెప్పబడుతున్నాయి. భాతరీయ సంప్రదాయం ప్రకారం దృష్టులు ఈ విధంగా ఉంటాయి.

"పశ్యంతి సప్తమాన్ సర్వే శనిజీవ కుజాః పునః
విశేషతః త్రిదశ త్రికోణ చతురష్టగాన్"

ప్రతిగ్రహం కూడా తానున్న స్థానం నుండి సప్తమస్థానాన్ని (180 డిగ్రీలు) చూస్తుంది. ఇదే కాక కుజుడు 4,8 స్థానాలను అందున్న గ్రహాలను, గురుడు 5,9 స్థానాలను అందున్న గ్రహాలను, శని 3,10 స్థానాలను అందున్న గ్రహాలను చూస్తారు. గురునికి ఆచ్ఛాదన దృష్టి మరొకటి ఉంది. ఈ గ్రహం తానున్న రాశినుండి మూడు, పదకొండవ స్థానాలను, అందులోని గ్రహాలను చూస్తుంది. ఇంతేగాక అన్ని గ్రహాలకు 3,10 స్థానాలపై పాదదృష్టి. 5,9 రాశుల్లో అర్ధదృష్టి. 4,8 గాశుల్లో త్రిపాద దృష్టి. 7వ రాశిపై పూర్ణదృష్టి ఉంటుంది.

'పాదదృష్టీ బలీర్మందః అర్థదృష్టీ బలీర్గురుః త్రిపాదో బలవాన్ భౌమః' అనే కారిక ప్రకారం శనికి 3,10 దృష్టులు బలీయమైనవి. గురువుకు 5,9 దృష్టులు బలీయాలు. కుజునికి 4,8 దృష్టులు బలీయాలు. అన్ని గ్రహాలకు సప్తమ దృష్టి బలంగా ఉంటుంది. శుభగ్రహ దృష్టి శుభం. పాపగ్రహదృష్టి అశుభం.

6. దేశగోచారాన్ని చూసే పద్ధతి తెలపండి? (2002) దేశగోచారంలో యురేనస్, నెప్ట్యూన్, ప్లూటోల పాత్రలను గూర్చి వ్రాయండి? (2001) దేశగోచారం అంటే ఏమిటి? దానివలన ఉపయోగములేవి? వివరించండి. (2000)

జ్యోతిశ్శాస్త్రంలో వ్యక్తిగతమైన ఫలితాలను సూచించే పద్ధతులతో పాటు సామూహిక ఫలితాలకు సంబంధించిన అంశాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఈ పద్ధతులలో ప్రాచ్యధోరణి, పాశ్చాత్యధోరణులు ప్రత్యేకంగా అనుశీలించబడుతున్నాయి. దేశపరిస్థితులపై గ్రహాల ప్రభావాన్ని ఊహించడానికి సాయన మేషరాశిలో సూర్యుడు ప్రవేశించే సమయానికి జాతకచక్రం రూపొందించి పరిశీలించడం పాశ్చాత్య సంప్రదాయం. దేశరాజధాని లేక కావలసిన నగర అక్షాంశ, రేఖాంశలకు సాయన మేషసంక్రమణకాలంలో ఏర్పడే లగ్నాది ద్వాదశ భావాలను, ఆ భావాల్లో వివిధ గ్రహాలను, దృష్టి సంయోగాలను గుర్తించి ఫలితాలు చూసే ఈ విధానాన్ని మేదినీ జ్యోతిషం లేదా ముండేన్ ఆస్ట్రాలజీ అని అంటారు. ప్రాచ్య పద్ధతిలోనూ వర్షలగ్నం, జగల్లగ్నం అనే పేర్లతో సంవత్సర ప్రారంభంలో ఉగాదినాడు, నిరయన మేష సంక్రమణ కాలానికి ఉన్న గ్రహస్థితుల ఆధారంగా దేశపరిస్థితులను విశదీకరించే సంప్రదాయం ఉంది.

దేశాన్ని వ్యక్తిగా భావించి ఫలితాలు చెప్పవలసిన ఈ విధానంలో వేరు వేరు దేశాలకు వేరు వేరు రాశులను నిర్దేశించుకోవడం జరిగింది. దీనిలోనూ ప్రాచ్య పాశ్చాత్య విధానాలలో కొంత భేదం కనిపిస్తుంటుంది. భావాల విషయంలో మాత్రం ద్వాదశభావాలలోనూ దాదాపు ఐక్యత కనిపిస్తుంటుంది. వ్యక్తి జాతకంలో గమనించే అంశాలకు విస్తృతరూపంగా దేశగోచార అంశాలు మనకు కనిపిస్తుంటాయి. మేదినీ జ్యోతిషం ప్రకారం ద్వాదశభావాలు సూచించే అంశాలు ఈ విధంగా ఉన్నాయి.

ఉదాహరణకు -

1. లగ్నం లేదా ప్రథమభావం : జనసామాన్యం, ప్రజల ఆరోగ్యం, దేశ అంతరంగిక వ్యవహారాలు, సాధారణ పరిస్థితులు.

2. ద్వితీయ భావం లేదా ధనభావం : జాతీయసంపద, ఆదాయం, స్టాక్ ఎక్ఛేంజ్, బ్యాంకులు, వాణిజ్య వ్యవహారాలు.

3. తృతీయభావం : రైల్వేస్, రవాణా, తంతితపాలా, టెలిఫోన్స్, పత్రికలు, ప్రచురణలు, ప్రచారం, సమాచారశాఖ.

ఈ విధంగా ఉన్న ఫలితాలలో వేరు వేరు భావాలను పరిశీలించేటప్పుడు ఉదాహరణకు తృతీయంలో వ్యక్తిగత జాతకాలలో చిన్న చిన్న ప్రయాణాలను, రచనలను, సహకారాన్ని పరిశీలిస్తుంటాం. అదేవిషయాన్ని దేశదేహానికి పరిశీలిస్తే రవాణా, తపాలా, ప్రసారాలు, పత్రికలు, సమాచారశాఖగా గుర్తించాల్సి ఉంటుంది.

దశమభావంలో పదవీ, హోదా గౌరవాదులను వ్యక్తిగత జాతకాలలో గమనిస్తే దేశానికి పార్లమెంటు, మంత్రివర్గం, ప్రభుత్వం, పరిపాలనా యంత్రాంగం వంటి అంశాలను గమనించి ఫలితాలు చెప్పవలసి ఉంటుంది. ఈవిధంగా మేదినీ జ్యోతిషంలో వేరు వేరు భావాలను గమనించి ఫలనిర్దేశం చేయాలి.

వేరు వేరు దేశాలకు లగ్నాలను నిర్ణయించి ఆ యా దేశాలకు ఫలితాలు చెప్పడమే దేశగోచారం అవుతుంది. ఆయా దేశాలకు సంబంధించి ఆరోగ్యం, విద్య, ఆర్థికపరిస్థితులు, వరదలు, కరువుకాటకాలు, పంటలు మొదలైన అంశాలో అనేక విషయాలను దీనిద్వారా మనం తెలుసుకోవచ్చు. ఆ యా దేశాలలోని సాంస్కృతిక రాజకీయ పరిస్థితులను పరిశీలించవచ్చు. వేరు వేరు దేశాలకు రాశి నిర్ణయం ఈ విధంగా ఉంటుంది. ఉదాహరణకు :

మేషం - ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, డెన్మార్క్, స్విట్జర్లాండ్, పోలండ్, సిరియా, బర్మింగ్‌హామ్

వృషభం - పర్షియా, పోలెండ్, ఏర్షియా, గ్రీస్, ఆసియామైనర్, జార్జియా, హాలండ్, ఐర్లండ్, సెయింట్ లూయీస్, సైప్రస్

మకరం – భారతదేశం, ఆఫ్ఘనిస్తాన్, అల్బేనియా, బోస్నియా, బల్గేరియా, మేసిడేనియా, గొమేండియోలా

ఈ విధంగా వేరు వేరు దేశాలకు రాశులు వేరు వేరుగా ఉంటాయి.

గ్రహ భావ కారకత్వాలలాగే రాశికారకత్వాలు కూడా వ్యక్తి జాతకాలలో కంటే వేరుగా ఉంటాయి. వాటిని తెలుసుకోవడం ద్వారా ఏ రాశిలో గ్రహయుతి దృష్టులు ఏర్పడినాయో ఆ రాశి స్వభావాన్ననుసరించి సంఘటనలను విశ్లేషించే అవకాశం ఏర్పడుతుంది. ఉదాహరణకు –

మేషం – పర్వతాలు, అడవులు, కార్ఖానాలు, గనులు, పెంపుడు జంతువులు, రక్షణ నిల్వలు.

వృషభం – గ్రామీణ వ్యవసాయ రంగాలు, అడవులు, అటవీ సంపద, పశువులు.

మిథునం – సమాచార వ్యవస్థ, విద్యాసంస్థలు, క్రీడాస్థలాలు, లైబ్రరీలు, సాంస్కృతిక కేంద్రాలు, విమానాశ్రయాలు.

ఈ విధంగా వేరు వేరు రాశికారకత్వాలు దేశగోచారంలో గమనించాల్సి ఉంటుంది. గ్రహ కారకత్వాలు కూడా ఈ విషయంలో ప్రత్యేకంగా గమనించాల్సి ఉంటుంది. ఉదాహరణకు

రవి : అధికారం, జీవశక్తి, స్వయంప్రకాశకత్వం, రాజు, ప్రసిద్ధులు, న్యాయ నిర్ణేతలు, న్యాయాధిపతులు, న్యాయసంబంధ అధికారులు, గౌరవనీయులు, మంత్రులు, నూతనాంశావిష్కరణలు, ప్రచార ప్రాధాన్యం గల విషయాలు, జనప్రసిద్ధి పొందిన విషయాలు, పై వర్గాలవారు, దేశం గర్వించదగిన వ్యక్తులు, అహంకారం గలిగిన వ్యక్తులు, అధికారులు, యజమానులు, గౌరవాలు, సంతోషాలు, పిల్లలు, బంగారం, జీవనవిధానాలు, పై అధికారులతో సంభాషణలు, దైవ ప్రార్థనలు, నిధుల అనుకూల్యం, బహుమానాలు, నష్టాల విషయంలో జాగ్రత్తలు, వ్యర్థంగా కాలం, ధనం వెచ్చించే గొప్పదనాలు, ఆకస్మిక తనిఖీలు, మతకలహాలు, ఎన్నికలు తదితరాంశాలు రవి కారకత్వాలుగా దేశగోచారంలో చర్చించబడతాయి.

ఈవిధంగానే వేరు వేరు గ్రహాల తత్వాలను దేశానికి అన్వయించి ఫలితాలను నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ దేశగోచారంలో యురేనస్, నెప్ట్యూన్, ప్లూటోలను కూడా పాశ్చాత్యులు గుర్తించారు. వాటి కారకత్వాలు ఈ విధంగా ఉంటాయి.

యురేనస్ : ఆకస్మిక మార్పులు, ఆటంకాలు, రైల్వేశాఖ, సంఘాలు, సమాజాలు, గ్యాస్, వాటర్ కంపెనీలు, పురపాలకసంఘాలు, సమ్మెలు, దోపిడీలు మొదలైనవి. వాయు, జల, వైజ్ఞానిక పరిశోధనలు, పేలుళ్ళు, అరాచకాలు, శని కుజులతో కలిసినప్పుడు అగ్నితత్వం కలిగి ఉండడం, అలజడి, తిరుగుబాటు, ఎదురు తిరగడం, స్వాతంత్ర్య పోరాటం, జ్యోతిషం, విపరీతమైన ఆలోచన, విద్యుత్ పరికరాలు, యాంత్రిక వాహనాలు, విమానాలు, రవాణా సౌకర్యాలు, లోహ భౌతిక శాస్త్రాలు, టెలిపతి, నిగూఢ శాస్త్రాలు, రేడియం, యురేనియం అనే ఖనిజాలు, పురాతన వస్తువులు, అత్యాధునిక వస్తువులు, త్యాగం, నూతనాంశాల అన్వేషణ, ప్రచురణ, తిరోగమన భావాలకు వ్యతిరేకంగానూ, ముందుగా ఊహించని సంఘటనలనుండి కాపాడడం, ప్రయాణ ప్రమాదాలు, ప్రేలుళ్ళు, ఆధునిక పద్ధతుల్లో చేసే తిరుగుబాటు వ్యతిరేకత, ఇతరులు రెచ్చగొడుతున్నా ప్రశాంతంగా ఉండడం మొదలైన అంశాలు యురేనస్ కారకత్వ పరిధిలోకి వస్తాయి.

నెప్ట్యూన్ : మబ్బు మసకగా అస్పష్టంగా ఉండడం, సాంఘిక సమానత్వం, చురుకుదనం, వ్యతిరేకంగా వ్యూహాలు, రాజద్రోహం, వంచన, మోసంచేసి సొమ్ము అపహరించడం, న్యాయ వ్యతిరేక కర్మలకు పూనుకోవడం, మోసం చేసే కంపెనీలు, నీచమైన రీతిలో చెడుకు క్రూరత్వానికి పూనుకోవడం, అరాచకం, నేరపరిశోధనలు, మాంత్రికులు, సముద్రాంతర్భాగాలు, సముద్ర ప్రయాణాలు, సముద్ర గర్భంలోని చమురు నిక్షేపాలు, చేపలు, మత్తుమందిచ్చే డాక్టర్లు, మత్తుమందులు, రసాయనాలు, పొగాకు, సువాసన ద్రవ్యాలు, నాజూకు వస్తువులు, ఖరీదైన ఆహారాలు, మనస్తత్వ శాస్త్రం, సినిమాలు, విపరీత ధోరణులు, సృజనాత్మక ధోరణులు, ఆధ్యాత్మిక విషయాలు, ఫొటోగ్రఫీ, మనోవైజ్ఞానిక పరిశోధనలు, విశ్లేషణలు, మాటతప్పడం, అపనమ్మకం, గూఢచర్యం, మత్తుమందులనుండి తప్పించుకోవడం తదితరాంశాలు.

షష్ఠీ : బహిష్కరణ, జీవితాన్ని చక్కదిద్దుకోవడం, లోతైన రహస్యాలు, మరణం, బంధుహితులు లేకపోవడం, భూగర్భంలోని విలువైన లోహాలు కనిపెట్టడం, ప్రేలుడు పదార్థాలు తయారుచేయడం, వాటి పరిజ్ఞానం, అనుకోని మార్పులు చేయడం, చీకటి, భారీప్రణాళికలు, అణ్వాయుధాలు, అణువిజ్ఞానం, అంతశ్చేతన, ఐహికభోగ ప్రీతి, సంపాదన, కూడబెట్టడం, లోహశుద్ధి ప్రక్రియలు, ప్రాణాపాయకర ఔషధాలు, పన్నులు, పితృధనం, మృతధనం, రంగులువేయడం, పాడైన దానిని బాగుచేయడం, జీర్ణోద్ధారణ, వాతలు పెట్టడం, నీరులేకపోవడం, దోషాలను వెలికితీయడం, సహకరించే వారిని గుర్తించడం, ప్రజాభిమతానికి చట్టానికి అనుకూలంగా ఉండడం తదితరాంశాలున్నాయి.

ఒక గ్రహస్వభావంతో ఇంకో గ్రహస్వభావం కలవడం వల్ల నూతన స్వభావం ఏర్పడుతుందనేది అందరికీ తెలిసిన సత్యమే. గ్రహయుతి, దృష్టి మొదలైన అంశాల ద్వారా పరిశీలించాల్సిన అంశాలలో భిన్నత, వైవిధ్యం ఏర్పడుతుంది.

అదేవిధంగా రెండు లేక మూడు గ్రహాలు ఒకరాశిలో కలవడం వల్ల ఫలితాలలో మార్పులుంటాయి. గురువుతోగాని, శనితోగాని, రాహువుగాని కేతువుగాని కలిస్తే చండాల యోగం. ఇది రాజుకి, రాష్ట్రానికి మంచిది కాదు. అదేవిధంగా ఒకరాశిలో నాలుగు లేక ఐదు గ్రహాలు కలిస్తే రక్తంతోగాని, జలంతో కాని భూమి తడుస్తుంది. లేదా యుద్ధభయం, అనారోగ్యభయం ప్రజలకేర్పడుతుంది. ఈ విధంగా వేరు వేరు అంశాల ద్వారా జ్యోతిషంలో దేశగోచారాన్ని గమనించవచ్చు.

8. పన్నెండు రాశులకు ఏడు గ్రహాలకు గల సంబంధాలను తెలుపండి? (2002)

జ్యోతిశ్శాస్త్రంలో మౌలికమైన అంశాలుగా 12 రాశులు, 7 గ్రహాలు, 27 నక్షత్రాలు ప్రత్యేకంగా గుర్తించబడినాయి. ద్వాదశరాశులు - మేషం నుండి మీనం వరకు ఉన్నాయి. అదేవిధంగా రవి నుండి శని వరకు గ్రహాలున్నాయి. వేరు వేరు గ్రహాలకు వేరు వేరు రాశులతో సంబంధాలను కలిగి ఉన్నాయి. అవి స్వక్షేత్ర, మూలత్రికోణ, ఉచ్ఛ నీచలుగా చెప్పబడుతున్నాయి.

గ్రహాలు-స్వక్షేత్రాలు : పన్నెండు రాశులకు అధిపతులుగా వేరు వేరు గ్రహాలున్నాయి. వీటిలో రవి, చంద్రులకు ఒకే రాశిపై ఆధిపత్యం ఉండగా, మిగిలిన ఐదు తారాగ్రహాలైన బుధ, శుక్ర, కుజ, గురు, శనులు, ఒక్కో గ్రహం రెండు రాశులపై ఆధిపత్యం కలిగి ఉన్నాయి.

"సింహస్యాధిపతి స్సూర్యః చంద్రః కర్కటకేశ్వరః
మేష వృశ్చికయోర్భౌమః కన్యామిథునయోర్బుధః
ధనుర్మీనద్వయోర్మంత్రీ తులావృషభయోర్భృగుః
మకరే కుంభరాశౌచ నాయకస్సూర్యనందనః"

రవి సింహరాశికి, చంద్రుడు కర్కాటక రాశికి అధిపతులు. కుజుడు మేష వృశ్చికాలకు, బుధుడు కన్యామిథునాలకు, గురుడు ధనుర్మీనాలకు, శుక్రుడు తులా వృషభాలకు, శని మకర కుంభరాశులకు అధిపతులవుతున్నారు.

ఈ ఆధిపత్యాల విషయంలో రవి చుట్టూ వరుసలో తిరిగే గ్రహాల వరుసనే కనిపిస్తుంది. ఆకాశంలో రవి చుట్టూ ఖగోళశాస్త్రం రీత్యా వరుసగా బుధుడు, శుక్రుడు, కుజుడు, గురుడు, శని గ్రహాలు ఆ యా గ్రహాల కక్ష్యల్లో తిరుగుతున్నట్లుగా కనిపిస్తాయి. అదేవిధంగా సింహరాశికి అధిపతి రవి అయితే, కన్యకు బుధుడు, తులకు శుక్రుడు, వృశ్చికానికి కుజుడు, ధనుస్సుకు గురుడు, మకరానికి శని అధిపతులు. కర్కాటకానికి చంద్రుడు ఆధిపత్యం వహిస్తే మిథునానికి బుధుడు, వృషభానికి శుక్రుడు, మేషానికి కుజుడు, మీనానికి గురుడు, కుంభానికి శని అధిపతులవుతున్నారు. ఈ విధంగా ఈ ఆధిపత్యాల విషయంలో కూడా ఒక క్రమపద్ధతి భారతీయ జ్యోతిశ్శాస్త్రంలో కనిపిస్తుంది.

ప్రతి గ్రహానికి కూడా ఉచ్ఛ స్థానం, నీచస్థానం, మూలత్రికోణస్థానాలు ఉంటాయి. ఉచ్ఛ స్థానం ఆదర్శానికి, నీచ స్వార్థానికి, మూలత్రికోణం, స్వక్షేత్రాలు స్వతంత్రానికి సంకేతాలుగా పరిగణిస్తారు.

ఉచ్ఛ - నీచ స్థానాలు : రవికి - మేషం, చంద్రునికి - వృషభం, కుజునికి - మకరం, బుధునికి - కన్య, గురునికి - కర్కాటకం, శుక్రునికి - మీనం, శనికి - తుల ఉచ్ఛస్థానాలుగా చెప్పబడుతున్నాయి.

ఉచ్చస్థానాలకు సరిగా ఎదురుగా ఉండే రాశులను ఆ యా గ్రహాల విషయంలో నీచరాశులుగా చెప్తారు. అవి రవికి – తుల, చంద్రునికి – వృశ్చికం, కుజునికి – కర్కాటకం, బుధునికి – మీనం, గురునికి – మకరం, శనికి – మేషం నీచ స్థానాలుగా చెప్పబడుతున్నాయి.

పరమోచ్చ స్థానాలు : రవికి మేషంలో 10వ డిగ్రీ పరమోచ్చ. చంద్రునికి వృషభంలో 3వ డిగ్రీ, కుజునికి మకరంలో 28వ డిగ్రీ, బుధునికి కన్యలో 15వ డిగ్రీ, గురునికి కర్కాటకంలో 5వ డిగ్రీ, శుక్రునికి మీనంలో 27వ డిగ్రీ, శనికి తులలో 20వ డిగ్రీ పరమోచ్చ స్థానాలుగా చెప్పబడుతున్నాయి.

పరమనీచ స్థానాలు : రవికి తులలో 10వ డిగ్రీ పరమనీచ, చంద్రునికి వృశ్చికంలో 3వ డిగ్రీ; కుజునికి కర్కాటకంలో 28వ డిగ్రీ, బుధునికి మీనంలో 15వ డిగ్రీ, గురునికి మకరంలో 5వ డిగ్రీ, శుక్రునికి కన్యలో 27వ డిగ్రీ, శనికి మేషంలో 20వ డిగ్రీ పరమనీచ స్థానాలుగా గుర్తించబడినాయి.

మూలత్రికోణాలు : రవికి సింహం, చంద్రునికి వృషభం, కుజునికి మేషం, బుధునికి కన్య, గురునికి ధనుస్సు, శుక్రునికి తుల, శనికి కుంభం మూలత్రికోణాలుగా తెలియజేయబడినాయి.

9. ఈ క్రిందివానిని గూర్చి క్లుప్తంగా వ్రాయండి? (2001)

1. ద్రేక్కాణం, 2. గ్రహాల దీప్తావస్థలు, 3. గోచారం నిర్వచనం, ఉపయోగం.

ద్రేక్కాణం : రాశిని మూడు భాగాలు చేసినపుడు ఒక్కో భాగానికి ద్రేక్కాణమని పేరు. 30 డిగ్రీల రాశి ప్రమాణాన్ని మూడు భాగాలుగా చేస్తే ఒక్కో ద్రేక్కాణ ప్రమాణం 10 డిగ్రీలుంటుంది. మొత్తం 12 రాశులకు 36 ద్రేక్కాణాలుంటాయి. ప్రథమ ద్రేక్కాణానికి ఆ రాశ్యధిపతి, రెండవ ద్రేక్కాణానికి పంచమాధిపతి, మూడవ ద్రేక్కాణానికి నవమాధిపతి ద్రేక్కాణాధిపతులు అవుతారు. ద్రేక్కాణం ద్వారా సోదరులు వారి సహకారాన్ని గమనిస్తారు. ప్రశ్నశాస్త్రంలోనూ, శరీరాంగాల విభజనలోనూ దీని వినియోగం ఉంది.

గ్రహాలు– దీప్తాది దశావస్థలు :

1. స్వస్థావస్థ : స్వక్షేత్రంలో ఉన్న గ్రహం స్వస్థావస్థను పొందుతుంది.
2. దీప్తావస్థ : ఉచ్చక్షేత్రంలో ఉన్న గ్రహం పొందే అవస్థ
3. ముదితావస్థ : మిత్రక్షేత్రంలో ఉన్న గ్రహావస్థ.
4. శాంతావస్థ : సమక్షేత్రంలో ఉన్న గ్రహం పొందేస్థితి.
5. శక్తావస్థ : వక్రించి ఉన్న గ్రహం యొక్క అవస్థ.
6. పీడావస్థ : రాశి అంతంలో 9వ పాదంలో ఉన్న గ్రహం పీడావస్థ.
7. దీనావస్థ : శత్రుక్షేత్రంలో ఉన్న గ్రహం పొందే అవస్థ.
8. వికలావస్థ : అస్తంగతమైన గ్రహం పొందే అవస్థ.
9. ఖలావస్థ : నీచయందున్న గ్రహం పొందే అవస్థ.
10. భీతావస్థ : అతిచారమందున్న గ్రహం పొందే అవస్థ.

గోచారం : గ్రహాల ప్రస్తుత సంచారాన్ని గోచారం అంటారు. వేరు వేరు గ్రహాలు తాము సంచరిస్తున్న ప్రదేశాలననుసరించి వేరు వేరు రాశులవారికి శుభాశుభ ఫలితాలను ఇస్తుంటాయి. గోచార ఫలితాలను జన్మనక్షత్రాన్ని, జన్మరాశిని బట్టి తెలుసుకోవాలి. జన్మకాలంలో చంద్రుడు ఎక్కడ ఉన్నాడో అది ఆ వ్యక్తికి జన్మనక్షత్రం అవుతుంది. ఆ నక్షత్రపాదం ఏ రాశిలో ఉంటుందో అది ఆ వ్యక్తికి జన్మరాశి అవుతుంది. పంచాంగంలో వేరు వేరు గ్రహాల ప్రస్తుత సంచార క్రమం ఉంటుంది. దానిననుసరించి వ్యక్తి జన్మరాశికి ఆ యా గ్రహాలు ఉన్న స్థానాలదూరాన్ని బట్టి శుభాశుభ ఫలితాలు ఉంటాయి. ఈ గోచార నియమాలు ఈ విధంగా ఉంటాయి.

"షట్త్రిదశస్థో భానుః షడ్దశ జన్మ త్రిసప్తక శీతాంశుః
ద్వ్యష్ట చతుర్దశ షట్‌జ్ఞః గురురద్రిద్వి నవపంచమే శుభఫలదః
కవిరగదశషడ్వర్జః కుజభానుజ రాహుకేతు షట్త్రిస్థాః
ఏకాదశస్థా స్సర్వే సమతారాః పరమమైత్ర తారా శ్శుభఫలదాః

గోచారరీత్యా రవి 3,6,10,11 స్థానాల్లో సంచరించే కాలాల్లో విశేష శుభ ఫలితాలనిస్తాడు. చంద్రుడు 1,3,6,7,10,11 స్థానాల్లోనూ, కుజుడు 3,6,11 స్థానాల్లోనూ, బుధుడు 2,4,6,8,10,11 స్థానాల్లోనూ, గురుడు 2,5,7,9,11 స్థానాల్లోనూ, 1,2,3,4,5,8,11,12 స్థానాల్లోనూ, శని 3,6,11 స్థానాల్లోనూ, రాహు కేతువులు 3,6,11 స్థానాల్లోనూ సంచరించే కాలంలో శుభఫలితాలనిస్తారు. మిగిలిన స్థానాల్లో సంచరించేటపుడు శుభఫలితాలను ఇవ్వరు.

దీనిద్వారా ప్రతి రోజు మనకు జరిగే శుభాశుభ ఫలితాలను తెలుసుకోవడానికి వీలుంటుంది. ముహూర్తంలో ఇది ఉపయోగపడుతుంది.

10. అయనాంశ భేదములను సంగ్రహంగా తెలుపండి? (2002) అయనాంశను వివరించి దానిలో విభిన్న మతాలను తెల్పండి? (2001)

భారతీయమైన నక్షత్ర సహిత రాశిచక్రానికి, ఋతుక్రమాన్ని అనుసరించే పాశ్చాత్యుల రాశిచక్రానికి గల భేదాన్ని 'అయనాంశ' అని వ్యవహరిస్తారు. అశ్వనీ నక్షత్రంతో భారతీయ రాశిచక్రం ప్రారంభమవుతుంది. భారతీయులు అనుసరించే జ్యోతిషపద్ధతిని నిరయన పద్ధతి అంటారు. పాశ్చాత్యులు అనుసరించే జ్యోతిష విధానాన్ని సాయన పద్ధతి అంటారు. సాయనమనగా అయనం కలిగి ఉన్నదనీ, నిరయనమంటే అయనం లేనిదనీ అర్థం.

ఆకాశంలో రవిమార్గను 23 న్నర డిగ్రీల వాలులో భూమధ్యరేఖ రెండుబిందువుల వద్ద ఖండిస్తుంది. ఈ ఖండన బిందువులనే విషువత్తులు అంటారు. ఒకటి వసంత విషువత్తు, రెండవది శరద్విషువత్తు. సంవత్సరంలో ఈ రెండురోజులు పగలు రాత్రి సమానంగా ఉంటుంది. ఈ రెండు బిందువులే కాక మరో రెండు ప్రత్యేక స్థానాలుంటాయి. అవి ఒకటి ఉత్తరాయణాంతం, రెండవది దక్షిణాయనాంతం. భూమి వంగి తిరగడం వల్ల భూమధ్యరేఖ ఖగోళమధ్యరేఖపై చేసే ఖండన ప్రదేశంలో తేడా రావడం వల్ల ఈ ప్రత్యేకమైన నాలుగు బిందుస్థానాలు క్రమంగా కదిలిపోతుంటాయి. ఈ కదలికలు 26000 సంవత్సరాలకొకసారి వలయం చుడతాయి. ఈ అయన కదలికనే 'విషుచలనం'

అంటాం. పాశ్చాత్యులు మారుతున్న అయనం కల్గిన భచక్రాన్ని, భారతీయులు స్థిరమైన అశ్వినీ నక్షత్రంతో ప్రారంభమైన భచక్రాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ రెండింటి మధ్య దూరమే 'అయనాంశ' గాపరిగణింపబడుతుంది.

అయనాంశలో తేడాలవల్ల జాతకచక్రాలు భిన్నంగా ఏర్పడుతుంటాయి. సూర్యుడు భూమధ్యరేఖను అంటే ఉత్తర విషువద్బిందువును మూలబిందువుగా తీసుకుని రాశిచక్రాన్ని 12 సమభాగాలుగా సాయనవాదులు విభజించారు. ఈ ఉత్తర విషవద్బిందువు స్థిరంగా ఉండదు. ఒక సంవత్సరానికి 50.24 సెకన్లచొప్పున దాదాపు 26000 సం॥రాల ఒకసారి 360 డిగ్రీల రాశిచక్రాన్ని పూర్తిచేస్తుంది. ప్రతి సంవత్సరం మార్పుచెందగా వచ్చిన నూతనమైన విషవద్బిందువునే రాశి ప్రారంభబిందువుగా సాయనవాదులు లెక్కిస్తారు. రాశిచక్ర గణనలో ఈ ప్రారంభ బిందువు అవసర మవుతుంది. ఈ ప్రారంభ బిందువు విషయంలో భారతీయులకు, పాశ్చాత్యులకు గణనలో అభిప్రాయభేదం కనిపిస్తుంది.

వైదిక సాహిత్యంలోనే ఈ విషుగతికి సంబంధించిన మంత్రాలు కనిపిస్తున్నాయి. సూర్యసిద్ధాంతం కూడా ఈ అయనాంశ విషయాలను గూర్చి చర్చించింది. పురాణాలలోని ధ్రువుని వధ, నరకాసుర వధ, కుమారస్వామి కథలు, దక్షయజ్ఞ ధ్వంస విశేషాలు మొదలైన వానిలో అంతర్గతంగా అయన కదలికలకు సంబంధించిన విశేషాలు ఉన్నాయి. 'కీరో' లాంటి పాశ్చాత్య జ్యోతిష్కులు కూడా భారతీయులకు అత్యంత ప్రాచీన కాలంలోనే ఉన్న అయన పరిజ్ఞానాన్ని ప్రస్తుతించారు. అయితే హిపార్కస్ అనే పాశ్చాత్య జ్యోతిష్కుడు దీనిని కనుక్కున్నట్లుగా ప్రస్తుతం ప్రచారంలో ఉన్నది. డీలాంబ్రీ అనే శాస్త్రవేత్త దీనిని గూర్చి సమగ్రంగా చర్చించాడు.

అయనాంశ ప్రమాణ విషయంలో శాస్త్రజ్ఞులలో ఏకాభిప్రాయం లేదు. అయన శూన్య సంవత్సర నిర్ణయంలో వీరి అభిప్రాయాలలో అనేకత్వం కనిపిస్తుంది. సాయన నిరయన రాశిచక్రాల ఐక్యత అంటే చర, స్థిర రాశిచక్రాల ఏకత్వమే అయన శూన్య సంవత్సరం. ఇది క్రీ.శ.285 సంవత్సరంగా లహరి, క్రీ.శ. 397 సంవత్సరంగా రామన్, క్రీ.శ 291 సంవత్సరంగా కృష్ణమూర్తి, క్రీ.పూ. 388 గా కీరో, క్రీ.శ. 498 గా సెఫోరియల్ తదితరులు గుర్తించారు.

ఈ అయన శూన్య సంవత్సరాల గణనలో వచ్చే తేడాల వల్ల పంచాంగ లేదా ఎఫిమెరిస్ నిర్మాణ క్రమంలో మార్పు వస్తుంటుంది.

11. సంవత్సర మానములు ఎన్ని విధాలు? భేదములకు ఆధారాలు ప్రమాణాలను వివరించండి? (2002) చాంద్రమానం అంటే ఏమిటి? చాంద్రమాసాలేర్పడే తీరును వివరించండి? (2001) వివిధ కాలమానాలను పేర్కొని, చాంద్ర సౌర మానాలను వివరించండి? (2000) వివిధ కాలమానాలు పేర్కొని, వాటి సంవత్సర మానాలు వివరించండి? (2003)

ప్రాచీన భారతీయ జ్యోతిశ్శాస్త్రంలో ముఖ్యంగా 9 సంవత్సర మానాలున్నాయి. అవి 1. బ్రాహ్మమానం 2. ప్రాజాపత్యమానం 3. దివ్యమానం 4. పిత్ర్యమానం 5. బార్హస్పత్యమానం 6. సౌరమానం 7. నాక్షత్రమానం 8. చాంద్రమానం 9. సావనమానం

బ్రాహ్మమానం : మనుకాలాలు 14, కల్పాది సంధికాలం 1 మొత్తం పదిహేను కాలాలు కలిపితే ఒక కల్పకాలం ఏర్పడుతుంది. ఇట్లా వేయి మహాయుగాలతో ఏర్పడిన కల్పకాలమే సృష్టికర్త అయిన బ్రహ్మకు ఒక పగలు, మరొక కల్పకాలం రాత్రి. రెండు కల్పాలతో బ్రహ్మకు అహోరాత్రం ఏర్పడుతుంది. ఇటువంటి అహోరాత్రాల్లో బ్రహ్మకు 100 సంవత్సరాల ఆయుర్దాయం ఉంటుంది. బ్రహ్మ ఆయుర్దాయంలో 50 సంవత్సరాలు గడిచింది. ఈ బ్రహ్మ ఆయుపుకు పరమని పేరు. దానిలో సగం ప్రథమ పరార్థం గడిచింది. మిగిలిన సగం ద్వితీయ పరార్థం. అందులో ప్రథమ దినం ప్రస్తుతం నడుస్తోంది. ఈ కల్పారంభంనుండి ఇప్పటికి ఆరు మన్వంతరాల కాలం జరిగింది. ఏడవదైన వైవస్వతమన్వంతరంలో 27 మహాయుగాలు గడిచాయి. 28వ మహాయుగంలో కృత, త్రేతా, ద్వాపర యుగాలు గడిచి ప్రస్తుతం కలియుగం నడుస్తోంది. ఈ మాన సంఖ్యలు పంచాంగరచనలో సృష్ట్యాది, యుగాది, కల్పాది కాలగణనల్లో ఉపయోగపడతాయి.

ప్రాజాపత్యమానం : మన్వంతర వ్యవస్థ ప్రాజాపత్యమానంతో ఏర్పడుతుంది. దీనిలో పగలు రాత్రి అనే భేదం లేదు. మానవులు ప్రజాపతి పుత్రులు. కాబట్టి వారికి

ప్రాజాపత్యులని పేరు. వారి మానం ప్రాజాపత్యమానం. 71 మహాయుగాలు ఒక మన్వంతరం. దీనికి చివర 4800 దివ్య సంవత్సరాలు సంధ్యాకాలం. ఈ కాలం జలప్రళయ సమయం.

దివ్యమానం : ఒక సౌరవర్షం దేవాసురులకొక అహోరాత్రం. దీనిలో దేవతల పగలు అసురులకు రాత్రి, సురల రాత్రి అసురులకు పగలు. 360 దివ్య అహోరాత్రాలు దేవతలకు ఒక సంవత్సరం. 12 వేల దివ్యవర్షాలు ఒక చతుర్యుగం. దీన్నే మహాయుగమంటాం. కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు, వాటి సంధ్యాకాలం, సంధ్యాంశకాలాలు కలిపితే ఒక మహాయుగ మవుతుంది. ఒక మహాయుగానికి 12,000 దివ్య సంవత్సరాలు, 43,20,000 సౌర సంవత్సరాలు.

పిత్ర్యమానం : 30 తిథులు పితృదేవతలకు ఒకరోజు. అమావాస్యతో అంతమయ్యే పక్షం కృష్ణపక్షం. పూర్ణిమతో అంతమయ్యే పక్షం శుక్లపక్షం. అమావాస్య కాలం పితృదేవతలకు పగలు, మధ్యసమయం. పూర్ణిమకాలం వారికి అర్ధరాత్రి. కృష్ణపక్ష అష్టమి సగం నుండి వారికి పగలు ప్రారంభం. శుక్లపక్షాష్టమి సగం నుండి వారికి రాత్రి ప్రారంభం.

బార్హస్పత్యమానం : వైశాఖాది మాసాల్లో అమావాస్యనాడు కృత్తికాది నక్షత్ర సంబంధం వల్ల కార్తికాది బార్హస్పత్య మాన సంవత్సరనామాలు ఏర్పడతాయి. చాంద్రమానాన్ని అనుసరించి వైశాఖ అమావాస్యనాడు కృత్తికా నక్షత్ర సంబంధం ఉంటే అది బార్హస్పత్యమానాన్ననుసరించి కార్తికాబ్దమౌతుంది. జ్యేష్ఠ అమావాస్యనాడు మృగశీర్ష సంబంధం ఉంటే మార్గశీర్షమనే బార్హస్పత్య మాన సంవత్సరమౌతుంది. ఇక్కడ చాంద్రమాసాల్లో చెప్పినట్లు చెప్పబడిన నక్షత్రానికి ముందు వెనుకల నక్షత్రాల సంబంధం ఉన్నా ఆ నక్షత్రంతో సంవత్సరం నామం ఏర్పడుతుంది. అలాగే ఏ దినమందు గురుగ్రహం ఉదయించడం గాని, అస్తమించడం గాని జరిగిందో అప్పుడే చంద్రుడు ఏ నక్షత్రంలో ఉన్నాడో ఆ నక్షత్రాన్ని బట్టి బార్హస్పత్యమాన సంజ్ఞ ఏర్పడుతుందని చెప్పారు. ప్రస్తుతం గురుగ్రహం ఉదయించినపుడున్న నక్షత్రాన్ని బట్టి బార్హస్పత్య మాన సంవత్సర నామాన్ని దైవజ్ఞులు పంచాగాల్లో సూచిస్తున్నారు.

సౌరమానం : సూర్య సంక్రాంతులవల్ల సౌరమానం ఏర్పడింది. రవి ఒక రాశిని వదిలి మరో రాశిలో ప్రవేశించడానికి పట్టేకాలం సౌరమానం. దీన్ని 30 భాగాలు చేస్తే 30వ భాగం సౌరదినం. సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఆ రాశిపేరుతో సౌరమాసం ఏర్పడుతుంది. సూర్య సంక్రమణం వల్ల 12 సౌరమాసాలేర్పడుతున్నాయి. ఈ 12 మాసాలు కలిపితే ఒక సౌర సంవత్సరం.

నాక్షత్రమానం : 60 నాడులు ఒక నాక్షత్ర అహోరాత్రం. ఒక నక్షత్రం ఉదయించినప్పటినుండి ఎంతకాలంలో మళ్ళీ అది ఉదయిస్తుందో అంతకాలం నాక్షత్ర అహోరాత్రం. నిత్యం ప్రవాహవాయువు చేత భచక్రం ఒకసారి భ్రమిస్తే దాన్ని నాక్షత్ర దినం అంటాం. 30 నాక్షత్ర దినాలు ఒక నాక్షత్రమాసం.

చాంద్రమానం : అమావాస్యనాడు సూర్యచంద్రులు కలిసి ఉంటారు. తరువాత సూర్యుని నుండి చంద్రుడు ప్రతిదినం తూర్పువైపు కదులుతాడు. ఈ చంద్రగతి ఆధారంగా చాంద్రమానం ఏర్పడుతుంది. సూర్యుని నుండి చంద్రుడు 12 డిగ్రీలు నడిస్తే ఒక తిథి. అదే చాంద్రదినం. రెండు సూర్య చంద్ర యుతులకు మధ్యకాలం చాంద్రమాసం.

సావనమానం : సూర్యోదయకాలం నుండి మరునాటి సూర్యోదయంకాలం వరకు ఉన్న సమయాన్ని సావనదినం అంటారు. ఇక్కడ సూర్యోదయమంటే నాడీవృత్తస్థ కల్పిత సూర్యోదయం అని గ్రహించాలి. 30 సావన అహోరాత్రాలు ఒక సావనమాసం.

ఈ విధంగా వేరు వేరు సంవత్సర మానాలు వాడుకలో ఉన్నాయి. సౌర చాంద్ర మానాల కలయికతో కూడుకున్న సంవత్సర గణన చాలా కాలంగా వాడుకలో ఉంది. దానినుండే అధికమాసాదుల గణన ఏర్పడుతుంది. చాంద్రమాసాలు కూడా ప్రామాణికమైనవి. దీనిలో పూర్ణిమనాడున్న నక్షత్రాన్ని బట్టి మాస నామ నిర్ణయం జరుగుతుంది. ఉదాహరణకు చిత్త నక్షత్రం నాడు పూర్ణిమ ఉంటే అది చైత్రమాసం, అదేవిధంగా విశాఖనాడు పూర్ణిమ ఉంటే వైశాఖం, జ్యేష్ఠ నాడు పూర్ణిమ ఉంటే అది జ్యేష్ఠ మాసం అవుతుంది. ఈవిధంగా చాంద్రమాసాల పరిగణన జరిగింది.

12. నవనాయకుల నిర్ణయ విధానాన్ని వివరించండి? **(2003)** నవనాయకులు ఏర్పడే పద్ధతిని వివరించండి? **(2001)** ఒక సంవత్సరానికి రాజు, మంత్రి, సేనానాయకులను నిర్ణయించే విధానాన్ని తెలిపి, దానివలన ఉపయోగమేమో వివరించండి? **(2000)** ఆర్ద్రా ప్రవేశ సమయాన్ని అనుసరించి, ఆ సంవత్సర ఫలాలను ఏ విధంగా గుర్తిస్తారో వివరించండి? **(2000)**

ఒక సంవత్సరం ప్రజలందరికీ అనుకూల ఫలితాలనిస్తుందా? ప్రతికూల ఫలితాలనిస్తుందా అని నిర్ణయించే విధానాన్ని సంవత్సర ఫలనిర్ణయం అని అంటారు. ఈ నిర్ణయంలో భాగంగా పంచాంగంలో నవనాయక నిర్ణయం ద్వారా సూచనలు చేస్తారు. సూర్యుడు వేరు వేరు రాశుల్లోకి సంక్రమించే సమయం ఆధారంగా ఈ గణనలు చేయడం జరుగుతుంది. ఒక సంవత్సర ఫలితం చెప్పాలంటే ముఖ్యంగా సంవత్సరానికి సంబంధించిన తొమ్మిది మంది నాయకులను నిర్ణయించాలి. వీరే నవనాయకులు. 1. రాజు 2. మంత్రి 3. సేనాధిపతి 4. సస్యాధిపతి 5. ధాన్యాధిపతి 6. అర్ఘాధిపతి 7. మేఘాధిపతి 8. రసాధిపతి 9. నీరసాధిపతి అనే తొమ్మిది మంది ద్వారా సంవత్సర ఫలితాన్ని గణించడం భారతీయ పంచాంగాలలో ఉంది. వీరి నిర్ణయం ఈ విధంగా ఉంటుంది.

1. రాజు – చైత్ర శుక్ల పాడ్యమి నాటి వారాధిపతి
2. మంత్రి – రవి మేష సంక్రమణ వారాధిపతి
3. సేనాధిపతి – రవి సింహ సంక్రమణ వారాధిపతి
4. సస్యాధిపతి – రవి కర్కాటక సంక్రమణ వారాధిపతి
5. ధాన్యాధిపతి – రవి ధనుస్సంక్రమణ వారాధిపతి
6. అర్ఘాధిపతి – రవి మిథున సంక్రమణ వారాధిపతి
7. మేఘాధిపతి – రవి ఆర్ద్రానక్షత్ర ప్రవేశ వారాధిపతి
8. రసాధిపతి – రవి తులా సంక్రమణ వారాధిపతి
9. నీరసాధిపతి – రవి మకర సంక్రమణ వారాధిపతి

పై విధంగా సూచించబడినట్లుగా తొమ్మిదిమంది నాయకులకు సంబంధించి సూర్యుడు ఏ వారంనాడు ఆ యా రాశుల్లోకి, నక్షత్రాల్లోకి ప్రవేశిస్తున్నాడో పంచాంగ గణనల ప్రకారం గమనించి నిర్ణయించాలి. ఉదాహరణకు :

చైత్ర శుక్ల పాడ్యమినాడు ఏ వారమో ఆ వారాధిపతిని ఆ సంవత్సరానికి రాజుగా నిర్ణయించాలి.

సంవత్సరాది ఆదివారం అయితే ఆ సంవత్సర రాజు సూర్యుడు. దీని ఫలితం వల్ల రాజుల మధ్య వైరం ఏర్పడుతుంది. మేఘాలు తక్కువగా వర్షిస్తాయి. ప్రజలకు రాజభయం అధికం. యుద్ధభయం, అగ్నిభయం కలుగుతాయి.

సంవత్సరాది సోమవారం అయితే ఆ సంవత్సర రాజు చంద్రుడు. దీని ఫలితం వల్ల ప్రజలు క్షేమంగా ఉంటారు. మేఘాలు భూమిపైన అంతటా వర్షిస్తాయి. ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారు. ధరలు అదుపులో ఉంటాయి. గోధుమలు, చెఱకు, వరి పండుతాయి. గోవులు పుష్కలంగా పాలిస్తాయి.

సంవత్సరాది మంగళవారం అయితే ఆ సంవత్సర రాజు కుజుడు. దీని ఫలం ప్రజల్లో అగ్నిభయం అత్యధికమౌతుంది. వర్షాలు తక్కువ. కూరగాయలు ధాన్యజాతులు ఆహారపదార్థాలు ఎక్కువ ధర ఉండి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండవు. నాయకులలో మైత్రి ఉండదు. సస్యాలు వృద్ధి చెందవు. రోగభయం, సర్పభయం, చోరభయం అధికం.

సంవత్సరాది బుధవారం అయితే ఆ సంవత్సర రాజు బుధుడు. దీనిఫలం సుడిగాలులు, తుఫానులు అధికం. వర్షాలు సమంగా ఉంటాయి. రాజభీతి రోగ భయాలు కూడా ఉంటాయి. సస్యాలు మధ్యమంగా ఫలిస్తాయి.

సంవత్సరాది గురువారం అయితే ఆ సంవత్సర రాజు గురుడు. దీని ఫలం వల్ల నాయకులు న్యాయమార్గంలో సంచరిస్తారు. నిత్యావసర వస్తువులు సులభంగా దొరుకుతాయి. ప్రజలు ఆరోగ్యవంతంగా, సుఖసంతోషాలతో ఉంటారు.

సంవత్సరాది శుక్రవారం అయితే ఆ సంవత్సర రాజు శుక్రుడు. దీని ఫలం వల్ల సమస్త ధాన్యజాతులు సమృద్ధిగా ఫలిస్తాయి. చక్కని వర్షాలు కురుస్తాయి. పశువులు

పుష్కలంగా పాలిస్తాయి. ప్రజలు భోగలాలసులౌతారు.

సంవత్సరాది శని వారం అయితే ఆ సంవత్సర రాజు శని. దీని ఫలితం వల్ల సస్యాలు మధ్యమంగా పండుతాయి. రోగభయం అధికం. ప్రభుదండన అధికం. ధరలు ఎక్కువగా ఉంటాయి. తక్కువకాలంలో పండే పంటలు ఫలిస్తాయి. ప్రజలు అన్యాయమార్గగాములవుతారు.

ఈ విధంగా వేరు వేరు వారాధిపతులలో నైసర్గికంగా శుభ అశుభ గ్రహాలను అనుసరించి ఫలాలను చెప్పవలసి ఉంటుంది. శుభగ్రహాలకు ఈ ఫలితాలు శుభంగానూ, అశుభగ్రహాలకు అశుభంగానూ చెప్పాలి. పంచాంగం ప్రకారం ఈ నిర్ణయాలుంటాయి.

రాజు, మంత్రి, సేనాధిపతుల వివరాలలో అధికంగా రాజుల మధ్య మైత్రి, యుద్ధభయాదులు, వర్షాలు, పంటలు పండడం, భూములు ఫలించడం, గోవుల వృద్ధి, ప్రజల ఆనందం, ధరలు, అగ్ని, చోరాదుల వల్ల భయాలు తదితరాంశాలు ప్రాధాన్యాన్ని వహిస్తుంటాయి.

సస్యాధిపతి, ధాన్యాధిపతులను అనుసరించి ఎటువంటి పంటలు ఆ సంవత్సరం పండుతాయో వివరిస్తూ ఆ యా గ్రహాలకు అనుకూలంగా చెప్పాలి. వర్షాల వివరం కూడా చెప్పవచ్చు.

అర్ఘాధిపతిని అనుసరించి ఆ సంవత్సరంలో ధరల నిర్ణయం ఉంటుంది. పంటలు పండడం, వర్షాలు పడడం అనే అంశాల ఆధారంగానే ఈ నిర్ణయం ఉంటుంది కాబట్టి ఇతర విశేషాలను స్పృశిస్తూ ధరల విషయం ప్రత్యేకంగా చర్చించాల్సి ఉంటుంది.

మేఘాధిపతిని ప్రత్యేకంగా పరిగణించడం జ్యోతిష సంప్రదాయం. కారణం సూర్యుడు ఆర్ద్రా నక్షత్రంలో ప్రవేశించే సమయానికి భారతదేశంలో వర్షాలు పడుతుంటాయి. ఆర్ద్ర కార్తెగా దీనిని భావిస్తుంటారు. ఫలితాల పరిగణనలో పంటలు పండడం, వర్షాలు పడడం, మేఘాలు ఫలించడం అనే అంశాలే ప్రాధాన్యమైనా ఈ నక్షత్రంలోకి రవి ప్రవేశించే తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ, లగ్నాలతోనూ ఇతర ప్రత్యేకాంశాలను కలుపుకొని ప్రత్యేకంగా గమనిస్తుంటారు. ఈ అంశాల సామూహిక గణన వల్ల ఆ సంవత్సరం పడే వర్షాన్ని లెక్కించవచ్చు.

రసాధిపతి ద్వారా నెయ్యి, నూనె, బెల్లం, ఉప్పు, పాలు, పెరుగు, చక్కెర మొదలైన రసవస్తువుల సంటలు, ధరవరలను నిర్ణయిస్తారు.

నీరసాధిపతి ద్వారా ముత్యాలు, రత్నాలు, ఆభరణాలు, లోహాలు, కర్పూరం, అగరువత్తులు తదితర వస్తువుల ధరవరలు ఆధారపడి ఉంటాయి.

వీరే కాక రవి వృషభ సంక్రమణ వారాధిపతి - పురోహితుడుగా, కన్యా సంక్రమణ వారాధిపతి - పరీక్షకుడుగా, మీన సంక్రమణ వారాధిపతి - దైవజ్ఞునిగా, కర్కాటక సంక్రమణ వారాధిపతి - దేవాధిపతిగా, మిథున సంక్రమణ వారాధిపతి - పశువులకు అధిపతిగా మొదలైన అంశాలలో వివరాలు అధికంగా తెలియజేయడం జరుగుతూ ఉంది. ఆ యా వారాధిపతులను అనుసరించి ఆ సంవత్సర ఫలితం నిర్ణయించడం జరుగుతుంది.

13. ప్రమాణ కాలం అంటే ఏమిటి? ఏదో ఒక పట్టణానికి స్థానిక కాలాన్ని నిర్ణయించే విధానం ఉదాహరణ పూర్వకంగా వ్రాయండి? **(2001)**

ఏ సమయాన్ని పుట్టిన సమయంగా మనం గుర్తిస్తున్నామో దాన్ని ప్రమాణకాలం లేక స్టాండర్డ్ టైమ్ అని అంటాం. అది మన గడియారాల్లో అన్ని ప్రదేశాల్లో దాదాపు సమానంగా కనిపిస్తుండే కాలం. వేరు వేరు రేఖాంశలలో కాలం వేరు వేరుగా ఉంటుంది. భారతదేశం వంటి దేశంలో పశ్చిమతీరం నుండి తూర్పుతీరం వైపుకు వెళ్ళే 82.30 డిగ్రీల తూర్పు రేఖాంశం ఆధారంగా కాలనిర్ణయం జరిగింది. అన్ని దేశాలకు ఈ విధంగా కాకుండా ఈ నిర్ణయం రేఖాంశల ఆధారంగా జోన్స్ పద్ధతిలో జరుగుతుంది. దానిని జోనల్ స్టాండర్డ్‌టైమ్ అని అంటాం. లండన్‌లోని గ్రీన్‌విచ్ అనే ప్రదేశంలో ప్రపంచవ్యాప్త ప్రమాణకాలాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ కన్నా భారతదేశంలో సమయం 5.30 గంటల ముందు ఉంటుంది. అంటే అక్కడ అర్ధరాత్రి 0 గంటలు అయినప్పుడు భారతదేశంలోని 82.30 డిగ్రీల తూర్పు రేఖాంశ ప్రకారం ఉదయం 5.30 గంటలు అవుతుంది.

ఏ తేదీన జాతకుడు పుట్టినా పుట్టిన సమయాన్ని మాత్రం ప్రదేశానుకూలంగా స్థానిక కాలమానానికి సంస్కరించుకోవలసి ఉంటుంది. ఏ ప్రదేశంలో వ్యక్తి పుడతాడో

ఆ ప్రదేశానికి సంబంధించిన రేఖాంశం అనుకూలంగా ఈ మార్పు ఉంటుంది. హైదరాబాద్‌కు చెందిన రేఖాంశ $78^{0}.27^{1}$

దేశవ్యాప్తంగా సమయ నిర్ధారణ కోసం ఏర్పరచిన రేఖాంశ నుండి స్థానిక కాలమానాన్ని తయారు చేసుకోవడానికి ఒక సూత్రం ఉంది. మన పై ఉదాహరణలో హైదరాబాద్ స్థానిక రేఖాంశ 78.27 డిగ్రీలు. భారత ప్రమాణ కాలరేఖాంశ 82.30 డిగ్రీలు. ఈ రెండింటికీ మధ్యలో ఉన్న తేడా 82.30 - 78.27 = 4.03 డిగ్రీలవుతుంది.

భూమి తనచుట్టూ తాను ఒకసారి తిరిగి రావడానికి 24 గంటలు పడుతుంది. అంటే 24 గంటల్లో భూమి 360 డిగ్రీలు (ఒక వృత్తం) తిరిగి వస్తుందన్న మాట.

360 డిగ్రీలు తిరగడానికి భూమికి 24 గంటలు పడితే

1 డిగ్రీ తిరగడానికి ఎంతకాలం పడుతుంది? అని లెక్కిస్తే

24 గంటలను నిమిషాల్లోకి మార్చుకుంటే 24 **x** 60 = 1440 నిమిషాలవుతుంది. 360 డిగ్రీలు భూమి తనచుట్టూ తిరగడానికి 1440 నిమిషాలు పడితే 1 డిగ్రీ తిరగడానికి ఎంత కాలం పడుతుంది?

1 **x** 1440 / 360 = 4 నిమిషాలు అవుతుంది. అంటే 1 డిగ్రీ భూమి తనచుట్టూ తిరగడానికి మన గడియారాల పరంగా 4 నిమిషాలు పడుతుంది. ప్రమాణ కాలమాన రేఖాంశకు, స్థానిక కాలమాన రేఖాంశకు మధ్యలో ఉన్న తేడాకు సంబంధించి ప్రతి డిగ్రీ తేడాకు 4 నిమిషాలను గుణించడం వల్ల ప్రమాణ కాలం నుండి స్థానిక కాలాని . మధ్యలో ఉండే కాలమాన వ్యవధి ఎంతో తెలుస్తుంది. ఈవిధమైన గణితాన్ని ఆధారం చేసుకొని మన ఉదాహరణలో హైదరాబాదుకు స్థానిక కాలమానాన్ని గుర్తించాలి.

స్థానిక కాలమాన రేఖాంశకు (Local Time Longitude), ప్రమాణ రేఖాంశకు (Standard Longitude) తేడా = 4.03 డిగ్రీలు. దీన్ని 4 నిమిషాలతో గుణిస్తే 4.03 **x** 4 = 16.12 నిమిషాలు. ఈ 16.12 అనేది హైదరాబాదు స్థానిక కాలమాన సవరణ (Local Mean Time Correction) అవుతుంది.

ఉదాహరణకు ఒక జాతకంలో పుట్టిన సమయంగా గుర్తించిన ప్రమాణకాలం మధ్యాహ్నం 3.30 గంటలు అయితే దానిలోనుండి హైదరాబాదు స్థానిక కాలమాన సవరణ (Local Mean Time Correction)ను తీసివేస్తే 3.30.00 - 0.16.12 = 3.13.48 నిమిషాలు అవుతుంది. దీని అర్థం ఏమిటంటే గడియారాల్లో చూపించే సమయం మధ్యాహ్నం 3.30 గంటలైతే హైదరాబాదులోని స్థానిక కాలం మాత్రం 3.13.48 గంటలవుతుంది.

14. ప్రదేశభేదం వల్ల సూర్యోదయ సూర్యాస్తమయాల కాలభేదాలు జాతకంపై ఎటువంటి ప్రభావాన్ని కలిగిస్తాయి? **(2002)** సూర్యోదయ సూర్యాస్తమయాలు అంటే ఏమిటి? వాటికి జ్యోతిశ్శాస్త్రంలో ఉన్న ప్రాధాన్యం ఏమిటో వివరించండి? **(2000)**

భూమి గోళాకృతిలో ఉంటుంది. ఈ గోళం తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యునిచుట్టూ ఒక నిర్దేశితమైన దీర్ఘవృత్తాకార కక్ష్యలో సంచరిస్తూ ఉంటుంది. భూగోళం తనచుట్టూ తాను తిరగడాన్ని ఆత్మభ్రమణం అంటాం. ఈ ఆత్మభ్రమణం వల్ల పగలు రాత్రి ఏర్పడుతున్నాయి. అయితే భూమి గోళాకృతిలో ఉండడం వల్ల ఈ రాత్రింబవళ్ళు భూమిపైనున్న అందరికీ, అన్ని ప్రాంతాలవారికీ ఒకేవిధంగా ఏర్పడవు. తూర్పు ప్రాంతాల వారికి ముందుగానూ, పశ్చిమ ప్రాంతాలవారికి తరువాత పగలు, రాత్రి క్రమంలో ఏర్పడతాయి. ఇవి ఎప్పుడు, ఏవిధంగా ఏర్పడతాయో తెలియజేయడానికి భూమికి ఉత్తర ధ్రువం నుండి దక్షిణ ధ్రువం మధ్యగా గీచిన ఊహారేఖలైన 'రేఖాంశ'లు వినియోగ పడతాయి.

ఒక ప్రాంతానికి అక్షాంశను, రేఖాంశను నిర్ణయించడం ద్వారా ఆ ప్రదేశం యొక్క స్థానాన్ని భూగోళంపై గుర్తించవచ్చు. అయితే ముఖ్యంగా రేఖాంశవల్ల కాల భేదాలు ఏర్పడతాయి. దీనిని గమనించడానికి సూర్యుడు మనకు ఒక ఆధారంగా కనిపిస్తుంటాడు. అయితే ఒక ప్రదేశంలో సూర్యుడు ఉదయించడం, అస్తమించడం ఆ ప్రాంతానికి చెందిన రేఖాంశను బట్టి ఉంటుంది. ఆ ప్రాంతంలో రేఖాంశకున్న సమయాన్ని ఆధారంగా రవి ఉదయాస్తమయాల కాలాన్ని గణించే అవకాశం ఉంది.

నిర్దిష్టమైన ప్రదేశాలకు నిర్దిష్టమైన సూర్యోదయాలుంటాయి. అంటే సూర్యోదయం భూగోళంపై అంతటా ఒకే విధంగా ఉండదు. రేఖాంశలలో మార్పులవల్ల సూర్యోదయం మారినట్లుగానే వేరు వేరు జాతకాలకు, వేరు వేరు కాలాల్లో ఉదయించే లగ్నాలు మార్పు పొందుతుంటాయి.

ఈ కారణాల వల్ల భూగోళంలో పూర్వార్ధంలో ఉండేవారికి సూర్యుడు కనిపించినపుడు పశ్చిమార్ధ గోళం వారికి కనిపించడు. అంటే పూర్వార్ధగోళం వారికి పగలేర్పడినప్పుడు పశ్చిమార్ధగోళం వారికి రాత్రి అవుతుంది. భూమి ఒక రోజులో తనచుట్టూ తాను ఒకసారి తిరుగుతుంది. కాబట్టి సగం 180 డిగ్రీలు తిరగడానికి సగం రోజు పడుతుంది. పూర్వార్ధగోళం మొదట సూర్యోదయమైతే పశ్చిమార్ధగోళం మొదట సూర్యాస్తమయ మౌతుంది. ఈ మధ్య ప్రాంతాల వారికి వేరు వేరు సమయాల్లో సూర్యోదయ సూర్యాస్తమయాలు ఏర్పడతాయి.

ఈ సూర్యోదయాస్తమయాల వల్ల జాతకంలో లగ్నాలు ఒకే విధంగా గణించడానికి అవకాశం ఉండదు. గ్రహాలన్నీ దాదాపు ప్రపంచవ్యాప్తంగా ఒకే విధమైన స్ఫుటాలతో కనిపించినా, లగ్నస్ఫుటాలలో మాత్రం చాలా మార్పులు కనిపిస్తుంటాయి, లగ్నస్ఫుటం ఖచ్చితంగా నిర్ణయించగలిగితేనే ఇతరమైన గణనలకు జాతకంలో అవకాశం ఏర్పడుతుంది. లగ్నాలలో వచ్చే తేడాలవల్ల భావచక్రంలోనూ, తదితరమైన గణనల్లోనూ తేడా వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి రేఖాంశల ఆధారంగా ప్రామాణిక, స్థానిక, విశ్వ కాలాలను నిర్ణయించడం అవసరం. ఇంకా తేదీ రేఖలు తదితరాదులవల్ల నావలలో ప్రయాణం చేసేవారికి, విమానాలలో ప్రయాణం చేసేవారికి సమయ సవరణకు వినియోగపడుతుంది.

ఎం.ఏ., జ్యోతిషం (ప్రథమ) పేపర్ 2

ఈ క్రిందివానిలో ఏ నాలుగు ప్రశ్నలకైనా సమాధానాలు వ్రాయండి. 1

పంచాంగం అంటే తెలిపి, పంచాంగ ప్రయోజనాలను విశదీకరించండి?

2. నవనాయకుల నిర్ణయ విధానం తెలియజేసి, రవి ఆర్ద్రానక్షత్ర ప్రవేశ ఫలితాలను తెలపండి?

3. దేశగోచారం యొక్క ప్రాధాన్యాన్ని వివరించండి?

4. క్రింద రాశులను, డిగ్రీలననుసరించి గ్రహాలున్న నక్షత్రపాదాలను తెలుపుతూ రాశి, నవాంశ కుండలులను నిర్మించండి. లగ్నం : 0.5.1, రవి : 7.17.35, చంద్ర : 10.21.25, కుజ : 0.2.10, బుధ: 6.28.48, గురు : 9.15.12, శుక్ర:9.2.58, శని : 2.9.19, రాహు : 8.5.56.

5. వేరు వేరు కాలమానాలను తెలియజేస్తూ, కాలానికి జ్యోతిషానికి ఉన్న సంబంధాలను వివరించండి?

6. భావమంటే ఏమిటి? భావవిభజన పద్ధతులు తెలుపుతూ, భావచక్ర నిర్మాణ విధానం తెలియజేయండి?

ఈ క్రిందివానిలో ఏ నాలుగు ప్రశ్నలకైనా సమాధానాలు వ్రాయండి: 1

అయనాంశ అంటే ఏమిటో తెలుపుతూ దానిలోని వేరు వేరు మతాలను వివరించండి?

2. ప్రదేశభేదం వల్ల కాలభేదాలు ఏవిధంగా ఏర్పడతాయో తెలియజేయండి?

3. తిథి, మాసాల విషయంలో భారతీయ వైజ్ఞానిక ధోరణి చర్చించండి?

4. గ్రహదృష్టులు, వాటి విశేషాలను తెలియజేయండి?

5. ఏడు గ్రహాలకు, పన్నెండు రాశులకు ఉన్న సంబంధాలను తెలియజేయండి?

6. ఈ క్రిందివాటిలో రెండింటిని గూర్చి క్లుప్తంగా వ్రాయండి.

1. నతాంశ 2. టేబుల్స్ ఆఫ్ అసెండెంట్స్ 3. విషువత్తులు 4. స్థానిక కాలం

ఎం.ఏ., జ్యోతిషం (ప్రథమ) పేపర్ 3

ఈ క్రిందివానిలో ఏ నాలుగు ప్రశ్నలకైనా సమాధానాలు వ్రాయండి. 1

ద్వాదశ లగ్నాలకు శుభపాపగ్రహాలను నిర్ణయించే పద్ధతిని వివరించండి?

2. ద్వితీయ, పంచమ, సప్తమ, దశమ భావ కారకత్వాలను వ్రాయండి?

3. ఆయుర్దాయ నిర్ణయ పద్ధతులను సోదాహరణంగా తెలియజేయండి?

4. మేష, సింహ, ధనుస్సు లగ్నాలలో పుట్టినవారి స్వరూప స్వభావాలను వివరించండి?

5. భావబలాలను నిర్ణయించే విధానాలను తెలియజేయండి?

6. వింశోత్తరీ దశావిధానాన్ని తెలియజేస్తూ వేరు వేరు భావాల్లో రవి చంద్రులున్నప్పుడు దశాఫలితాలు తెలియజేయండి?

ఈ క్రిందివానిలో ఏ నాలుగు ప్రశ్నలకైనా సమాధానాలు వ్రాయండి: 1

చంద్రసంబంధ యోగాలను గూర్చి వ్రాయండి?

2. శని మహాదశలో అంతర్దశల ప్రమాణాలను లెక్కించే పద్ధతిని తెలియజేయండి?

3. హంస, మాళవ్య, శశ యోగాలను గూర్చి వ్రాయండి?

4. గురు, శుక్ర, రవి కారకత్వాలను తెలియజేయండి?

5. భావఫలనిర్ణయంలో ముఖ్యసూత్రాలు తెలియజేయండి?

6. దైవజ్ఞుని అర్హతలు - బాధ్యతలను తెలియజేయండి?

ఎం.ఎ., జ్యోతిషం - ప్రథమ

పేపర్ - 3

1. కర్కాటక, కన్యా, వృశ్చిక లగ్నాలలో పుట్టినవారి స్వరూప స్వభావాలను వివరించండి? (2002)

కర్కాటకం:- కర్కాటకం అంటే పీత. అలాగే వీరికి శరీరంలో పైభాగం ఎక్కువ క్రింది భాగం తక్కువగా ఉంటుంది. పొట్ట ఉంటుంది. అందమైన పలువరుస ఉంటుంది. వీరు ఎల్లప్పుడు కొత్తదనాన్ని కోరుకుంటారు. వీరు స్వార్జిత ధనంతో సుఖపడతారు. వీరికి ఊహాశక్తి ఎక్కువ. కాలపురుషాంగాలలో కర్కాటకం హృదయానికి సంబంధించినది కాబట్టి వీరికి హృదయసంబంధరోగాలు రావడానికి అవకాశాలు ఎక్కువ. వీరు అతి తక్కువగా మాట్లాడతారు. వీరికి దిగ్భ్రమ కలిగించే విషయాలు అంటే ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. వీరి మనస్సు ఎదుటివారికి తొందరగా అర్థంకాదు. ఈ లగ్నంవారికి అందరియందు వాత్సల్యం, ధార్మిక కార్యాచరణ ఉంటాయి.

ఏ అలికిడి జరిగినా పీత వెంటనే కన్నంలోకి దూరిపోతుంది. ఇతరులు ఏమనుకుంటారో అనే భావనతో వారి ప్రవర్తన అతి జాగ్రత్తగా ఉంటుంది. ఓర్పు తక్కువగా ఉండడంవల్ల కష్టసుఖాలను తట్టుకునే స్థితిలో వీరుండరు. కాని పరిస్థితులకు అనుగుణంగా ప్రవర్తిస్తూంటారు. వీరు సూక్ష్మగ్రాహులు. ఇది జలతత్త్వరాశి కాబట్టి వీరికి నీరంటే ఇష్టం. జలసంబంధమైన వాటివల్ల ప్రమాదాలు సంభవించవచ్చు కాబట్టి నీరు ఉండే ప్రదేశంలో జాగ్రత్తగా ఉండాలి. ఇది చరరాశి కాబట్టి వీరి ఆలోచనలు కూడా అలాగే త్వరగా మార్పుచెందుతాయి. వీరికి ఏదైనా పోటీ ఉంటేనే విజయాన్ని సాధిస్తారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్న సమయంచూసి పనులను ప్రారంభించి విజయాన్ని సాధిస్తారు. పాత విషయాలను కూడా కొత్త పద్ధతిలో చెప్పగలిగే నైపుణ్యం వీరికి కలిగి ఉంటుంది.

వీరి వైవాహిక జీవితం అనుకున్న ఆనందంగా ఉండదు. కొంత ఇబ్బందులు ఉంటాయి. కాని వీరు తమ కుటుంబంకోసం ఎక్కువగా శ్రమపడతారు. కుటుంబ

సభ్యులతో ప్రేమగా వ్యవహరిస్తారు. చిన్న తప్పుజరిగినా దాని గురించి చాలా ఎక్కువగా బాధపడతారు.

కన్య:- వీరు సన్నని పొడవైన శరీరం కల్గి, నల్లని కళ్ళు, దట్టమైన వెంట్రుకలతో వంపులు తిరిగిన కనుబొమ్మలు, సన్ననిగొంతుతో వయస్సు ఎక్కువగా ఉన్నా యువకులుగా కన్పిస్తారు.

వీరిది సౌమ్య స్వభావం. ఆ స్వభావంతోనే అధికారులను ఆకట్టుకుంటారు. వీరికి జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉండి మేధావులుగా ఉంటారు. వీరికి బహుభాషా జ్ఞానం కూడా ఉంటుంది. కన్య అంటే పడుచు. స్త్రీ ఏవిధంగా ఇతరులను ఆకట్టుకుంటుందో అదేవిధంగా ఇతరులను ఇట్టే ఆకట్టుకునే స్వభావాన్ని కల్గి ఉంటారు. వీరికి ఆశ ఎక్కువగా ఉంటుంది. జాలి మాత్రం బయటకి కనపడనివ్వరు. అనుమానంగా ఉంటూ ఉదార స్వభావంతో ఉంటారు. వీరికి ధైర్యం, కోపం వచ్చి వెంటనే పోతాయి. వీరికి మిత్రులయందు ప్రేమ ఎక్కువగా ఉంటుంది. ఇతరులపై జాలి ఎక్కువ. వీరు చురుకుగా ఉంటారు. వీరి వృత్తి, ప్రవృత్తి వేరువేరుగా ఉంటాయి. వీరికి లలిత కళలపై అభిమానం ఉంటుంది. అప్పుచేయడంలో నేర్పు కలిగి ఉంటారు. ఎదుటివారు తనను గౌరవించకున్నా వీరు ఎదుటివారిని గౌరవిస్తారు. వీరికి ఏ పనిలోనైనా చొరవ అధికంగా ఉంటుంది. కాని ప్రారంభదశలో కొంచెం భయపడతారు. ఇష్టమున్న విషయాలు కూడా ఇష్టములేనట్లు వాదిస్తారు. వీరు నటనా నైపుణ్యాన్ని కల్గి ఉంటారు. వీరు తమ బాధలను ఆత్మీయులకు మాత్రమే చెప్పుకుని సంతృప్తి చెందుతారు.

వీరు మంచి ప్రణాళిక రూపకర్తలు. వీరు అనుకునే లక్ష్యం లేదా గమ్యం అత్యున్నతంగా ఉంటుంది. వీరు నిశిత పరిశీలనా దృష్టి కలిగి ఉంటారు. ఒక్కొక్కసారి తమ అభిప్రాయాలను ఇతరులపై రుద్దడానికి కూడా వెనకాడరు. వీరు జన్మ స్థలానికి దూరంగా స్థిరపడతారు. వీరికి బంధువులు ఇరుగుపొరుగువారికంటే స్నేహితుల ద్వారా అభిమానం ఎక్కువగా ఉంటుంది.

ఇది ద్విస్వభావరాశి కాబట్టి ప్రతి విషయాన్ని రెండు వైపులా ఆలోచించడం అన్నింటికి సమప్రాధాన్యాన్నివ్వడం, భిన్నాంశాలను సమన్వయం చేస్తూంటారు. ఇది భూతత్త్వ రాశి. ఇవి విజ్ఞానానికి వ్యాపారానికి, ఇంద్రియశక్తులకు ప్రాధాన్యం వహిస్తాయి.

వృశ్చికం :- వృశ్చికం అంటే తేలు. తేలు కనబడితే జనం చంపుతారు. కనుక ఇతరులనుండి తనను కాపాడుకోవడంకోసం రహస్య ప్రవర్తనం కలిగి ఉంటుంది. అలాగే రహస్యప్రవర్తన ఈ లగ్నంవారికి ఉంటుంది. వీరు అందమైనరూపం, పొడవైన బాహువులు పొట్టిగా వంకర తిరిగిన జుట్టు, విశాలమైన ముఖంతో అవయవసౌష్ఠవం కలిగి ఉంటారు.

ఇది జలతత్త్వరాశి కాబట్టి ఊహాలోకాల్లో విహరించడం, భావావేశం, చిన్న విషయాలకు కూడా ఆందోళన చెందడం, కష్టసుఖాలు, సంపద మొదలైనవి. ఉన్నదానికంటె ఎక్కువగా ఊహిస్తారు. భార్య పిల్లలతో అనుబంధం ఎక్కువగా ఉంటుంది. పరిసరాల ప్రభావాలకు ఎక్కువగా లోనౌతారు.

వీరికి దాన ధర్మాలంటే ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. అపకారులను క్షమించడం, హేళనచేయడం, తగాదాలంటే ఇష్టం కలిగి ఉంటారు. ఎప్పుడూ తాను గొప్పవాడినని అనుకుంటారు. ఎదుటివారు తమ అభిప్రాయాలతో ఏకీభవించకపోతే వారితో విముఖంగా ఉంటారు. వీరి మాటలు సూటిగా కఠినంగా ఉంటాయి. వీరు పరోపకార గుణాన్ని కలిగి ఉంటారు. కలహాలతో పట్టుదలతో వ్యవహరిస్తారు. స్త్రీ లోలత్వం ధన సంపాదనలో నైపుణ్యం వీరికుంటాయి. ఇతరులను తమకు అనుకూలంగా మలచుకుంటారు.

2. భచక్రంలో భావములు ఎన్ని వాటి కారకత్వము, కాలపురుషునితో గల సంబంధము వివరింపుము? (2000)

ఆకాశంలోని సూర్యాది గ్రహాలు సంచారంచేసే భచక్ర మార్గాన్ని క్రమ పద్ధతిలో గమనించిన 12 రాశులుగా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అశ్విన్యాది నక్షత్రాలకు సంబంధించిన 108 నక్షత్ర పాదాల్లో 9 నక్షత్ర పాదాలు ఒకరాశికి వర్తించేవి అవుతున్నాయి. మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, సింహం, కన్య, తుల, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం అనేవి ఈ రాశులు. ఈ రాశులు లగ్నాలుగా మారిన సందర్భాలలోనూ, చంద్రరాశులగా ఉన్నప్పుడూ, తదితర ఫలిత జ్యోతిష పరిశీల

నాంశాలలో ఆ యా రాశులు కొన్ని ప్రత్యేక కారకత్వాలను ప్రకటిస్తున్నాయి. వాటి అధ్యయనం వల్ల ఆకాశంలోని 360 డిగ్రీల రాశిచక్ర వ్యవస్థలోని వైవిధ్యాలను అధ్యనం చేయవచ్చు. రాశులకు చెందిన వేరు వేరు ప్రత్యేకాంశాలు ఈ విధంగా ఉంటాయి.

కాలపురుషాంగాలు : కాలపురుషునికి మేషం - శిరస్సు, వృషభం - ముఖం, మిథునం - భుజాలు, కర్కటకం - హృదయం, సింహం - భుజాలమధ్యభాగం,కడుపు, కన్య - కటి ప్రదేశం, తుల - పొత్తికడుపు, వృశ్చికం - మర్మాంగాలు, ధనుస్సు - తొడలు, మకరం - మోకాళ్ళు, కుంభం - పిక్కలు, మీనం - పాదాలు.

చరస్వభావ రాశులు - స్వభావాలు : ఈ రాశులలో జన్మించినవారికి చురుకుదనం, చాంచల్యం, మార్పును కోరడం, కార్యసాధన లక్ష్యం, క్రియాశీలత, ఉత్సాహం, కార్య నిర్వహణ, చపలత్వం, అభిప్రాయాలు, ఆలోచనావిధానాల్లో మార్పులు, పర్యటనలపై ఆసక్తి స్థిరత్వం తక్కువ తదితర స్వభావాలుంటాయి. (మేష, కర్కాటక, తులా, మకరాలు)

స్థిరస్వభావ రాశులు-స్వభావాలు : సిద్ధమైన అభిప్రాయాలు, సుఖ జీవనాభిలాష, అధికారం పైకంటే ప్రయోజనం, సౌఖ్యం, దీక్ష, ఏకాగ్రత, నిగ్రహం, ఓర్మి, సుస్థిరత, పట్టుదల, వాగ్దానాలు చెల్లించాలనే స్వభావం, ఆత్మవిశ్వాసం, నిర్వహణ, సమర్థత, తరచు మార్పులు ఇష్టపడకపోవడం మొదలైన స్వభావాలుంటాయి. (వృషభ సింహ వృశ్చిక కుంభాలు)

ద్విస్వభావ రాశులు-స్వభావాలు : రెండువైపులా ఆలోచించడం, ద్వంద్వ స్వభావం, అభిప్రాయాలలో మార్పు, భిన్నాంశాలను సమన్వయించడం, వ్యాఖ్యానించడం, ఉపదేశించడం, బోధనాశక్తి, ప్రతి విషయాన్ని సందేహించడం, విభిన్నమైన ఆశయాలు, అభిరుచులు, విమర్శలు, సమీక్షలు, విచారణలు చేయగలగడం, విచక్షణను ఉపయోగించడం తదితర స్వభావాలుంటాయి. (మిథున కన్యాధనుర్మీనాలు)

అగ్నితత్వ రాశులు-స్వభావాలు : నాయకత్వం, ధైర్య సాహసాలు, శక్తి, చైతన్యం, ప్రేరణ, ఉద్దీపన, విక్రమం, పౌరుషం, తమ మార్గంలో ఇతరులను నడిపించడం, తమ ప్రభావాన్ని ఇతరులకు చూపించడం, ముందు వెనుకలు చూడకుండా ముందుకు

దూకడం తదితర స్వభావాలుంటాయి. (మేష సింహ ధనుస్సులు)

భూతత్వ రాశులు - స్వభావాలు : భోజన ప్రియత్వం, శరీరబలం, జీవనోపాధి, కృషి, ప్రతిఫలం, శారీరక అవసరాలు, సంపాదన, సౌకర్యాలు, సంక్షేమం, భౌతిక విషయాలకు ప్రాధాన్యం, పట్టిన పట్టు విడువకుండా ప్రారంభించిన పని పూర్తిచేయడం, భద్రత, రక్షణ, ప్రయోజనదృష్టి, సహనం, నెమ్మది, ముందుజాగ్రత్తలు తదితర స్వభావాలుంటాయి.(వృషభ కన్యా మకరాలు)

వాయుతత్వ రాశులు - స్వభావాలు : స్నేహపరిచయ బాంధవ్యాలు, వ్యాపక శక్తి, విజ్ఞాన వికాసం, పథకాలు, ప్రణాళికలు, తెలివి, సామర్థ్యం, సాంఘిక కార్యక్రమాలు, పరిచయాలు పెంచుకోవడం, కొత్తవి తెలుసుకోవడం, నిస్వార్థం, స్నేహం, సాముదాయిక శ్రేయస్సు తదితర లక్షణాలుంటాయి.(మిథున తులా కుంభాలు)

జలతత్వ రాశులు - స్వభావాలు : ఊహాలోకాల్లో విహరించడం, స్పందన, ఆలోచన, ఊహ, భావన, ఉద్వేగం, భావావేశం, ఆందోళన, సంపద, కష్టసుఖాలు, భార్య పిల్లలతో అనుబంధం ఎక్కువగా ఉండడం, పరిసర ప్రభావాలకు ఎక్కువగా లోనుకావడం, స్పందన, ప్రతిస్పందన, స్ఫురణ, ఉద్వేగం మొదలైన స్వభావాలుంటాయి. (కర్కాటక వృశ్చిక మీనాలు)

మేషరాశి : రక్తవర్ణం, పెద్ద శరీరం, నాలుగు కాళ్ళు, రాత్రియందు బలం కలిగింది, తూర్పు దిక్కున నివాసం, క్షత్రియ జాతి, పర్వతాలలో సంచరించేది, రజోగుణ ప్రాధాన్యం కలిగింది, పృష్ఠోదయరాశి, పురుష ప్రకృతి, అగ్నితత్వం, చరస్వభావం, కుజుడధిపతిగా గలది అవుతున్నది.

వృషభరాశి : తెల్లని రంగు కలిగింది, శుక్రుడధిపతి, పొడవైనది, నాలుగు పాదాలు, రాత్రియందు బలం కలిగింది, దక్షిణదిక్కు నివాసం కలది, గ్రామంలో సంచరించేది, వైశ్యజాతి, భూతత్వం, స్థిరస్వభావం, రజోగణ ప్రాధాన్యం, పృష్ఠోదయరాశి.

మిథునరాశి : శిరస్సుతో ఉదయించేది, వీణతో కూడిన స్త్రీతోనూ గదతో కూడిన పురుషునితోనూ కూడినది, పశ్చిమ దిశా నివాసం, వాయుతత్వం, ద్విస్వభావం, రెండు పాదాలు కలిగింది, రాత్రియందు బలం కలిగింది, గ్రామ సంచారి, వాత

ప్రకృతి, సమానమైన ప్రకృతి, పచ్చనిరంగు, బుధుడధిపతిగా కలది.

కర్కాటకరాశి : లేత ఎరుపు రంగు, వన సంచారి, బ్రాహ్మణజాతి, రాత్రి బలం కలిగింది, అనేక పాదాలు కలిగినది, స్థూలదేహం, సత్త్వగుణం, జలతత్త్వరాశి, చర స్వభావం, పృష్ఠోదయం, చంద్రుడు అధిపతిగా కలిగినది.

సింహరాశి : సత్త్వగుణం, నాల్గుపాదాల జంతువు, క్షత్రియ జాతి, వన సంచారి, శీర్షోదయరాశి, పెద్దశరీరం కలది, పాండువర్ణం, తూర్పుదిక్కు నివాసం, స్థిరస్వభావం, అగ్నితత్త్వం, సూర్యుడధిపతిగా కలది.

కన్యారాశి : పర్వత సంచారి, పగటియందు బలం కలది, శీర్షోదయరాశి, మధ్యమమైన శరీరాంగాలు కలది, రెండుపాదాలు కలది, దక్షిణ దిక్కు నివసించేది, ఒక చేతిలో వరికంకులు, ఒకచేతిలో అగ్ని కలది, వైశ్యజాతి, చిత్రవర్ణం, వాయుతత్త్వం, ద్విస్వభావం, కౌమారవయస్సు, తమోగుణ ప్రాధాన్యం, బాల్యచేష్టలు, భావాలు కలది, బుధుడధిపతిగా కలది.

తులరాశి : శీర్షోదయరాశి, పగటియందు బలం కలది, కృష్ణవర్ణం, రజోగుణ ప్రధానం, పశ్చిమ దిక్సంచారం చేతయునది, భూచరం, హింసా స్వభావం కలది, శూద్రజాతి, మధ్యమదేహం కలది, రెండుకాళ్ళు, చరస్వభావం, వాయుతత్త్వం, శుక్రుడధిపతిగా గలది.

వృశ్చికరాశి : స్వల్పశరీరం, అనేకపాదాలు, బ్రాహ్మణజాతి, కన్నములలో నివాసం, ఉత్తరదిక్కు పగటియందు బలం, పింగళవర్ణం, భూచరం, ఎక్కువ రోమాలు కలది, పదునైన అగ్రభాగం, జలతత్త్వం, స్థిరస్వభావం, కుజాధిపత్యం కలది.

ధనుస్సురాశి : పృష్ఠోదయం, సత్త్వగుణం, పింగళవర్ణం, రాత్రిబలం, క్షత్రియజాతి, మొదటి 15 భాగలు ద్విపాదం, తరువాత చతుష్పాదం, సమశరీరం, ధనుస్సును ధరించింది, తూర్పుదిక్కున నివసించేది, భూచరం, తేజస్సుకలది, అగ్నితత్త్వం, ద్విస్వభావం, గురుడధిపతిగా గలది.

మకరరాశి : తామసగుణం, దక్షిణ నివాసం, రాత్రిబలం కలది, పృష్ఠోదయం, పెద్దశరీరం కలది, కర్బుర వర్ణం, వనాలలో భూమియందు సంచరించేది, మొదటి

15 భాగలు చతుష్పాదం, రెండవ భాగం పాదాలు లేనిది, జలచరం, భూతత్త్వం, చరస్వభావం, శని అధిపతిగా కలది.

కుంభరాశి : కుండ చేతిలో ఉన్న పురుషరూపం, బభ్రువర్ణం, మధ్యమదేహం, ద్విపాదం, పగటిబలం, జలచరం, శీర్షోదయం, తమోగుణప్రధానం, శూద్రజాతి, పశ్చిమదిక్కు, స్థిరస్వభావం, వాయుతత్త్వం, శని అధిపతిగా కలది.

మీనరాశి : పుచ్ఛ ఆస్యములు కలిగిన రెండు చేపల స్వరూపం కలిగింది, పగటియందు బలం కలిగింది, జలతత్త్వం, సత్త్వగుణప్రధానం, మంచి ఆరోగ్యం కలది, జలచరం, బ్రాహ్మణజాతి, పాదాలు లేనిది, మధ్యమదేహం కలిగింది, ఉత్తర దిక్కు నివాసి, ఉభయోదయరాశి, ద్విస్వభావం, జలతత్త్వం, గురుడధిపతిగా గలది.

3. ద్వాదశ లగ్నాలకు శుభ పాప గ్రహాలను పేర్కొనండి? (2001), లగ్నాలకు యోగ కారక గ్రహాలను వివరించండి? గ్రహములకు సహజ, ఆదిపత్య, శుభ, పాప స్థితులను, మారక స్థానములు ఉదాహరణతో ఒక లగ్నమునకు (అనగా మేషం నుండి మీనం) వివరింపుము?

వేరు వేరు లగ్నాలకు ఆధిపత్యాల రీత్యా శుభాశుభ గ్రహాలను, యోగకారక గ్రహాలను నిర్ణయించడానికి కొన్ని ప్రత్యేకమైన సూత్రాలున్నాయి. ఆ సూత్రాలననుసరించి ఒక్కో లగ్నానికి శుభాశుభ గ్రహాలను నిర్ణయించవచ్చు. ఆ సూత్రాలు ఈ విధంగా ఉంటాయి.

1. లగ్నం మొదలు 5,9 స్థానాధిపతులు ఎవ్వరైనా శుభగ్రహాలే.
2. నైసర్గిక పాపులు కేంద్రాధిపతులైతే ఆధిపత్యశుభులు.
3. నైసర్గిక శుభగ్రహాలు కేంద్రాధిపతులైతే అధిపత్య పాపగ్రహాలు.
4. కోణాధిపతులైనా త్రిషడాయాధిపతుల (3,6,11) స్థానాలకు అధిపతులైతే అశుభ ఫలితాలనిస్తారు.
5. ఏ గ్రహమైనా కోణాధిపతి అయితే శుభఫలితాన్నిస్తాడు.

6. శుభగ్రహం కేంద్రాధిపతి అయితే అశుభఫలితాన్ని, అశుభగ్రహం కేంద్రాధిపతి అయితే శుభఫలితాన్నిస్తారు.

7. ఏ గ్రహమైనా 3,6,11 స్థానాలకు అధిపతి అయితే అశుభాన్నే కలిగిస్తాడు.

8. 3,6,8,11,12 స్థానాధిపతులు శుభులైనా పాపులైనా అశుభఫలితాలనే ఇస్తారు.

9. అష్టమాధిపతి అశుభఫలితాన్నిస్తాడు కాని అతడే లగ్నాధిపతి కూడా అయితే శుభఫలితాన్నిస్తాడు. (మేష, తులా లగ్నాలకు ఇది వర్తిస్తుంది)

10. 2-12 స్థానాధిపతులు లగ్నాధిపతితో సాహచర్యం వల్ల శుభాశుభ ఫలితాలనిస్తారు.

11. గురు శుక్రులకు కేంద్రాధిపత్యం అధిక దోషప్రదం.

12. గ్రహాలకుండే రెండు ఆధిపత్యాలలో ఒకటి బాగా ఉండి రెండవ ఆధిపత్యం దోషఫలితాన్నిచ్చేటప్పుడు ఆ గ్రహం ఇచ్చే పూర్తిఫలం లగ్నాధిపతికి, ఆ గ్రహానికి ఉండే స్నేహంపై ఆధారపడి, సమత్వంగా ఉంటుంది.

13. కేంద్రాల్లో (1,4,7,10) శుభగ్రహాలుండడం మంచిది. కోణాల్లో (5,9) ఉండే శుభగ్రహాలు అన్నివిధాలా మంచినే చేస్తాయి. ఈ గ్రహాలు ఏ భావాలకు ఆధిపత్యం వహిస్తున్నాయో ఆ భావాధిపతుల ఫలాన్ని, యే కోణంలో ఉన్నాయో ఆ కోణానికి అనుసరించిన భావఫలితాన్ని శుభత్వం గల్గి సంపూర్ణంగా ఇస్తాయి.

కోణాలలో ఉన్న పాపగ్రహాలు ఏ భావానికి అధిపత్యం కల్గి ఉన్నాయో ఆ భావాన్ని సంపూర్ణంగా వృద్ధిచేసి ఏ కోణస్థానంలో ఉన్నాయో ఆ భావఫలితాలను పాడు చేస్తాయి.

కేంద్రస్థానాలలో ఉండే పాపగ్రహాలు ఏ భావాలకు ఆధిపత్యం కలిగి ఉంటాయో ఆ భావఫలితాలను వృద్ధిచేస్తూ, ఏ స్థానాల్లో ఉంటాయో ఆ భావఫలాలను పాడు చేస్తాయి. అందుకే పాపగ్రహాలకు కేంద్రాధిపత్యం మంచిది, కేంద్రస్థితి మంచిదికాదు.

పై సూత్రాలరీత్యా వేరువేరు లగ్నాలకు ఆధిపత్యాల రీత్యా యోగకారక గ్రహాలను నిర్ణయించే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు -

మేషలగ్నం : మేషలగ్నానికి లగ్న అష్టమాధిపతి కుజుడు - ద్వితీయ, సప్తమాధిపతి శుక్రుడు - తృతీయ, షష్ఠాధిపతి బుధుడు - చతుర్థాధిపతి చంద్రుడు - పంచమాధిపతి రవి - నవమ వ్యయాధిపతి గురుడు - దశమ లాభాధిపతి శని.

లగ్నాధిపతి ఎప్పుడైనా మేలు చేస్తాడు కాబట్టి కుజుడు ఈ లగ్నానికి శుభుడు. అష్టమాధిపత్యం చెడు చేస్తుంది మేషలగ్నానికి అష్టమాధిపతి కూడా కుజుడే. అయితే లగ్నాధిపతే అష్టమాధిపతి అయితే దోషం ఉండదనే 9వ సూత్రాన్ని అనుసరించి కుజుడు ఈ లగ్నానికి శుభాన్ని కలిగిస్తాడు.

ద్వితీయస్థానం, సప్తమస్థానం మారకస్థానాలు. ఈ రెండింటికీ అధిపతి అయిన శుక్రుడు మేషలగ్నానికి ప్రబల మారకుడవుతున్నాడు. కేంద్రాధిపత్యం శుభగ్రహాలకు మంచిది కాదు. అందువల్ల సప్తమకేంద్రాధిపతిగా శుక్రుడు మారకుడు. అశుభ ఫలితాలను ఇస్తాడు. అదేవిధంగా లగ్నాధిపతికి శుక్రుడు మిత్రుడు కూడా కాకపోవడం వల్ల ద్వితీయాధిపత్యం కూడా దోషాన్నే కలిగిస్తుంది.

తృతీయ, షష్ఠస్థానాలు రెండూ అశుభస్థానాలే. ఈ రెండింటికీ అధిపతి అయిన బుధుడు మేషలగ్నం వారికి శుభఫలితాలను ఇవ్వలేడు. అందువల్ల బుధుడు ఈ లగ్నం వారికి అశుభఫలితాలనే ఇస్తాడు. అదేవిధంగా లగ్నాధిపతి కుజునికి బుధుడు మిత్రుడు కూడా కాకపోవడం వల్ల అశుభఫలితాలనిస్తాడు.

కేంద్రాధిపతి శుభగ్రహమైతే దోషాన్నిస్తాడు. చంద్రుడు నైసర్గిక శుభగ్రహం. చతుర్థ కేంద్రాధిపతిగా చంద్రుడు ఈ లగ్నానికి ఇబ్బందికరమైన ఫలితాలనిస్తాడు. అయితే లగ్నాధిపతికి మిత్రుడు కావడం వల్ల దోషశాతం తక్కువగా ఉంటుంది.

కోణాధిపతులెవరైనా మేలును కలుగజేస్తారు. పంచమకోణాధిపతి అయిన రవి ఈ లగ్నానికి యోగకారకుడు అవుతున్నాడు. లగ్నాధిపతికి మిత్రుడు కూడా కావడం వల్ల విశేష శుభఫలితాలనిస్తాడు.

మేష లగ్నానికి నవమ వ్యయాధిపతి గురుడు. నైసర్గిక శుభుడైన గురుడు కోణాధిపత్యం (9) వల్ల యోగకారకుడు. లగ్నాధిపతి అయిన కుజునితో గురునికి ఉన్న మిత్రత్వం వల్ల వ్యయాధిపత్యం కూడా మంచిదే. రెండు అధిపత్య మిత్రత్వాలు,

లగ్నాధిపతితో మైత్రి వల్ల గురుడు ఈ లగ్నానికి యోగకారకుడు.

మేషలగ్నానికి దశమ లాభాధిపతి శని. దశమకేంద్రాధిపతిగా నైసర్గిక పాపి అయిన శని శుభాన్నిస్తాడు. లాభాధిపతిగా ఏ గ్రహమైనా ఇబ్బందికరమైన ఫలితాల నిస్తారు. లగ్నాధిపతి అయిన కుజునితో శనికి మైత్రి అంతంత మాత్రమే. అందువల్ల ఈ గ్రహం మేషలగ్నానికి మిశ్రమఫలాలను ఇస్తుంది.

ఈ అంశాలను కూలంకషంగా పరిశీలిస్తే మేషలగ్నం వారికి రవి, గురు, కుజులు యోగకారకులు. చంద్రుడు సమ ఫలితాలనిస్తాడు. శని, బుధ, శుక్రులు వరుసగా ప్రబల మారకులవుతున్నారు.

వృషభలగ్నం : వృషభలగ్నానికి లగ్న షష్ఠాధిపతి శుక్రుడు, ద్వితీయ పంచమాధిపతి బుధుడు, తృతీయాధిపతి చంద్రుడు, చతుర్థాధిపతి రవి, సప్తమ వ్యయాధిపతి కుజుడు, అష్టమ లాభాధిపతి గురుడు, నవమ దశమాధిపతి శని అవుతారు.

శని, బుధుడు, శుక్రుడు ఈ లగ్నానికి యోగకారకులు. రవి, కుజ, చంద్ర, గురులు ఈ లగ్నానికి క్రమంలో దోషప్రదులు అవుతున్నారు.

మిథునలగ్నం : మిథున లగ్నానికి లగ్న చతుర్థాధిపతి బుధుడు, ద్వితీయాధిపతి చంద్రుడు, తృతీయాధిపతి రవి, పంచమ వ్యయాధిపతి శుక్రుడు, షష్ఠ లాభాధిపతి కుజుడు, సప్తమ దశమాధిపతి గురుడు, అష్టమ నవమాధిపతి శని అవుతున్నారు.

బుధ, శుక్రులు యోగకారకత్వాన్నిస్తారు. రవి, గురు, కుజ, శని, చంద్రులు వరుసగా అశుభ ఫలితాన్ని ఇచ్చేవారవుతారు.

కర్కాటకలగ్నం : కర్కాటక లగ్నానికి లగ్నాధిపతి చంద్రుడు. ద్వితీయాధిపతి రవి. తృతీయ వ్యయాధిపతి బుధుడు. చతుర్థ లాభాధిపతి శుక్రుడు. పంచమ దశమాధిపతి కుజుడు. షష్ఠ నవమాధిపతి గురుడు. సప్తమ అష్టమాధిపతి శని అవుతున్నారు.

లగ్నాధిపతిగా చంద్రుడు యోగకారకుడు. చంద్ర, కుజ, రవి, గురులు శుభప్రద గ్రహాలు కాగా బుధ, శుక్ర, శని గ్రహాలు అశుభఫలితాలనిచ్చే గ్రహాలవుతున్నాయి.

సింహలగ్నం : లగ్నాధిపతి రవి, ద్వితీయ లాభాధిపతి బుధుడు, తృతీయ దశమాధిపతి శుక్రుడు, చతుర్థ నవమాధిపతి కుజుడు, పంచమ అష్టమాధిపతి గురుడు, షష్ఠ సప్తమాధిపతి శని, వ్యయాధిపతి చంద్రుడు అవుతున్నారు.

లగ్నాధిపతి రవి సింహలగ్నానికి యోగకారకుడు. రవి, కుజ, గురు, చంద్రులు ఆధిపత్య శుభగ్రహాలు కాగా, బుధ, శుక్ర, శనులు క్రమంలో మారకులు అవుతున్నారు.

కన్యాలగ్నం : లగ్న దశమాధిపతి బుధుడు, ద్వితీయ నవమాధిపతి శుక్రుడు, తృతీయ అష్టమాధిపతి కుజుడు, చతుర్థ సప్తమాధిపతి గురుడు, పంచమ షష్ఠాధిపతి శని, లాభాధిపతి చంద్రుడు, వ్యయాధిపతి రవి అవుతున్నారు.

బుధ, శుక్ర, శనులు శుభప్రద గ్రహాలు కాగా కుజ, గురు, రవి, చంద్రులు ఆధిపత్య పాపగ్రహాలు అవుతున్నారు.

తులాలగ్నం : లగ్నాధిపతి, అష్టమాధిపతి శుక్రుడు, ద్వితీయ సప్తమాధిపతి కుజుడు, తృతీయ షష్ఠాధిపతి గురుడు, చతుర్థ పంచమాధిపతి శని, నవమ వ్యయాధిపతి బుధుడు, దశమాధిపతి చంద్రుడు, లాభాధిపతి రవి అవుతున్నారు.

శని, బుధ, శుక్రులు యోగకారకులు కాగా గురు, రవి, కుజ, చంద్రులు ఆధిపత్యాల రీత్యా అశుభఫలితాల నిచ్చేవారవుతున్నారు.

వృశ్చికలగ్నం : లగ్న షష్ఠాధిపతి కుజుడు, ద్వితీయ పంచమాధిపతి గురుడు, తృతీయ చతుర్థాధిపతి శని, సప్తమ వ్యయాధిపతి శుక్రుడు, అష్టమ లాభాధిపతి బుధుడు, నవమాధిపతి చంద్రుడు, దశమాధిపతి రవి అవుతున్నారు.

షష్ఠాధిపత్యం దోషం అయినా లగ్నాధిపత్యం కూడా ఉండడం వల్ల కుజుడు ఈ లగ్నానికి యోగకారకుడే.

గురు, కుజ, చంద్ర, రవులు యోగకారకులు కాగా శుక్ర, బుధ, శనులు అశుభఫలితాలనిచ్చేవారు అవుతున్నారు.

ధనుర్లగ్నం : లగ్న చతుర్థాధిపతి గురుడు, ద్వితీయ తృతీయాధిపతి శని, పంచమ వ్యయాధిపతి కుజుడు, షష్ఠ లాభాధిపతి శుక్రుడు, సప్తమ దశమాధిపతి బుధుడు, అష్టమాధిపతి చంద్రుడు, నవమాధిపతి రవి అవుతున్నారు.

లగ్నాధిపతి గురునికి చతుర్థ కేంద్రాధిపత్యం దోషకారకం అయినా లగ్నాధిపతి కావడం వల్ల యోగకారకుడు అవుతాడు. రవి, గురు, చంద్ర, కుజులు యోగకారకులు కాగా శని, బుధ, శుక్రులు వరుసగా అశుభఫలితాలనిస్తున్నారు.

మకరలగ్నం : లగ్న ద్వితీయాధిపతి శని, తృతీయ వ్యయాధిపతి గురుడు, చతుర్థ లాభాధిపతి కుజుడు, పంచమ దశమాధిపతి శుక్రుడు, షష్ఠ నవమాధిపతి బుధుడు, సప్తమాధిపతి చంద్రుడు, అష్టమాధిపతి రవి అవుతున్నారు.

లగ్న ద్వితీయాధిపతులు ఒకరే కావడం వల్ల శని ఈ లగ్నానికి శుభుడు. శని, శుక్ర, బుధులు ఆధిపత్య శుభులు కాగా కుజ, చంద్ర, రవులు క్రమంలో మారకులు అవుతున్నారు.

కుంభలగ్నం : లగ్న వ్యయాధిపతి శని, ద్వితీయ లాభాధిపతి గురుడు, తృతీయ దశమాధిపతి కుజుడు, చతుర్థ నవమాధిపతి శుక్రుడు, పంచమ అష్టమాధిపతి బుధుడు, షష్ఠాధిపతి చంద్రుడు, సప్తమాధిపతి రవి అవుతున్నారు.

విశేషయోగకారకులుగా ఏగ్రహాన్ని చెప్పడానికి లేకపోయినా శని, శుక్ర, బుధులు క్రమంలో సాధారణ శుభఫలితాలను ఇస్తారు. అదేవిధంగా గురు, కుజ, చంద్ర, రవులు క్రమంలో దోషఫలితాలను అధికంగా ఇస్తారు.

మీనలగ్నం : లగ్న దశమాధిపతి గురుడు, ద్వితీయ నవమాధిపతి కుజుడు, తృతీయ అష్టమాధిపతి శుక్రుడు, చతుర్థ సప్తమాధిపతి బుధుడు, పంచమాధిపతి చంద్రుడు, షష్ఠాధిపతి రవి, లాభ వ్యయాధిపతి శని అవుతున్నారు.

కుజ, చంద్ర, రవులు శుభఫలితాలనిచ్చే గ్రహాలు కాగా, శని, బుధ, శుక్రులు క్రమంలో దోషకారులవుతున్నారు.

4. ఏవైనా భావ కారకత్వాలు వ్రాయండి? (2001), చతుర్థ, ద్వితీయ భావాల కారకత్వాలు వ్రాయండి? తృతీయ, షష్ఠ లాభ భావాల వివరణతో విశదీకరింపుము?

లగ్నభావం : శరీరం, రూపం, జ్ఞానం, వర్ణం, బలం, దౌర్బల్యం, సుఖదుఃఖాలు, స్వభావం, ఆశయాలు, అభిరుచులు, దృక్పథాలు, ఆలోచనాసరళి. పట్టుదల, నిత్య కృషిశీలత, చక్కని ప్రయత్నం తదితర అంశాలు లగ్నభావం నుండి పరిశీలించాలి.

ద్వితీయ/ధనభావం : ధనం, ధాన్యం, కుటుంబం, మృత్యువు, శత్రువు, ధాతువులు, రత్నాదికాలు, మృదువాక్కు, దాతృత్వం, ఆస్తికత్వం, కన్ను, స్నేహం, లోభం, ధన సంపాదనకు ప్రయత్నం, సహాయం, కలిమి, లేమి, బ్యాంకు నిల్వలు, వాటాలు, విలువైన వస్తువులు తదితర అంశాలు ధనభావం నుండి పరిశీలించాలి.

తృతీయ/సహజభావం : పరాక్రమం, సేవకులు, సోదరీ సోదర వర్గం, దగ్గర ప్రయాణాలు, పితృమరణం, కంఠం, రచన, శ్రవణం, దాసీజనం, దగ్గరి బంధువులు, సహకారం, చిత్తచాంచల్యం, సహాధ్యాయులు, సమీపవ్యక్తులు, సంభాషణ, పరామర్శ, ప్రచారం, ప్రసారం, కమ్యూనికేషన్లు, పుస్తకపఠనం తదితర అంశాలు సహజభావం నుండి పరిశీలించాలి.

చతుర్థ/మాతృభావం : సుఖం, వాహనాలు, బంధువులు, మాతృసౌఖ్యం, గృహం, ఆహారం, కృషి, విద్య, తల్లి ఆరోగ్యం, భూములు, సుగంధ ద్రవ్యాలు, అభివృద్ధి, జన్మస్థలం, తల్లితరపు బంధువులు, చేపట్టినపదవి, అధిష్ఠించిన ఆసనం, కార్యాలయం మొదలైన అంశాలు చతుర్థ భావం ద్వారా చూడాలి.

పంచమ / సంతానభావం : సంతానం, యంత్రాలు, మంత్రదీక్ష, విద్య, బుద్ధి, పుత్రులు, రాజ్యలాభం, పదవీచ్యుతి, మంచి స్వభావం, మనస్సు, ఆలోచన, పితృధనం, రహస్యాలు, కార్యాచరణం, సంతృప్తి, పాండిత్యం, వంశపరంపరాగతమైన మంత్రిపదవి, సంతతికి సంబంధించిన విషయాలు, అనురాగం, ఆత్మీయత, సరదాలు, లలితకళలు, పరపాలనా సమర్థత, ప్రసూతి వైద్యం, సృజనాత్మకత, హృదయానికి సంబంధించిన విషయాలు పంచమభావం ద్వారా పరిశీలించాలి.

షష్ఠ/ రోగభావం : మేనమామ, మృత్యుభయం, వాణిజ్యం, నష్టవస్తుపరిజ్ఞానం, ఆత్మ మరణాలు, రోగం, యుద్ధం వల్ల కలహం వల్ల వచ్చే సంపద, లోభం, అస్వస్థత, స్ఫోటకం, ఉన్మాదం, శత్రువుల సంతోషం, వృత్తివిద్యలు, అనారోగ్యం, రోగ నిరోధక శక్తి, ఔషధం, చికిత్స, సిబ్బంది, కార్మికులు, అధికారి, సేవకులు, శారీరక బలం, వ్యాయామం, అంగవైకల్యం, ఆహారధాన్యాలు, నింద, సేవ, సోదరులతో కలహం మొదలైన అంశాలు షష్ఠ భావం ద్వారా పరిశీలించాలి.

సప్తమ / కళత్రభావం : భార్య, మార్గప్రయాణం, వాణిజ్యం, నష్టవస్తు పరిజ్ఞానం, ఆత్మ మరణాలు, వివాహం, భర్త, పవిత్రత, తాంబూలం, సుగంధ పుష్పాలు, మైథునం, స్వదేశం, అన్యదేశం, అష్టమిత్రులు, విరోధి, అధికారి, భాగస్వామి, స్నేహితులు, జీవితంతో ముడిపడిన వ్యక్తులు, పది మందిలో పలుకుబడి తదితర అంశాలు కళత్ర భావం ద్వారా పరిశీలించాలి.

అష్టమ / ఆయుర్భావం : ఆయువు, రణం, మృతధనం, మరణం, ఇబ్బందులు, అవమానం, లైఫ్ ఇన్సూరెన్స్, భార్యను బాధించే కార్యకలాపాలు, దుఃఖం, ఆకస్మిక లాభనష్టాలు, ఆరోగ్యం, దుష్టసాంగత్యం, పరివారం, చెడ్డపనులయందు ఆసక్తి, యుద్ధం, అవయవలోపం, జీవహింస, లావాదేవీలు, క్రయ విక్రయాలు, పరాశ్రయం, పరాధీనం, అన్యాక్రాంతం, పన్నులు, లాటరీలు, మరణం తదితర అంశాలను అష్టమ భావం ద్వారా గమనించాలి.

నవమ భావం : భాగ్యం, భార్య సోదరుడు, ధర్మం, సోదరుల భార్యలు, తీర్థయాత్రలు, సేవ, తపస్సు, గురువులు, విద్య నేర్చుకోవడం వల్ల వచ్చిన గౌరవం, ప్రయాణం, భాగ్యం, నీతి, పరాక్రమం, పిత్రార్జన, శుభకార్యాలు, దనం దాచడం, సజ్జన సాంగత్యం, దూర ప్రయాణాలు, సాధారణ విద్య, విదేశ వ్యవహారాలు, పరిశోధన, శాస్త్రవిజ్ఞానం, మత రాజకీయ న్యాయ సారస్వత వైజ్ఞానిక విషయాలు, విశాలభావాలు, దూరదృష్టి, దేవాలయాలు, శాసనకర్తలు, బోధకులు, మతాధిపతులు తదితర అంశాలను ఈ భావం ద్వారా గమనించాలి.

దశమ / రాజ్యభావం : రాజ్యం, గౌరవం, కీర్తి, పితృసుఖం, ప్రవాసం, ఋణాలను పరీక్షించడం, శరీరబలం, రాచకార్యాలు, యంత్రాలు, మంత్రాలు, ఓషధులు, సుఖ జీవనం, రాజులవద్ద ప్రఖ్యాతి, ఇతరులపై దయచూపడం, ముద్రాధికారం, వృత్తి వ్యాపారాలు, సాంఘిక రాజకీయ విషయాలు, తండ్రి, పెద్దలు, అధికారం తదితర అంశాలను దశమభావం ద్వారా గమనించాలి.

ఏకాదశ / లాభభావం : వివిధ వస్తువులు, సంపత్తి, పుత్రుని భార్య, ఆదాయం పశువృద్ధి, అన్ని విధాలైన లాభాలు, దురాశ, ఇతరుల మీద ఆధారపడడం, పినతండ్రి

సాత్వికోపాసన, కళానైపుణ్యం, సంఘాలలో సభ్యత్వం, కంపెనీలలో వాటాలు, సంస్థలు, రాజకీయ పార్టీలు, సమిష్టి ఆశయాలు, ఆదర్శాలు, సంఘవ్యవహారాలను లాభభావం ద్వారా గమనించాలి

ద్వాదశ / వ్యయభావం : ధనవ్యయం, శత్రువుల వృత్తాంతం, జన్మాంతమందలి విషయాలు, నిద్రాభంగం, మనోవ్యథ, పాదాలు, శత్రుభయం, బంధనం, పీడా విముక్తి, చిత్తవైకల్యం, దీనస్వభావం, సుఖంకోసం ఆలోచించడం, దేహసౌఖ్యం లోపించడం, మృతి, ఇతర దేశం వెళ్ళడం, అన్నివిధాల ఖర్చులు, భార్యాహాని, విశ్రాంతి లోపం, విశ్రాంతి భవనాలు, పరాధీనత, రహస్య స్థావరాలు కలలు, భ్రమలు, నిద్ర, మత్తు, దేశాంతరవాసం తదితర అంశాలు ద్వాదశభావం వల్ల గమనించాలి.

4. ఏవైనా గ్రహ కారకత్వాలను వ్రాయండి? (2001), సూర్య శనుల కారకత్వాలు వివరించండి?

జాతక ఫలనిర్ణయానికి గ్రహ, భావ, రాశుల యొక్క కారకత్వాలు పరిపూర్ణంగా తెలిసి ఉండాలి. ఆ యా భావాలు ఏ రాశులకు సంబంధించినవో, ఆ భావాలకు అధిపతులైన గ్రహాలు ఏవో వాటి స్వరూప స్వభావాలు పరిపూర్ణంగా తెలిస్తే తప్ప సరియైన ఫలితాన్ని నిర్ణయించలేం. అందువల్ల జ్యోతిర్విద్యాభ్యాసంలో గ్రహ, భావ, రాశి కారకత్వాలు, స్వరూప స్వభావాలను అధ్యయనం చేయడం తప్పనిసరి. వాటిలో ముందు గ్రహాల గూర్చిన వివరాలు స్థూలంగా అధ్యయనం చేద్దాం.

రవి : గ్రహరాజైన రవి తేనెరంగులాగా పింగళవర్ణం గల నేత్రాలు కలవాడు, సమమైన దేహం కలవాడు, పరిశుద్ధుడు, పిత్తప్రకృతి, ధీమంతుడు, పురుష గ్రహం, తక్కువ కేశసంపద కలవాడు.

శరీరం, పితృప్రభావం, శివోపాసన, ధైర్యం, రుచి, జ్ఞానోదయం, మనశ్శుద్ధి, ప్రవాళం, రాజ్యం, భూషణం, రుధిరం, పిత్తం, కఫం, శిరోవ్యాధి, సాత్వికం, దుర్వ్యయం, ఆత్మ, నేత్రచికిత్స, అక్షి, యజ్ఞం, సువర్ణం, అశ్వం, సింహాసనం, శౌర్యం, దుర్గం, దినబలం, ఉష్ణశక్తి, ఖగోళ పరిజ్ఞానం, రాజాశ్రయం, కెంపు, రాగి, రక్తచందనం,

సృజనాత్మకశక్తి, నిర్వహణ సమర్థత, గౌరవ ప్రతిష్ఠలు, పోషకత్వం, దాతృత్వం, పందేలు, పోటీలు, గౌరవ పదవులు,అధికారం, టీవీ, హుందాతనం, వ్యక్తిత్వం, ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయాలు, పరిపాలన మొదలైన కారకత్వాలుంటాయి.

చంద్ర : వాత కఫ ప్రకృతి కలిగినవాడు, పండితుడు, గుండ్రని శరీరం కలిగినవాడు, శుభదృష్టికలవాడు, మధురమైన వాక్కు కలిగినవాడు, చంచల స్వభావి, కామపీడితుడు చంద్రుడు.

మాతృకారకుడు, సౌఖ్యం, మనస్సు, బుద్ధి, వస్త్రం, జలం, భోజనం, నిద్ర, స్త్రీ, ముఖం, ఉదరం, బాహువులు, రజతం, క్షయం, అపస్మారం, గుల్మం, శక్తి, యశస్సు, సౌందర్యం, ఛత్రం, చామరం, యాత్ర, స్ఫటికం, పట్టువస్త్రాలు, బావి, శుక్రపుష్టి, సంతోషం, రాత్రిబలం, ఆహారపానీయాలు, రసపదార్థాలు, నౌకాయానం, నిత్యావసరాలు, వసతి కల్పన, మాతృవర్గీయులు, బంధువులు, హృదయభావాలు, స్పందన, ప్రతిస్పందన మొదలైన అంశాలు చంద్ర కారకత్వాలవుతాయి.

కుజ : ఎర్రని కండ్లు కలవాడు, క్రూరుడు, చంచలుడు, ఉదార హృదయం కలవాడు, పిత్తప్రకృతి, క్రోధం అధికంగా కలవాడు, కృశించిన మధ్యమదేహం కలవాడు కుజుడు.

భ్రాతృ, భూమి, వ్యవసాయం, యుద్ధం, పరాక్రమం, చోరత్వం, శత్రుత్వం, కోపం, మూర్ఖత్వం, ఆయుధధారణం, యంత్రం, తంత్రం, సేనాధిపత్యం, వాగ్వాదం, ఉష్ణం, పిత్తం, వ్రణాలు, క్షయం, పరదేశగమనం, కామం, ఉద్యానవనం, పరుషభాషణం, గణితం, బంగారం, ఋణం, నాయకత్వం, గుర్తింపు, ప్రాధాన్యం, కార్యారంభ కుతూహలం, ఉత్సాహం, దురుకుదనం, ధైర్యం, సాహసం, ప్రేరణ, చైతన్యం, కలహశీలం, తలబిరుసుదనం, అహంభావం, అహంకారం, దుడుకుదనం, స్వతంత్ర ప్రవర్తన, మహిళలకు భర్తృ కారకత్వం, శరీరంలో తల, మెడ, క్షణికావేశాలకు లోనుకావడం తనకు తోచినట్లు వర్తించడం తదితర అంశాలు కుజకారకత్వాలౌతాయి.

బుధ : సుందరదేహం, శ్లేషతో కూడిన వాక్కు, హాస్యప్రీతి, వాత, పిత్త, కఫ ప్రకృతి, భావప్రకటన, విషయ గ్రహణశక్తి, ఆలోచనా పటిమ బుధ గ్రహ తత్వాలు.

జ్యోతిషం, వేదాంతం, వాణిజ్యం, శిల్పం, యంత్రం, తంత్రం, నపుంసకత్వం, సేవకులు, యుక్తి, విష్ణూపాసన, వ్యాకరణం, పురాణం, మృదువచనం, అశ్వం, కంఠం, నాభి, గుహ్యం, వామకర్ణం, రత్నపరీక్ష, దాయాదులు, సాధుత్వం, మాతులచింత, మైథునం, వాక్కు, విద్య, వినయం, వివేకం, మిత్రుడు, సగోత్రుడు, గణితం, వేదం, పాండిత్యం, శిల్పి, కళాకారుడు, కావ్యకౌశలం, మాతామహుడు, యంత్రాలు, మంత్రాలు, గుర్రం, భయం, నృత్యం, కోశాగారం, తీర్థయాత్రలు, వాయువ్యప్రీతి, గోపురాలు బుధ కారకత్వాలు. మానసిక రుగ్మతలు, మతిభ్రమణం, నరాల బలహీనత, ఉదర వ్యాధులు, మూగతనం, నత్తి మొదలైన వ్యాధులకు ఇతడు కారకుడు.

గురు : విశాలదేహం కలవాడు, పింగళవర్ణం గల కేశాలు, నేత్రాలు కలవాడు, కఫప్రకృతి, ధీమంతం, సర్వశాస్త్ర పారంగత్వం గురుని తత్వం.

ధనం, పుత్రులు, దేహపుష్టి, బుద్ధి, సంపద, మృదుభాషణ, జ్యోతిషం, మేడ, పల్లకి, సింహాసనం, స్వర్గలోక సంచారం, పౌత్రులు, గృహసౌఖ్యం, ఆచారం, దాతృత్వం, వాచాలత్వం, పశుసంపద, హృదయం, తపస్సు, జ్యేష్ఠ సోదరుడు, బంధువులు, బంగారం, నిక్షేపం, వైదూర్యం, కావ్యజ్ఞానం, సద్వ్యయం, వాతం, శ్లేష్మం, అగ్నిమాంద్యం, దంతాలు, మంత్ర, వేదాంత, బ్రాహ్మణ భక్తి శ్రద్ధ, కీర్తి, గౌరవం, విద్య, విజ్ఞానం, ఉన్నతాశయాలు, ఉన్నత విద్యాభ్యాసం, విదేశ వ్యవహారాలు, దూర దృష్టి, శాస్త్రబోధన, పుస్తక ప్రచురణ, ప్రసంగాలు, ప్రసారాలు, శరీరంలో పిరుదులు, తొడలు, రక్తనాళాలు గురు కారకత్వాలవుతాయి.

శుక్ర : సుఖం కలవాడు, సుందరదేహం కలవాడు, శ్రేష్ఠుడు, యోగ్యమైన నేత్రాలు కలవాడు, కావ్యరచన చేసేవాడు, కఫవాత ప్రకృతి కలవాడు, మెలికలు తిరిగిన వెంట్రుకలు కలవాడు శుక్రుడు.

కళత్ర, వివాహ, కీర్తి, నేత్ర, వాహన, సౌందర్య, సరస సల్లాప, నృత్య, గీత, కవిత్వ, రతి, రాజముద్రాధికారం, కామసుఖం, క్రయవిక్రయాలు, ఏనుగు, గుర్రం, వెండి, ముత్యాలు, జారత్వం, వంశం, పుష్పం, గంధం, భోగం, యజుర్వేదం, జలక్రీడ, భరతశాస్త్రం, గాంభీర్యం, జలసంచారం, పరిమళం, అతిమూత్రం, వింజామరలు,

కళానైపుణ్యం, అష్టైశ్వర్యాలు, సింహాసనం, ప్రభుత్వం, భార్యాసుఖం, జన సంబంధాలు, విలాస వస్తువులు శుక్రుని కారకత్వాలు. శరీరంలో గొంతు, మెడ, నాభి, మూత్రపిండాలు ఇతనికి వర్తిస్తాయి.

శని : కృశించిన పొడవైన దేహం కలవాడు, పింగళవర్ణం గల నేత్రాలు కలవాడు, వాతప్రకృతి, పెద్దదంతాలు, ప్రకాశించే సమూహం, కఠినరోమాలు, కేశాలు కలవాడు శని.

ఆయువు, హూణవిద్య, దాస్యం, అనాచారం, నపుంసకత్వం, అబద్ధం, ఔదార్యం, బంధనం, దుఃఖం, జూదం, అడవుల సంచారం, అన్యకులవిద్య, కుచ్ఛితం, పౌరుషం, పాపం, నరకం, మరణం, వాతం, వాద్యధ్వని, జీవనోపాయం, దుస్సహవాసం, కార్యభంగం, కిరాతత్వం, వ్యసనం, మూర్ఖం, నల్లధాన్యం, మహిషం, పితృకారకత్వాలు శనికి ఉంటాయి. ఉపాధులకు అవసరమైన కృషి, కార్యసాధక దృష్టి, క్రమశిక్షణ, ఏ పనికైనా శక్తివంచన లేకుండా శ్రమపడడం, ఓర్పు, నిదానం, సహనం, సుస్థిరత, భద్రత మొదలైన అంశాలు శనికి వర్తిస్తాయి. శరీరంలో మోకాలు, ఎముకలు ఇతనికి సంబంధించినవి.

రాహు : పొగవంటి ఆకారం, నల్లని శరీరం, వనాలలో సంచారం, భయంకరం, వాతప్రకృతి, ధీమంతం రాహువు యొక్క లక్షణాలు.

మాతామహ, హూణవిద్య, ఉద్యానవనం, ఛత్రం, చామరం, రాజ్యం, జూదం, పరదేశగమనం, నీచాశ్రయం, శ్వాస, అన్యభాష, ప్రేతత్వం, కర్మ, ధైర్యం, ప్రతాపం, ధూమం, స్మశానం, తస్కరం, భేదం, వైధవ్యం, వ్యవహారం, వృక్షపతనం, శిలలు, వైరాగ్యం, బలాత్కారం, భ్రష్టత్వం, మహారణ్యం, ఘోరయుద్ధం, ధనార్జన, కష్టసుఖాలు, మహోత్పాతం, జ్వరాపస్మారం, విషూచి, సంకోచం మొదలైనవి రాహు కారకత్వాలు.

కేతు : కేతువు రాహువుల స్వరూపాదుల విషయంలో దాదాపు సమానమైన లక్షణాలే ఉంటాయి.

మోక్షం, గంగాస్నానం, వైరాగ్యం, మంత్రశాస్త్రం, ఐశ్వర్యం, భోగం, భాగ్యం, వేదాంతం, జ్ఞానం, మూఢభక్తి, పిత్తం, లోభం, అన్యభాష, మిత్రభేదం, శూల, స్ఫోటకం,

విషూచి, వ్రణం, శైవదీక్ష, పితామహ, చపలత్వం, బ్రహ్మవేత్తత్వం, మతం, దంభం, నటన, భిక్షాటన, కలహం, వికారం, కీర్తి, ప్రతాపం, కపాలం, పాషాణం స్నేహం మొదలైనవి కేతుకారకత్వాలు.

5. భావబలం ఎన్ని విధాలో వివరించి ఏవేని రెండు బలాలను వివరించండి? (2001) ఒక భావబలాన్ని ఎలా నిర్ణయిస్తారు.

జ్యోతిషశాస్త్రంలో ఫలనిరూపణ చేయాలంటే గ్రహాలయొక్క బలాబలాలను భావబలాలను నిర్ణయించాలి. ఈ బలాబలాలను నిర్ణయించడానికి 6 రకాల ప్రత్యేక అంతర్గత బలాలను చూడాలి. అవి 1. స్థానబలం, 2. దిక్బలం, 3. కాలబలం, 4. చేష్టాబలం, 5. దృక్బలం, 6. నైసర్గికబలం.

1. స్థానబలం : జాతకచక్రంలో గ్రహాలు ఉన్న స్థితినిబట్టి లభించిన బలం స్థానబలం. ఇవి 5 రకాలుగా ఉంటుంది. **ఎ.ఉచ్ఛబలం, బి. సప్తవర్గజబలం, సి. ఓజయుగ్మ రాశ్యంశబలం, డి. కేంద్రబలం, ఇ. ద్రేక్కాణబలం.**

సాధారణంగా స్థానబలాన్ని కొందరు జ్యోతిష్కులు ఉచ్ఛ, మూలత్రికోణ, స్వక్షేత్ర, మిత్ర క్షేత్రాలలో గ్రహస్థితినిబట్టి నిర్ణయిస్తారు. కొందరు షోడశవర్గులరీత్యా బలం నిర్ణయిస్తారు.

ఎ. ఉచ్ఛబలం : ఒకగ్రహం, ఆ గ్రహంయొక్క ఉచ్ఛస్థానానికీ, నీచస్థానానికీ, మధ్యలో ఉండడం వల్ల కలిగే బలాన్ని ఉచ్ఛబలం అంటారు.

బి. సప్తవర్గజబలం : రాశి, హోర, ద్రేక్కాణ, సప్తాంశ, నవాంశ, ద్వాదశాంశ మరియు త్రింశాంశ అనే ఏడువర్గల అధిపతులతో గ్రహానికి ఉన్న శత్రువులతో కలిగే బలాన్ని సప్తవర్గజబలం అంటారు.

సి. ఓజోయుగ్మ రాశ్యంశబలం : గ్రహాలు రాశి, నవాంశ చక్రాలలో బేసి (ఓజ) సరి (యుగ్మ) వర్గులలో ఉండి పొందేబలాన్ని ఓజయుగ్మరాశ్యంశబలం అంటారు.

ఈ. కేంద్రబలం : గ్రహాలు కేంద్రాలు (1,4,7,10) పణఫరాలు (2,5,8,11) ఆపోక్లీమాలు, (3,6,9,12)ల్లో ఉండడంవల్ల పొందే బలాన్ని కేంద్రబలం అంటారు.

ఉ. ద్రేక్కాణబలం : గ్రహాలు అవి ఉన్న ద్రేకాణాన్ని అనుసరించి పొందేబలాన్ని ద్రేక్కాణబలం అంటారు.

2. దిక్బలం : గ్రహాలు వేర్వేరు దిక్కుల్లో ఉండడంవల్ల పొందే బలాన్ని దిక్బలం అంటారు. జన్మలగ్నాన్ని తూర్పుదిశగాను, చతుర్థం ఉత్తరదిశగాను, సప్తమం పశ్చిమంగాను మరియు దశమం దక్షిణదిశగాను భావిస్తారు.

బుధగురులు లగ్నంలో, చతుర్థంలో చంద్ర, శుక్రులు, శని సప్తమంలో, రవి,కుజులు దశమంలో పూర్తి దిగ్బలాన్ని పొందుతారు. ఆయా స్థానాలకు అభిముఖంగా (180) ఉన్న గ్రహాలు పూర్తి బలహీనమవుతాయి. మధ్యలో ఉంటే అనుపాతంద్వారా గుర్తించాలి.

గ్రహస్ఫుటంనుండి ఆయాగ్రహాల అత్యంతబలహీనన స్థానాలయొక్క భాగలను తీసివేయాలి. అది 180 కంటే ఎక్కువ ఉంటే దాన్ని 360 నుంచి తీసివేయాలి. తక్కువ ఉంటే అలాగే ఉంచాలి. ఈ దిగ్బల భావాన్ని 3చే భాగిస్తే ఆ గ్రహం యొక్క దిగ్బలం వస్తుంది.

3. కాలబలం : జాతకుడు జన్మించిన సంవత్సరం, మాసం, వారం, హోర మొదలైన జననకాలన్ననుసరించి గ్రహాలకు కలిగే బలాన్ని కాలబలం అంటారు. ఇది మొత్తం 9 బలాల సమూహం. **అ.నతోన్నతబలం, ఆ.పక్షబలం, ఇ.త్రిభాగఫలం, ఈ.అబ్దబలం, ఉ.మాసబలం, ఊ.వారబలం, ఋ.హోరాబలం, ౠ.అయనబలం, ఎ.యుద్ధబలం.**

4. చేష్టాబలం : గ్రహాలు సూర్యునిచుట్టూ తిరుగుతూ ఉండడంవలన గ్రహానికి కలిగే బలాన్ని చేష్టాబలం అంటారు. భూమినుండి పరిశీలిస్తున్న మనకు గ్రహాలు ముందు వెనుకలు తిరుగుతున్నట్లు కనిపిస్తాయి. దీన్ని వక్రం అంటారు. ఈ వక్రగ్రహాలకు చాపము ఉంటుంది. దీన్ని వక్రచాపమను, చేష్టాకేంద్రమనీ, చేష్టాకేంద్రంలోని మూడవభాగాన్ని చేష్టాబలం అనీ అంటారు.

రవి చంద్రులు ఉత్తరాయణంలో బలం కలవారు. మిగిలిన గ్రహాలు వక్రించినపుడు, గ్రహాయుద్ధంలో గెలిచినపుడూ, పూర్ణచంద్రునితో కూడియున్నపుడూ చేష్టాబలం కలిగి ఉంటారు.

చేష్టాకేంద్రం విలువను తెలుసుకోవడానికి క్రింది సూత్రాన్ని ఉపయోగించాలి. గ్రహంయొక్క మధ్యమ స్ఫుటానికి నిజస్ఫుటానికి సరాసరిని కనుక్కొని వచ్చిన విలువను గ్రహంయొక్క శీఘ్రోచ్చనుండి తీసివేస్తే చేష్టాకేంద్రం యొక్క విలువ వస్తుంది.

5. దృక్బలం : రాశిచక్రంలో గ్రహాల మధ్య ఏర్పడే 'దృష్టి' ఆధారంగా ఏర్పడే బలం 'దృక్బలం' అవుతుంది. ఒక గ్రహం మరొక గ్రహాన్ని చూస్తుంటే, చూసేగ్రహాన్ని ద్రష్ట గ్రహం అని (ఆస్‌పెక్టింగ్ ప్లానెట్) అని చూడబడుతున్న గ్రహాన్ని దృశ్య గ్రహమని (ఆస్‌పెక్టెడ్ ప్లానెట్) అని అంటారు. దృశ్యగ్రహ స్ఫుటంనుండి ద్రష్టగ్రహ స్ఫుటాన్ని తీసివేస్తే 'దృష్టి కేంద్రం' (ఆస్‌పెక్ట్ అంగిల్) వస్తుంది.

6. నైసర్గిక బలం : ప్రతి గ్రహానికి సహజంగా ఉండే బలాన్ని నైసర్గికబలం అంటారు. గ్రహంయొక్క సహజ కాంతిననుసరించి నైసర్గికబలం ఆధారపడి ఉంటుంది. అత్యధిక కాంతిని 60 షష్ట్యంశలుగా నిర్ణయించారు. రవిగ్రహం అత్యధిక అధికమైన కాంతి కలిగి ఉండడంవల్ల ఆ గ్రహానికి 60 షష్ట్యంశల నైసర్గికబలం ఉంటుంది.

60 షష్ట్యంశలను 7చే భాగిస్తే ఒక్కొక్కటి 8.57 షష్ట్యంశల విలువను పొందుతాయి. కాంతిరీత్యా తక్కువనుండి ఎక్కువ కాంతిని విడుదల చేసే గ్రహాలక్రమం ఈ విధంగా ఉంటుంది. కావున శని, కుజ, బుధ, గురు, శుక్ర, చంద్ర, రవులు వరుసగా $60\times1/7$, $60\times2/7$, $60\times3/7$, $60\times4/7$, $60\times5/7$, $60\times6/7$, $60\times7/7$

గ్రహాల నైసర్గిక బలాలు జాతక ఆధారాలుకావు. కాబట్టి అన్ని జాతకులకు సహజంగా ఒకే విధంగా ఉంటాయి.

రెండు గ్రహాలు సమానమైన షడ్బలం కలిగి ఉన్నప్పుడు ఆయా గ్రహాల నైసర్గిక బల విలువ ఆధారంగా అధికంగా నైసర్గికబలం కల్గినగ్రహం యొక్క ప్రభావం జాతకునిపై (రెండవ గ్రహంకంటే) ఎక్కువగా ఉంటుంది అని చెప్పబడింది. ఇది భావేశ బలం.

భావబలాన్ని గణించడానికి భావేశబలం, భావదిగ్బలం, భావదృష్టిబలం కలిపి భావబలంగా గుర్తించబడుతుంది.

భావం - దిగ్బలం :

1. మిథున, కన్యా, తులా కుంభాలు, ధనుస్సు పూర్వార్థం ద్విపద రాశులు. ఇవి లగ్నాలైతే ఒక రూపబలం వస్తుంది. ఇవే సప్తమం అయితే బలం శూన్యం. తక్కిన భావాలైతే అనుపాతం ద్వారా గమనించాలి.

2. మేష వృషభ సింహాలు, ధనుస్సు ఉత్తరార్థం, మకరం పూర్వార్థం చతుష్పద రాశులు. ఇవి దశమభావాలైతే ఒక రూపం బలం వస్తుంది. ఇవే చతుర్థభావమైతే బలం శూన్యం. తక్కిన భావాలైతే త్రైరాశిక పద్ధతి ద్వారా బలం లెక్కించాలి.

3. కర్కాటక, వృశ్చికాలు కీటరాశులు ఇవి సప్తమభావాలైతే ఒక రూపం బలం వస్తుంది. ఇవి లగ్నాలైతే బలం శూన్యం. మధ్యభావాలైతే అనుపాతం ద్వారా లెక్కించాలి.

4. మీనం, మకరంలో పశ్చిమార్థం జలరాశులు. ఇవి చతుర్థభావాలైతే ఒక రూప బలం వస్తుంది. ఇవే దశమాలైతే బలం శూన్యం. తక్కిన భావాలైతే అనుపాతం ద్వారా బలం తెలుసుకోవాలి.

భావం - దృష్టి బలం :

1. గ్రహానికి దృష్టిబలం కట్టినవిధంగానే భావానికి దృష్టిబలం కట్టాలి.

2. భావంపై శుభదృష్టి అధికంగా ఉంటే దానిలో నుండి అశుభదృష్టిని తగ్గించి మిగిలిన దానిని స్వీకరించాలి.

భావేశబలం + భావదృష్టిబలం + భావదిగ్బలం = భావబలం అవుతాయి.

3. భావంపై అశుభదృష్టి ఎక్కువగా ఉంటే శుభదృష్టి బలాన్ని అశుభదృష్టి బలం నుండి తీసివేసి త ందాన్ని భావేశబలం + భావదిగ్బలం కలిపి భావబలంగా పరిగణించాలి.

ఈ విధంగా భావబల నిర్ణయం ఉంటుంది.

6. పంచమహాపురుష యోగాలు ఏవి? అవి ఏర్పడే విధానం తెలుపండి? (2001, 2002)

యోగం అంటే కలయిక అని అర్థం. యోగాలు ఏర్పడడమంటే ఏవైనా అంశాలు కనీసం రెండు కలిసి ఉండాలని అర్థం. రాశి - గ్రహం, గ్రహం-గ్రహం, భావం-గ్రహం, భావం-భావాధిపతి ఇటువంటి అంశాలు రెండు కాని అంతకంటే ఎక్కువగాని కలిసి ఏర్పడితే వానిని యోగాలు అంటారు. అయితే ఈ రకమైన కలయికలను గుర్తుంచుకోవడానికి వీలుగా కొన్ని సూత్రాలు ఉంటాయి. వాటిని యోగాలుగా అధ్యయనం చేయడం జరుగుతుంది.

యోగాలలో శుభయోగాలు, దుర్యోగాలని రెండు రకాలుగా వుంటాయి. శుభ యోగాలవల్ల శుభం, దుర్యోగాలవల్ల ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కొన్ని కొన్ని కలయికలు శుభం కావని, మరికొన్ని శుభమైనవనీ దీని ద్వారా మనకు తెలుస్తోంది. రాజయోగమని చెప్పినంత మాత్రాన అది వ్యక్తిని ఏదో చాలా పెద్దవాణ్ణి చేసేస్తుందనే భావనను ఏర్పరచుకోవడం, నీచయోగం అయినంత మాత్రాన అది వ్యక్తిని అధఃపాతాళానికి తొక్కివేస్తుందనుకోవడం అపోహ. ఎందుకంటె ఆ యా యోగాలను గుర్తించి వాటిని పొందడానికి లేదా నివారించుకోవడానికి వ్యక్తి తగిన ప్రయత్నం చేయకపోతే అవి జీవితానికి వర్తించకుండా వ్యర్థమైపోతుంటాయి. అందువల్ల యోగాలను గుర్తించి వాటిని పొందడానికి అవసరమైనంత కృషి చేయడం అవసరమని జ్యోతిషశాస్త్రం సూచనలు చేస్తుంటుంది. ఆ సూచనలను గమనించి నిత్యజీవనాన్ని ఆనందంగా మలచుకొనే ప్రయత్నం చేయడం వ్యక్తి విధి. యోగాల పేర్లను బట్టి మోసపోయి అనవసర భ్రమలు పెంచుకొనే ప్రయత్నం కూడా మంచిది కాదు.

యోగాలలో ప్రస్తుతం, కొన్ని యోగాలు, అవి ఏర్పడేవిధానాలు, వాటివల్ల కలిగే ఫలితాలను చూద్దాం.

పంచమహాపురుషయోగాలు :

రుచక భద్రక హంసక మాలవాః సశశకాః పంచచ కీర్తితాః

స్వభవనోచ్ఛ గతేషు చతుష్టయే క్షితి సుతాదిషు తాన్ క్రమశో వదేత్

పై శ్లోకం ద్వారా రుచక మహాపురుష యోగం - కుజునికి, భద్రక మహాపురుష యోగం - బుధునికి, హంసక మహాపురుష యోగం - గురునికి, మాలవ్య మహాపురుష యోగం - శుక్రునికి, శశక మహాపురుష యోగం - శనికి ఏర్పడతాయి.

రవిచంద్రులు కాక మిగిలిన గ్రహాల (కుజ, బుధ, గురు, శుక్ర, శని) వల్ల ఈ పంచమహాపురుష యోగాలు ఏర్పడతాయి. ఈ యోగాలు పట్టడానికి ప్రత్యేకమైన సూత్రాలు అవసరమవుతాయి. అవి :

1. ఈ పంచ తారాగ్రహాలు లగ్నానికి గాని, చంద్రునికి గాని కేంద్రాలలోనే ఉండాలి.

2. ఆ కేంద్రస్థానాలు స్వక్షేత్రంగాని, ఉచ్ఛగాని కావాలి.

3. జాతకపారిజాతంలో వైద్యనాథదీక్షితులు ఆ కేంద్రాలు మూల త్రికోణాలు కూడా కావాలని చెప్పారు.

4. సారావళిలో కళ్యాణవర్మ, హోరాసారంలో పృథుయశుడు, బృహజ్జాతకంలో వరాహమిహిరుడు మొ॥వారు కేంద్రాలు షడ్బల సంపన్నాలై వుండాలని చెప్పారు.

ఈ యోగాలపుడు రవిచంద్రులు బలంగా వుంటే ఈ యోగాలు యింకా బలవత్తరమౌతాయి. కాని రవిచంద్రులకు ఈ యోగాలతో సంబంధం లేదు.

ఈ పంచమహాపురుష యోగాలను లగ్నం నుండి గాని, చంద్రుని నుండి గాని చూడవచ్చు. ఈ యోగాలు రాజయోగప్రదాలు. ఉన్నతోద్యోగప్రదాలు. ఈ ఐదు యోగాలలోనూ ఒక యోగం కలిగితే అదృష్టశాలి, రెండు కలిగితే రాజకుమారుడు, మూడుయోగాలు కలిగితే రాజు, నాల్గు యోగాలు కల్గితే చక్రవర్తి, ఐదు యోగాలు కలిగితే నృపేంద్రులు అవుతారు.

రుచక మహాపురుష యోగం :

ఈ యోగం చర, స్థిర రాశుల్లో జన్మించినవారికే పడుతుంది.

మేషం : కుజుడు మేష (స్వ-1), మకరా(ఉచ్ఛ-10)లలో ఉంటే ఈ యోగం పడుతుంది.

వృషభం : సప్తమంలో స్వక్షేత్రమైన వృశ్చికంలో కుజుడుంటే ఈ యోగం. (విశాఖ నక్షత్రమైతే మంచిది)

కర్కాటకం : మకరం (ఉచ్ఛ-7), మేషం (స్వ-10) రాశుల్లో కుజుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది. అశ్వినిలో కుజుడుంటే యోగకారకుడు, భరణిలో ఉంటే యోగ కారకుడు కాడు. సూర్య నక్షత్రాలైన కృత్తిక 1వ పాదంలో ఉంటే మంచి ఐశ్వర్యం ఉంటుంది.

సింహం : ఈ లగ్నానికి చతుర్థ(4), నవమా(9)ధిపతిగా కుజుడు యోగకారకుడు. వృశ్చికం (స్వ-4) లో కుజుడేంటే రుచక మహాపురుష యోగం ఏర్పడుతుంది. దానిలోనూ అనూరాధ, జ్యేష్ఠ నక్షత్రాలలో ఉంటే సామాన్యఫలం, విశాఖ నక్షత్రంలో ఉత్తమఫలం కలుగుతుంది.

తుల : మకరం (ఉచ్ఛ-10), మేషం (స్వ-7) రాశుల్లో కుజుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది. కృత్తిక, శ్రవణాలలో కుజుడుంటే విశేషయోగం.

వృశ్చికం : లగ్నంలో కుజుడుంటే సాధారణ యోగం ఉంటుంది.

మకరం : లగ్నమైన మకరంలోగాని, చతుర్థమైన మేషంలోగాని కుజుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది.

కుంభం : వృశ్చికంలో దశమస్థానంలో కుజుడుంటే ఈ యోగం.

రుచక మహాపురుష యోగం - ఫలాలు : ఈ యోగం ఏర్పడిన జాతకులు కోలముఖం (పొడుగైన ముఖం) కలిగినవారు, ధైర్యవంతమైన పనులు చేసి సంపాదించిన ధనం కలవారు, ధైర్యశాలురు, శత్రువులను జయించువారు, బలవంతులు, గర్వితమతులు, సేనానాయకులు, చేసే పనుల్లో విజయం సాధించేవారు అవుతారు.

మానసాగరి ప్రకారం ఈ యోగజాతకులు దీర్ఘాయుష్మంతులు, సుందరకాంతితో కూడినవారు, అధికరక్తబలం కలవారు, సాహస కార్యసిద్ధి కలవారు, మనోహరమైన భ్రూయుగం కలవారు, నల్లని కేశాలు కలవారు, సమమైన కరచరణాలు కలవారు, మంత్రజ్ఞులు, ఉత్తర కీర్తివంతులు, ఎరుపురాశి మిశ్రీకృత శరీరం కలవారు, సరళమైన అంగిలి కలవారు, మంత్ర కార్యాలలో కుశలురు, కటి ప్రదేశం, కంఠం పొడుగ్గా

ఉండేవారవుతారు. దీర్ఘాయుష్మంతులు 70 సంవత్సరాలు ఆయువు కలవారు, శస్త్ర, అగ్ని చిహ్నాలు కలవారు అవుతారు.

భద్ర మహాపురుష యోగం :

ఈ యోగం ద్విస్వభావ రాశులవారికి మాత్రమే ఏర్పడుతుంది.

మిథునం : లగ్నంలో బుధుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది. కన్యలో చతుర్థ స్థానంలో బుధుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది.

కన్య : లగ్నంలో బుధుడున్నా, దశమమైన మిథునంలో బుధుడున్నా ఈ యోగం ఏర్పడుతుంది.

ధనుస్సు : సప్తమమైన మిథునంలో బుధుడున్నా, దశమమైన కన్యలో బుధుడున్నా ఈ యోగం ఏర్పడుతుంది.

మీనం : చతుర్థమైన మిథునంలో బుధుడున్నా సప్తమమైన కన్యలో బుధుడున్నా ఈ యోగం ఏర్పడుతుంది.

భద్ర మహాపురుషయోగం – ఫలితాలు : శార్దూల ప్రతిమా సమానులు, గొప్పనైన భుజ వక్షస్థలాలు కలవారు, మంచి నడవడి, నడక కలవారు, దీర్ఘబాహుయుగళం కలవారు, చక్కని కంఠం కలవారు, విద్వాంసులు, పద్మాలవంటి చేతులు, కాళ్ళు కలవారు, చక్కని విచక్షణ కలవారు అవుతారు.

మానసాగరి ప్రకారం పాదాలలోనూ చేతులలోను శంఖ, అసి, హస్తి, గద, పుష్ప, శర, నికేతన, చక్ర, హల, కమలాది భద్ర చిహ్నాలు కలవారు, సుగంధ విరాజితమైన శరీరం కలవారు, సుశబ్ద వచో విశాలురు అవుతారు. 80 ఏండ్లు జీవించేవారవుతారు.

ఫలదీపిక ప్రకారం ఈ యోగ జాతకులు దీర్ఘాయుష్మంతులు, కుశాగ్రబుద్ధి కలవారు, స్వచ్ఛమైన దేహం కలవారు, విద్యావంతులు, ప్రశంసలను పొందెవారు, రాజు, ధనాఢ్యులు, చక్కని ఉపన్యాసకులు అవుతారు.

హంస మహాపురుష యోగం :

ఈ యోగం గురుని వల్ల ఏర్పడుతుంది. చర, ద్విస్వభావ రాశులకు మాత్రమే ఈ యోగం ఏర్పడుతుంది.

మేషం : చతుర్థంలో కర్కాటకంలో ఉచ్చలో గురుడున్నప్పుడు ఈ యోగం ఏర్పడుతుంది. ఇందులోనూ పునర్వసూ నక్షత్రమైతే మంచిది.

మిథునం : గురువు సప్తమమైన ధనుస్సులో స్వక్షేత్రంలో ఉన్నా, దశమమైన మీనంలో స్వక్షేత్రంలో ఉన్నా ఈ యోగం కలుగుతుంది. సప్తమంలో ఉంటే తల్లిదండ్రుల కన్నా కీర్తివంతుడవుతాడు. లగ్నాన్ని గురువు చూస్తే చాలా దోషాలు పోతాయి. గురువు స్థితి కన్నా దృష్టి మంచిది.

కర్కాటకం : గురువు లగ్నంలో ఉచ్చలో ఉంటే ఈ యోగం ఏర్పడుతుంది. దీని వల్ల అన్ని సుఖాలు కలుగుతాయి కాని సంతానయోగం వుండదని పరిశీలకుల భావన. పునర్వసూ, పుష్యమీ నక్షత్రాలైతే మంచిది.

కన్య : చతుర్థమైన ధనుస్సులో గాని, సప్తమమైన మీనంలో గాని స్వక్షేత్రాల్లో ఉన్నప్పుడు ఈ యోగం కలుగుతుంది. చతుర్థంలో ఉంటే మంచి విద్య, సప్తమంలో ఉంటే సంసార సుఖం కలుగుతాయి.

తుల : దశమంలో ఉచ్చలో కర్కాటకంలో గురువుంటే ఈ యోగం ఏర్పడుతుంది.

ధనుస్సు : లగ్నంలో స్వక్షేత్రంలో ఉన్నా, చతుర్థంలో మీనంలో గురుడు ఉన్నా ఈ యోగం ఏర్పడుతుంది. ఉత్తరాషాఢ, పూర్వాభాద్ర నక్షత్రాలైతే మంచిది.

మకరం : కర్కాటకంలో సప్తమంలో ఉచ్చలో గురుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది.

మీనం : లగ్నంలో గాని, దశమమైన ధనుస్సులో గాని గురుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది.

ఈ యోగం గురువు వల్ల ఏర్పడుతుంది. ఈ జాతకులు సుగుణాలను కలిగినవారు, చేతులందు, పాదాల్లో శంఖ, పద్మ, మత్స్య, అంకురాది రేఖలు కలిగిన వారు, సుందరాకృత శరీరం కలవారు, ధార్మికులు అవుతారు.

మాళవ్య మహాపురుష యోగం :

ఈ యోగం శుక్రునివల్ల ఏర్పడుతుంది. ఇది చర, స్థిర రాశులవారికి మాత్రమే ఏర్పడే యోగం.

మేషం : సప్తమాధిపతి శుక్రుడు సప్తమమైన తులలో వుంటే ఈ యోగం ఏర్పడుతుంది.

వృషభం : లగ్నమైన వృషభంలో శుక్రుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది. షష్ఠాధిపత్యం వల్ల ఈ యోగం సాధారణమౌతుంది.

కర్కాటకం : చతుర్థమైన తులలో శుక్రుడుంటే ఈ యోగం కలుగుతుంది.

సింహం : దశమమైన వృషభంలో శుక్రుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది. వీరు స్వశక్తివల్ల పైకి వస్తారు.

తుల : లగ్నంలో శుక్రుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది. అష్టమాధిపత్యం వల్ల ఈ యోగం సామాన్యమౌతుంది.

వృశ్చికం : సప్తమమైన వృషభంలో శుక్రుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది.

మకరం : దశమమైన తులలో శుక్రుడుంటే ఈ యోగం కలుగుతుంది. దశమంలో శుభగ్రహానికి కేంద్రాధిపత్యదోషం ఏర్పడినా, శుక్రునికది మూలత్రికోణం కావడం వల్ల దోషఫలితం తగ్గి వృత్తిలో ఎదగడం, గౌరవమర్యాదలు, కీర్తి ప్రతిష్ఠలు పొందడం జరుగుతుంది.

కుంభం : చతుర్థస్థానమైన వృషభంలో శుక్రుడుంటే ఈ యోగం ఏర్పడుతుంది.

ఈ యోగజాతకులు పరిపుష్టి గల దేహం కలవారు, వాహనాలు కలవారు, ధనసంతులు, భార్యా సంతానం కలవారు, అదృష్టశాలి, అభివృద్ధి కలవారు, సుఖాసన పరులు, ప్రసన్నమైన పంచేంద్రియాలు కలవారౌతారు.

సారావళి ప్రకారం స్థూలమైన అధరాలు కలవారు, సమశరీరాకృతి కలవారు, ఆజానుబాహులు, 70 ఏళ్ళు జీవించేవారవుతారు.

శశక మహాపురుష యోగం :

ఈ యోగం శనివల్ల ఏర్పడుతుంది. ఇది చర, స్థిర రాశులవారికి మాత్రమే ఏర్పడే యోగం.

మేషం : సప్తమమైన తులలో ఉచ్చలో శని ఉన్నా, దశమమైన మకరంలో స్వక్షేత్రంలో శని ఉన్నా ఈ యోగం ఏర్పడుతుంది.

వృషభం : శని (దశమం) కుంభంలో ఉంటే ఈ యోగం ఏర్పడుతుంది. శని దశమంలో ఉంటే రాజకీయంగా మంచిది.

కర్కాటకం : శని తులలో చతుర్థంలో ఉన్నా మకరంలో సప్తమంలో ఉన్నా ఈ యోగం కలుగుతుంది. విశాఖలో ఫలితాలు మామూలుగా ఉంటాయి.

సింహం : సప్తమమైన కుంభంలో శని ఈ యోగాన్ని కలిగిస్తాడు.

తుల : లగ్నంలోనూ, చతుర్థమైన మకరంలోనూ శని ఉంటే ఈ యోగం ఏర్పడుతుంది.

వృశ్చికం : చతుర్థమైన కుంభంలో శని ఉంటే ఈ యోగం పడుతుంది. కాని, ఇది పెద్దగా అనుభవంలోకి రావడంలేదు.

మకరం : లగ్నమైన మకరంలో గాని, దశమమైన తులలో ఉచ్చలో గాని శని ఉంటే ఈ యోగం ఏర్పడుతుంది.

కుంభం : లగ్నంలో శని ఉన్నప్పుడే ఈ యోగం ఏర్పడుతుంది.

ఈ యోగం పరిపూర్ణంగా అనుభవంలోకి రావడానికి శనికి గురు లేదా శుక్రుల సంబంధం ఉండాల్సి ఉంటుంది.

ఈ యోగజాతకులు సర్వజనానురక్తులు, సేవాపరాయణులు, బలశాలి, గ్రామపెద్ద లేదా రాజు అయినప్పటికీ కొంత చెడు ప్రవర్తన, పరధనభోగం, సుఖపడేవారు అవుతారు.

7. చంద్రునివలన ఏర్పడు యోగాలు ఎన్ని వాటి ఫలితాలు వివరించండి? (2000)

చంద్ర సంబంధ యోగాలు :

1. అనఫయోగం : చంద్రునికి ద్వాదశస్థానంలో ఏ గ్రహమైనా (కుజాది పంచగ్రహాలు మాత్రమే) ద్వితీయంలో గ్రహం లేకుంటే అది అనఫ యోగం అవుతుంది.

ఈ జాతకులు వినయవిధేయతలు కలిగి, ధనవంతులు, అధికారులు అవుతారు. తృప్తితోనూ, సుఖంతోనూ జీవింత గడుపుతారు. సువస్త్రధారులవుతారు.

2. సునఫయోగం : చంద్రునికి ద్వాదశంలో గ్రహం లేకండడా ద్వితీయంలో ఏ గ్రహమైనా వుంటే సునఫయోగం అవుతుంది.

ఈ యోగంలో పుట్టినవారు స్వార్జితంతో రాజుగనో, రాజసమానునిగనో ఉంటాడు. తన ఔన్నత్యం చేత, విజ్ఞానం చేత ఖ్యాతిపొందేవారవుతారు.

3. ధుర్ధురయోగం : చంద్రునికి 2, 12 స్థానాల్లో గ్రహాలన్నీ ఉంటే దుర్ధురా యోగం ఏర్పడుతుంది.

దుర్ధురాయోగ సంభూతులు సుఖం, భోగం, ధనం, వాహనాలు కల్గి సేవకా గణంతో ఆనందంగా ఉంటారు.

4. కేమద్రుమయోగం : చంద్రునికి 2,12 స్థానాల్లో గ్రహాలు లేకుండా- చంద్రునితోగాని, చంద్ర కేంద్రాల్లోగాని గ్రహాలు లేకుంటే కేమద్రుమ యోగం అవుతుంది.

ఈ యోగంలో పుట్టినవారు రాజకులంలో పుట్టినవాడైనా నిరంతరం దుఃఖాన్ని అనుభవించేవారు, నీచమార్గానువర్తులు, దారిద్ర్య పీడితులు, అల్పభావంతో ఉండేవారు, మోసగాళ్ళు అవుతారు.

ఇవే కాక చంద్రసంబంధంగా గురువుతో కలయిక వల్ల గజకేసరీయోగం, కుజునితో కలయిక వల్ల చంద్రమంగళయోగం, ఇంకా చంద్రాధియోగాదులు ప్రత్యేకంగా గుర్తించబడినాయి.

8. సూర్య సంబంధ యోగాలు :

1. వేసియోగం : చంద్రుడు తప్ప కుజాది పంచగ్రహాలు ఏవైనా రవికి ద్వితీయంలో ఉంటే వేసియోగం అవుతుంది. శుభగ్రహాలు ద్వితీయంలో ఉంటే శుభవేసి, పాపగ్రహా లుంటే పాపవేసి యోగం అవుతుంది.

శుభవేసి జాతకులు అతి రూపవంతులు, సుఖంగా వుండేవారు, గుణనిధులు, ధీరులు, రాజులు అవుతారు. పాపవేసి జాతకులు అకారణ జననిందకులు, విగత రూపవంతులు, హీనజనప్రియులుగా వుంటారు.

2. వాసియోగం : చంద్రుడు తప్ప కుజాది పంచగ్రహాలేవైనా రవికి 12వ స్థానంలో ఉంటే వాసి యోగం అవుతుంది. శుభగహాలుంటే శుభవాసి అనీ, పాపగ్రహా లుంటే పాపవాసియోగం అంటారుచ.

శుభవాసి యోగసంభూతులు ఖ్యాతిపరులు, సకలజన ప్రియులు, దాత, రాజప్రియులుగా వుంటారు.

పాపవాసి యోగజాతకులు మోసకారులు, పరనిందకులు, కుయుక్తులతో వుండేవారి స్నేహం చేసేవారు. ఋజువర్తనా హీనులు మొదలైన అవలక్షణాలు కలిగిన వారవుతారు.

3. ఉభయచరియోగం : రవికి 2,12 స్థానాల్లో శుభగ్రహాలుంటే ఉభయచరీ యోగం అనబడుతుంది. శుభగ్రహాలైతే శుభ ఉభయచరి, పాపగ్రహాలైతే పాపోభయచరి యోగం అవుతుంది.

శుభోభయచరి అయితే అందమైన అవయవ సౌష్టవం గలవారు, ప్రియవాక్కులు గల్గవారు, రసికులు, వాక్పటిమ కలవారు, ధన యశోవిశాలురు అవుతారు.

పాపోభయచరి అయితే లోకాపవాదాన్ని పొందేవారు, దుఃఖిత మనస్సు కలవారు, విద్యాధన చ్యుతి (హీనత) పొందినవారు అవుతారు.

9. గ్రహాలకు గల అవస్థలు, ఋజుగతి వక్రగతిని తెలుపండి? (2000)

గ్రహాలకు వాటి గమనాన్ని భూగోళంపై పరిశీలకుని రీత్యా ప్రత్యేక గమనాలు ఉన్నాయి. ఆ గమనాలన్నీ కేవలం తారా గ్రహాలకే పరిమితం. తారా గ్రహాలంటే తారల్లాగా కనపడతూండేవి మాత్రమే. అవి 1. బుధ 2. శుక్ర 3. కుజ 4. గురు 5. శని గ్రహాలు. ఈ గ్రహాలకున్న ప్రత్యేకమైన గతులు 3. అవి 1. వక్రం 2. అతిచారం 3. స్తంభన.

వక్రం : రవి చంద్రులకు వక్రగతి ఉండదు. రవి స్థిరమైనవాడుగా ఉండి తన చుట్టూ అనేక గ్రహాల సంచారాలకు కారకుడవడం వల్ల రవికి వక్రగతి ఉండే అవకాశం లేదు. రవి నిజానికి చరించడు. భూచలనం వల్ల రవి సంచరిస్తున్న ట్లనిపిస్తుంది. అందువల్ల కూడా రవికి వక్రగతి లేదు. అదే విధంగా చంద్రుడు భూమికి ఉపగ్రహం. భూమి చుట్టూ తిరిగే ఇది గ్రహం కూడా కాదు కాబట్టి దీనికి కూడా వక్రగతి లేదు. కేవలం భూమితో సమానంగా తిరిగే ఇతర గ్రహాలకే ఈ ప్రత్యేకమైన గతులు భూ గ్రహంపైని పరిశీలకులకు అగుపిస్తాయి. కారణం ఆ గ్రహాలతో పాటు భూమి కూడా చలించడం వల్ల మాత్రమే.

నిజానికి ఏ గ్రహానికి వక్రం కాని, ఇతరమైన ఏ ప్రత్యేకమైన గతి ఉండదు. వేరు వేరు గ్రహాలు వేరు వేరు కక్ష్యల్లో సంచరిండం వల్ల వాటి గమన వేగాలు వేరు వేరుగా ఉండడం వల్ల భూమిపై ఉన్న వారికి ఈ విధమైన గతులు కనిపించే అవకాశం ఉంది. భూమికి సూర్యునికి మధ్యలో ఉండడం వల్ల బుధ, శుక్రులు, మిగిలిన గ్రహాలకు, సూర్యునికి మధ్యలో భూమి కూగా ఉండడం వల్ల ఇతర గ్రహాలు వక్రాది గతుల్లో కనిపించే అవకాశం ఉంటుంది.

భూమి మీది ఒక స్థిరమైన బిందువు వద్ద పరిశీలకుడు ఒక గ్రహాన్ని పరిశీలిస్తున్నపుడు ఆ గ్రహానికి చెందిన కక్ష్యాను కూలంగా ఆ గ్రహం కనిపిస్తుంది. ఉదాహరణకు కుజుడు భూమి తరువాత ఉన్న గ్రహం. ఈ గ్రహాన్ని ఒక ప్రత్యేకమైన ప్రదేశంలో ఒక పరిశీలకుడు చూస్తున్నప్పుడు ఒక నక్షత్రంలో కనిపిస్తుంది. భూమి, కుజుడు వేరు వేరు వృత్తాల్లో సంచరించడం వల్ల భూమి కొంత ముందుకు వెళ్ళిన

తర్వాత మళ్ళీ కుజుణ్ణి చూస్తే దాని గమన వేగం, కక్ష్య కొంత భిన్నంగా ఉంటాయి. కాబట్టి కుజుడు ఇంతకు ముందు కనిపించిన నక్షత్రం కన్నా కొంచెం వెనుకవైపు జరిగినట్లు అగుపిస్తాడు. భూ కక్ష్యావలయం చిన్నది కావడం, కుజ కక్ష్యా వలయం పెద్దది కావడం దీనికి కారణం. ఇక్కడ అగుపించడమే ప్రధానం కాని నిజంగా వక్రగతి ఏ గ్రహానికి కూడా ఉండదు.

రెండు గ్రహాలు గమనంలో ఉంటూ మొదట సమానంగా కనిపించడం, ఒక గ్రహం కొంచెం ముందుకు వెళ్ళడం వల్ల రెండవ గ్రహం కూడా కొంచెం వెనుకకు కనిపించడం జరుగుతుంది. ఈ స్థితినే వక్రగతి లేదా రిట్రాగ్రేడ్ మోషన్ అని అంటారు. వేరు వేరు గ్రహాలకు వక్రగతి సమయాలు ఈ విధంగా ఉంటుంది.

గ్రహం	వక్రగతికాలం	స్థిరంగా ఉండేకాలం	వక్రంగా ప్రారంభం అయ్యేటప్పుడు రవి నుండి దూరం	తిరిగి ఋజు మార్గంలో
బుధుడు	24 రోజులు	1రోజు	14 -20 డిగ్రీలు	17-20 డిగ్రీలు
శుక్రుడు	42 రోజులు	2 రోజులు	29 డిగ్రీలు	29 డిగ్రీలు
కుజుడు	80 రోజులు	3 రోజులు	228 డిగ్రీలు	132 డిగ్రీలు
గురుడు	240 రోజులు	5 రోజులు	245 డిగ్రీలు	115 డిగ్రీలు
శని	140 రోజులు	5 రోజులు	251 డిగ్రీలు	109 డిగ్రీలు
ఇంద్ర	115 రోజులు	6 రోజులు	251 డిగ్రీలు	103 డిగ్రీలు
వరుణ	157 రోజులు	6 రోజులు	259 డిగ్రీలు	111 డిగ్రీలు
యమ	160 డిగ్రీలు	7 రోజులు	260 డిగ్రీలు	109 డిగ్రీలు.

గ్రహాలు – దశావస్థలు :

1. స్వస్థావస్థ : స్వక్షేత్రంలో ఉన్న గ్రహం స్వస్థావస్థను పొందుతుంది.
2. దీప్తావస్థ : ఉచ్ఛక్షేత్రంలో ఉన్న గ్రహం పొందే అవస్థ

3. ముదితావస్థ : మిత్రక్షేత్రంలో ఉన్న గ్రహావస్థ.

4. శాంతావస్థ : సమక్షేత్రంలో ఉన్న గ్రహం పొందేస్థితి.

5. శక్తావస్థ : వక్రించి ఉన్న గ్రహం యొక్క అవస్థ.

6. పీడావస్థ : రాశి అంతంలో 9వ పాదంలో ఉన్న గ్రహం పీడావస్థ.

7. దీనావస్థ : శత్రుక్షేత్రంలో ఉన్న గ్రహం పొందే అవస్థ.

8. వికలావస్థ : అస్తంగతమైన గ్రహం పొందే అవస్థ.

9. ఖలావస్థ : నీచయందున్న గ్రహం పొందే అవస్థ.

10. భీతావస్థ : అతిచారమందున్న గ్రహం పొందే అవస్థ.

స్వస్థ, దీప్త, ముదిత, శాంతావస్థల్లోని గ్రహాలు శుభఫలితాలను ఇస్తాయి. శక్తావస్థలో శుభగ్రహాలు వక్రిస్తే శుభాన్ని, అశుభగ్రహాలు వక్రిస్తే ఇబ్బందులను కలిగిస్తాయి. పీడ, దీన, వికల, ఖల, భీతావస్థలలోని గ్రహాలు అశుభఫలితాలను గాని, పూర్తిఫలితాలను ఇవ్వకపోవడం గాని చేస్తాయి.

10. నక్షత్రములు ఎన్ని? వాటికిగల గ్రహాధిపత్యము తెల్పుము? (2000)

నక్షత్రాలు మొత్తం 27. వీటికి 9 గ్రహాల ఆధిపత్యం ఉంటుంది. గ్రహాధిపత్యం వింశోత్తరీ దశల ఆధారంగా జరుగుతుంది. వింశోత్తరీ దశావిధానానికి ఒక ప్రత్యేకమైన పద్ధతి ఉంది. వింశోత్తరి అంటే 120 సంవత్సరాల ప్రమాణం. వేరు వేరు నక్షత్రాలకు వేరు వేరు గ్రహాలు ఆధిపత్యం వహించి వారికి సంబంధించిన దశాంతర్దశల్లో శుభాశుభ ఫలితాన్ని ఇస్తుంటాయి. ఆ యా నక్షత్రాలకు గల గ్రహాధిపత్యాన్ని ఈ విధంగా గమనించవచ్చు.

ఇన శశి కుజ రాహుర్జీవ మందజ్ఞః కేతుః
భృగురితి నవానాం కృత్తికాది క్రమేణ

కృత్తికా నక్షత్రం నుండి వరుసగా రవి, చంద్ర, కుజ, రాహు, గురు, శని, బుధ, కేతు, శుక్ర గ్రహాలు అధిపతులవుతున్నారు.

కృత్తిక	ఉత్తర	ఉత్తరాషాఢ	రవి	6 సం॥
రోహిణి	హస్త	శ్రవణం	చంద్ర	10 సం॥
మృగశిర	చిత్త	ధనిష్ట	కుజ	7 సం॥
ఆరుద్ర	స్వాతి	శతభిషం	రాహు	18 సం॥
పునర్వసు	విశాఖ	పూర్వాభాద్ర	గురు	16 సం॥
పుష్యమి	అనూరాధ	ఉత్తరాభాద్ర	శని	19 సం॥
ఆశ్లేష	జ్యేష్ఠ	రేవతి	బుధ	17 సం॥
మఖ	మూల	అశ్విని	కేతు	7 సం॥
పుబ్బ	పూర్వాషాఢ	భరణి	శుక్ర	20 సం॥
				120 సం॥లు

11. ఒక మహాదశలో అంతర్దశల గణితాన్ని నిర్ణయించే విధానం వివరిస్తూ కుజ మహాదశలో అంతర్దశల కాలాన్ని తెలియజేయండి? (2002) రవిమహర్దశ, అంతర్దశలను క్రమంగా పేర్కొని అంతర్దశలను లెక్కించే పద్ధతిని తెలుపండి?

ఒక మహాదశ అదే అంతర్దశతో ప్రారంభమౌతుంది. అంతర్దశల ప్రమాణ గణనకు ఒక ప్రత్యేక విధానం ఉంది.

జననకాల మహాదశానాథుని ప్రమాణాన్ని అంతర్దశానాథుని ప్రమాణంతో గుణించగా ఒకట్ల స్థానంలో సంఖ్య తప్ప మిగిలిన సంఖ్యలన్నీ నెలలవుతాయి. ఒకట్ల స్థానంలోని సంఖ్యను 3 తో గుణిస్తే అవి రోజులవుతాయి. ఉదాహరణకు రవి మహాదశలోని వేరు వేరు అంతర్దశలను పరిశీలిద్దాం.

రవి మహాదశా ప్రమాణం 6 సంవత్సరాలు. పై సూత్రం ప్రకారం

సం.నె.రో

రవిలో రవి 6 **X** 6 = 36 (6**X**3=18) - 0. 3.18

రవిలో చంద్ర	6 X 10= 60 (0X3=0) - 0. 6.00
రవిలో కుజ	6 X 7 = 42 (2X3=6) - 0. 4.06
రవిలో రాహు	6 X18 = 108(8X3=24) -0.10.24
రవిలో గురు	6 X16 = 96 (6X3=18) - 0.09.18
రవిలో శని	6 X19= 114(4X3=12) - 0.11.12
రవిలో బుధ	6 X17= 102(2X3=06) - 0.10.06
రవిలో కేతు	6 X 7 = 42 (2X3=6) - 0. 4.06
రవిలో శుక్ర	6 X20 = 120(0X3=0) - 1.00.00

రవి మహాదశ	6.00.00

ఈవిధంగా అంతర్దశా ప్రమాణాలను లెక్కించుకోవచ్చు.

12. స్వక్షేత్రాలలోగల షష్ఠాష్ట వ్యయభావాధిపతులు తమ దశలలో ఎట్టి ఫలితాలిస్తారు? (2002)

భావాధిపతి తాను స్థితిని పొందిన భావ ఫలాలను, తన కారకత్వ ఫలాలను తన దశలో ఇస్తాడు. లగ్న చంద్రులలో బలమైన స్థానాన్ని లగ్నంగా భావించి అక్కడినుండి భావాధిపతి ఉపచయస్థానాలను, ఉచ్ఛ, స్వక్షేత్ర, మిత్ర క్షేత్రాలను పొందినపుడు శుభగ్రహసంబంధం, మిత్రగ్రహ సంబంధం కలిగినపుడు ఆ దశ అనుకూలంగా ఉంటుంది.

షడ్బలయుతుడైన గ్రహం పరమోచ్చను పొందితే అతని దశలో శుభఫలాలు, ఆరోగ్యం, ధనప్రాప్తి కలుగుతాయి. ఇటువంటి గ్రహం ఉచ్చను పొందితే ఈ దశలో ధనలాభం కలుగుతుంది. బలహీనుడై నీచను పొందిన గ్రహందశలో ధననష్టం, అనారోగ్యం, దారిద్ర్యం కలుగుతాయి. శత్రు క్షేత్రంలో ఉంటే చిన్న వ్యాధి, కొంత ధననష్టం కలుగుతాయి. పరమ నీచను పొంది బలహీనుడైన గ్రహదశలో అన్నీ కష్టాలే కలుగుతాయి.

వర్గోత్తమ గ్రహం స్వక్షేత్రగ్రహంతో సమానం. ఈ దశ శుభప్రదం. ఈ గ్రహానికి కేంద్రాధిపత్యదోషం వస్తే ఫలం స్వల్పంగా ఉంటుంది. వర్గోత్తమ గ్రహం సహజపాపియై కేంద్రాధిపత్యం పొందితే మిక్కిలి శుభదాయకమవుతుంది. ఈ గ్రహం అస్తంగతమయినా, నీచను పొందినా మిశ్రమఫలితాలు ఉంటాయి. దశానాథుడు 2,3,11 భావాలకధిపతి అయితే సామాన్య ఫలాన్ని, 6,8,12 భావాలకధిపతి అయితే పాప ఫలాలను ఇస్తాడు. సప్తమాధిపతి బంధుమరణం కూడా కలిగిస్తాడు. వ్యయాధిపతి ఆందోళన, అపజయం కలిగిస్తాడు. పంచమాధిపతి దశలో అధికారవృద్ధి కలుగవచ్చు. అష్టమ వ్యయాధిపతులు పరివర్తనం పొందితే శుభ ఫలితాన్నిస్తారు.

షష్ఠాధిపతిగాని అష్టమాధిపతిగాని వ్యయాధిపతిగాని స్వక్షేత్రస్థితి పొందితే ఆ దశ శుభదాయకమవుతుంది. మండల(బింబ) గ్రహం అష్టమాధిపతి అయినా మారకుడు కాదు. పాపి అయిన దశానాథుడు లగ్నంలో ఉంటే మరో పాపగ్రహ భుక్తిలో పాప ఫలం కనబడుతుంది. దశానాథుడు లగ్నానికిగాని, లగ్నాధిపతికిగాని ద్వితీయంలో ఉంటే ప్రతికూల ఫలాలు కలుగుతాయి. నీచను పొందినగ్రహం తన దశలో పాప ఫలాన్నిస్తుంది. పాపగ్రహం 3,6,8,12 రాశుల ఆధిపత్యాలను పొంది ఆ స్థానాల్లో ఉంటే పాపఫలాలెక్కువగా ఉండవు. పాపగ్రహాలు దుస్థానాలకు అధిపతులయినా వారిదశ, దశాక్రమంలో అయిదవదికాని, ఏడవదికాని అయితే ఆ దశల్లో పాప ఫలాలు కలుగుతాయి. శుభఫలితాలు కొంచెంగా ఉంటాయి.

13. బాలారిష్టం అంటే ఏమిటో తెల్పి, బాలారిష్ట యోగాలు, బాలారిష్ట నక్షత్రాలు, బాలారిష్ట భంగాలను గురించి వివరించుము? (2003)

12 సం॥ల లోపు చిన్నపిల్లలు చనిపోతే దానిని బాలారిష్టము అని అంటారు.

చంద్రాష్టమంచ ధరణీసుత సప్తమంచ
రాహుర్నవంచ శనిజన్మ గురుస్తృతీయే
అర్కస్తుపంచ భృగుషట్క బుధశ్చతుర్థే
కేతువ్యయస్తు జనితో మరణాయసద్యః

లగ్నాత్తు 8లో చంద్రుడు, 7లో కుజుడు, 9లో రాహువు, లగ్నంలో శని, 3లో గురుడు, 5లో రవి, 6లో శుక్రుడు, 4 బుధుడు, 12లో కేతువు ఉంటే బాలారిష్టం ఏర్పడుతుంది. ఈ గ్రహదశలలో జననం అయితే ఈ బాలారిష్ట ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో శిశువు మరణించే అవకాశం ఉంటుంది.

గురువు లగ్నంలో ఉండి, చంద్రుడు అష్టమంలో ఉండి, షష్ఠద్వాదశాలను రాహువు చూస్తున్నా బాలారిష్టం ఏర్పడుతుంది. అంతే గాక చంద్రుడు గండాంత నక్షత్రంలో ఉండి పాపగ్రహాలతో చూడబడుతున్నా శిశువు తొందరగా మరణిస్తాడు.

జన్మలగ్నానికి అష్టమం కుజస్థానమై మేష వృశ్చికాలలో ఒకటై అందులో గురువుండి శుక్రుడి దృష్టి ఉంటే లేక సూర్య చంద్ర కుజ శనులతో చూస్తుంటే ఆ శిశువు 3 సంవత్సరాలలోపు మరణిస్తాడు. శని వక్రించి మేషంలోకానీ వృశ్చికంలో కాని ఉండి కుజునితో చూడబడుతున్న షష్టాష్టమాలలోకాని కేంద్రాలలోకాని ఉంటే శిశువు జన్మించిన తర్వాత 2 సం॥రాలలోపు మరణిస్తాడు.

రవి శని కుజులు ముగ్గురు కానీ ఈ ముగ్గురిలో ఏ ఒక్కరిలో కానీ జన్మలగ్నంలోకానీ, 4,7,10 స్థానాలల్లో ఉన్న శిశువు జన్మించిన 10 రోజులలో కాని 10 నెలలోకానీ 10 సంవత్సరాలలో కానీ మరణిస్తారు.

బాలారిష్ట భంగాలు : లగ్నాధిపతి బలంగా ఉండి శుభగ్రహయుతిగాని దృష్టిగాని కలిగి కేంద్రస్థితిని పొంది పాపగ్రహ యుతి, దృష్టులు లెకుంటే బాలారిష్టం పోతుంది. పూర్ణచంద్రునిపై శుభగ్రహయుతి దృష్టులుండి శుభరాశి, నవాంశలలో గాని, స్వ, ఉచ్ఛ, మిత్ర వర్గాల్లోగాని ఉంటే బాలారిష్టం పోతుంది.

గురు, శుక్ర, బుధులలో ఒకరైనా కేంద్రాలలో పాప సంబంధం (యుతి, దృష్టి) లేకుండా ఉంటే బాలారిష్టం పోతుంది. శుక్లపక్షంలో రాత్రిగాని, కృష్ణపక్షంలో పగలు జన్మించి చంద్రుడు శుభగ్రహ దృష్టి కలిగి షష్ఠాష్టమ స్థానాల్లో ఉంటే బాలారిష్ట భంగం కలుగుతుంది. పూర్ణచంద్రుడు స్వ, ఉచ్ఛ, మిత్ర వర్గాలలో ఉన్నా శుభ స్థితిలో ఉన్నా, శుభ గ్రహ వీక్షణ ఉన్నా శత్రు పాపగ్రహ వీక్షణలు కాని యుతికాని లేనప్పుడు బాలారిష్టం భంగమవుతుంది.

శుక్లపక్షంలో రాత్రి లేక కృష్ణపక్షంలో పగటి వేళలో జననమై ఆ సమయంలో చంద్రుడు షష్టాష్టమ స్థానాలలో ఉండి శుభులతో చూడబడుతున్నా బాలారిష్టాన్ని నివారించవచ్చు.

బాలారిష్ట విధానాలు : ప్రాచీన జ్యోతిషగ్రంథాలలో బాలారిష్టం రెండు విధాలుగా చెప్పబడింది. 1. సద్యోబాలారిష్టం, 2. సౌమ్య బాలారిష్టం. శిశువు పుట్టినవెంటనే కానీ తర్వాత 4,5 మాసాలలో మరణిస్తే సద్యోబాలారిష్టం అనబడుతుంది. ఇందుకు శుభసంబంధం కలిగితే శిశువు ఒక సంవత్సరం వరకు జీవిస్తాడు.

బాలారిష్ట నక్షత్రాలు : 1. అశ్విని 2,4 పాదాలు. 2. భరణి 2వ పాదం, 3. కృత్తిక 3వ పాదం, 4. రోహిణి 1,2,4 పాదాలు. 5. మృగశిర మొదటిపాదం 6. పుష్యమి 1వ పాదం, 7. మఘ 2వ పాదం, 8. ఉత్తర ఫల్గుని 2వ పాదం, 9. హస్త 3,4, పాదాలు, 10. చిత్త 2వ పాదం, 11. విశాఖ 4వ పాదం, 12. అనూరాధ 3వ పాదం, 13. జ్యేష్ఠ 3వ పాదం, 14. మూల 2,3 పాదాలు, 15. ఉత్తరాషాఢ 1 పాదం, 16. ధనిష్ఠ 2వ పాదం, 17. శతభిషం మొదటిపాదం, 18. ఉత్తరాభాద్ర 4వ పాదం. ఈ నక్షత్రాలలో జన్మించినవారికి విశేషంగా బాలారిష్టం సంభవిస్తుంది.

శుభాకాంక్షలతో...

మీ మనోభావాలకు అందమైన అక్షరాకృతి

కావ్యశ్రీ గ్రాఫిక్స్

2-2-1136/7/1-సి,

న్యూనల్లకుంట, హైదరాబాద్.

ఫోన్ : **27550530**

ఎం.ఏ., జ్యోతిషం - ప్రథమ

పేపర్ - 4

1. భూ పరీక్షా పద్ధతులను వివరించండి? (2000,2002) భూ పరీక్షలో దిగ్భ్రమం అంటే ఏమిటో వివరించి, ఉచ్ఛ నీచలను గూర్చి విశదం చేయండి? (2003)

ఇల్లు కట్టే ముందర, ఇంట్లోవాళ్ళందరికీ సర్వ సుఖాలు కలగాలని భూ పరీక్షలు చేస్తారు. భూమి 3 రకాల గుణాలు కల్గి ఉంటుంది. 1.ఉత్తమ, 2.మధ్యమ, 3. అధమ అని మూడు రకాలు. ఈ మూడు గుణాలు తెలుసుకోవడానికి కొన్ని పరీక్షలు చేస్తారు.

ముందుగా పరిసరాల ప్రభావాన్ని గమనించాలి. పరిసరాలు ఇంటికి అనువైనవిగా ఉండాలి. అంటే మనసుకు అహ్లాదాన్ని కల్గించేవిగా ఉండాలి. మరియు రక్షణ కూడా ఉండేటట్లు చూసుకోవాలి. అలాగే ఆరోగ్యకరమైన వాతావరణం ఉందా లేదా అని కూడా చూసుకోవాలి. పొలిమేర్లకు ఆనుకొని ఉన్నభూమి, స్మశాన భూమి, స్మశానాలకు దగ్గర్లో ఉన్నభూమి దేవాలయాల నీడ పడే భూమి, విష్ణుదేవాలయాలకు వెనుక ఉన్న భూమి, గ్రామ దేవతలకు, శక్తి ఆలయాల ప్రక్కనే ఉన్నభూమి, జాతరలు చేయడానికి నిర్ణయించిన స్థలం, చౌరస్తాలలో ఉన్నభూమి, పంచాయితీ పెట్టే భూమి, రాగి మొదలైన చెట్లు ఉన్న స్థలాలు, గృహనిర్మాణాలకు పనికిరావు.

దిగ్భ్రమం : గృహ నిర్మాణాలకు తీసుకోబడిన స్థల మధ్యభాగంలో శంకువును నాటి దిక్సాధన చేస్తే ఎనిమిది దిశలు ఏర్పడతాయి. ఈ ఎనిమిది దిక్కులు దిక్సాధన పద్ధతి ప్రకారంగా చేయాలి. అట్లా చేస్తే శుద్ధమైన దిక్కులు వస్తాయి. దిక్సూచి ద్వారా దిక్సాధన చేసేటప్పుడు నీటిమట్టంతో ముందుగా స్థలాన్ని నిమ్నోన్నతాలు (ఎత్తు పల్లాలు) లేకుండా చేయాలి. లేకుంటే దిక్కులు సరిగా రావు. శుద్ధమైన దిక్కులు రాగ దిగ్భాగలు విదిక్కులలోకి వస్తే దిగ్భ్రమదోషం ఏర్పడుతుంది.

ఉచ్ఛ నీచలు : వాస్తులో ముఖ్యంగా ఉచ్ఛ నీచలు ప్రధాన పాత్ర వహిస్తాయి. దక్షిణ, పశ్చిమ, నైరుతి, వాయువ్య దిశలు ఎత్తుగా ఉండి మిగిలిన దిశలు పల్లంగా

ఉన్న స్థలాన్ని గజపృష్ఠం అని పిలుస్తారు. ఇది గృహ నిర్మాణాలకు మంచిది. దీనిలో నివసించేవారు ఐశ్వర్యప్రాప్తిని పొందుతారు.

రంగు, రుచి, స్పర్శ, వాసన : భూమియొక్క సహజ ఆకారాన్ని అనుసరించి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను పరీక్షించాలి అని చెప్పడం వలన పంచ భూతాలకుగల గుణాలను అధారంచేసుకొని యేయే భూత గణాలు ఏయే ప్రాంతాలలో పెరిగి ఉన్నాయి. కష్టదాయకమా? సుఖదాయకమా? అనే విషయాలను చాలా రకాలుగా విమర్శించి అలాంటి భూములు ఎవరికి లాభం ఎవరికి నష్టం అనే విషయాలు పూర్వపరిశోధకులు చెప్పారు.

రంగు : తెల్లని రంగుగల భూమి బ్రాహ్మణభూమి, జ్యోతిష శాస్త్రాన్ననుసరించి ఈ రంగుకు శుక్ర గురులు అధిపతులు. అందుచేత ఈ భూమిని సత్వగుణ భూమిగా చెప్పాలి. విద్యా వ్యాసంగము జ్ఞాన సముపార్జన కలిగిన వ్యక్తులకు ఇది అనుకూలంగా ఉంటుంది. ఎఱ్ఱనిరంగు గల భూమి క్షత్రియ భూమి. ఎఱ్ఱని రంగుకు కుజుడు అధిపతి. కుజుడు సైన్యాధికారి కావున శౌర్యం కలిగిన పాలనా సామర్థ్యం కలిగిన వ్యక్తులు ఈ భూములలో బాగా రాణిస్తారు. పచ్చని భూమి వైశ్యభూమి దీనికి అధిపతి. బుధుడు. బుధుడు వ్యాపార లక్షణాలు కలిగిన ధనాధిపతి. వ్యాపార లక్షణాలు కలిగి వ్యాపారం చేసే ఏ వ్యక్తులైనా ఈ భూములలో నివసించవచ్చు. నల్లని భూమి శూద్ర భూమి, దీనికి అధిపతి శని. శ్రమకారులైన ఏ కార్మికులైనా ఇందులో నివసించవచ్చు.

రుచి : తియ్యని రుచి గలిగిన భూమి బ్రాహ్మణభూమి, ఒగరు మన్నుగల భూమి క్షత్రియభూమి, పుల్లని రుచిగల భూమి వైశ్యభూమి, చేదు రుచిగల భూమి శూద్రభూమి అని పిలుస్తారు. తియ్యని రుచి కల స్థలం ఉత్తమమని, కషాయ స్థలం మధ్యమమని, ఆమ్ల రుచి కలిగిన స్థలం అధమం అని తిక్త (చేదు) రుచిగల స్థలం అధమని చెప్పారు.

స్పర్శ : దర్భమొక్కలతో నున్న స్థలం బ్రాహ్మణస్థలమని, కాకి వెదురు చెట్లతో ఉన్న స్థలం క్షత్రియ స్థలమని, రెల్లుతో నున్న స్థలం వైశ్య స్థలమని, వివిధ రకాల గడ్డితో ఉన్న స్థలం శూద్ర స్థలమని భావించాలి.

వాసన : స్థలంలోని మన్నును తీసి పరీక్ష చేస్తే జాజి, మల్లె, సార, పొన్న మొదలైన పుష్పాల వాసనను కలిగి ఉంటే బ్రాహ్మణస్థలం, రక్తంయొక్క వాసన ఉంటే క్షత్రియ స్థలం అని, తేనెవాసన కలిగి ఉంటే వైశ్యస్థలమని, మద్యం వాసన ఉంటే శూద్ర స్థలం అని నిర్ణయించాలి. సుగంధం కలిగిన స్థలం ఉత్తమమని, రక్త గంధం కలిగిన స్థలం మధ్యమమని, మధుర గంధం కలిగిన స్థలం అధమమని మత్స్య గంధం గల స్థలం నింద్యం అని అంటారు.

రూపం : గంభీరమైన రూపంగల స్థలం బ్రాహ్మణ స్థలమని, ఉత్తమమైనదని, ఉన్నతంగానున్న స్థలం క్షత్రియ స్థలం అని, మధ్యమంఅని, ఎత్తుపల్లాలు లేకుండా సమానమైన రూపం కలిగిన స్థలం వైశ్యులని, అధమమని, వికటంగా ఉంటే శూద్ర స్థలంగా నిశ్చయించాలి. ఇది వింద్యం.

శబ్దం : గుఞ్జం, ఏనుగు, వెదురు, వీణ, సముద్రం, భేరి మొదలైన ధ్వనిని కలిగిన స్థలం ప్రశస్తమైనదని, కీచురాయి ప్రతిధ్వని, భయంకర ధ్వని మొదలైన శబ్దాలు గల స్థలం నింద్యమైనదని చెప్పారు.

2. వాస్తు శబ్ద నిర్వచనం, వివిధ గ్రంథాల్లోని వాస్తు శబ్ద వివరణ గురించి రాయండి? (2000)చతుర్విధ వాస్తు స్వరూపాలు, నివాసయోగ్యం కాని భూములను విశదీకరించండి? (2003) ప్రాసాద, శయన, యాన వాస్తుల గురించి వ్రాయండి? (2002)

వాస్తు అను శబ్దం 'వసనివాసే' అను ధాతువునుండి ఏర్పడింది. శిల్ప శాస్త్రంలో వాస్తువు విస్తృతార్థంలో వాడబడింది. గ్రామాలను, తోటలను, వంతెనలను, తటాకాలను నిర్మించడానికి ఆధారమైనది వాస్తుశాస్త్రం అని అర్థం.

వాస్తుశాస్త్రం అవసరమైన నియమ నిబంధనలను మరియు నిర్మాణ విధానాలను తెలుపుతుంది.

వాస్తుశాస్త్రం ఈ క్రింది సూత్రాలపై ఆధారపడి ఉంది.

1. పరిసరాల ప్రభావం.
2. నిర్మాణ స్థలంయొక్క భౌతిక స్థితి.

3. ఆరోగ్య సూత్రాల సమన్వయం.
4. నిర్మాణ సౌందర్య పరిరక్షణ.
5. జీవితావసరాలకు రూపకల్పన.
6. భూ భౌతిక శక్తుల వలన లాభాలు.
7. భూగోళంపై ఖగోళ గ్రహగతుల ప్రభావం.
8. దేశ, కాల, పాత్రల పరిగణన.
9. మానవ జీవితంమీద ఖగోళ గ్రహగతుల ప్రభావం.

క్షేత్ర పరిజ్ఞానం : గృహనిర్మాణంకోసం తీసుకున్న స్థలానికి సరిహద్దులు ఏర్పాటుచేసి ఆ సరిహద్దుల వెంబడి కంచెలుగాని, గోడలుగాని కట్టుకొని నిర్మాణాలకోసం అనువుగా తయారుచేసిన స్థలానికి 'క్షేత్రం' అనే పేరు వాడుకలో వచ్చింది. **'భూరేవ ముఖ్య వస్తు స్యాత్'** భూమియే ముఖ్య వస్తువు అని మయుడు అన్నాడు. నిర్మాణాలకు తగిన క్షేత్రాన్ని నిర్ణయించుకునే ముందు పరిశీలించవలసిన అంశాలు ఇవి.

దిక్కులు – వర్గులు, నామ, నక్షత్ర ప్రాధాన్యం, వర్గులు, వర్గాధిపతులు, క్షేత్రార్పణం, గ్రామార్పణం, భూ పరీక్ష.

చతుర్విధ వాస్తువులు : గృహ నిర్మాణాది కార్యాలు చేయడంకోసం ఎన్నో ప్రయత్నాలు చేశారు. అటువంటి ప్రయత్నాలు చెప్పేదే ఈ చతుర్విధ వాస్తువులు.

మనుష్యులు దేవతలు ఎక్కడ నివసిస్తారో అది వాస్తువు అనబడుతుంది. ఇది భూమిని ఆశ్రయించుకుని ఉంటుంది. కాబట్టి భూమికి వస్తువు అనే పేరు సిద్ధించింది. దీనిని నాలుగు రకాలుగా విభజించడం జరిగింది.

1. భూమి, 2. ప్రసాదం, 3. యానం, 4. శయనం.

1. భూమి : గృహాది నిర్మాణాలకోసం గ్రహించిన కొంత పరిమితికి లోబడి ప్రాకారాదులను ఏర్పరుచున్న స్థలం. ఏ నిర్మాణానికైనా భూమి ముఖ్య వస్తువు కాబట్టి **'భూరేవ ముఖ్యవస్తుస్యాత్ యానిజాతాని తానిహి'** అని మయుడు చెప్పాడు. ఇందులో భూమిని ఏయే పద్ధతులలో గ్రహించాలి. భూమిలో ఉండే గుణదోషాలు ఏమిటి.

దిక్కులను ఎలా నిర్ణయించాలి. భూమియొక్క ఉచ్ఛ నీచలు ఎలా ఉండాలి. రంగు, రుచి, వాసన, శబ్దాల గురించిన పరిజ్ఞానం మొదలైన విషయాలు తెలియాలి.

భూమియొక్క ఆకృతుల విషయం కూడా ఈ భూమి అనే అంశంలోనికే వస్తుంది. వంకరలు లేనిది చతురస్రం దీర్ఘచతురస్రంగా గల భూమి నివాసానికి శుభప్రదంగా చెప్పబడింది. త్రికోణాకారస్థలం వలయం లేదా వృత్తాకార భూమి, కత్తెరవలె ఉండేచోటు, వీధులకు అడ్డంగా ఉండే స్థలం కూర్మభద్ర, శూర్ప, ధనురాకారంగల భూములు, దేవాలయం, పశువుల విశ్రాంతిశాలలలో, యుద్ధభూములలో దేవాలయం నీడ పడే స్థలాలలో నివాసం ఉండరాదు.

దీర్ఘ చతురస్రంగా ఉన్న భూమి తూర్పు పడమరల పొడవు కంటె దక్షిణోత్తరాల పొడవు ఎక్కువగా ఉంటే శ్రేష్ఠం. దక్షిణ ఉత్తరాల కంటే తూర్పు పడమరలు ఎక్కువగా ఉండటం మధ్యమం. నాలుగు దిక్కులు సమానంగా గల భూమి ధనవృద్ధి సర్వకార్య జయం కలుగుతాయి.

నివాసయోగ్యం కాని భూములు : త్రికోణస్థలము, రాజభీతిని, సంతాన నష్టాన్ని, శకటాకార భూమి సౌఖ్యహానిని, శూర్పాకార భూమి, ధనహానిని, వ్యజనాకార భూమి ధర్మహానిని, మురజాకార భూమి వంశ హానిని, సర్ప, మండూకాకార భూములు భయాన్ని, ఖరాకార భూమి నిర్ధనత్వాన్ని, అజగరాకార భూమి, మృత్యుభయాన్ని, చిపిటాకార భూమి పౌరుష హీనాన్ని, ముద్గరం, కాకం, ఉలూకం మొదలైన ఆకార భూములు మృతసంతానాన్ని, దుర్గమ భూమి పాపకర్మలు చేసే సంతాన్ని కలిగిస్తాయి. నది ఒరపిడిగల భూమి మూర్ఖులను, పెద్దశిలలుగల భూమి దరిద్రులను, గోతులను గల భూమి అబద్ధమాడే సంతానాన్ని, బొరియలు గలభూమి పశు, పుత్ర పీడను వక్రభూమి అంగ హీనమైన సంతానాన్ని, శూర్ప, మూర్జాల, లకుట భూమి భీతిని కలిగిస్తుంది. వాయుపీడగల భూమి వాతరోగమును, భల్ల, భల్లాక సంయుత భూమి పశు హానిని, వికటరూప భూమి అంగ హీనుల సంతానాన్ని, రూక్షం, పరుషమగు భూమి చెడ్డమాటలు మాట్లాడే సంతానాన్ని, దేవాలయ నివాసిత భూమి ఉద్వేగాన్ని కలిగిస్తుంది. కావున ఈ భూములు గృహనివాసానికి మంచివి కావు.

2. ప్రాసాదం : ప్రాకారాదులు లేదా సరిహద్దులు ఏర్పరచుకున్న నివాస స్థలంలో తమతమ అర్హతలకు అనుగుణంగా నిర్మించిన గృహ, సౌధ, అట్టాలికాది నిర్మాణాలకు ప్రాసాదమని పేరు. ఈ ప్రాసాదం మనం ఏర్పరచుకున్న భూమిలో ఆయా నివాసాలకు అనుగుణంగా కట్టే కట్టడాలని నిర్ణయం. అవి 1. మానవ గృహాలు, 2. దేవతా గృహాలు.

మానవ గృహాలు : ఏకశాల, ద్విశాల, త్రిశాల, చతుశ్శాలలుగా నిర్మించవచ్చు.

3. యానం : వ్యక్తి ప్రయాణ సాధనాలుగా ఉపయోగించే రథాలు, బండ్లు, విమానాలు, నీటిపై ప్రయాణించే ఓడలు మొదలైనవి యానవిభాగంలోకి చేరుతాయి. యానాలననుసరించి ప్రస్తుతం ఇవి 3 విధాలు. 1.భూమిపైన 2.నీటిపైన 3.వాయు ప్రయాణం.

4. శయనం : యజమాని సుఖంగా జీవించడానికి అవసరమైన మంచాలు, కుర్చీలు, సోఫాలు మొదలైన వస్తు సముదాయాన్ని శయనం అంటారు. వీటిని ఒక క్రమపద్ధతిలో తయారుచేసే విధానం శిల్పశాస్త్రంలో చెప్పబడింది. సభా భవనం ఎలా నిర్మించాలి. దానిలో ఆసనాదులు, శయ్యాదులు ఎలా నిర్మించాలి. అనే దానికి మయుసభాభవనం ఒక మచ్చుతునక.

3. షోడశవిధాలైన భూమ్యాకృతులను వివరించండి? (2003)

వివిధ ఆకారాల్లో ఉన్న స్థలాల్లో నిర్మాణాలు చేసినప్పుడు వచ్చేదోషాలను గురించి చెప్పిన గ్రంథాల్లో షోడశ భూలక్షణం అనే ప్రకరణంలో తెలిపారు. షోడశభూములు అంటే పదహారు విధాలైన భూములు అని అర్థం. వాటి పేర్లు. 1.ఆయతం, 2.చతుర్శ్రం, 3.వృత్తం, 4.భద్రాసనం, 5.చక్రం, 6.విషమ బాహువు, 7.త్రికోణం, 8. శకటాకృతి, 9.దండాకారం, 10.పణవాకారం, 11.మురజాకారం, 12.బృహన్ముఖం, 13.వ్యజనా కారం, 14.కూర్మ పృష్ఠం, 15.ధనురాకారం, 16.శూర్పాకారం.

1. ఆయతాకార స్థలం : రెండు ఎదురెదురు దిశలు అనగా తూర్పు పడమర, లేదా ఉత్తర దక్షిణాల కొలతలు సమానంగా ఉండి మిగిలిన రెండు దిశలు పొడవుగా ఉంటే దానిని ఆయతం లేక దీర్ఘచతురస్రంగా పిలుస్తారు. ఈ స్థలంలో నివసిస్తే సకల కార్యాలు సిద్ధిస్తాయి.

2. చతురస్రాకార స్థలం : పొడవు వెడల్పు సమానంగా ఉండి, మూల కొలతలు సమానంగా ఉండాలి. ఇది ధనవృద్ధినిస్తుంది. నాలుగు దిక్కులు హెచ్చుతగ్గులు లేకుండా సమానమైన కొలతలు కలిగియున్న స్థలం చతురస్రం అనబడుతుంది.

3. వృత్తాకార భూమి : వంకరలు లేకుండా వృత్తాకారంగా ఉన్న భూమి అనుకూలమైనది. దీనిలో నివసించేవారికి జ్ఞానాభివృద్ధి ధనాభివృద్ధి కలుగుతుంది. దేవతా నివాసాలకు, విహార మందిరాలకు కూడా మంచిది.

4. భద్రాసనాకార భూమి : రెండు ఎదురెదురు దిశలలో సమానమైన కొలతలు కలిగి ఉండి, రెండు అభిముఖదిశలలో అంతకుమించిన కొలతలతో మొదటి హద్దుల యొక్క మూలలను కలుపుతూ లోపలకు విల్లువలె వంగి ఉన్న స్థలాన్ని భద్రాసనం అంటారు. అంటే నాలుగు కోణదిశలలో స్థలం సమాన పాళ్ళలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ స్థలం సుఖ సౌఖ్యాలను కలిగిస్తుంది.

5. చక్రాకార భూమి : వృత్తాకార భూమిలో మూలలు ఏర్పడుతాయి. చక్రాకార భూమి దరిద్రాన్ని సంతానసష్టాన్ని సౌఖ్య నాశనాన్ని కలుగజేస్తుంది. కాబట్టి ఈ భూమిలో నివాసం మంచిది కాదు.

6. విషమబాహు భూమి : ప్రక్క ప్రక్కల గల అనగా ఎదురెదురు సమాన కొలతలుగల దిక్కులుండి మిగిలిన ఎదురెదురు దిక్కులలో ఏదేని ఒక దిక్కున విదిక్కుకు స్థలం పెరిగి ఉంటే (ఒక భుజం ఎక్కువగా ఉంటే) విషమాకార స్థలం ఉంటుంది. '**విషమే శోక లక్షణం**' అనగా విషమ బాహువు శోకాన్ని కలిగిస్తుంది, సంతాపాలను కూడా కలుగజేస్తుంది.

7. త్రికోణాకార భూమి : మూడు కోణాలు మాత్రం కలిగి ఉన్న భూమిని త్రికోణాకార భూమి అంటారు. దీనిని త్రిభుజమని కూడా వ్యవహరిస్తారు.

8. శకటాకార భూమి : ఎదురెదురుగా ఉన్న రెండు దిక్కులు మూడు విధాలుగాను కొలతలు కలిగిఉన్న స్థలాన్ని శకటాకార భూమిగా చెప్తారు. బండి గూడువంటి ఆకారం కలిగిన స్థలం, నివాస స్థలానికి యోగ్యమైనది కాదు. ఇది సమ చతురమైనా ఆయతమైనా కూడా నింద్యం. దీనిలో నివసించేవారికి ధనక్షయం కలిగి దారిద్ర్యం సంభవిస్తుంది. అంతే గాక సంతానసుఖం నాశనమౌతుంది.

9. దండాకార భూమి : రెండు ఎదురెదురు దిశలు సమాన కొలతలు కలిగి కఱ్ఱలాగా పొడవుగా ఉన్న భూమిని దండాకార భూమి అంటారు. వెడల్పుకంటె రెట్టింపు దాటిన పొడవు గలది.

10. పణవాకార భూమి : పణవం అంటే ఢక్కా అని అర్థం. ఢక్కా ఆకారం కలిగిన స్థలాన్ని పణవాకార భూమి అంటారు. మతాంతరంలో విదిక్కులలో స్థలమేమీ లేక లోపలకు చొచ్చుకుని ఉండి దిక్కులలో స్థలం నాల్గువైపుల పెరిగితే అది పణవాకార స్థలం అంటారు. ఈ భూమిలో నివసించేవారికి నేత్రసంబంధమైన వ్యాధులు కలుగుతాయి.

11. మురజాకార భూమి : రెండు ఎదురెదురు దిక్కులు సమాన కొలతలతో ఉండి మిగిలిన దిక్కులు మూలలతో కలసి ఏటవాలుగా దీర్ఘాలై మొదటి రెండు దిక్కులయొక్క చివర ఏటవాలుగా ఉన్న భూమిని మురజాకార స్థలం అంటారు.

12. బృహన్ముఖ భూమి : స్థలం ముందుభాగం ఎక్కువ కొలత కలిగి వెనకభాగం తక్కువగా ఉంటుంది. ఈ భూమిలో నివసిస్తే ధననాశనాన్ని దరిద్ర్యాన్ని కలిగిస్తుంది. ఇందులో నివసించేవారికి బంధునాశనం కూడా కలుగుతుంది.

13. వ్యజనాకార స్థలం : ఇందులో నివసించేవారికి ధననష్టం వ్యాపారభంగం ఉద్యోగాలు పోవడం కలుగుతాయి.

14. కూర్మ పృష్టాకార భూమి : ఒక్కదిక్కు స్థలం దీర్ఘంగా ఉండి దాని పార్శ్వంలో విదిక్కులు కోణాలుగా ఉండి మిగిలిన దిక్కులలో స్థలం తాబేలు చిప్పవలె వంగి ఉంటే దానిని కూర్మపృష్టాకార భూమి అంటారు. దీనిలో నివసించేవారికి ఎప్పుడూ శోకబంధనం (ఖైదు) రాజదండనం (శిక్షలుపడటం) కలుగుతాయి.

15. ధనురాకార భూమి : ఒకదిక్కులో స్థలం పొడవుగా ఉండి మిగిలిన మూడు దిక్కులలో విల్లుఆకారంవలె వంపు తిరిగి ఉంటే అది ధనురాకార స్థలం అంటారు. దీనిలో నివసించేవారు అపకీర్తి పాలౌతారు.

16 శూర్పాకార భూమి : నాలుగు దిక్కులో కొలతలు ఏవిధంగా ఉన్నా చూడడానికి ఇంగ్లీషులో 'యు' ఆకారం కలిగి లేక చేట వంటి ఆకారం గల భూమిని శూర్పాకార స్థలం అంటారు. దీనిలో నివసించేవారికి వ్యాధులు కలిగి దారిద్ర్యపీడ పొందుతారు.

4. గృహ నిర్మాణ విషయంలో సింహద్వారంతోపాటు ఇతర ద్వారాల సంఖ్యా పరిమితిని వివరించండి? (2000)

రాజ ప్రాసాదాలలో, హర్మ్యాలలో, ధనవంతుల ఇళ్ళలలో అనేక విధాలైన ఇతర నిర్మాణాలలో, మానవ నివాసానలన్నింటిలోనూ గదులను నిర్మించాలి. వేరువేరుకర్మలు చేయడంకోసం వేరువేరు శరీరాంగాలు ఉన్నట్లే ఇంటిపనులు నిర్వర్తించడానికి వేరు వేరు గదులు అవసరం. ఈ గదులు 2,4,6,8,12,16వరకు నిర్మించవచ్చు. ఈ గదులు అనేక రకాలుగా ఉంటాయి. అనేక కార్యకలాపాలు నిర్వహించడానికి విశాలమైన నిర్మాణాలకు, ధనవంతులయొక్క ప్రభువులయొక్క నివాసాలకు, అవసరాలకు తగిన విధంగా గృహ, సౌధ, హర్మ్య ప్రాసాదాదులు వేరువేరు ప్రమాణాలతో నిర్మించాలి. వీటిలో మానవ సౌకర్యాలకు 8 ప్రధానమైన చిన్న గదులుండాలి. 1.బాత్‌రూమ్, 2.డ్రెస్సింగ్‌రూమ్, 3.బీరువా ఉండే గది., 4.వంటశాల, 5. పూజగది, 6.డైనింగ్‌రూమ్, 7. ధనగృహం, 8. బెడ్‌రూమ్. ఇంకా అనేక రకాలైన అవసరాలు తీర్చుకోవడానికి వేరువేరు గదులుకూడా ఉండేవి. చతురస్రం, వర్తులం,షట్కోణం, అష్టకోణం గల రూపాలలో గదులు నిర్మించవచ్చు. త్రికోణాకారంగా నిర్మాణం చేయకూడదు.

సరిసంఖ్యలో స్తంభాలు దూలాలనుంచి రెండు ధనుర్ముష్టుల ప్రమాణంకంటే తక్కువ ప్రమాణంలేని గదులను నిర్మించాలి. చతురస్రం, వర్తులం, షట్కోణం, అష్టకోణంగల రూపంతో గదులను నిర్మించవచ్చు. త్రికోణాకార నిర్మాణం చేయకూడదు. స్థలం యుగ్మపట్టకరచనం కలిగినవిగా ఉండాలి. యుగ్మపట్టక రచనమంటే తలుపులకు లోపల, బైట, తలుపుల బలానికి గోడలకు ఫలకాస్థాపనం చేయడం. గదులను ద్వారంతో గాని ద్వారం లేకుండా గాని నిర్మించవచ్చు. ద్వారాలకు రెండు తలుపులుండాలి. ద్వారాలకు పక్కపక్కన కిటికీలుండాలి. గదులు మహాద్వారాలను ఉపద్వారాలను కలిగి ఉండాలి. ద్వారహీనంగా గది నిర్మించడమంటే గదికి మూడు భాగాలలో గోడను కట్టి ఒక భాగంలో తోరణాకృతిలో గోడను నిర్మించడమని అర్థం. గదిలో గోడలకు ఒకవైపుగాని, రెండువైపులగాని, మూడు వైపులగాని, నాలుగు వైపులగాని ద్వారాలుండవచ్చు. ద్వారాలకు రెండు తలుపులను పెట్టవచ్చు. ఒకప్పుడు శైలీ భేదాలననుసరించి ఒక తలుపును పెట్టవచ్చు. క్రింద ఒక్కొక్క తలుపు, దీనిపైన మరొక

రెక్క తలుపువలె రెండు తలుపులను పెట్టవచ్చును. ద్వారాలకు రెండువైపుల సమాన ప్రమాణంతో ఉండి విషమస్థితి లేనట్లు పెట్టాలి. గదులను నిర్మించేటప్పుడు విషమసంఖ్య (బేసిసంఖ్య) లేకుండా చూడాలని విశ్వకర్మ మతం చెపుతోంది. ఒక ఇంటిలో 2,4,6,8,10 సంఖ్యలతో గదులను కట్టాలి. బేసి సంఖ్యలతో కట్టరాదు. ఒక గది, వెనుకభాగంలో ఒకగది కట్టవచ్చునని నిర్మాణభేదం చెప్తోంది.

5. దిక్పరిచ్ఛేదనా పద్ధతులను వివరించండి?(2002) దిక్సాధన పద్ధతులను వివరించండి? (2003) దిక్సాధనా పద్ధతిని, శుద్ధప్రాచీ, ఈశప్రాచీల గురించి రాయండి? (2000)

వైజ్ఞానిక దృష్టితో ఆలోచిస్తే వ్యక్తి మానసిక శారీరక వికాసాలకు గాలి, వెలుతురు చాలా అవసరం. దిక్కులకు అభిముఖంగా గృహనిర్మాణం చేసినప్పుడే ఈ గాలి వెలుతురు తగినంతగా ఇంటిలోనికి ప్రవేశించే అవకాశం ఉంది. అందుకే దిక్కులకు అభిముఖంగా అవసరమైన గృహాన్ని నిర్మించుకోవాలి. ఇల్లు కట్టేస్థలంలో మధ్యన సమానంగా చేసి అక్కడ 36 అంగుళాల ప్రమాణంతో ఒక వృత్తం గీయాలి. ఈ వృత్తం మధ్యభాగంలో 12 అంగుళాల ప్రమాణం కలిగిన శంకువును నాటాలి. రవి మేష, మిథున, సింహ తులా రాసుల్లో ఉన్నప్పుడు వృత్త మధ్య రేఖకు రెండంగుళాల దూరంలోను, ధనుః కుంభ రాసుల్లో రవి సంచరించేటప్పుడు ఆరు అంగుళాల దూరంలోను మకరంలో రవి సంచరించేటప్పుడు 8 అంగుళాల దూరంలోను మీనంలో రవి సంచరించేటప్పుడు 4 అంగుళాల దూరంలోను శంకుచ్ఛాయ పడుతుంది. ఏయే మాసాలలో దిక్కులను నిర్ణయిస్తామో ఆయా మాసాల్లో వృత్తంలో పడిన శంకుచ్ఛాయ నుండి అయామాసాలకు చెప్పిన అంగుళాలను సంస్కరిస్తే సరియైన తూర్పు పశ్చిమ దిక్కులు వస్తాయి.

ఈ ప్రాక్పశ్చిమ బిందువులనుండి మత్స్యాకార రేఖలను వేయాలి. ఈ రేఖల మధ్యనుండి వచ్చేరేఖ దక్షిణ ఉత్తర దిశలరేఖ అవుతుంది. ఈ నాలుగు దిక్కుల బిందువులనుండి మళ్ళీ మత్స్యాకార రేఖ వేస్తే వాటి మధ్యనించి వచ్చిన రేఖలు ఆగ్నేయ, నైఋతి, వాయువ్య, ఈశాన్య దిక్కులు అవుతాయి.

శుద్ధప్రాచీ : శుద్ధ ప్రాచీ అంటే సరియైన తూర్పుదిక్కు అని అర్థం. మొదట తూర్పు దిక్కును సాధించి దీని ఆధారంతో మిగిలిన మూడు దిక్కులను ఈశాన్యాది విదిక్కులను నిర్ణయించాలి. విదిక్కులు ఆయాది సాధన నిర్ణయానికి మంచివికావు. కనుక సరియైన తూర్పు దిక్కును నిర్ణయించి తద్వారా మిగిలిన దిక్కులను సాధించాలి.

గృహ, గ్రామ, నగర, నిర్మాణాల్లోను, మార్గ నిర్మాణాల్లోను దిక్కుల నిర్ణయాలను జాగ్రత్తగా పరిశీలించి దిక్కులకు అభిముఖంగా ఉండేవిధంగా దిక్సాధన చేయాలి.

ఈశప్రాచీ : శంకుచ్ఛాయద్వారా సాధించబడిన 'శుద్ధప్రాచీ' దిక్కుకు 'బ్రాహ్మీప్రాచీ' అని పేరు. శంకుచ్ఛాయతో సాధించిన తూర్పు బిందువు (ప్రాగ్బిందువు) కొంచెం దక్షిణానికి జరిపితే 'ఇంద్రీప్రాచీ' అని పేరు. శంకుచ్ఛాయతో సాధించిన ప్రాగ్బిందువును కొంచెం ఉత్తరానికి జరిపితే దానికి 'ఐశీప్రాచీ' అని పేరు. ఈ ఐశీప్రాచీ శివాలయాది దేవాలయ నిర్మాణాలకు ప్రశస్తమని కొందరి అభిప్రాయం. విప్రులయొక్క గృహనిర్మాణానికి 'ఐశీప్రాచీ' ప్రశస్తమని మరికొందరి అభిప్రాయం.

6. ఆయాది సాధన పద్ధతులను తెలిపి, సప్తవర్గ గణితాన్ని వివరించండి? (2003) ఆయాది గణనలోని క్రమపద్ధతిని వివరించండి? (2000)

ఆయము – ఆదాయం అనే అర్థంలో వాడబడుతుంది. గృహంకాని ఇతర నిర్మాణాలు కాని తమకిష్టం వచ్చినట్లు నిర్మించవచ్చు. కాని ఆయం కట్టి ఆయా నిర్మాణాలు చేయడంద్వారా వ్యక్తికి మేలు కలుగుతుంది. భారతీయ వాస్తుశాస్త్రజ్ఞుల నిర్ణయం ప్రకారం నిర్మాణాలకోసం తీసుకోబడిన భూమికి, గృహ, భవన, హర్మ్య ప్రాకార నిర్మాణాలకు వాపీ, కూపాదులకు, కొలపాత్రకు, శయన ఆసనాదులు మొదలైన అన్ని వస్తువుల సముదాయాలకు ఆయాది శుద్ధి ఉండాలి. ఇవి వస్తువుకు వస్తువుకు తేడా ఉంటుంది.

ధ్వజం, ధ్రూమం, సింహం, శ్వానం, వృషభం, ఖరం, గజం, వాయసం అనే ఆయాలు ఎనిమిది రకాలుగా ఉన్నాయి. తూర్పు దిక్కున ధ్వజాయం, ఆగ్నేయంలో ధూమ్రాయం దక్షిణంలో సింహాయం, నైఋతిలో శ్వానాయం, పశ్చిమంలో వృషభాయం, వాయువ్యంలో ఖరాయం, ఉత్తరంలో గజాయం, ఈశాన్యంలో కాకాయం

ఆధిపత్యం కలిగి ఉన్నాయి. స్వస్థానానికి ఐదవదిక్కు శత్రువర్గం అవుతుంది. తూర్పు దిక్కున ధ్వజాయానికి స్వస్థానం. దానికి 5వ దిక్కు పశ్చిమం శత్రువర్గానికి చెందింది.

నిర్మాణాలకు అవసరమైన పొడవు వెడల్పునుబట్టి వైశాల్యం సాధిస్తే దానిని క్షేత్రీకృత పదం అని అంటారు. దీనికే పదమని, పిండమని వ్యవహారం ఉంది. ఈ పదాలనుబట్టి గణితంద్వారా ధ్వజాది ఆయాలు వస్తాయి. తూర్పు, దక్షిణ, పశ్చిమోత్తరాలలో ఏ దిక్కులో గృహనిర్మాణం చేసినప్పటికీ ధ్వజాయం కలిగిన గృహపదం శ్రేష్ఠం. దక్షిణ పశ్చిమోత్తరాలలో ఏ దిక్కున గృహనిర్మాణం చేసినా ధ్వజ సింహాయం కలిగిన గృహపదం శ్రేష్ఠం. పశ్చిమ, ఉత్తర దిక్కులో ఏ దిక్కులో గృహ నిర్మాణం చేసినా ధ్వజ, సింహ, వృష గజాయాలు కలిగిన గృహపదం ఏదైనా శ్రేష్ఠం.

ఆయాలు-దృష్టులు : ధ్వజాది ఆయాలలో ధ్వజాయం తూర్పుదిక్కునందుండి పశ్చిమాన్ని చూస్తుంది. కుడి, ఎడమలను చూస్తుంది. పృష్ఠ ముఖం కలిగి ఉండడం శ్రేష్ఠం కాదు. సింహాయం దక్షిణ దిక్కునుండి ఉత్తరం చూస్తుంది. కుడి, ఎడమలను చూస్తుంది. పృష్ఠాన్ని చూడడం శ్రేష్ఠం కాదు. వృషభాయం పశ్చిమదిక్కు నందుండి తూర్పుదిక్కును చూస్తుంది. కుడి ఎడమలను చూస్తుంది. వెనకభాగం చూడడం శ్రేష్ఠం కాదు. గజాయం ఉత్తరదిక్కునందుండి దక్షిణాన్ని చూస్తుంది. కుడి, ఎడమలను చూస్తుంది. వెనక భాగం చూడడం మంచిది కాదు.

ధ్వజాయానికి పశ్చిమద్వారం, వృషభాయానికి తూర్పుద్వారం, సింహాయానికి ఉత్తర ద్వారం, గజాయానికి దక్షిణద్వారం పెట్టడం శ్రేష్ఠమని ఆయ నియమాలు చెప్తున్నాయి. తూర్పు ఇల్లు అన్నా, పశ్చిమద్వార గృహం అన్నా ఒకే అర్థంలో తీసుకోవాలి.

ఆయం : (ధ్వజ, ధూమ్ర, శ్వాన, వృషభ, ఖర, గజ, కాకాయం)

వారం : (ఆది, సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని 7 వారాలు)

అంశం : (ఇంద్రాంశం, యమాంశం, రాజాంశం, అని 3)

ధనం : (గృహం యొక్క ధనం లేదా ఆదాయం)

ఋణం : (గృహం యొక్క వ్యయం)

నక్షత్రం : (అశ్విన్యాది 27 నక్షత్రాలు)

తిథి : (శుక్ల, కృష్ణ పక్షాలలో మొత్తం 30)

యుతి : (విష్కంభాది 27 యోగాలు)

ఆయుర్దాయం : (అల్పాయువు, మధ్యాయువు, పూర్ణాయువు)

క్షేత్రీకృత పదాన్ని క్రింద ఇచ్చిన సంఖ్యలతో గుణించి, భాగిస్తే వరుసగా ఆయం, వారం, అంశం, ధనం, ఋణం, నక్షత్రం, తిథి, యుతి, ఆయువు అనే 9 వర్గాలు వస్తాయి. క్షేత్రీకృత పదమంటే శాలల పొడవును వెడల్పుచే గుణించగా వచ్చిన వైశాల్యం. దీనినే గృహ పిండమని, పదమని వ్యవహరిస్తారు.

ఆయాన్ని సాధించడానికి ఉపయోగపడే విషయాలు తొమ్మిది రకాలు. వీనినే నవవర్గులు అని పిలుస్తారు. అవి 1. ఆయం లేక యోని, 2. వారం, 3. అంశం, 4. ధనం, 5. ఋణం, 6. నక్షత్రం, 7. తిథి, 8. యుతి, 9. ఆయుర్దాయం.

1. ఆయం : ధ్వజ, ధూమ్ర, సింహ, శ్వాన, వృషభ, ఖర, గజ, కాకాయాలు, దిక్కుకు ఒకటి చొప్పున మొత్తం 8.

2. వారం : ఆది, సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శనివారాలు 7.

3. అంశం : ఇంద్రాంశం, యమాంశం, రాజాంశం అనే 3 అంశాలు.

4. ధనం : గృహం యొక్క ధనం లేదా ఆదాయం.

5. ఋణం : గృహం యొక్క వ్యయం.

6. నక్షత్రం : అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర, ఆర్ద్ర, పునర్వసు, పుష్యమి, ఆశ్లేష, మఖ, పుబ్బ, ఉత్తర, హస్త, చిత్త, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణం, ధనిష్ఠ, శతభిషం, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి అనే 27 నక్షత్రాలు.

7. తిథి : శుక్లపాడ్యమి, విదియ, తదియ, చవితి, పంచమి, షష్ఠి, సప్తమి, అష్టమి, నవమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి, పూర్ణిమ, 15 తిథులు కృష్ణ ప్రతిపదాది అమావాస్య వరకు 15 తిథులు మొత్తం 30.

8. యుతి : విష్కంభం, ప్రీతి, ఆయుష్మాన్, సౌభాగ్యం, శోభనం, అతిగండం, సుకర్మ, ధృతి, శూల, గండ, వృద్ధి, ధ్రువ, వ్యాఘాత, హర్షణ, వజ్ర, సిద్ధి, వ్యతీపాత, వరీయాన్, పరిఘ, శివ, సిద్ధము, సాధ్య, శుభ, శుక్ల, బ్రహ్మ, ఐంద్ర, వైధృతులనే 27 యోగాలు.

9. ఆయుర్దాయం : అల్పాయువు, మధ్యమాయువు, పూర్ణాయువు, పై తొమ్మిది విషయాలను నవవర్గులని అంటారు. గృహనిర్మాణ విషయంలో ఈ వర్గులను గమనించి శుభ వర్గులను గ్రహించి వాటికి అనుగుణంగా నిర్మాణాలు చేయాలి.

ఆయాది వర్గులను షడ్వర్గులని, నవవర్గులని, చతుర్దశ వర్గులని షోడశవర్గులను కూడా చెప్పారు. వీటిని సాధించేపద్ధతులు అనేకంగా ఉన్నాయి. ఆయా పద్ధతులలో ఒకదాని ప్రకారం గృహానికి గాని ఇతర నిర్మాణాలకుగాని ఆయాది నవవర్గ గణితం చేసి శుద్ధి సాధించడంవల్ల గృహం శ్రేయస్సును కలిగించేదవుతుంది. ఆయాది వర్గ సాధనకు విశ్వకర్మప్రకాశిక, వాస్తువిద్య, అపరాజిత పృచ్ఛ, కాలామృతం సమరాంగణ సూత్రధారం, మనుష్యాలయ చంద్రిక వంటి గ్రంథాలలో వేరువేరు సూత్రాలు ఇచ్చినప్పటికీ ఆయా సూత్రాలు ప్రాంతపరమైన భేదాలలో వినియోగపడుతుంది. ఉదా. వాటిలో విశ్వకర్మ ప్రకాశిక ప్రకారం గణన ఈవిధంగా చేయవలసి ఉంటుంది.

పదం x 9 (నవ) ÷ 8 (నాగ) = శేషం ఆయం

పదం x 9 (అంక) ÷ 7 (అద్రి) = వారం

పదం x 9 (అంగ) ÷ 9 (నవ) = అంశం

పదం x 8 (గజ) ÷ 12 (సూర్య) = ద్రవ్యం

పదం x 3 (వహ్ని) ÷ 8 (అష్ట0 = ఋణం

పదం x 8 (నాగ) ÷ 27 (భ) = నక్షత్రం

పదం x 8 (అష్ట) ÷ 30 (తిథి) = తిథి

పదం x 7 (సాగర) ÷ 27 (ఋక్ష) = యోగం (యుతి)

పదం x 8 (నాగ) ÷ 120 (ఋభాను) = ఆయువు

7. సోపాన నిర్మాణానికి చెందిన ఆకృతులను వివరించండి? (2003)

అంతస్థులు మొదలైనవానిని ఎక్కడానికి ధృడమైన సంధి కర్మ ఉన్న నిర్మాణాలకు సోపానాలు అని పేరు. వీటిని రాళ్ళతోగాని, కర్రలతోగాని, ఇటుకలతోగాని నిర్మించవచ్చు. స్థలాల ప్రమాణాలను స్వరూపాలను అవగాహన చేసుకొని ఈ సోపానాల నిర్మాణం చేయాలి. ఈ సోపానాలు 12 అంగుళాలు, లేదా 16 అంగుళాలు లేదా 1 1/2 హస్తము ఎత్తు ఉండవచ్చు. మెట్ల పొడవు రెండు హస్తాలు లేక (ఒక గజం) 3 హస్తాలు లేక (1 1/2గజం) గాని ఇంకా అధికమైన పొడవుగాని ఉండవచ్చు. మెట్లను ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పడిపోవడానికి అవకాశం లేకుండా రెండువైపులా దండాకారంగా కర్రను బిగించాలి. మెట్లు కదిలిపోకుండా ఇనుప పట్టాలతో గట్టిగా కట్టాలి. ఎక్కువ పొడవు లేకుండా చాలా తక్కువ పొడవు కాకుండా సోపాన నిర్మాణాన్ని చేయవలసి ఉంటుంది.

మెట్లు కట్టడంలో నాలుగు రకాలున్నాయి. అవి.

1. సమనిర్మాణం, 2. తిర్యక్కృత నిర్మాణం, 3. వక్ర నిర్మాణం, 4. వర్తులాకార నిర్మాణం.

1. సమనిర్మాణం : నేలభాగంనుండి అంతస్థు పైవరకు సమానంగా మెట్లను కట్టే విధానం. ఈ ప్రకారం వేసినపుడు పై ఎత్తు వరకు సమ సూత్రంగా నిర్మించాలి. మెట్లు ఎన్ని కట్టాలనే. నియమం లేదు. వీలునుబట్టి కట్టవచ్చు.

2. తిర్యక్కృత నిర్మాణం : నేలభాగంనుండి కొన్ని మెట్లను సమసూత్రంగా వరుసగా నిర్మించిన తర్వాత కుడివైపుగాని, ఎడమవైపుగాని, త్రిప్పి మళ్ళీ కొంతదూరం వరుసగా మెట్లను సమసూత్రంగా వరుసగా నిర్మించిన తర్వాత కుడివైపుగాని, ఎడమవైపుగాని, త్రిప్పి మళ్ళీ కొంతదూరం వరుసగా మెట్లను కట్టే విధానం అంతస్థుయొక్క ఎత్తును అనుసరించి స్థలంలో ఉన్న వీలువనుబట్టి ఇది నిర్మించాలి.

3. వక్ర నిర్మాణం : చెట్టుకు లత చుట్టుకొన్నట్లు వంకరగా నిర్మించే విధానం.

4.వర్తులాకార నిర్మాణం : నేలపై నుండి పై అంతస్థులను ఎక్కడానికి క్రింద కూపారంగా కట్టి దాని మధ్యలో ఒక పొడవైన దండాన్ని నిర్మించి దండానికి మెట్లను అమర్చి పై

భాగాలను ఎక్కే విధానం. దీన్నే సర్పవేష్టనం వంటి నిర్మాణం అంటారు. ఇంకా స్థిర సోపాన నిర్మాణం అంటారు. దండం చుట్టూ మెట్లు వచ్చి తిరుగుతూ పై అంతస్థులకు ఎక్కవలసి ఉంటుంది.

అగ్ర సోపానాల నిర్మాణం గుహ్యమని, అగుహ్యమని రెండు విధాలు. సింహద్వారం యొక్క రెండు పార్శ్వాలలో ఉన్న అరుగుల మధ్య గుమ్మాలతో ప్రారంభించి నేలవరకు కట్టిన మెట్లను గుహ్యమని, పునాదికి అవతల కట్టబడిన మెట్లను అగుహ్యమని అంటారు. సోపానాలు చతురస్ర దీర్ఘచతురస్ర వృత్తాలని మూడు విధాలు. సోపాన నిర్మాణం 1. త్రిఖండరచన, 2. శంఖమండల రచన, 3. అర్ధగోమూత్ర రచన, 4. వల్లీ మండలరచన అని నాలుగువిధాలు.

మూడు ఖండాలుగా నిర్మించే సోపాన క్రమానికి త్రిఖండసోపానమని మొదట పెద్దమెట్లు కలిగి క్రమంగా చివరి మెట్లు చిన్నవిగా కట్టిన పద్ధతికి శంఖమండలం అని పేరు. రెండు ఖండాలుగా నిర్మించబడ్డ సోపానాలకు అర్ధగోమూత్రమని, వృక్షాన్ని చుట్టుకున్న లతలాగా నిర్మించే పద్ధతికి వల్లీమండలం అని పేరు వచ్చింది. అంతస్థులమీదికి సోపానాలు ప్రదక్షిన క్రమంలో నిర్మించాలి. ప్రాసాదాలలో మండపాలలో మెట్లు బేసి సంఖ్యలో నిర్మించాలి. మనిషి జీవించడానికి ఉపయోగపడే అన్ని శాలలలో, సావిడిలో, చిత్రశాలలు, విద్యా శాలలు, వైద్యశాల్లోల మెట్లను ముఖభాగంలో పార్శ్వభాగంలో కూడా నిర్మించవచ్చు.

మెట్లను అన్ని దిక్కుల్లోను, అన్ని విదిక్కులోను నిర్మించవచ్చు. గృహాగ్రంగాని, గృహ పార్శ్వాలలోగాని, వెనకభాగాలలోగాని అన్నిదిక్కుల్లోను సోపానాలు నిర్మించవచ్చు.

8. శంకుస్థాపన, శంకు తయారీ పద్ధతిని వివరించండి? (2000)

శంకువు సూచీ ఆకారాన్ని కలిగి ఉంటుంది. ఏదైనా గుండ్రని వస్తువును సూర్యునికి అభిముఖంగా ఉంచినట్లయితే దాని ఛాయ ఒక నియమిత ప్రదేశంవరకు శంకు ఆకారంలో ప్రయాణం చేస్తుంది. దీనికి శక్తిని ఆకర్షించే లక్షణం ఉంటుంది. అందుకే యంత్రాలలో ప్రధానమైన శ్రీచక్రం కూడా శంకు ఆకారాన్ని కలిగి ఉంటుంది.

ప్రకృతిలో ఉన్నట్టి ప్రాణశక్తిని తన సూచీముఖంద్వారా ఆ గృహానికి చేరవేసే శక్తి ఈ శంకువుకు ఉంది. ఘటాకాశంవలె ఉన్న గృహ నిర్మాణస్థలంలో అనంతశక్తి సంపన్నుడైన గ్రహరాజు సూర్యుని సహస్ర కిరణాల ప్రభావాన్ని ఈ శంకువు తన లోనికి ఆహ్వానిస్తుంది. దాని ద్వారా ఆ ఇల్లు శక్తివంతమై ప్రాణశక్తిని ఆ యింటిలో ఉండే వారందరికీ పంచుతుంది. తద్వారా గృహంలో ఉన్నవారు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లుతారు. ఈ శంకువు మణిపూరకచక్రమున్న వాస్తుపురుషుని నాభిస్థానంలో ఉంచుటవలన మానవశరీరానికి పరిపూరకము కావలసిన శక్తిని నాభి ద్వారా అందిస్తుంది.

శంకువు 24 అంగుళాలు లేదా 20 అంగుళాల లేదా 12 అంగుళాలు పొడవు కలిగి దానిని మూడు భాగాలు చేసి మొదటిభాగం నాలుగు కోణాలు మధ్యభాగం ఎనిమిది కోణాలుగాను పై భాగం (అగ్రం) గుండ్రంగాను నిర్మించాలి. ఇండ్లు కాలిపోయినవి, గచ్చచెట్లు, ముండ్లు గలవి, గచ్చ, జెముడు, మఱ్ఱి, వేప, రావి, మామిడి, వెలగ, తాటి, పగడ, జువ్వి, నల్లవిసి చెట్లు గృహ నిర్మాణానికి యోగ్యాలు కావు. కనుక మది, ఏపి, కడప, కొడిసె, శ్రీతాళం (పారద) పారిభద్ర, మారెడు, వెదురు, దేవకాంచన, చంద్రచేప గల చెట్లయొక్క కర్రను గృహ నిర్మాణాలకు వాడవచ్చు. ఇంటి నివాసాలకు దారుశంకువును, దేవాలయాలకు రాతి శంకువును నిర్దేశించారు. దేవాలయాలకు మానాంగుళాన్ని, ఇంటి నివాసాలకు మాత్రాంగుళాన్ని శంకు ప్రమాణంకోసం నిర్దేశించారు.

ఈశాన్యంనుండి నైఋతివరకు గల గృహ నిర్మాణ ప్రదేశాన్ని 28 భాగాలు చేసి దానిలో వాస్తుపురుషుని లిఖించి ఈశాన్యం శిరస్సునుండి పది భాగాలు పుచ్ఛం నుండి 17 భాగాలు వదలి మిగిలిన ఒక భాగాన్ని నాభిగా నిర్ణయించాలి. ఆ నాభికి మధ్యస్థంగా శంకుస్థాపన చేయాలని నిర్దేశించబడింది.

సంధ్యాకాలాలు, మధ్యాహ్న అపరాహ్ణాలు, నిశీధి, రాత్రి పూర్వాద్వితీయ భాగాలు, శంకుస్థాపన చేస్తే కర్తకు నాశనం కలుగుతుంది. కావున రాత్రి మూడు నాల్గు ఝాముల ప్రాతఃకాలంలో శకుస్థాపన చేస్తే మంచిది. పగటిలో సాయంకాలాన్ని, రాత్రిలో అర్ధరాత్రిని వదిలిపెట్టాలి. అంటే చాలా గ్రంథాలలో బ్రాహ్మీముహూర్తాలు మంచివి అని చెప్పారు.

9. ఈ క్రింది వానిలో రెండింటిని పరిచయం చేయండి? (2003) పూర్వభవనం, భూదృఢత్వ పరీక్ష, పురుష ప్రమాణం, శంకుస్థాపన ముహూర్తం.

పూర్వ భవన నిర్మాణం : దేవతా ప్రాసాదాలకు, రాజ ప్రాసాద, హర్మ్య, సౌధ, భవనాలకు, విశేష శాలలకు సాధారణ మానవ గృహాలకు ముందుభాగంలో వాహనాలకొరకు బంధు మిత్రులతో మాట్లాడదానికి, వినోదానికి ఇంటి అందానికి నిర్మించబడే స్తంభాలతోకూడిన నిర్మాణానికి పూర్వభవనం అని పేరు. దీన్ని మంటపాకృతిలో గాని శాలాకృతిలోగాని నిర్మించవచ్చు. దీనిలో అందమైన ఆసనాలు, దీపాలు, దీప స్తంభాలు ఇతర అందమైన నిర్మాణాలు అలంకారాలు పెట్టుకోవచ్చు. ఈ పూర్వభవనాన్ని (సావిడి) ప్రధాన సింహద్వారంతో కలిపిగాని, విడిగాగాని నిర్మించవచ్చు. ఇది తక్కువ ఎత్తుగల పునాది కలిగినది, సోపానపంక్తి గలదిగా ఉండాలి. ఇటుకలతో నిర్మించిన స్తంభాలనుగాని దారుస్తంభాలనుగాని పెట్టాలి.

స్తంభన్యాసక్రమం 4 స్తంభాలనుండి 16 స్తంభాలవరకు పూర్వభవన నిర్మాణంలో ఉపయోగించవచ్చు. ఈ విధానాలలో 1.చతుస్తంభ విధానం, 2. షట్స్తంభ విధానం, 3. అష్టస్తంభవిధానం, 4. దశస్తంభ స్థాపనాక్రమం, 5. ద్వాదశ స్తంభస్థాపనా క్రమం, 6. షోడశ స్తంభ స్థాపనాక్రమం. ముఖ్యమైనవి.

భూ దృఢత్వ పరీక్ష : గృహ నిర్మాణానికి స్థలశోధన చేసి స్థల మధ్యభాగంలో హస్త ప్రమాణంగల (24 భారతీయ అంగుళాలు, బ్రిటీష మానంలో 18 అంగుళాలు) పొడవు వెడల్పు లోతుకలిగి ఒక గుంటనుత్రవ్వి తరువాత ఆ త్రవ్విన మట్టితో ఆ గుంటను పూడ్చగా మన్ను మిగిలితే ఆ స్థలం శుభఫలప్రదం. అట్లాగాక ఆ మన్ను మిగలక లేక సమానంగా సరిపోతే ఆ స్థలం సామాన్య శుభాలను ఇస్తుంది. అట్లా గాక మన్ను మిగలకపోతే ఆ స్థలం శుభప్రదం కాదు. కాబట్టి గృహ నిర్మాణానికి యోగ్యం కాదు.

పురుష ప్రమాణం : పురుష ప్రమాణంలో ఉత్తమ మధ్యమ అధమ భేదాలున్నట్లు తెలుస్తుంది. ఈ మూడు విధాలైన పురుష ప్రమాణ భేదాలననుసరించి గృహ యజమాని పొడవుననుసరించి పురుష ప్రమాణం నిర్ణయించాలి.

108 భారతీయాంగుళాలు	ఉత్తమ పురుషప్రమాణం (6 అడుగుల 9 అంగు)
96 భారతీయాంగుళాలు	మధ్యమ పురుషప్రమాణం (6 అడుగులు)
84 భారతీయాంగుళాలు	హీన పురుష ప్రమాణం (5 అడు॥ 3 అంగు॥)

ఈ విధంగా గృహ యజమానినిబట్టి ప్రమాణాన్ని గ్రహించేటప్పుడు యజమాని 25 సం॥రాలు నిండినవాడుగా ఉండాలి. 25 సం॥ల తక్కువ వయస్సుగలవారు ప్రమాణ నిర్ణయానికి అనర్హులు. స్త్రీ విషయంలో 20 సం॥రాలు నిండిన వారినిబట్టి పురుష ప్రమాణం గ్రహించాలి.

శంకుస్థాపన ముహూర్తం : రాత్రియందు గర్భన్యాసం, తరువరి ప్రధమేష్టికాన్యాసం చేయాలి. మధ్యాహ్నకాలం అర్ధరాత్రి, ఉభయ సంధ్యలు గృహారంభానికి పనికిరావు. ఇక్కడకూడా రాత్రి కాలం పూర్తిగా నిషేధింపబడలేదు. సంధ్యాకాలాలు, మధ్యాహ్న అపరాహ్నాలు, నిశీధి, రాత్రి పూర్వ ద్వితీయ భాగాలు, శంకుస్థాపన చేసిన కర్తకు నాశనం కలుగుతుంది. కావున రాత్రి మూడునాల్గు ఝాముల ప్రాతఃకాలమున శంకుస్థాపనకు శుభం. పగటిలో సాయంకాలాన్ని, రాత్రిలో అర్ధరాత్రిని వర్జించాలి. అంటే చాలా గ్రంథాలు బ్రాహ్మీముహూర్తాదులను అనుమతించాయి.

10. వాస్తు పురుషుడనగా ఎవరు? వాస్తుపురుషోత్పత్తి గురించి వ్రాయండి(2000) (2002)

పురాణాల ప్రకారంగా వాస్తుపురుషుని కథ ఈవిధంగా ఉంది. పూర్వం అంధకాసురునికి శివునికి పెద్ద యుద్ధం జరిగింది. ఆ ఘోరయుద్ధంలో శివునియొక్క దేహం నుండి చెమటబిందువు పుట్టి భూమిపై పడింది. ఆ చెమటబిందువునుండి భూలోకం స్వర్గలోకాలకు మహా భయాన్ని కలిగించే ఆకారం పుట్టింది. ఆ మహాకారాన్ని చూసి అందరూ భయపడి బ్రహ్మవద్దకు వెళ్ళారు. బ్రహ్మదగ్గరనుండి వరాలు పొందిన ఆ ఆకారాన్ని దేవతలు భూమిపైకి తోశారు. ఆ ఆకారం బోర్లా తోయబడింది. అలా దేవతలచేత త్రోయబడిన మహాకారం దేవతామయమై భూలోక ప్రజలచేత వాస్తుపురుషునిగా గ్రహించబడింది. ఈ వాస్తుపురుషుని దేహం బ్రహ్మ వరం వలన

సమస్త దేవతలకు నివాసం కావడంవలన భూలోక ప్రజలకు కూడా పూజిస్తున్నారు. భాద్రపద బహుళ తదియ శనివారం కృత్తికానక్షత్రంలో వ్యతీపాత యోగం ఉండగా భద్ర కరణంయొక్క మధ్యభాగంలో వాస్తుపురుషుడి జననం జరిగిందని చెప్తారు.

అంధకాసురుడు అంటే చీకటనీ, ఈశ్వరుడంటే ప్రభువుచే సృష్టించబడిన భూతంగా ఈ వాస్తుపురుషుని తెలుసుకోవాలి. ఇక అధోముఖంగా త్రోయడం గురించి ఆలోచిస్తే సూర్యుని కిరణాలు అధోముఖంగానే భూమిపై పడతాయి. ఆ కారణంగా ఆ కిరణాలు భూమండలాన్నంతా వ్యాపించి ఉంటాయి. ఆ కిరణాలలో సమస్త దేవతలూ ఉన్నారని అట్టి సూర్యకాంతే వాస్తుపురుషునిగా నిర్ణయింపబడింది. ఆ సూర్యకాంతి ఆధారంగా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. వాస్తు పురుషుడు మూడు రకాలు 1. స్థిర వాస్తుపురుషుడు 2. చరవాస్తు పురుషుడు, 3.క్షణిక వాస్తుపురుషుడు.

1. స్థిర వాస్తుపురుషుడు : వాస్తు పురుషుడు అధోముఖంగా శయనిస్తాడు. ఆ వాస్తుపురుషుడిని స్థిరవాస్తు పురుషుడు అంటారు. ఈశాన్యంలో తల, నైఋతిలో పాదాలు, వాయువ్య ఆగ్నేయ దిక్కుల్లో భుజాలు, మధ్యభాగంలో వక్షస్థలం చేతులు ఉంటాయి. వాస్తువిద్య అనే గ్రంథంలో ఏకాశీతి పదంలో వాస్తు పురుషుని శిరస్సు ఈశన్యంలో, ఉంటే, చతుషష్టి పదవాస్తులో మహేంద్రపదం అంటే తూర్పున ఉంటుందని చెప్పారు. ఈ వాస్తు పురుషుని అనుసరించి దేవతావిన్యాసం, వాస్తుపురుషాంగ విభాగం, మర్మోపమర్మాది ముఖ్యస్థానం నిర్ణయం చేస్తారు.

2. చరవాస్తు పురుషుడు : వాస్తుపురుషుడు రవి సంచారాన్నిబట్టి చరవాస్తు పురుషుడుగా సంచరిస్తాడు. అపుడు ఈతనికి చరవాస్తుపురుషుడు అని పేరు. చరవాస్తుపురుషుడు ఎడమవైపుగా తిరిగి పడుకొని రవి ఉన్న రాశిలో పాదాలు ఉంచి దానికి సప్తమ రాశిలో తల ఉంచి నాలుగు దిక్కులు తిరుగుతాడు. ఈ చరవాస్తుపురుషుడు రవి కన్య, తుల, వృశ్చిక రాసులలో సంచరించేటప్పుడు తూర్పుదిక్కు తలపెట్టి, ధనుస్సు, మకర, కుంభ రాసులలో దక్షిణం దిక్కు తలపెట్టి, మీన మేష వృషభ రాసుల్లో పడమర వైపు తలపెట్టి ఉంటారు. ఈ చరవాస్తుపురుష స్వరూపమే మాస వాస్తు పురుష స్వరూపంగా లోకంలో వ్యవహరింపబడుతోంది. వాస్తు పురుషుడు యేయే దిక్కులను చూస్తుంటాడో ఆ దిక్కులకు ఎదురుగా ముఖద్వారాలను ఉంచి గృహనిర్మాణం చేయాలి.

భాద్రపద, ఆశ్వీజ, కార్తీక మాసాల్లో తూర్పు శిరస్సుగాను
మార్గశిర, పుష్య, మాఘ మాసాల్లో దక్షిణ శిరస్సుగాను
ఫాల్గుణ, చైత్ర, వైశాఖ మాసాల్లో పడమర శిరస్సుగాను
జ్యేష్ఠ, ఆషాఢ, శ్రావణ మాసాల్లో ఉత్తర శిరస్సుగాను
వాస్తు పురుసుడు యెడమ ప్రక్కగా పడుకుంటాడు.

3. క్షణిక వాస్తుపురుషుడు : మాస వాస్తుపురుషుడు భాద్రపదం నుండి మూడు నెలలకొకసారి క్రమంగా తూర్పు , దక్షిణ, పడమర, ఉత్తర దిక్కులకు శిరస్సుఉంచి ఎట్లా తిరుగుతాడో అట్లాగే దినవస్తుపురుషుడు సూర్యోదయం మొదలుకొని మళ్ళీ సూర్యోదం అయ్యే ఝామువరకు ఒక్కోక్కదిక్కులో తల పెట్టి రెండు సార్లు తిరుగుతాడు.

మొదటి ఝామున ఉత్తర శిరస్కుడుగాను
రెండవ ఝామున తూర్పు శిరస్కుడుగాను
మూడవ ఝామున దక్షిణ శిరస్కుడుగాను
నాలుగవ ఝామున పశ్చిమ శిరస్కుడుగాను మళ్ళీ అట్లే రాత్రి మొదటి భాగాన ఉత్తర శిరస్కుడుగా క్రమంగా పరిభ్రమిస్తాడు. మిగిలిన నియమాలన్నీ మాస వాస్తుపురుషునివలెనే ఉంటాయి.

11.వాస్తులో పదవిన్యాస ప్రాముఖ్యాన్ని వివరించి, పదంలో రకాలు, మర్మ, వేధల గురించి రాయండి?(2000, 2002) వాస్తు పదాలు పేర్కొని ఏదో ఒకదానిని గూర్చి వివరించండి? (2003)

పదాలు 32 రకాలని మయమతం తెలియజేసింది. అవి 1 సకలం, 2. పేచకం, 3. పీఠం, 4. మహాపీఠం, 5. ఉపపీఠం, 6. ఉగ్రపీఠం, 7. స్థండిలం, 8. మండూకం, 9. పరమశాయిక, 10. ఆసనం, 11. స్థానీయం, 12. దేశీయం, 13. ఉభయచండితం, 14. భద్ర మహాసనం, 15. పద్మగర్భం, 16. త్రియుతం, 17. వ్రతభోగం, 18. కర్ణాష్టకం, 19. గణితపాదం, 20. సూర్యవిశాలం, 21. సుసంహితం, 22. సుప్రతీకాంతం, 23. విశాలం, 24. విప్రగర్భం, 25. విశ్వేశం, 26. విపుల భోగం,

27. విప్రతికాంతం, 28. విశాలాక్షం, 29. విప్రభక్తిం, 30. విశ్వేశసారం, 31. ఈశ్వర కాంతం, 32. నిర్మాణ విశేశాలనుబట్టి (గ్రామం, నగరం, పట్టణం భవనం, నగరం, ప్రాసాదం మొ॥వి) స్వీకరించబడిన భూమిని సమాన విభాగాలు చేయడాన్ని పదం అంటారు. పదాల పేర్లలో వేరువేరు వాస్తు గ్రంథాలలో అభిప్రాయ బేధాలున్నాయి.

నిర్మాణానికి స్వీకరించబడిన మొత్తం భూమికి ఈశాన్యంనుండి ఆగ్నేయం వరకు మొదటి సూత్రాన్ని, అగ్నేయం నుండి నైరుతికి రెండవ సూత్రాన్ని, నైరుతినుండి వాయువ్యానికి మూడవ సూత్రాన్ని, వాయువ్యంనుండి ఈశాన్యానికి నాల్గవ సూత్రాన్ని కట్టాలి. ఈ నాల్గు సూత్రాలమధ్య ఉన్న భూమికే 'సకల'మని పేరు. తీసుకున్న స్థలాన్ని నాల్గు భాగాలు చేస్తే పేచకం అంటారు. 9 అయితే పీఠం 16 అయితే మహాపీఠం, 25 ఉపపీఠం, 36 ఉగ్రపీఠం 49 స్థండిలం, 64 మండూకం (చతుష్షష్టి పదవాస్తు) 81 అయితే పరమశాయి (ఏకాశీతి పదవాస్తు) 100 ఆసనం (శతపద వాస్తు) లాగా విభజన జరుగుతుంది. ఈవిధమైన విభజనల్లో తీసుకున్న స్థలాన్ని 1024 సమభాగాలు చేస్తే ఇంద్రకాంతం అని పేరు.

వాస్తు పదాలు ఉపయోగించే ప్రదేశాలు : ఏకపదవాస్తువును యతీశ్వరుల గృహాలు, ఆసనాలు, భోజనపాత్రలు, పితృదేవ గణాది యజ్ఞాలు గురుపూజనం చేయడానికి, చతుష్పదమైన వాస్తువును వివాహం, యాత్రాలలో గ్రహించబడే దీక్షల విషయంలో గ్రహించాలి. నవపదమైన వాస్తువును వన ప్రదేశాలలో, షోడశపద వాస్తువును దైవ సంబంధ కార్యాలకు, షట్త్రింశత్పదవాస్తువను శుభ కర్మలలో, ఏకోన పంచాశత్పద వాస్తు అన్నిజీర్ణోద్ధరణ కార్యాలకు, చతుష్షష్టిపదవాస్తును గ్రామ, నగర, రాజ నిర్మాణా లకు ఉపయోగించాలి. ఏకాశీతి పదవాస్తువును అన్ని నివాస గృహాలకు, ఏకోన పంచాంగ శత్పద (స్థండిల) వాస్తును, అన్ని జీర్ణోద్ధరణ కార్యాలకు, శతపదవాస్తును మంటపాలకు 196 పద విభాగం గల వాస్తువును వాపీకూప, తటాకాది నిర్మాణాలకు వినియోగించాలి.

వాస్తుపదాలన్నింటిలో ఏకాశీతిపదం, శతపదం, చతుష్షష్టిపదం అనేవి ముఖ్యమైనవి.

ఏకాశీతి పదవాస్తు : నిర్మాణానికి తీసుకున్న స్థలాన్ని చతురస్రంగాచేసి తర్వాత 81

సమాన విభాగాలుగా వేయాలి. మధ్యలోని 9 భాగాలను బ్రహ్మస్థానం అంటారు. బ్రహ్మస్థానానికి తూర్పు ఉన్న 6 పదాలను అర్యమ అంటారు. దక్షిణ 6పదాలు వివస్వం, పశ్చిమం 6 పదాలు మిత్ర, ఉత్తరం 6 భాగాలు పృథ్వీధర భాగాలు అవుతాయి. నాలుగు విదిక్కులకు ఇద్దరు దేవతలకు పదవిభాగం ఉంటుంది. ఇవి అంతర్భాగాలు. బహిర్భాగ దేవతలు ఒక్కోదిక్కుకు 8 చొప్పున 4 దిక్కుల్లో 32మంది ఉంటారు. పద విభాగంలేని దేవతలు కూడా ఉంటారు.

చతుష్షష్టిపదవాస్తువు : ఈ విభాగంలో నిర్మాణానికి స్వీకరించిన స్థలం 8x8 =64 సమభాగాలు చేస్తారు. ఏకాశీతి పదవాస్తులోలాగా దీనిలో కూడా బాహ్యావరణంలో 32మంది దేవతలుంటారు. మధ్యలో 4 పదాలు బ్రహ్మకు, 4దిక్కుల్లో ముగ్గురు చొప్పున, విదిక్కుల్లో ఇద్దరుచొప్పున పదవిభాగాలు కల్గి ఉంటారు.

శతపద వాస్తువు : నిర్మాణానికి స్వీకరించిన స్థలాన్ని 10x10=100 సమభాగాలుగా చేస్తారు. దీని మధ్యలో 16 భాగాలు బ్రహ్మస్థానం అంటారు. 32 భాగాలు ఒక్కొక్కదిక్కుకు చెందుతాయి. తూర్పుదిక్కు ఆర్యమునకు 8 భాగాలు, పశ్చిమంలో 8 భాగాలు మిత్రునికి, ఉత్తరంలో 8 భాగాలు పృథ్వీధరునికి చెందుతాయి.

వాస్తుపదాలు ద్వారాలు : గృహానికి సింహద్వారం ఏవైను నిర్ణయించాలనేది పదభాగాలనుబట్టి ఉంటుంది. తూర్పుదిక్కున ప్రధానద్వారం పెడితే జయన్త, దక్షిణదిక్కు ప్రధానద్వారం పెడితే గృహక్షత, పశ్చిమదిక్కున ప్రధానద్వారం పెడితే సుగ్రీవ, ఉత్తరదిక్కున ప్రధానద్వారం పెడితే ముఖ్యభల్లాట సోమ పదాల్లో పెట్టడం మంచిది. మయుమతం ప్రకారం 32 దేవతాపదాలలో మహేన్ద్ర రాక్షస, పుష్పదంత, భల్లాట అనే నాల్గు దిక్కులోనే ప్రధానద్వారం శ్రేష్ఠం అన్నారు. మిగిలిన వాటిలో ప్రధానద్వారం దోషం అన్నారు. అంతర్ద్వారంకూడా పై పదాలలోనే పెట్టాలన్నారు.

వాస్తుపద మర్మసంధులు : వాస్తు పదాల ఆధారంగా ఈ మర్మసంధులను నిర్ణయిస్తారు. నిర్మాణానికి తీసుకోబడ్డ స్థలంలో సిరలు, వంశములు, అనువంశములు, సంధులు, అనుసంధులు, మర్మలు, మహా వంశాలు అనే స్థానాలున్నాయి. పదంలో 16వ భాగం ప్రమాణం. తూర్పు, పడమరలు, ఉత్తర, దక్షిణాలుగా ఉన్న రేఖలకు మహా

వంశాలు అని పేరు. అడ్డంగా గీసిన పొడవైన రేఖలకు వంశం అని పేరు. వంశపదాలకు 8వ వంతు, అనువంశాలకు 10వ వంతు, మర్మాలకు 12వ వంతు, ఉప మర్మాలకు 16వ వంతు ఉంటాయి. ఇతర అంగసంబంధం కలిగిన వాటికి అనుసంధులని పేరు.

ఏకాశీతి పదవాస్తు మర్మసంధులు : దీనికి తూర్పుదిక్కు 10 రేఖలు, ఉత్తర దిక్కు 10 రేఖలు వేయాలి. ఈ 20 రేఖలనే నాడులు అంటారు. దీనిలో ఈశాన్యం నుండి నైరుతికి, ఆగ్నేయంనుండి వాయువ్యానికి ఒక్కొక్క కోణరేఖను గీయాలి. తరువాత 3 పదాలకు ఒక్కొక్క రేఖను గీయాలి. వాస్తుక్షేత్రంలో నాడులకు, రజ్జువులు ఎక్కడ కలుస్తాయో ఆ ప్రదేశాన్ని మర్మస్థానం అంటారు. ఈ విధంగా ఏర్పడే మర్మస్థానాలు అనేకంగా ఉంటాయి. కొన్నిచోట్ల 3రజ్జు సూత్రాలకు, మరికొన్నిచోట్ల 4,5,6,7,8 నాడీ రజ్జు సూత్రాలకు సంబంధం కనిపిస్తుంది. 8 నాడీ రజ్జువులు కలిస్తే దానికి మహామర్మం అని పేరు. ఇటువంటివి ఏకాశీతిపదవాస్తులో 4 ఉంటాయి. ఇవి వాస్తుపదం చివరలో 3,4 పద సంధిలోనూ 6,7 పద సంధిలోనూ కలుగుతాయి.

చతుష్షష్టిపదవాస్తువు మర్మ నిర్ణయం : దీనిలో రెండుకోణాలలో రెండు సూత్రాలను గీయాలి. తూర్పు, ఉత్తరాలకు వ్యాపించిన రేఖలకు వంశములు అనిపేరు. కోణ సూత్రాలను ఈశాన్యం నుండి నైరుతికి, ఆగ్నేయం నుండి వాయువ్యానికి వేయాలి. వాస్తుపురుషుని శిరస్సు, ముఖం, నాభి, స్తనాలు, హృదయం ఈ ప్రదేశాలను మహామర్మాలని అంటారు.

వాస్తుపురుషుని ఒక్కోఅంగంలో కలిగే వేధకు ఒక్కోరకమైన ఫలితాలుంటాయి. ఈ వేధలను తెలుసుకోవడానికి ఏకాశీతి, చతుష్షష్టి, శతపదాలలోని వాస్తు పురుషాకృతిని గమనించాలి. ఎనిమిది సూత్రాలు కలిసేచోట వేధ కలిగితే గర్భనాశనం, ఆరుసూత్రాలు కలిసేచోట వేధ కలిగితే శత్రువృద్ధి, నాలుగుసూత్రాలు కలిసేచోట వేధ కలిగితే స్థలనాశనం జరుగుతుంది.

12. గృహనిర్మాణ దోషాలు (2002)

గృహనిర్మాణ స్థలసేకరణచేసి పునాదులు త్రవ్వినదగ్గరనుండి గృహాన్ని నిర్మించి గృహప్రవేశం చేసేవరకు ప్రతి విషయంలోను ఎలాంటి దోషాలు లేకుండా జాగ్రత్తలు

తీసుకుని గృహాన్ని నిర్మించుకుంటే అందులో నివసించేవారు ఆనందంగా సుఖసంతోషాలతో జీవించడానికి అవకాశం ఉంటుందని శాస్త్రకారులు చెబుతున్నారు. దోషాలతో గృహాన్ని నిర్మించడం వలన అందులో నివసించేవారు సుఖంగా ఉండక అనేక ఇబ్బందులకు గురి అవుతారు. గృహాన్ని ఏ దోషాలు లేకుండా నిర్మించినప్పటికీ జాతకంలో పరిస్థితి బాగాలేకున్నప్పటికీ వారికి ఇబ్బందులు కలుగుతాయి.

స్థలదోషమని, దిగ్బాధ దోషమని, మర్మదోషమని, ద్వార దోషమని వేధా దోషాలని ఇంకా అనేక రకాలైన దోషాలు ఉంటాయి.

స్థల దోషాలు : గృహనిర్మాణంకోసం తీసుకున్న స్థలంలో నీరు ఆగ్నేయ మూలనుండి వెలుపలికి పారితే అగ్నిభయం, దక్షిణదిక్కునుండి బయటకు పారితే మృత్యుభయం, నైరుతినుండి పారితే రోగం, పడమరనుండి పారితే ధనధాన్య క్షయం కలిగిస్తాయి. వాయువ్యదిక్కునుండి పారితే సర్వనాశనం కలిగిస్తాయి. పడమరనుండి మాత్రమే పెద్ద వీధులుగల స్థలాలకు వాయువ్యంనుండి దక్షిణం మాత్రమే రాజవీధి గల స్థలాలకు ఆగ్నేయంనుండి నీరు బైటకు పోవచ్చు. ఈ విషయాలు కేవలం స్థలానికి మాత్రమే కాని ఇండ్లకు వర్తించదు. ఎక్కువ ముఖద్వారాలు కలిగిన ఇండ్లకు మాత్రం ఏమూలనుండి ఏ మూలకైనా నీరు పోయే అవకాశం ఉంటుంది.

దిగ్బాధ దోషం : గృహ నిర్మాణంకోసం తీసుకున్న స్థలం మధ్యభాగంలో శంకువును నాటి దిక్సాధన చేస్తే 8 దిక్కులు వస్తాయి. ఈ 8 దిక్కులు దిక్సాధన పద్ధతిని అనుసరించి వేయాలి. లేకపోతే విదిక్కులోనికి వస్తే దిగ్బాధదోషం ఏర్పడుతుంది. ఒక దిక్కు సరిగాఉండి మిగిలిన దిక్కులు సరిగాలేకపోతే ఆ దిక్కుకు దోషం ఏర్పడుతుంది.

మర్మ దోషం : గృహానికి నాలుగు మర్మదోషాలు ఏర్పడతాయి. అవి 1. సశల్యం, (శల్యాలతో కూడుకున్నది), 2. పాదహీనం= స్తంభాలు లేనిది, 3. సమ సంధి= సమ సంఖ్యతో కూడిన సంధులు గలది. 4. శిరో గురుత్వం = పై కప్పు ఎక్కువ బరువు కలిగినటువంటిది. ఇటువంటివి గృహనిర్మాణాలలో పనికిరావు.

ద్వార దోషాలు : నిమ్నద్వారం – భూభాగంకంటె పల్లంగా పెట్టినది, ఉన్నతద్వారం – శాలా భూభాగంపైన చెప్పబడిన ప్రమాణంకంటె ఎక్కువ ఎత్తులో పెట్టబడినది.

కరాళద్వారం భయంకరంగా కనిపించేది, సంముఖద్వారం – ప్రాకారద్వారానికి సమసూత్రంగా ఎదురుగా పెట్టబడింది, వామావర్తద్వారం – స్థలంలోనుండి ఎడమ చేతిమీదుగా గృహంలో ప్రవేశించేలా పెట్టినది. నాగదంతాలు, దూలాలు, స్తంభాలు, గోడలు, మూష (గూళ్ళు) గవాక్షాలు ద్వార మధ్యభాగానికి రాకూడదు. ఇవి విషమ స్థానాల్లో ఉండరాదు. సింహద్వారం తనంతట తాను తెరుచుకుంటే దోషాన్నిస్తుంది. గృహ ప్రధానద్వారం తనంతట తాను మూసుకుంటే చాలా దుఃఖాలను కలిగిస్తుంది. తెరచి మూయబడినపుడు శబ్దం చేస్తే భయం కలిగిస్తుంది.

గృహ సింహద్వారానికి ఎదురుగా ముందుగా నాలుగు వీధుల కూడలిలో ఉంటే సేవకులవల్ల కష్టాలు కల్గుతాయి. వృక్షాలు ద్వారానికి ఎదురుగా ఉంటే శిశువులకు హాని, బురదగుంటకు ఎదురుగా ఉంటే శోకం కలుగుతాయి. కృశించిపోయింది, వికృతాకారం కల్గింది, ఎక్కువ ఎత్తైంది, చూడటానికి భయంకరమైంది, శిథిలమైంది, ముందుభాగంలో మందమైన కమ్మీలు కల్గినది, మధ్యభాగం తక్కువ కల్గినది, మొదటి భాగం ఊడిపోయింది, పొట్టిది, కర్ణాలు లేనిది, సూత్రమార్గానికి ప్రక్కగా పెట్టబడింది, బీటలు తీసినది అయిన సింహద్వారం శుభకరమైనది కాదు. అటువంటి ద్వారం, కలిగిన ఇల్లు యజమాని సంపదలను నాశనం చేస్తుంది.

సాధారణ దోషాలు : ఎక్కువకాలం నివాసం లేకుండా పాడుబడిన ఇల్లు, పైకప్పులేని ఇల్లు, పెద్దపెద్ద సర్పాలు నివసించే భూమిలో నిర్మించిన ఇల్లు, తలుపులు మూసేటప్పుడు తెరచినప్పుడు శబ్దంచేసే ద్వారం గల ఇల్లు. ఇలాంటి దోషాలు కలిగిన ఇళ్ళలో నివసించకూడదు.

వృక్షాలు దోషాలు : తూర్పున రావిచెట్టు, దక్షిణంలో జువ్విచెట్టు, పశ్చిమంలో మట్టిచెట్టు, ఉత్తరంలో బ్రహ్మమేడిచెట్టు వల్ల వేధ కల్గుతుంది.రాజవృక్షం, నింబం, ఆమ్రం, కదళీఫలం, ఈ చెట్లు ప్రాగాది నాలుగు దిక్కులలో వరుసగా ఉన్నా వేధ కల్గుతుంది. ఆగ్నేయంలో పాలుగారేచెట్లు, నైరుతిలో కడిమిచెట్లు, వాయువ్యంలో ముండ్ల చెట్లు, ఈశాన్యంలో అరటిచెట్లు ఉండకూడదు.

పునాదులు దోషాలు : పై పునాదులు, పిట్టగోడలు మొదలైన నిర్మాణాల్లో సంభవించే దోషాలు ఉంటాయి. వీటిలో గుణాలు 20 రకాలు. వీటికి వ్యతిరేకంగా చేస్తే కూడా

దోషాలు 20 రకాలుగా కనబడతాయి. గోడల కర్ణభాగంలో హెచ్చు వచ్చేటట్లు, మధ్యభాగంలో లోపలకు వచ్చేటట్లు కడితే నిర్ఘితమనే దోషం వస్తుంది. ఇది దొంగల భయాన్నిస్తుంది. కర్ణభాగాల లోపలకు వచ్చేటట్లు, మధ్యభాగాలు వెలుపలకు వచ్చేటట్లు కట్టిన గోడలకు కూర్మోన్నతమనే దోషం వస్తుంది.

వేధ ఫలితాలు : దిక్కులలో విదిక్కులలో, వాస్తు వేధను శోధించాలి. పాత ఇంటికి వేధా దోషముంటే ఆ దోషాన్ని సవరించుకోవాలి. నూతనంగా వేధాదోషాన్ని చక్కగా గమనిస్తూ వేధా దోషాలులేకుండా గృహాలను, శాలలను, సౌధాలను నిర్మించాలి. అంధకం, రుధిరం, కుబ్జం, కాణం, బధిరం, దిగ్వక్త్రం, చిపిట, వ్యంగజం, మురజం, కుటలం, కుట్టకం, సుప్తం, శంఖు పాలకం, వికటం, కంకం, కైకరం అనే పదహారు రకాల వేధా దోషాలున్నాయి.

13. సాధారణ గృహ నిర్మాణ నియమాలు దోషాలను వివరించండి?

స్థలాల స్వరూపం : ఏ నిర్మాణాన్నైనా చేయదలచుకుంటే తీసుకునే స్థలం చతురస్రంగా గాని దీర్ఘ చతురస్రంగాగాని తప్పనిసరిగా ఉండాలి. చతురస్ర స్థలంలో నాలుగు బాహువులు, రెండు కర్ణాలు, సమానంగా ఉండాలి. దీర్ఘ చతురస్రంగా ఉన్న స్థలంలో ఎదుటి భుజాలు సమానాలు, కాని ఆసన్న భుజాలు సమానాలు కావు. వివిధ ఆకారాలు గల స్థలాన్ని చతురస్రంగా గాని, దీర్ఘ చతురస్రంగాగాని తీసుకుని మిగిలిన ఖాళీ స్థలాన్ని వదిలివేసి ఇల్లు కట్టాలి. నిర్మాణానికి తీసుకున్న స్థలంలో పుట్టలు, బొరియలు బీటలు, శల్యాలు మొదలైన దోషాలు ఉంటే వాటిని తీయించి కొత్తమన్ను పోసి నిర్మాణం చేయాలి. ఏ స్థలాన్నైనా దిక్సాధన చేసి తీసుకోవాలి.

నీటి వాటములు : ఏ స్థలానికైనా తూర్పు ఉత్తరం ఈశాన్యం నుండి నీరు బయటకు పోయేటట్లు తూములు పెట్టుకోవాలి. కొన్ని స్థలాలకు పైవిధంగా నీరు పోవటానికి వీలు లేనపుడు ఆగ్నేయ వాయువ్యాలనుండి నీరు బయటకు పోవడానికి తూములు పెట్టాలి. నైరుతి మూలనుండి నీరు వీధిలోకి పోవడానికి తూములు పెట్టడం నిషేధించ బడింది. నీటివాటం స్థలాలకు మాత్రమే చూడాలి. ఇండ్లలో ఈ నియమం పాటించడానికి వీలులేదు. ఇండ్లలోని గదుల సందర్భాలనుబట్టి నీటి వాటాలను

పెట్టుకోవచ్చు. అన్ని దిక్కులకు తూములు పెట్టవచ్చు. మండువా ఇండ్లలో మధ్యలోఉన్న మండువా గొయ్యిలోకి వచ్చే నీరు తూర్పుగాగాని, ఉత్తరంగాగాని పోయేటట్లు తూము పెట్టాలి.

నేల ఎత్తు పల్లాలు : ప్రతీ ఇంటికి వసారాలు ఉంటాయి. గర్భం వసారాలు సమానంగా ఉండేటట్లు చూడాలి. గర్భం ఎత్తుచేసి వసారాలన్నీ ఒకే ఎత్తులో గర్భంకంటే తక్కువ ఎత్తుపెట్టి నేలను సరిచేయాలి. ఇంటికి ఎదురుగా అరుగులు ఎత్తుగా ఉండాలి. గర్భం గదులకంటే పక్కన, ముందుభాగాలలో ఉన్న వసారాల నేలభాగం ఎత్తు పెట్టరాదు. ఇండ్లకు ముందు వసారాలు పల్లంగాను వెనుక వసారాలు ఎత్తుగా ఉండేటట్లు నేలను చేయరాదు. ఇంటికి రెండు వైపులా ఉన్న వసారాల నేలభాగం సమానంగా ఉండాలి.

పునాదులు - గోడల నిర్మాణం : భూమిలోపల కట్టే పునాదులను భూమి బలాన్నిబట్టి, పునాదిపైన వచ్చే కట్టడం ఎత్తునుబట్టి నిర్ణయించాలి. గట్టి ప్రదేశం తగిలిన చోటనుండి, నీరు తగిలిన ప్రదేశంనుండి భూమిలో పునాదులు తీయాలి. పైన కట్టే గోడలో సగం ప్రమాణంగల పునాదిని నిర్మించాలనడం, సాధారణ నియమంగా ఉంది. ఇది విశాల భవనాల విషయం అని కొందరి అభిప్రాయం. పునాది సమానంగా వంకర లేకుండా ఉండాలి. శాలా స్వరూపం పునాదులపై చూపాలి. ఇంట్లో శాలాభాగానికి గోడలు శాలా వెడల్పుతో సమానమైన ఎత్తును పెట్టాలి. కొన్ని ప్రత్యేక నిర్మాణాలలో వాయు ప్రసారం, కాంతి ప్రసారానుగుణంగా గోడల ఎత్తును పెట్టాలి. వసారాల గోడలను అన్నింటికి సమాన ప్రమాణం కలవానివిగా చూసుకోవాలి. గోడల పారులను తప్పి గోడలను పెట్టడం శ్రేయస్కరం కాదు. వసారాలలోగాని, గర్భంలోగాని పొడవులో గోడలను పెట్టుకోవాలి. శాలయొక్క ముందు వసారాలు వెనుక వసారాలు సమాన ప్రమాణంగా ఉండటం శ్రేష్ఠం. వసారాల వెడల్పు ప్రమాణాలు అన్నీ సమానంగా ఉండాలి. హెచ్చు తగ్గులు పెట్టడం శ్రేష్ఠం కాదు.

గోడలు ఆరు రకాలు. అవి 1. శిలా నిర్మితం, 2. ఇష్టికా నిర్మితం, 3. ఫలకా నిర్మితం, 4. మృణ్మయ నిర్మితం, 5. కాష్ఠ నిర్మితం. శిలా నిర్మితం సాధారణ మానవ గృహాలకు నిషేధించబడింది. డాబా వేసే ఇండ్లకు గర్భం గోడలు సమానంగా ఉండాలి.

ద్వారాలు కిటికీలు : ఇంటికి ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేసేటప్పుడు ఇంటి పొడవును 9 భాగాలు చేసి 4,5,6 భాగాలలో ఒక భాగంలో ప్రధానద్వారాన్నుంచాలి. ఒకే దిక్కులో 2 గుమ్మాలు పెట్టవలసి వచ్చినపుడు 4,6 భాగాలలో పెట్టవచ్చు. సింహ ద్వారానికి ముందు వెనుకలలో పెట్టే ద్వారాలను సింహద్వారానికి ఎదురుగా పెట్టాలి. మిగిలిన గుమ్మాలను పెట్టేటప్పుడు ఒక గుమ్మానికి ఇంకోగుమ్మం ఎదురుగా పెట్టరాదు. శాలా గర్భం యొక్క పొడవుకు సగ భాగంలో ద్వారం పెట్టరాదు. ద్వారాలు కిటికీలు సరి సంఖ్యలోనే ఉండాలి. ఇంటి మొత్తానికి కలిపి లెక్క చూడాలి. ద్వారాలు చతుశ్శాలా ద్వారాలు, పంచశఖా ద్వారాలు అని రెండు రకాలు. ద్వారాలను ప్రదక్షిణ క్రమంలో పెట్టుకోవాలి. అప్రదక్షిణా క్రమంలో పెట్టరాదు. శాలా గర్భ విశాలాన్నిబట్టి ద్వార ప్రమాణం నిర్ణయించాలి. కిటికీల ప్రమాణాలు ద్వార ప్రమాణాలమీద ఆధారపడి ఉంటాయి.

స్థలాల్లో గృహనిర్మాణం ; ఏ స్థలంలోనైనా గృహాన్ని నిర్మించేటప్పుడు తూర్పు ఉత్తర, ఈశాన్యాలను చేర్చిగాని, దక్షిణ పశ్చిమ నైఋతులను చేర్చి గాని కట్టాలి. తూర్పు, ఆగ్నేయ దక్షిణాలను చేర్చిగాని, పశ్చిమ వాయువ్య ఉత్తరాలను చేర్చిగాని ఇండ్లను కట్టరాదు. స్థలాలో స్థల మధ్యభాగాలు పిశాచభాగం అనే స్థలం 9వ వంతు భాగాన్ని వదిలి ఇల్లు కట్టాలి. దక్షిణ సరిహద్దులనుండి ఇండ్లను కట్టరాదనే నియమం ఉంది.

ఎం.ఏ., జ్యోతిషం (ప్రథమ) పేపర్ 4

ఈ క్రిందివానిలో ఏ నాలుగు ప్రశ్నలకైనా సమాధానాలు వ్రాయండి.

1. వాస్తుశాస్త్ర ప్రయోజనాలను తెలియజేయండి?
2. ఆయాది వర్గ సాధనా పద్ధతులను తెలిపి నవవర్గ గణితాన్ని తెలియజేయండి?
3. వాస్తుపురుషోత్పత్తిని తెలియజేస్తూ, వాస్తు పురుష భేదాలను గూర్చి వ్రాయండి?
4. వాస్తు పద విన్యాసాలు, మర్మాది సంధులు, తీసుకోవలసిన జాగ్రత్తలపై వ్యాసం వ్రాయండి?
5. భవన నిర్మాణంలోని వేరు వేరు భాగాలను తెలుపుతూ ఉపగృహాల నిర్మాణం గూర్చి వర్ణించండి?
6. స్థల సేకరణనుండి గృహప్రవేశమయ్యేంతవరకు కనిపించే వాస్తుదోషాలపై సమగ్ర వ్యాఖ్య వ్రాయండి?

ఈ క్రిందివానిలో ఏ నాలుగు ప్రశ్నలకైనా సమాధానాలు వ్రాయండి:

1. భూ పరీక్షా పద్ధతులను తెలియజేయండి?
2. షడ్విధ శాలలను గూర్చి తెలపండి?
3. గృహారంభ, గృహప్రవేశ ముహూర్తాల సాధారణ నియమాలను తెలియజేయండి?
4. శంకువు ఏవిధంగా తయారు చేస్తారు? దాని స్థాపనాక్రమాన్ని, మతాంతరాలను తెలియజేయండి?
5. ప్రస్తుతం లోక వ్యవహారంలో ఉన్న వేరు వేరు మానాలను గూర్చి తెలపండి?
6. దిక్సాధనలో శుద్ధప్రాచీ, ఈశప్రాచీల గూర్చి వ్రాయండి?

శుభాకాంక్షలతో ...
మీ మనోభావాలకు అందమైన అక్షరాకృతి
కావ్యశ్రీ గ్రాఫిక్స్
2-2-1136/7/1-సి,
న్యూనల్లకుంట, హైదరాబాద్.
ఫోన్ : 27550530